
అంఆ

ఆధ్యాత్మిక మధురస్మృతులు



రచన
ఎ. కుసుమా చక్రవర్తి
(ఎమ్.ఎ., బి.యిడి)
ఆంధ్రా యూనివర్శిటి హైస్కూల్
వాల్తేరు

జయహో మాతా శ్రీ అనసూయా
రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి



విశాఖ మందిరంలో అమ్మ

అంఆ

ADHYATMIKA MADHURA SMRUTHULU

వందే మంజుల మందహాస వదనాం వందే పరాందేవతాం
వందే మంగళదాయినీం సుచరితాం వాత్సల్య వారాంనిధిమ్
వందే త్యాగమయీాం జగ త్త్రయమయీాం వందేత్రయీాం చిన్మయీాం
వందే జిల్లెళ్ళమూడి భాగ్యకళికాం వందేఽ_ నసూయాంబికామ్ ॥

– మహాకవి శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి (కరుణశ్రీ)

Writer

A. KUSUMA CHAKRAVARTHY (M.A. B.Ed.)
Waltair

ద్వితీయ ముద్రణ
వేయి ప్రతులు

2003 నవంబరు 15, హైమక్క షష్టిపూర్తి ఉత్సవం
జిల్లెళ్ళమూడి

వెల రూ. **60/-**

ప్రాప్తి స్థానం :

1. మాతృశ్రీ పూజా సర్కిల్
4-45-1, అశోక్‌హౌస్,
అమ్మమందిర్, పెదవాల్తేరు,
విశాఖపట్నం - 530 017.
ఫోన్ : 2530346

2. A.S. Chakravarthy
4-445-1, Ashok House,
Pedawaltair,
VISAKHAPATNAM - 530 017.
Ph. 2530346

3. విశ్వజననీ పరిషత్
మాతృశ్రీ పబ్లికేషన్స్,
జిల్లెళ్ళమూడి - 522 113.

ముద్రణ :

Sathyam Offset Imprints
46-18-10, Mandavari Peta,
Visakhapatnam-530 016.
© : (0891) 2735878, 2713440

His Holiness - Jagadguru

SRI SIDDHESWARANANDA BHARATISWAMY

Siddheswari Peetadhipati - Courtallam



Mounaswamy Mutt.
Courtallam - 627 802
(Via Tenkasi)
Thirunelvell (Dt.)
Tamilanadu.

Camp Office :
B1-C40, Kaallpeetam Street,
4th Line, Ravindra Nagar,
GUNTUR - 522 006. (A.P.)
Ph : 0863 - 2231625
2256666

పరమహంస, పరివ్రాజకాచార్య జగద్గురు

శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి

సిద్ధేశ్వరీ పీఠాధిపతి - కుర్తాళం

విశాఖపట్టణ రచయిత్రి శ్రీమతి కుసుమకుమారికి ఆశీర్వచన శ్రీముఖము

శ్రీ పి. యస్. ఆర్. ఆంజనేయప్రసాద్ ద్వారా మీరు పంపిన **"ఆధ్యాత్మిక మధురస్మృతులు"** అన్న గ్రంథం స్వామి వారికి చేరినది. వారు దానిని పరిశీలించి చాలా సంతోషించినారు. మాతృశ్రీ అనసూయాదేవి యందు కల భక్తిచే వారి పూర్వాశ్రమములో రచించిన గ్రంథ విశేషాలను స్మృతికి తెచ్చుకొని మీరు రచించిన అనుభవలహరికలను గమనించి పరమేశ్వరి దివ్యానుగ్రహమునకు కావలసిన యోగ్యత మీయందున్నదని భావించినారు.

సిద్ధేశ్వరీ పీఠ దేవతయైన పరమేశ్వరి మీకు శుభములు ప్రసాదించాలని తమ ఆశీర్వచనములను తెలియజేయమన్నారు.

ఈ గ్రంథము భక్తి మార్గములో ప్రచారమునకు రావాలని వారు దీవిస్తున్నారు.

స్వామివారి ప్రతినిధి
సిద్ధేశ్వరీపీఠము
కుర్తాళం

శ్రీ మాత్రే నమః

విశ్వబంధు తపోవన్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)

వ్యవస్థాపకులు :
శ్రీశ్రీశ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ

శ్రీ సద్గురు సేవాశ్రమం
పెదపులిపాక
పెనమలూరు మండలం

అమ్మా!

మీరు పంపిన **"అంఆ దివ్యానుభూతులు"** పుస్తకము చేరినది సంతోషము.

తేనెటీగలు సుదూర ప్రాంతములకు వెళ్ళి కొంచెం కొంచెం తేనెను తీసుకు వచ్చి ఒక్కచోట తేనెపట్టును పెట్టినట్లుగా, **"అమ్మ సన్నిధిలో"** వారి వారి జీవితంలో జరిగిన అనుభవాలను ఒక్కచోట చేర్చి దీనికి దివ్యానుభూతులు అను నామకరణము చేయుట సబబే అనిపించుచున్నది.

శ్రీ లలితా పరాభట్టారికా అమ్మవారి దివ్యత్వమును వశిన్యాది వాగ్దేవతలు శ్రీ లలితా సహస్రనామాలుగా కీర్తిస్తే అవి నిజమే అని జగన్మాత ముద్రవేసినది.

అదే రీతిగా అమ్మ దివ్యత్వమును మా కుసుమాచక్రవర్తి కీర్తిస్తే అది నిజముగాక ఏమౌతుంది. కుసుమాలలో శుభప్రదమైనది, దేవతల అంగములకు సంకేతమైనది కలువపుష్పము. "మహాపద్మాటవీ సంస్థా" అన్నట్లుగా ఆ అమ్మ ఈ అమ్మలో అనగా కుసుమాచక్రవర్తిలో వుండి వ్రాసుకున్నది అంటే సబబు అనిపిస్తున్నది. అందుచేత దీనిలో అతిశయోక్తులుగాని, కల్పనలు గాని లేవని చెప్పవచ్చు. ద్వితీయ ముద్రణకు అవకాశము వచ్చింది అంటే భక్తుల ఆదరణ ఎంత ఉన్నదో మనకు తెలుస్తున్నది. శ్రీ లలితా సహస్రనామాలు సూత్రములు అయితే **"అమ్మ జీవితము భాష్యము"** అని చెప్పక తప్పదు. ఈ గ్రంథమును ఆశ్రయించిన వారి జీవితము ధన్యమగునని, ఈ గ్రంథ విషయములను సేకరించి క్రమ శైలిలో కూర్చిన శ్రీమతి కుసుమా చక్రవర్తి జీవితము ధన్యము, ధన్యము.... నొందునది గాక అని అమ్మను ప్రార్థిస్తూ ..... అమ్మా ఇక సెలవు.

ఇట్లు
హరిః ఓమ్ స్మరణలలో

స్వామి వాసుదేవానంద గిరి

మహిమాన్విత - మన అమ్మ

జిల్లెళ్ళమూడి - 522 113

డా॥ పి. ఝాన్సీలక్ష్మీబాయి

మహిమలు ఆధ్యాత్మిక సాధకులకు ప్రథమ సోపానాలు. మహిమలు తెలిస్తేనే కాని ఒక వ్యక్తిలోని మహత్వం వ్యక్తం కాదు. ఆధ్యాత్మికరంగంలో సమున్నతమయిన వ్యక్తి మన అదృష్టవశాత్తు తటస్థపడితే మనం అతని గురించి ఆలోచిస్తూ "మహిమలు చేయగలడా?" అని ప్రశ్న వేసుకుంటాం. అందుకే ఆధ్యాత్మిక మార్గగాములయిన సాధకులకు మహిమలు మొదటిమెట్టు.

మహోత్తములయిన వ్యక్తులు, సమున్నతులు, సిద్ధసంకల్పులు అయినవాళ్ళు, వాళ్ళ సంకల్పబలంతో కోరి మహిమలు చేయరు. ప్రదర్శించరు, ప్రకటించరు. సిద్ధసంకల్పులయిన వారి స్వభావం వలన అవి సిద్ధించడం సహజమయిన విషయం వారిని చేరబోయిన మనకు ఈ మహిమలు అనుసంధానాన్ని సృష్టిస్తాయి. భగవంతునికి భక్తునికి అనుసంధానాన్ని సృష్టించటమే మహిమల పరమార్ధం ఇవి లేకపోతే వాడు మనస్థాయికి దిగిరావటం వారి స్థాయిని మనం చూడటం అసంభవం.

ఒకరకంగా చూస్తే వారికి మనపై ఉన్న వాత్సల్యభావానికి ప్రతీకలే ఈ మహిమలు. వారిలో నిత్యం నిండి నిబిడీకృతంగా ఉండే వాత్సల్యభావం అప్రయత్నంగా ఆశీస్సులరూపంలో అభివ్యక్తం కావటమే ఈ మహిమల సహజస్వరూపం. అయితే ఇంతమాత్రంతో మహిమలు చేయని మహాత్ములు మాననీయిలు కారు అని అనుకుంటే అది కేవలం అవివేకమే అవుతుంది.

ఈ గ్రంథంలో ప్రస్తుతించబడిన కరుణాంతరంగ వాత్సల్యగంగ మహిమాన్విత అయిన అమ్మను గురించి, అమ్మ మహిమల గురించి ఆలోచిస్తూ ఒక విషయం చెప్పక తప్పదు.

అమ్మ ఎప్పుడూ బిడ్డల మహత్వాన్ని మహితత్వాన్ని కోరుతుందే కాని తన మహత్వాన్ని ప్రదర్శించుకోవటానికి తపనపడదు, తహతహలాడదు. అలా ప్రదర్శించడం మాతృధర్మానికి సృష్టిసూత్రానికి విరుద్ధం. తల్లి పసిబిడ్డలో సైతం

పరంధాముని చూసి మురిసిపోతూ "రామాలాలీ మేఘశ్యామాలాలీ, తామరసనయన దశరథ తనయా లాలీ" అని ముద్దాడటం చూస్తాం.

అమ్మను నేను గమనించిన 34 సం॥ల కాలంలో ఎంతోమంది, తమకు అమ్మ వలన జరిగిన మహిమాన్విత విషయాలను చెప్తూఉంటే అమ్మ వాటిని వినటానికి ఎక్కువ శ్రద్ధ చూపరు. వాటికి తన కర్తృత్వాన్ని ఒప్పేవారుకాదు.

అమ్మ మహిమలు అనుభవించిన, పరవశించిన సోదరీసోదరులు అధిక సంఖ్యలో ఉన్నారు. అందులో కొందరు తెలియచేసిన విషయాలే "దివ్యానుభూతులు ఆధ్యాత్మిక మధురస్మృతులు" అను గ్రంథాలు ఆవిర్భవించటానికి కారణమయినాయి. మరి అందరూ వారి వారి అనుభవాలను అభివ్యక్తీకరిస్తే ఈ గ్రంథాలు ఎంత వేగంగా మరి ఎన్ని వస్తాయో!

ఈ గ్రంథరచయిత్రి శ్రీమతి కుసుమక్కయ్య తనదయిన శైలిలో తనవైన అనుభవాలను, అందరి అనుభవాలను, మనం అందరం అనుభవించాలని ఎంతో తపన పడింది. అక్కయ్య కృషిని అమ్మ మాటల్లో చెప్పాలంటే "తపనే తపస్సు" అని అనుకుందాం. అక్కయ్య చేసిన ఈ తపస్సు మనందరి చేతకూడా తపస్సు చేయిస్తోందన్నది నిర్వివాదసత్యం. సంస్కృతంలో ధాతువులన్నిటికి అర్థాలు చెప్తూ శబ్దబ్రహ్మవేత్త పాణిని "తప-ఆలోచనే" అని అంటారు. తపధాతువుకు ఆలోచన అనే అర్థం నిర్ధారిస్తారు. ఈ గ్రంథాలు చదువుతున్నమనం తదేకధ్యానంతో అమ్మ ధ్యాసతో తపస్సులోనే ఉంటాం అనేది "దివ్యానుభూతులు" చదివిన పాఠకుల అభిప్రాయం. "మధురస్మృతులు" గ్రంథం కూడ అంతకేమాత్రం తగ్గకుండా అంతరంగాన్ని అలరిస్తుంది.

కుసుమక్కయ్యగారింట్లో ఒకరోజు అమ్మ సంధ్యావందనం కార్యక్రమంలో పాల్గొన్నాను. జిల్లెళ్ళమూడిలో సంధ్యావందనం చేస్తున్న అనుభూతి కలిగింది. "దివ్యానుభూతులు" గ్రంథం చదువుతుంటే అమ్మతో కలిసి గడిపిన కాలం ప్రత్యక్షమవుతుంది. అనుభూతి, అనుభవం అనే సంస్కృతపదాలకు సాక్షాత్కారం, ప్రత్యక్షం అని అర్థం. ఈ రెండు గ్రంథాలు ప్రతి సన్నివేశంలో అమ్మ సాక్షాత్కారాన్ని కల్గింప చేస్తాయి. కుసుమక్కయ్య వాళ్ళింట్లో పూజలు, లలితాసహస్రపారాయణ కార్యక్రమం కూడ చాలా తృప్తికరంగా ఉంటాయి.

చక్రవర్తి అన్నయ్యగారి పట్టుదల, కుసుమక్కయ్యలోని సమగ్రత వాళ్ళింటికి వచ్చేవాళ్ళకి, పూజలకి పారాయణలకి ప్రత్యేకాకర్షకాలుగా ఆహ్వాన పత్రికలుగా అనిపిస్తాయి. కుసుమక్కయ్యలో కనపడే లక్ష్మీకళ చూస్తుంటే మనస్మృతి గ్రంథంలో మనువు మహిళల మాననీయతను మహితత్వమును గూర్చి చెప్పిన మాట.

"స్త్రియః శ్రియశ్చగేహేషు
నవిశేష్యోఽస్తి కశ్చన"

అనేది గుర్తొస్తుంది స్త్రీకి, శ్రీకి - లక్ష్మికి భేదం లేదు. శ్రీ-డబ్బు లేనివారి ఇల్లు, స్త్రీలేని ఇల్లు కళారహితంగా కనిపిస్తుంది అని.

లక్ష్మీకళతో పారాయణలు, పూజలు నిర్వహించే అక్కయ్య పూజాఫలంగా కుసుమక్కయ్య ద్వారా ఎన్ని సుమసుగంధాలు సోదరలోకం పొందవలసి ఉందో!

డా॥పి. ఝాన్సీలక్ష్మీభాయి
Reader in Sanskrit
JILLELLAMUDI

ఓం - అం - ఆ

వాత్సల్యామృతవర్షిణి

బ్రహ్మాండం వసుంధర జిల్లెళ్ళమూడి - 522 113

జగన్మాత అయిన అమ్మ "జగత్తే మాత" అని ప్రవచించింది.

అప్పుడే అమ్మ స్నానం చేసి వచ్చి కూర్చున్నది. అమ్మ హాలునిండా జనం. (ప్రస్తుతం అలంకార హైమ వున్నగది) హాల్లో మంచం మీద అమ్మ.

అమ్మ దర్శనార్థం ప్రభుదత్త బ్రహ్మచారిగారు, రఘువరదాసుగారు వచ్చారు. అమ్మ మంచం మీద కుడివైపు ప్రభుదత్త బ్రహ్మచారిగారు, ఎడమవైపు రఘువరదాసుగారు కూర్చున్నారు. బ్రహ్మచారి గారిని అమ్మ ఒడిలోకి తీసుకున్న దృశ్యం చూడగానే కళ్ళు చెమర్చాయి.

పెద్ద జరీ అంచుగల పట్టు రవికె వేసుకుంది. ఎఱ్ఱని పట్టుచీర కట్టుకుని, ముక్కుకు బులాకీ పెట్టుకుని, జుట్టు విరబోసుకుని అధ్యాత్మికోన్నతులైన తన ఇద్దరి బిడ్డలను చెరొక వైపున దగ్గరకు తీసుకుంది. కరుణారసపూరిత దృక్కులతో వీక్షిస్తూ తన అమృత హస్తాలతో వారిని ఆప్యాయంగా నిమురుతున్న ఆ మాతృమూర్తిని చూడగానే నాకు ఒళ్ళు జలదరించి, నేత్రాలు బాష్పపూరితాలయినాయి. చూచేవారికే అలావుంటే ఆ మహాత్ముల హృదయాలు ఎంత పరవశించాయో అనిపించింది. ఆ దృశ్యము వర్ణనాతీతం. ఆ ఆనందం ఊహాతీతం. వాళ్ళిద్దరికీ ప్రతిదానికి హరే రామ అనే అలవాటు వుంది. అమ్మను చూసినప్పటినుంచి "జైమా, జైమా" అంటున్నారు.

బ్రహ్మచారిగారు అమ్మను కడు దగ్గరగా తీసుకుని "జగన్నాథం వెళదామా అమ్మా?" అన్నారు. "అంతా అదే అయినప్పుడు ప్రత్యేకంగా వెళ్ళేదేముంది?" అన్నది. బ్రహ్మచారి గారికి తెలుగు బాగా అర్థం కాదు అక్కడ వున్న ఉమ అనే సోదరి హిందీలోకి అనువాదం చేసింది. ఆయన విని నవ్వుకున్నారు. "బృందావనం పోదామా?" అన్నారు మళ్ళీ అమ్మ విన్నది, ఏమీ విననట్లుగా మామిడి పండ్లను కొరికి ఒకటి బ్రహ్మచారిగారికి మరొకటి రఘువరదాసు గారికి నోట్లోపెట్టి, వారితో వచ్చిన వారందరికి ప్రసాదం ఇచ్చింది.

శాయమ్మ గార్ని ఫలహారం చేసుకురమ్మని చెప్పింది. ఆమె తేగానే అమ్మ బ్రహ్మచారి గారి చేయి పట్టుకుని గేటు ఇవతల వున్న జీపుదాకా వచ్చి ఠక్కున ఎక్కి కూర్చున్నది. ప్రక్కనే బ్రహ్మచారిగారు కూర్చున్నారు. వెనుక సీటులో వారితో వచ్చిన సీతమ్మగారు, ఆమె తమ్ముడు, ఆమె తల్లి, శాయమ్మగారు, సుబ్బారావు అన్నయ్య నేను ఎక్కాం. ఉమ, కస్తూరి ఇంజన్‌పైన ఒకవైపు, రఘువరదాసు గారు, రామకృష్ణ అన్నయ్య మరొక వైపు ఎక్కారు. అమ్మ మట్టిపూడి వెళుతుందనుకున్నాం.

అమ్మ ఓంకారనది వైపుకు వెళ్ళనివ్వమని సూచించింది. ఒడ్డున ఆపించి జీపు దిగి, అక్కడ వున్న ఆవులను గేదెలను వాటిని కాస్తున్న కాపరులను చూపించి "బృందావనం వచ్చాం నాన్నా" అన్నది అమ్మ. జీప్ దిగిన అంతా ఆశ్చర్యపోయాం. మేము మట్టిపూడి అనుకున్నాం కాలువ దగ్గరకు తీసుకువచ్చింది. ఎంత మాయ చేసింది! అమ్మ మాయను మనమేం తెలుసుకోగలం అని అమ్మ లీలలను గురించి చెప్పుకుంటూ పరమానంద భరితులైనాము.

అమ్మ శాయమ్మగారు తెచ్చిన స్వీటును మూడుమార్లు ఓంకార నదిలో వేసి, బ్రమ్మచారి గారికి, రఘువరదాసు గారికి నోట్లో పెట్టింది. రఘువరదాసు గారు కూడ అమ్మకు మూడుసార్లు నోట్లో పెట్టారు. అమ్మ అక్కడ వున్న అందరికి ప్రసాదం నోట్లో పెట్టి దూరంగా వున్న గొడ్ల కాపరులకు పంపింది. 15 నిమిషాలలోనే జీపుని తిరుగు ముఖం పట్టించి ఆవరణలోకి వచ్చాక వారు వెళ్ళటానికి అమ్మ అనుజ్ఞ ఇచ్చింది.

విశ్వతాదాత్మ్యం కలిగిన అమ్మ "అంతా అదే, అది కానిది లేదు నాన్నా" అని అమ్మ అంతా తానై, సర్వజ్ఞ అయి, సర్వవ్యాపిని అయి, సర్వశక్తియై వెలసిన అమ్మను ఒకసారి అమ్మా "భగవంతునికి రూపం యొక్క అవసరం ఏమిటి తాను చేయదల్చుకున్నది అక్కడే వుండి ఎందుకు చేయకూడదు?" అని అడిగాను "ఒక నాటకం వ్రాసామనుకో, దాన్ని ప్రదర్శించినప్పుడు కలిగే ఆనందం, వింటే ఏముంటుంది?" నామరూప రహితుడే కాదు సహితుడేనని చెప్పటానికి అవకాశం, అందరికీ అర్థమై ఆనందించటం కోసం రూపం అవసరం, రూపం వున్నందువల్ల శక్తి పెరిగేది తరిగేది లేదు" అని చెప్పింది.

ఒకసారి ఒక సోదరుడు చీరాల హోటల్‌లో టిఫిన్ చేసి తన కారులో అమ్మను చూడటానికి బయలుదేరాడు. ఆయన చేతిలో తాటిబెల్లం వుంటే ఒక ముసలామె

తాటిబెల్లం కొంచెం పెట్టమని అడిగింది. ఆమెను "పో పో" అని చెప్పి ఆ పెద్దమనిషి జిల్లెళ్ళమూడి చేరి అమ్మకు పాద పూజ చేసాడు, అప్పుడు అమ్మ ఆయనతో తాటిబెల్లం కొంత అడిగాను ఇవ్వలేదే - అన్నది. 'అమ్మా' అని ఆయన అమ్మ పాదాక్రాంతుడయ్యాడు. అందరిలో నేనున్నాను, అంతటా నేనున్నాని తెలియచేయటమే కదా!

ఒకసారి అమ్మగదిలో పిల్లుల గొడవ ఎక్కువగా వుండటం వలన పిల్లి, పిల్లలను ఓ గోతంలో వేసేకుని వాటిని మరో ఊరిలో వదిలి రావాలనుకున్నారు. అంతలో అమ్మకు ఈ విషయం తెలిసింది. వాటిని స్వేచ్ఛగా వదిలి వేయమని అమ్మ ఆదేశించింది.

అవి అమ్మ మంచం మీదకెక్కి సింహాసనం మీదకెక్కి మలమూత్ర విసర్జన చేసేవి. అమ్మ గుడ్డలతో ఆడుతూ చింపేవి. ఆహారం కోసం రోజూ రాత్రిళ్ళు ఎలుకలను చంపి అమ్మ గదిలోకి తీసుకొచ్చేసి గది అంతా ఖరాబు చేసేవి. ఆ దృశ్యాలను చూడలేక ఆ పరిస్థితి సహించలేక వాటిని పంపాలన్న ఆలోచన జరిగింది.

అమ్మ అంగీకరించలేదు సరికదా - "మీరు బజారుకు వెళితే మంచి పళ్ళు కనిపిస్తాయి వాటిని కొనుకొచ్చి మీ పిల్లలకు పెడదామనుకోరూ? తోటలో మంచి కూరగాయలను చూస్తే అవి కూర చేసి మీ పిల్లలకు పెట్టాలనుకోరూ? అవీ అంతే దాన్ని గురించి ఇంత ఆలోచన, అల్లరి ఎందుకు" అని అమ్మ మందలించింది.

మరొకసారి నివేదన చేయబోయే అన్నాన్ని పిల్లి ముట్టుకున్నదమ్మా అంటే "పిల్ల ముట్టుకున్నది" అని సరిచేసిన అమ్మ సర్వ మాతృత్వం సర్వజగతినే ముగ్ధులను చేసింది.

వెనుకటి రోజుల్లో ఆవు కుక్కకు పాలిచ్చేది. కుక్క దగ్గర పిల్లి పాలు తాగింది. అమ్మ గుంజకానుకుని కూర్చునుంటే అమ్మ పమిట చెంగు మీద ఎలుకలు, పిల్లులు కలిసి మెలసి ఆడుకునేవి. వాటికి సహజంగా బద్ధ శతృత్వం కదా! మున్యాశ్రమాల్లో అలా వుండేవని వినేవాళ్ళం, కాని అది ఇక్కడ సాధారణం. పిల్లి మ్యావ్ అనే ధ్వనిలో ఓంకారం ధ్వనించేది. ఒకరోజు రాధకృష్ణ రెడ్డి నామం చేస్తుంటే మరొక స్త్రీ గొంతు వినిపించింది ఎవరిదాగొంతని విచారిస్తే కుక్క "జయహో మాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరీ శ్రీ పరాత్పరి" అన్న నామాన్ని శ్రావ్యంగా గానం చేస్తున్నట్లు తెలిసింది.

శరీరం మీద పురుగు వాలినా అదీ సేవకోసమే వచ్చిందనేది అమ్మ. గట్టిగా పట్టుకొని వదలకపోయినా దాని సంస్కారమది దాన్నీ సేవ చేసుకోనివ్వండి అనేది.

మంచం నిండా పురుగులు వాలినా తోలనిచ్చేది కాదు. కందిరీగ కుట్టి చెయ్యి వాచి బాధ పడుతూకూడ అది సేవ చేసుకుని వెళ్ళిందనేది.

అమ్మ హాల్లో ఒక కాకి తిరుగుతోంది. ఎంత తోలినా అది పోవటం లేదమ్మా అంటే "అది నీలాంటిదే నువ్వు పోతున్నావా నన్ను వదిలి అదీ నా కోసమే వచ్చింది" అనేది. నేతితో పూరీలు చేయమని గారెలు చేయమని అనేది. చేస్తే వాటిని చిన్న చిన్న ముక్కలుగా తుంచి ఎగరవేసేది అమ్మ. అవి కింద పడకుండా కాకులు ఎగిరెగిరి పట్టుకుని తింటుంటే వాటి ఆనందాన్ని చూసి వెలిగిపోయే అమ్మను చూస్తుంటే మనకు ఎంత సంతోషంగా వుంటుందో.

అమ్మ దగ్గరకు మేమొచ్చిన కొత్తలో అమ్మ ఒట్టి నేలమీదనే పడుకునేది. చుట్టూ నెట్టులిచ్చిన నేల తల్లి. అప్పుడు వచ్చిన అందరూ అమ్మ చుట్టూ పడుకునే వాళ్ళం ఊరికెళ్ళేవాళ్లకు తను కూర్చున్న చోటి మట్టినే ప్రసాదంగా ఇచ్చేది. అమ్మ ఇచ్చిన ఆ ప్రసాదం సువాసనలను వెదజల్లుతుండేది.

"దైవం మానుషరూపేణ" అని ఆర్యోక్తి

దైవం మాతృ రూపంలో వచ్చి వాత్సల్యామృతాన్ని కురిపించింది. ఆ అమృతాన్ని జుర్రుకున్న వారెందరో వున్నారు. వారిలో కుసుమక్కయ్య ఒకరు, అనేకానేక మధురస్మృతుల్ని ప్రసాదించి వాటిని వ్యక్తీకరించగలిగిన అదృష్టాన్ని అందించింది 'అమ్మ'. లోగడ ఆమె వ్రాసిన దివ్యానుభూతుల్ని చదివి పరవశించిన వారెందరో! అమ్మ సాన్నిధ్యాన్ని అనుభవించామని పులకించిన వారెంతమందో!

అమ్మ పదే పదే "మీకేం మీరు హాయిగా అనుభవిస్తున్నారు. మీరు తిని కూర్చుంటే కుదరదు ఇతరులకూ పంచి పెట్టాలి" అని అనేది.

"మీరు తృప్తిగా తిని ఇతరులకు ఆదరణగా పెట్టండి" అనే అమ్మ ఇచ్చిన సందేశం ప్రకారం కుసుమక్కయ్య తను అనుభవించి ఇతరులకు ఆదరణంగా మధురస్మృతులను అందించి పరవశింప చేస్తోంది. ఇంకా ఎన్నో దివ్యానుభూతుల్ని అందరికి పంచేలా అమ్మ ఆమెపై వారి కుటుంబ సభ్యులపై కరుణావృష్టిని కురిపించాలని శ్రీమాతకు వినతులర్పిస్తూ.

వసుంధరక్కయ్య

జిల్లెళ్ళమూడి
01-12-1997

మహాసరస్వతి - అమ్మ

రామకృష్ణ అన్నయ్య జిల్లెళ్ళమూడి
అమ్మ అంతరంగిక కార్యదర్శి

(వసుంధరక్కయ్య రాసిన "వాత్సల్యామృత వర్షిణిలో శ్రీశ్రీశ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారు. శ్రీశ్రీశ్రీ రఘువరదాస్‌గార్ల గురించి వివరణ తెలియచేయమని అడిగిన వెంటనే రామకృష్ణ అన్నయ్య ఇచ్చిన వివరణ.)

శ్రీశ్రీశ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారు ఉత్తరప్రదేశ్ అలహాబాద్‌లోని ప్రఖ్యాత 'సంకీర్తన భవన్' కు వ్యవస్థాపకులు. వీరు ఋషి, జితేంద్రియులు, తత్త్వవేది, తపస్వి, సాధు మహారాజ్, మంత్ర సిద్ధి పొందిన రాధోపాసకులు, భక్తి జ్ఞాన వైరాగ్యాల త్రివేణి సంగమం. ముక్తి మార్గాల్లో నామ సంకీర్తనకు పెద్దపీట వేసిన మహనీయులు. వీరు మూర్తీభవించిన ఆర్షధర్మం. 'భాగవత కథ' అన్న 108 భాగాల బృహత్ గ్రంథ రచయిత. ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు, చైతన్య చరితావళి మొదలైన అనేక ఆధ్యాత్మిక గ్రంథ రాజాలను లోకానికి అందించిన యశస్వి.

వీరి ప్రధాన శిష్యులే శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామీజీ. సన్యాసాశ్రమం స్వీకరించక ముందు వారు శ్రీ శియారఘువరదాస్‌గా సుప్రసిద్ధులు. ఆంధ్రదేశాన్ని 1950 వ సం॥ నుంచి 1975 వరకు "హరేరామ" నామ సంకీర్తనతో ఉర్రూతలూగించిన నామయోగి. ఆంధ్ర తమిళనాడు, కర్నాటక, కేరళ అన్ని దక్షిణాది రాష్ట్రాల్లో విరివిగా పర్యటించి నామ సంకీర్తనను అత్యధికంగా ప్రచారం చేసిన నామావతారులు. తాను భక్తి పారవశ్యంలో మునిగిపోయి ప్రజలను ఆనందరసామృత సాగరంలో ముంచెత్తిన మరో చైతన్య ప్రభువు. సన్యాసాశ్రమం స్వీకరించినప్పటికీ నామప్రచారం కొరకై చేసే విస్తృత దేశపర్యటనలో అడ్డుగా నిలిచిన దండకమండలాలను పరిత్యజ్యించిన ధీరోదాత్త పరివ్రాజకపుంగవులు. సంకీర్తనమే ఊపిరిగా జీవించిన సంకీర్తనా తత్పరులు. వీరు ఆకృతి దాల్చిన "నామ సంకీర్తనం" అనటం అతిశయోక్తి కాదు. భక్త తులసీదాస్ విరచిత "హనుమాన్ చాలీసా" ను గానం చేసి, లక్షలాది మంది చేత చేయించి, చోసాస్థూపాలను వందలాది నిర్మించిన పూత చరిత్రుడు.

అమ్మను పరాశక్తిగా దర్శించి 'జయహో మాతా శ్రీ అనసూయా' అన్న అమ్మ నామాన్ని మధురాతిమధురంగా గానం చేసి పరవశించిపోయిన భాగవతోత్తములు వీరు.

సాహిత్యానికి, సంగీతానికి ప్రతీకలై నిలిచిన ఆ యిద్దరు మహనీయులు అమ్మకు ఇరువైపుల ఆసీనులయితే అమ్మ సరస్వతీదేవియై శోభిల్లిన ఆ కమనీయ దృశ్యం చిరస్మరణీయం.

అమ్మ చరణసేవలో
కొండముది రామకృష్ణ

కుసుమ పరాగం

'పురుషోత్తమ పుత్రభార్గవ'

పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్

కుసుమా! కుసుమపరాగా! రాగవిలాసినీ!

మాతృశ్రీ కృపయాపాతు సర్వదా సర్వధాభృశమ్!!

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అని శ్రీరాముడు చెప్పినట్లుగా పెద్దలు చెపుతారు. శ్రీమతి అయ్యగారి కుసుమకుమారి తన జననీ జనకులకు తన "మధురస్మృతులు" గ్రంథాన్ని అంకితం ఇవ్వటం సముచితంగా ఉన్నది. పైగా వాళ్లు మామూలు తల్లిదండ్రులు కాదు. విశ్వజనని దగ్గరకు చేర్చిన తల్లిదండ్రులు. "తండ్రి హరి చేరుమని యెడి తండ్రి తండ్రి" అని కదా భాగవతం చెప్తున్నది.

గుంటూరులో శ్రీ అన్నంరాజు మాధవరావుగారు, శ్రీమతి కనకదుర్గాంబగారు పార్వతీ పరమేశ్వరులవలె వారం వారం జరిగే అమ్మ పూజా కార్యక్రమాలకు వచ్చేవారు. ఆ ఇంటిల్లిపాదీ జిల్లెళ్లమూడి అమ్మ బిడ్డలే, అమ్మ అనురాగవాత్సల్యాలు జుఱ్ఱుకున్నవారే.

వారి కుమార్తె కుసుమ అక్కయ్య నాకంటే వయసులో చిన్నదే అయినా అక్కయ్య అని పిలవటం మా అలవాటు. అది జిల్లెళ్ళమూడి అందరింట్లోని వాతావరణ ప్రభావం ఈ అక్కయ్య విషయంలో అంతమాత్రమే కాదు. ఈ గ్రంథం చదివింతరువాత అక్కయ్య అని పిలవటమే న్యాయం అనిపించింది. "ఏళ్ళు మీరిన వాడా వృద్ధుడు, జ్ఞానవృద్ధుడు, వృద్ధుడు కాని" అని నీతిచంద్రికలో చదివాను. నిజమే. ఈ రకంగా కూడా కుసుమ అక్కయ్యే.

అక్కయ్య వ్యాసాలు మాతృశ్రీ మాసపత్రికలో వచ్చే రోజుల్లో పరవాలేదు ఏదో వ్రాస్తుందని అనుకునే వాడిని. రాను రాను కలం పదునుదేలింది. ఆమె వ్రాసిన తన, ఇతరుల అనుభవాలు చదివిన తరువాత అనిపించింది. నాలాంటివాడు ఇంక వ్రాయకపోయినా పర్వాలేదు అని, ఆ కథా కథనశైలిలో అంతటి ఆసక్తి కలిగించే ఒకరకమైన మాధుర్యం ఉన్నది. అక్కయ్యే అందరి అనుభవాలు సేకరించి వ్రాస్తే బాగుండునని అనిపించింది. మొత్తంమీద ఈ మధురస్మృతులు ఆమెకే కాదు అమ్మ బిడ్డలందరికీ మధురస్మృతులే.

ఒక రకంగా తన అనుభవాలు చెప్పడం వేరు. ఇతరుల అనుభవాలు తన

హృదయగతం చేసుకుని వ్రాయడం వేరు. మనలో చాలామందిమి మన అనుభవాలునే కాగితం మీద పెట్టవలసి వస్తే చాలా ఇబ్బంది వస్తుంది. దానికి అనుగుణమైన భాష, శబ్దాలు, ధార మనకు దొరకవు. "అమ్మను గూర్చి ఏమని చెప్పను? అనుభవించిన అనుభూతికి ఏ రంగు కప్పను?" అన్నాను నేను ఒకసారి కాన్వాస్ మీద ఏ రంగు వేయాలో దాంట్లో ఆరితేరిన వాడికే తెలుస్తుంది. కుసుమ అక్కయ్య తనకుంచెతో ఈ రంగులను అందంగా తీర్చిదిద్దింది. ఈ శిల్పం ఆమె సొత్తైనది.

ఒక వ్యక్తి మీద, అందులో ఒక ఆధ్యాత్మిక శక్తి సంపన్నులైన దేవతామూర్తి మీద, అందునా మనముందు కదలాడే దైవశక్తి సంపన్నుల పైన విశ్వాసం కుదరటం కష్టం. నిలబడటం అంతకన్న కష్టం. ఎందుకంటే వారి దినచర్యలలో మనం చూచే లౌకిక వ్యవహారాలు ఆ నమ్మకాన్ని నిలబడనీయవు. ఇందులో సిద్ధులు వేరు. జ్ఞానులు వేరు. సిద్ధులైతే ఏదో ఒక మహిమ చూపుతారు. దాంతో ఈ లోకం వారి వెంటబడుతుంది. ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. జ్ఞానులు అలాకాక వారి సన్నిధిలోని వారికి, వారిని విశ్వసించిన వారి జీవితాలలో మహిమలు అతిసామాన్యంగా జరుగుతుంటాయి. అయితే వాటిలో వారి అస్తిత్వాన్ని అంగీకరించరు. మీ విశ్వాసమే మిమ్మల్ని రక్షించింది. మీకు అది జరిగే సమయం వచ్చింది. జరిగింది నేనేం చేయలేదని అంటారు. మంచి నేను చేసానని నమ్మితే చెడు జరిగినప్పుడు కూడా నేనే చేసానని అనుకోవాలి. రెండూ వాడిచ్చినవే అని అంటారు. అసలు విశ్వాసమే భగవంతుడంటారు. దేనికీ వారి కర్తృత్వాన్ని ఒప్పుకోరు.

ఇక అమ్మ గురించి చెప్పవలసి వస్తే "అమ్మ అవతారం" మిగిలిన దశావతారాలకు భిన్నమైనది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ వారి అవతార పరమధర్మమైతే అమ్మ తనది తల్లి ధర్మమన్నది. తల్లికి తప్పే కనిపించదన్నది. బురద తొక్కివస్తే కడుగవలసిన బాధ్యత తనదేనన్నది. దుష్టత్వాన్ని శిక్షించాలిగాని, దుష్టుడ్నికాదన్నది. తనది రక్షణేనన్నది. తన వద్ద శిక్షణేగాని శిక్షలేదన్నది. ఒక విలక్షణమైన వ్యక్తిత్వం అమ్మది. సర్వత్రా మమకారమే నన్నది "నరకాసురుడు, రావణుడు కూడా బిడ్డలే కదా! వారి తల్లులు దుఃఖించకుండా ఎలా వుంటారు" అన్నది అమ్మ. "తల్లికి చెడ్డవాడూ బిడ్డేకదా" అంటుంది.

ఒక బిడ్డ అమ్మ పాదాలు కడుగుతూ "ఇవి బ్రహ్మకడిగిన పాదాలే కదా!" అంటే "అవును నాన్నా! నీవు బ్రహ్మవు కాకపోతేగా" అన్నది. సర్వకాల సర్వ అవస్థలలోనూ ఆ అద్వైత శిఖరంపై ఉంటుంది అమ్మ.

హైమను శక్తిపాతం చేసి దివ్యత్వాన్నివ్వటం చూస్తే మనమంతా దివ్యులమనే భావన నివ్వటానికే అనిపిస్తుంది. హైమ ప్రసాదించిన అనుభవాలు కోకొల్లలు. తనను నమ్ముకున్నవారికే కాదు హైమను ఆరాధించిన వారికి తీరిన కోరికలు, ఇచ్చిన ఫలితాలూ చూస్తుంటే నమ్మిచెడినవారు లేరనిపిస్తుంది. నన్ను కూడా జిల్లెళ్ళమూడి కరణం గారి భార్యగా ఆరాధిస్తున్నారా? ఏ లలితగానో, చండిగానో, దుర్గగానో లేదా వాళ్ళ వాళ్ళ ఇష్టదైవాలను నాలో చూచి పూజిస్తున్నారు. వాళ్ళనమ్మకమే వాళ్ళను రక్షిస్తుంది అని అమ్మ అంటుంది. అన్ని రూపాలుగా వారికి ఎట్లా కనిపిస్తున్నావంటే అది వాళ్ళను అడగాలిరా అంటుంది.

ఏలూరు నివాసి సోదరుడు తూనుగుంట త్రిలోక అప్పారావుకు జరిగిన అనుభవం చదువుతుంటే అమ్మ తనను నమ్ముకున్నవాళ్ళకు ఎలా రక్షగా వుంటుందో తెలుస్తుంది. అంతే కాదు దొంగలో కూడ పశ్చాత్తాపం తెప్పించి నమ్మినవాడిని, నమ్మనివాడిని కూడా కాపాడటం అమ్మ తత్వంలోని విశిష్టత. కర్త, కర్మ క్రియ అన్నీ తానే అవుతుంది. "కార్యకారణ నిర్ముక్తా" ధ్యానధ్యాతృధ్యేయరూప" కదా అమ్మ. అప్పారావుకు అమ్మ యందు కల అచంచల విశ్వాసం అతన్ని స్థిత ప్రజ్ఞగా తీర్చిదిద్దాయి.

మనకేం కావాలో అమ్మకు తెలిసినంతగా మనకు తెలియదు. కుసుమక్కయ్య "తన కుటుంబాన్ని అప్పుల ఊబిలోంచి బయటపడేస్తే చాలు ఇంకేమీ కోరనంటే" అంతేనా ఇంకేమీ కోరవా? అంటూ అమ్మ ఆ కుటుంబాన్ని కష్టాల కడలిలోంచి ఒడ్డుకు చేర్చటమేకాక సుఖసంతోషాలతో ఉండే కుటుంబానికి కావలసినవన్నీ అడక్కుండానే ఇచ్చింది.

మహిమాన్విత అయిన అమ్మలోని మమతా మాధుర్యం అనుభవించినవారు ఆనందంతో ఉక్కిరిబిక్కిరియై తమ కన్నీళ్ళతో పాదాలభిషేకించక ఏంచేస్తారు? ప్రపంచంలో బిడ్డలకు తనే అన్నీ సమకూర్చి పూజచేసుకోమనే దేవుళ్ళెక్కడ దొరుకుతారు. కుసుమక్కయ్య పెద్దకూతురు పెళ్ళి జరిగిన తీరు, వాళ్ళ కుమారుని ఉపనయనం అమ్మే కావాలని చేసిన పద్ధతి ఎవరి మనస్సు కష్టపడకుండా ఎవరెవరికి ఏ విదంగా పెట్టుపోతలు జరగాలో ఆ విధంగా జరిపించిన పద్ధతిలోని అమ్మ కరుణ, వాత్సల్యం కుసుమకు కన్నీళ్ళు తెప్పించటంలో ఆశ్చర్యం లేదు. కుసుమ ఆ సన్నివేశాన్ని వ్రాసిన, చిత్రీకరించిన తీరు మన మనస్సులను కూడా ద్రవింపచేస్తాయి.

ఇక శ్రీ చక్రవర్తి గారిలోని ఏమీపట్టని మనస్తత్వం చూస్తే, 'శీతోష్ణసుఖ దుఃఖా'లలో చలించని మనస్సు, 'పండితాస్సమ దర్శనః' అన్న పదం జ్ఞప్తికి వస్తుంది. అయితే ఇక్కడ విచిత్రమేమిటంటే అమ్మ బిడ్డలెవ్వరూ లోకంలో ప్రచలితంలో ఉన్న పండిత' శబ్దవాచ్యులుకారు. పండితులు కాకుండానూ పోరు. శ్రీ చక్రవర్తి గారికీ తన శ్రీమతి వ్రాసిన గ్రంథావిష్కరణ జరుగుతుండగా తనను గూర్చి ఒక్కమాట చెప్పకపోయినా పట్టదు. తన కూతురు పెళ్ళి చేస్తూ తాను మొదటి పంక్తిలో భోజనానికి కూర్చున్నా కూర్చోకూడదు అని తోచదు. అది ఒక సచ్చిదానంద స్వరూప లక్షణం మరి. ఉన్నది ఉన్నట్లుగా జరిగినది జరిగినట్లుగానే కదురసవంతంగా వ్రాయడం కుసుమ ప్రత్యేకత. శ్రీ విశ్వనాథ "ప్రాక్పపశ్చిన్మతమ్ముల ప్రతిభ వేయిరెట్లు గొప్పది నవకథాధృతినిమించి, కవి ప్రతిభ లోన ఉందు తొంబదియైనపాళ్ళు" అని అంటారు. కుసుమరచనా ప్రాభవంలో ఆ ప్రతిభ సర్వేసర్వత్రా కనిపిస్తుంది, యీ వ్యాసాలలో.

కష్టాలలో ఉన్నవారు అమ్మతో "నీవేదో కాచి రక్షిస్తావనుకుంటే నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటావా? అని అమ్మ మీద అలిగి భోంచేయని సన్నివేశాలు కూడా ఉంటాయి. ఎందుకంటే అన్నింటికంటే బిడ్డలు కడుపునింపు కోవటమే 'అమ్మ' కు ఆనందం. అలాలేనినాడు బాధపడ్తుంది. అమ్మను సాధించాలంటే పస్తులుండటమే సరియైన మార్గం అని భావించేవారు చాలా మందే వున్నారు.

ఒకసారి బాధల్లో అమ్మ మనల్ని కాపాడలేదని కుసుమక్కయ్య భీష్మించుకు కూర్చుని ఇంట్లో ఎవరికీ అన్నం వండలేదు. మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. అందరూపస్తే, అయితే తనబిడ్డలు తినకుండా పస్తులు, పడుకోవటం అమ్మకు బాధేకదా శ్రీనాదెండ్ల లక్ష్మణరావు గారి భార్య భ్రమరాంబక్కయ్య వాళ్ళింటికి ఆ సమయంలో వచ్చి, అన్నయ్య (లక్ష్మణరావు) ఊళ్ళో లేనప్పుడు వచ్చి మీ ఇంట్లో భోంచేయమన్నావుగదా! అందుకే వచ్చాను. భోజనం పెట్టమన్నది. ఇక తప్పేదేమున్నది లేచి అప్పుడు వంటచేసి అందరికీ పెట్టక తప్పలేదు. అమ్మలీలలు ఈ విధంగా వుంటాయి. అమ్మే భ్రమరాంబరూపంలో వచ్చిందో, భ్రమరాంబ మనస్సులో దూరివచ్చిందో వీళ్ళచేత భోజనం చేయించటానికి.

అమ్మ "ఎవరూ తిట్టీకొట్టీ నన్ను ఏడిపించలేరు. వాళ్ళలోని మంచితనమే నన్ను ఏడిపిస్తుంది" అని అంటుంది. అమ్మలోని అపారమైన కరుణ, అకారణ కరుణ మన మనస్సును ద్రవింపచేస్తుంది.

రేటూరికి చెందిన 'ఇమామ్' అనే ముస్లిమ్ యువకుడు ఈనాడు మనం అఖండ పారాయణగా పారాయణ చేస్తున్న "జయహో మాతాశ్రీ అనసూయ రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి" నామాన్ని సృష్టించి మొదటిసారిగా జిల్లెళ్ళమూడిలో గానం చేసాడు. అతడ్ని పోలిసెట్టి కుమారస్వామిగారి భార్య అన్నపూర్ణమ్మగారు "శ్యామ్" అని నామకరణం చేసి పెంచుకున్నారు. చివరిదశలో అతను జిల్లెళ్ళమూడి వచ్చి అక్కడే అమ్మలో కలసిపోవడం అమ్మ అపార కరుణకు నిదర్శనం.

లలితాంబక్కయ్య మనుమరాలు అనసూయ సర్టిఫికెట్లు సిటీబస్సులో పోయి దొరకటంలో హైమ పట్ల ఆమెకు నమ్మకం కలగటానికి ఒక తార్కాణం. సుప్రసిద్ధ కమ్యూనిష్టు యం.పి. వీరమాచనేని ప్రసాదరావుగారి కోడలికి స్వయంగా అమ్మే వచ్చి ఆపరేషన్ చేయటం ఆయనకు దృశ్యమానం కావటం ఆనందాశ్చర్యాలలో ఆయన పులకరించిపోవటం జరిగింది. ఆ విషయం మరో మాజీకమ్యూనిష్టు యం.పి. కి చెబితే హేతువాది యిలా మారాడేమిటని ఆశ్చర్యపోతుంటే" ఏ ఆధారం లేక నమ్మటం ఎలా మూర్ఖత్వమో ఎన్నో అవలోకిస్తూ, అనుభవిస్తూ నమ్మకపోవటం కూడా అంత మూర్ఖత్వమేనని" ఏ ప్రకోపం లేకుండా చెప్పటం ఒక గొప్ప అనుభవమే.

అన్నంరాజు మురళీ భార్యకు రెండవ పురుడు అయిన తరువాత జుట్టుపూర్తిగా వూడిపోయి బాధపడ్తోందని మురళీ 'అమ్మ' కు నివేదించాడు. చాలామంది స్పెషలిష్టులకు చూపించానని ఎవరూ జుట్టు ఎందుకు వూడిందో అసలు జుట్టు వస్తుందో రాదో చెప్పలేకపోతున్నారని చెప్పాడు. తిరుపతి మొక్కు తీర్చకపోవటం వల్ల ఇలా జరిగిందంటున్నారన్నాడు. దానికి అమ్మ "వెంకన్న కావాలంటే గుర్తు చేస్తాడు కాని యిలా జుట్టు పూర్తిగా ఎందుకు తీసుకుంటాడంటూ తన ఎడమచేతితో గుండు మీద రాసింది. ఆరు నెలలుగా లేని జుట్టు అమ్మ చేతితో రాసిన మర్నాడే రావటం మొదలై మామూలుగా జుట్టు వచ్చేసింది. "నీవే వెంకన్నవు అని" ఇక్కడే జుట్టు ఇస్తామన్నాడు. మీకు నమ్మకముంటే అలాగే కానివ్వండని మూడు కత్తెర్లువేసి వారిని ఆనందపరిచింది.

అదే విధంగా పోతుకూచి ఝాన్సీకి మోటారులో జుట్టు పడిపోయి చర్మంతో సహా వూడి స్మృహ కోల్పోతే అమ్మ కాపాడిన విషయం మనందరికీ తెల్సినదే. కాబట్టే అమ్మ అపారకరుణామయి.

నాదయోగి రాధా కృష్ణరెడ్డి అంధుడు అమ్మను ఎన్నెన్నో పరీక్షలు చేసి అమ్మ స్థానమే పరంధామమని నమ్మినవాడు. అతడు గానం చేస్తుంటే ప్రకృతి పాడేదీ, పక్కనే వున్న కుక్క తోడుగా రాగం తీసేది. జిల్లెళ్ళమూడి దేవాలయ గర్భగుడిలో అర్ధరాత్రి 'హైమ' నామం చేస్తుంటే "హైమ ఆలయంలో నుంచి లేచి వస్తుందేమోనని పిస్తోందిరా! వాడు నామం చేస్తుంటే" అని అమ్మకే అనిపించింది. రాధను తనలో కలుపుకొని జిల్లెళ్ళమూడిలోనే ప్రతిష్ఠింప చేసుకున్నది.

వైద్యులు పరీక్షలు చేసి పిల్లలు కలగరని ఆశవదులుకున్న రుక్మిణక్కయ్య, యోగయ్యలకు సంతానం కలగటం సోదరులు వల్లూరి పాండురంగారావు, ఏకా అంజన్‌లకు సంతానభాగ్యం ప్రసాదించటం, అమ్మ కరుణ కటాక్షాలకు నిదర్శనం.

ఇక అడుగడుగున కాపాడిన అడవులదీవి మధు, రాచర్ల లక్ష్మీనారాయణుల విషయం చెప్పవలసివస్తే ఒక్కొక్కరిదీ ఒక్కొక్క గ్రంథం అవుతుంది. ఇలాంటివెన్నో, ఎందరెందరో వేలకువేలు.

అమ్మకు 50 ఏళ్లు నిండినప్పుడు "నీకేం చేయమంటావమ్మా" అని అడిగితే లక్షమంది పిల్లలు భోజనం చేస్తుంటే చూడలనివున్నది అన్నది. అలాగే అమ్మస్వర్ణోత్సవాలకు లక్ష. ఏభైవేలమంది ఒకే పంక్తిన భోజనం చేసారు. అమ్మ ఆనందంగా కన్నులారా ఆ వైభవాన్ని తిలకించింది.

అలాగే 60 ఏళ్ళకు లక్షమంది పిల్లల్ని ఉయ్యాల్లో పడుకోబెట్టి వూపుతూ వుంటే చూడాలన్నది. ఆ ఉత్సవాన్ని అమ్మ కళ్ళారా చూచినట్లే వర్ణించి చెపుతుంటే అక్కడే వున్న మేమంతా ఆనంద పులకితులమైనాము. కానీ ఆ ఉత్సవాన్ని కళ్ళారా చూడలేకపోయాము. భావనాలోకంలో తప్ప అమ్మ దానిని ఎప్పటికి నెరవేరుస్తుందో!

కుసుమక్కయ్య అలా భగవతి పాదాలకు సుగంధ భరితంగా తననుతాను ఒక కుసుమంగా సమర్పించుకున్నది. అంతకంటే జీవితానికి ధన్యత ఏమున్నది?

స్మృతి అంటే మరుపురానిది. "మరుపు అంటే మరణం" అన్నది అమ్మ. అంటే మృతి లేని స్మృతి. ఇవన్నీ మధురస్మృతులు.

ఇలాంటి గ్రంథాలను అనుభవ సుగంధ భరితం చేసి అక్కయ్యలకు, అన్నయ్యలకు, తమ్ముళ్ళకు, చెల్లెళ్ళకు రాబోయే తరాలకు ఇంకా ఇంకా అందించాలని ఆశిస్తూ, ఆకాంక్షిస్తున్నాను.

"అస్తు, సన్మంగళాని భవన్తు"

కృతజ్ఞతాంజలి

సుఖాన్ని వెతుక్కోవాలి. ఆనందాన్ని వెతుక్కోనవసరం లేదు. భౌతికమయిన ఉనికికి అతీత హృదయానుభూతి ఎందుకుంటుందంటే మహర్షి చెప్పిన ఆనందం తానైన మహాత్ములు కావటం వలన. పరుసవేది తాకిన ఇనుము బంగారమయినట్లు, వారి సన్నిధిలో అలౌకికానుభూతి, వారి క్రియల ద్వారా పొందుతాము. క్రియలకు అతీతంగా మౌనం నుండీ కూడా పొందుతాము. వారు పెట్టేవి, ఇచ్చేవి ఏమిటి అని కాదు. అమ్మ పూర్ణతత్వానుభూతి యొక్క ప్రభావం దివ్యానుభవాన్ని, అనుభూతిని కలుగచేస్తుంది. "చెప్పేది అనుభావం తనలో ఉద్భవించేది అనుభవం" అంటుంది అమ్మ. అట్టి అనుభవజ్ఞానప్రపూర్ణ కనుక అమ్మ చెంత అట్టి భావనానుభూతి కలుగుతుంది. కలకండ, తీపి వేరుకానట్లు దివ్యమాతృత్వం వేరు కాదు కనక అట్టి అనుభూతిని పొందుతాము.

నా పురాకృత పుణ్యవశాన షోడశోపచారాలుగా, షోడషవర్షములు మాతృశ్రీ అనసూయామహాదేవి యొక్క సేవాభాగ్యం కలిగింది. మాతృశ్రీ చరణ సన్నిధిలో సంప్రాప్తమైన అనుభూతులు, అమ్మను దర్శించి, అమ్మతో సంభాషించు అవకాశమేర్పడిన సందర్భమున మా హృదయములలో పదిలపరచుకున్న 'దివ్యానుభూతుల'కు అక్షరరూపం కల్పించాము. 'దివ్యానుభూతుల'ను చదివి స్పందించినవారు అందించిన ప్రోత్సాహముతో, వారి అనుభవాలనూ కలిపి 'ఆధ్యాత్మిక మధురస్మృతుల'ను పేర రూపకల్పన చేసాము. వారందరికీ నా హృదయపూర్వక నమస్కృతులు

శుభాశీస్సులు అందించిన శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి వారికి నమస్సుమాంజలులు అర్పిస్తున్నాను. పెదపులిపాక శ్రీశ్రీశ్రీ వాసుదేవానందగిరి స్వామిజీకి కైమోడ్పులు సమర్పిస్తున్నాను. రామకృష్ణ అన్నయ్య రాసిన మహాసరస్వతి-అమ్మ, పి.యస్.ఆర్. అన్నయ్య అందించిన కుసుమ పరాగం ఈ గ్రంథానికే వన్నె తెచ్చాయనటంలో సందేహం లేదు. అడిగిందే తడువుగా డా॥ఝాన్సీలక్ష్మీబాయి పంపిన "మహిమాన్విత మన అమ్మకు, వసుంధరక్కయ్య పంపిన 'వాత్సల్యామృతవర్షిణి'కి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

నా మొదటి కృతియైన 'దివ్యానుభూతులు' 'మాతృశ్రీ' అనసూయా మహాదేవి" పాదపద్మములకు భక్తి పూర్వకముగా సమర్పించుకొన్నాను. అమ్మ యొక్క

అనుగ్రహవిశేషముచే "ఆధ్యాత్మిక మధురస్మృతులు" సర్వాంగసుందరముగా రూపొందినది.

20 సం॥లకు పూర్వము నా అనుభూతులను వ్యాసరూపములో వ్రాసినప్పుడు మా అత్తగారు శ్రీమతి రోహిణీ దేవిగారు ఇచ్చిన అమూల్య సలహాలు ఎంతో ఉపయోగపడినవి. మాతృశ్రీలో నా వ్యాసములను చదివిన మా పినమామగారు, డా॥ ఎ.ఎన్.రావ్ గారు, మా చిన్న అత్తగారు రాజ్యలక్ష్మిగారు నాకు ఎంతో ప్రోత్సాహాన్ని కలుగచేసారు. ఇప్పటికీ వారి ఆశీస్సులు నాకు ఎంతో స్ఫూర్తిని దీప్తిని కలుగ చేస్తున్నాయి.

నాచే అమ్మ రాయించిన "దివ్యానుభూతుల"కు "ఆధ్యాత్మిక మధురస్మృతుల"కు ప్రూఫు సరిచూసిన మా కోడలు అయ్యగారి ఉమాదేవికి జగన్మాత అయిన అమ్మ ఆశీస్సులు సర్వదా లభించాలని కోరుకుంటున్నాను.

గ్రంథాన్ని సకాలంలో, సర్వాంగ సుందరంగా ముద్రించిన సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్, విశాఖపట్టణం వారి యాజమాన్యానికి, సిబ్బందికి నా ధన్యవాదాలు.

ప్రతివారం పూజలకు వస్తున్న అక్కయ్యలకు, అన్నయ్యలకు నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు తెలియ చేసుకుంటున్నాను.

అమ్మ చరణ సేవలో

అయ్యగారి కుసుమాచక్రవర్తి



అమ్మ పాదాలు అంబురుహంబులంచు
పల్కు కవి వాక్కు నేటితో పతన మాయె
నిశిని పద్మముల్ ముకుళించు, నిభము లేక
అమ్మ పాదాలు భక్తుల నాదరించు



కవులు అమ్మ పాదాలను పద్మములతో పోల్చుదురు. అది సబబు కాదు. పద్మములు అమ్మ పాదాలతో సమానత్వము పొందజాలక రాత్రులందు ముకుళించుకుపోగా మన అమ్మ పాదాలు మాత్రమే అహర్నిశలూ భక్తులను ఆదరించుచుండును. ఇది నిక్కము.

శ్రీ పి. సత్యనారాయణ
గ్రేడ్ I తెలుగు పండిట్, ఎ.యు. హైస్కూలు

దివ్యానుభూతులు - ఆవిష్కరణ

1997 ఫిబ్రవరి 17వ తేదీన జిల్లెళ్ళమూడిలో ధాన్యాభిషేకము జరిగిన రోజు అనుగ్రహసదస్సులో మాష్టరు ఎ.వి.వి. ప్రసాదరావు గారు 'దివ్యానుభూతులు' అను గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆ ఆవిష్కరణానంతరం మాట్లాడమంటే "శోకఃశ్లోకత్వం ఆగతః" వాల్మీకికి క్రౌంచమిథునంలో ఒక పక్షి చనిపోయిన శోకంలో నుంచి శ్లోకం ఆవిర్భవించింది. 24 వేల శ్లోకాలతో వాల్మీకి రామాయణం రచించినట్లుగా, మా బాబు యాక్సిడెంట్ వలన కలిగిన శోకం నుంచి నా అనుభవాలను వ్యాసరూపంగా వ్రాసానని చెప్పాను. అమ్మ కంటతడి పెట్టిన సంఘటనను రామకృష్ణ అన్నయ్య వివరించాడు. మా నాన్నగారు పోయిన తరువాత మా అమ్మగార్ని జిల్లెళ్ళమూడి తీసుకువెళ్ళినప్పుడు అమ్మ కంటి నీరు తుడుచుకుంటుంటే "అమ్మా నీవూ కంటతడి పెడ్తున్నావా?" అని రామకృష్ణ అన్నయ్య అడిగాడు. దానికి అమ్మ "ఎవరూ నన్ను కొట్టి, తిట్టి ఏడిపించలేరు. దాని మంచితనమే నన్ను ఏడిపిస్తున్నదని" చెప్పింది.

ఆ సంఘటన సినిమారీలులాగా నా కళ్ళముందు మెదిలేటప్పటికి నా గొంతు మూగబోయింది. కొంచెంసేపు వుంటే ఏడ్చేస్తానన్న భయంతో మాట్లాడటానికి అవకాశమిచ్చిన కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలని చెప్పి కూర్చుండిపోయాను. ముందుగా "శ్రీకారం చుట్టటానికి కారణమైన శ్రీ పన్నాల రాధాకృష్ణ శర్మగారికి, సలహా సహకారాలందించిన రామకృష్ణ అన్నయ్యకు ధన్యవాదాలని చెప్పాను.

ఇంకా రెండు మూడు సంఘటనలను వివరించాలనుకున్నా అమ్మ స్మృతిలో మెదిలిన దుఃఖంతో మా ఆయన ఇచ్చిన ప్రోత్సాహం గురించి ఒక్క మాటకూడ చెప్పలేక పోయాను. స్టేజి దిగి రాగానే మా పెద్ద అమ్మాయి అమ్మా! నాన్న గురించి ఒక్కమాట చెప్పలేదేమని అంది. తీరాలోపలికి వెళ్ళాక మా చిన్న అమ్మాయి నాన్న గురించి రెండు ముక్కలు చెప్పి వుండవలసినదమ్మా! అనేటప్పటికి నాకెంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్న ఆయన గురించి చెప్పలేదని చాలా బాధపడ్డాను.

విశాఖ సభ్యులలో ఒకరు "మీ అమ్మకు అంత సన్మానం జరుగుతుంటే మీ నాన్న ఫీల్ అవుతున్నారా?" అని మా అమ్మాయిని అడిగారు. అక్కడే వున్న వల్లభజోస్యుల లక్ష్మిగారు "ఆవిడ రీసర్చి చేసి డాక్టరేటు తెచ్చుకోలేదని బాధపడ్డారు కాని, ఆమెకు సన్మానం జరుగుతుంటే చూసి అసూయ పడేమనిషి కాదని" చెప్పారు.

శ్రీమన్నారాయణగారు పదే పదే అయ్యగారి కుసుమాచక్రవర్తి అంటుంటే

ఈవిడ స్టేజిమీద ఇంకేం చెప్తుందో అని భయపడ్డాడని ఆయన అన్నారు. దానితో నా మనస్సు స్థిమితపడింది. అంతమటుకు వున్న ఆవేదన దూరం అయింది.

ఆ విషయాన్ని రామకృష్ణ అన్నయ్యతో చెపితే "నా కాలు బాగాపని చేస్తుంది. నా చేయి బాగా పనిచేస్తుంది. నాముక్కు బాగా పనిచేస్తుందని చెప్పుకుంటామా! అలాగే వారిద్దరూ ఒకటే. అర్ధనారీశ్వర తత్వం వారిదని" అన్నాడు.

"అథో అర్ధోవాఏష ఆత్మనః యత్పత్నీః

(అతడు, అంటే పతి సగపాలు, పత్నియే తక్కిన సగపాలు) అనటం చేత భార్యాభర్తలిద్దరూ కలిసి ఏకవ్యక్తి అన్న ఉత్కృష్ట భావం వేదాలలోనే ప్రకటించబడింది. ఆ మాట విని మహాదానందభరితురాలనయ్యాను. ఏ స్త్రీకి అయినా అంతకంటే కావల్సినది ఏముంటుంది? 'అమ్మే' నా వ్యధను దూరం చేయటానికి అన్నయ్యచేత అలా పలికించిందని నా ప్రగాఢ విశ్వాసం. అందుకే వారికి వేరే ఎటువంటి కృతజ్ఞతలు తెలియచేయలేదు. ఈ పుస్తకాలు రాయటమయితే నేనే కానీ, ఆలోచన, విషయవివరణ అంతా ఆయనదే. ఆయన ప్రోత్సాహంతో నా ఆలోచనలను మీ ముందు పరచగల్గుతున్నాను. నేను నిమిత్తమాత్రురాలిని. అమ్మ యొక్క అండదండలు ఎప్పుడూ ఇలాగే వుండాలని కోరుకుంటున్నాను.

ఇట్లు
అమ్మ చరణసేవలో
అయ్యగారి కుసుమాచక్రవర్తి

కృతిసమర్పణ



జన్మజన్మాంతరాల పుణ్యఫలంగా నాకీ పుట్టుకలో తల్లి, గురువు, దైవం అన్నీ తానే అయిన 'మాతృశ్రీ అనసూయామహాదేవి' చరణసేవ చేసుకునే భాగ్యం కలిగింది. అట్టి జన్మకారకులైన నా జననీ జనకులు **శ్రీమతి అన్నంరాజు కనకదుర్గాంబ, శ్రీ అన్నంరాజు మాధవరావు** పుణ్యదంపతులకు సభక్తి పూర్వకముగా ఈ కృతిని అంకితం చేస్తున్నాను.


మాతృదేవోభవ

పితృదేవోభవ

ఆచార్యదేవోభవ

అతిథిదేవోభవ

– అయ్యగారి కుసుమాచక్రవర్తి



అమ్మతో, "హరేరామ" నామ సంకీర్తనతో ఉర్రూతలూగించిన నామయోగి
శ్రీ రఘువరదాసు మరియు అమ్మ అంతరంగిక కార్యదర్శి రామకృష్ణ అన్నయ్య

అమ్మ దీవెన

అమ్మ చరణాలు అరవిందులలరుననుచు
పల్కు కవివాక్కు నేటితో పతనమాయె
రాత్రి పద్మముల్ వీడగారాగదనము
అమ్మ చరణాలు భక్తులన్ ఆదరించు ॥

అనెడి విజ్ఞుల మాటలనాలకించి
భక్తి భావన మీ యెద పరిమళింప
రసమయ జగత్తులోననురాగమొదవి
అమ్మ దీవెన కుసుమమ్మునందు కొనుమ ॥

శ్రీ పి. సత్యనారాయణ
గ్రేడ్ I తెలుగు పండిట్
ఎ.యు. హైస్కూలు

చక్రవర్తి సహధర్మ । చారిణియయి
అధ్యయన పరిషత్తున । కమ్మయునయి
ఆలమందల మధ్య గో । పాలుపగిది
మురళి మ్రోయించుకుసుమ । మొకరింతు

శ్రీ గోళ్ల రామలింగేశ్వరరావు

శ్రీ మాతృశ్రీ అనసూయకు వారసురాలుగా
మహోన్నత భావాలను
తియ్యని తేనెల మాటలతో
కుసుమాలనెడి పదపుష్పములతో
సుగంధములు వెదజల్లుమాలలను
మావంటి వారికి సహితము అర్థమగు రీతిలో
చక్కని శైలితో కూడిన అనురాగ బంధముతో
క్రమపద్ధతి విడువక
వర్ణించిన మీ వచనామృతము అమ్మ యొక్క కీ
ర్తియు మీ అనుభవ దివ్యానుభూతులు, మధురస్మృతులు
అత్యంత మనోహరమే కాక అతి తియ్యతి
య్యగా మీ అనుభూతులను మేము పొందునట్లు
గా రచించిన మీ రచనామృతకావ్యమునకు మీకు మీ శ్రీవా
రికి నా వినయపూర్వక కృతజ్ఞతాభివందనములు

శ్రీ అడిదం గోపాలరావు

అక్షర సుమహారం

"ముదితల్ నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పించినన్"
అన్న మహాకవుల మహితోక్తికి మచ్చుతునక
మాతృశ్రీ కృపాలబ్ధ మహిమాన్విత యశోతిలక

పురుషులతో పోటీపడి అతివలు సాధించిన
ప్రతిభా పాండిత్యాలకు అచ్చమైన ప్రతిరూపం
మహిళా చైతన్యానికి మానవీయ మణిదీపం

నిత్యనూతనాంశాలను నిలువు దోపిడీ చేసి
ప్రేమ మీర అందించే ఆ 'మేడమ్' సన్నిధి
విద్యార్థుల కందరికీ తరిగిపోని పెన్నిధి

'దివ్య' మైన 'అనుభూతులు' సాటిలేని 'మధురస్మృతులు'
'అనసూయావ్రతకల్పం', 'సచ్చరిత్ర' సంపుటాలు
'ఎల్లరమ్మ' కరుణతోడ ఎగరేసిన బావుటాలు

జిల్లాలో రాష్ట్రంలో కొల్లలుగా గౌరవాలు
నిర్విరామ పరిశ్రమకు అవే ఆనవాలు
నిరుపమాన నిబద్ధతకు ఆమె "వ్రాలు"

'విశ్వజనని' పదార్చనకు విశాఖలో విరబూసిన
తాత్విక చైతన్యానికి కావలసిన నిత్యస్ఫూర్తి
సేవాభావం పండిన "శ్రీమతి కుసుమా చక్రవర్తి".

అర్కపురిలో 'అమ్మ' ఒడిలో ఇది
ఆత్మీయులు కురిపించే అసలు సిసలు మమకారం
ఆదర్శ గురుత్వానికి "అక్షర సుమహారం"

సమస్సుమనస్సులతో
అధ్యాపకబృందం
మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల, పాఠశాల

రచన : మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి

పద్య నవరత్నాలు

మాకందం - మీకందం

అమ్మయె తల్లియు తండ్రియు
అమ్మయె మనతోడు నీడ అమ్మయె సఖియౌ
అమ్మయె గురువును దైవము
అమ్మయె మనకిహము పరము నరయగ మదిలోన్

కుసుమకుమారీ సుమముల
పసుపు కుంకుమలతోడపతిజేదోడై
మసలిన భువిపైనిండుగ
ససురాధ్వరి మాత యమ్మ సతతముగాంచున్

తనయులు మనుమలు భర్తయు
మనసెరిగియు మీదు దరిని మసలుచునుండన్
అనవరతజపతపంబుల
వినయంబున గొలుతు వెపుడు వేడ్కన్ అమ్మన్

అమ్మయె సర్వసుఖంబులు
అమ్మయె నఖిల జగంబులు అమ్మయెతానౌ
అమ్మను నమ్మిన తానే
అమ్మవు గావున నితరముల నరయగనేలా

అమ్మను దివ్యాక్షరములు
నెమ్మనమున మరువకెపుడు నిరతము తలపన్
అమ్మను నామ మహత్త్వము
కమ్మని కమనీయ సోయగమ్ముల వెలయున్

పుట్టిన తావు గారం
బుట్టి వడగపట్టి యొప్పి పూత కుసుమమై
మెట్టిన చోటున బాధ్యత
పట్టియు కులవృద్ధిన్‌గని పరగన్ స్థిరమై

ఆటల పాటల చేతల
బాటలు వేసినదని తగపల్వురుమెచ్చన్
మాటల మూటల వారధి
దాటగ పాఠాలు నొక్క తాటిని చెప్పన్

ఏయూస్కూలున చేరిన
ప్రాయపు ధారల మరల్చి ప్రౌఢతనొప్పన్
హాయిగ నుత్తుమ టీచరు
ధ్యేయము నెరగూరె అమ్మ దీవనలందన్

అమ్మయె ఐశ్వర్యమయము
అమ్మయె సుఖమయి, శుభమయి, ఆనందమయీ
అమ్మ నడుగంగ నేల !
అమ్మయె సర్వమ్ముగాన నన్నియు గూర్చున్

రచన : ఎమ్. ఓబయ్య
తెలుగు పండిట్



హైమక్క

అంఆ

ఆధ్యాత్మిక మధురస్మృతులు



అమ్మతో ఎ.ఎస్. చక్రవర్తి, కుసుమా చక్రవర్తి

అంఆ

ఆధ్యాత్మిక మధురస్మృతులు

అమ్మతత్వం - అమృతత్వం

ఈ కలియుగంలో దుఃఖనివారణార్థం ప్రపంచానికి అవసరమైనది, అనుగ్రహింపబడినది జ్ఞానం కాదు. సాధన, తపస్సు, అందరినీ ప్రేమించే గుణం అందరిపై కారుణ్యం. అమ్మ ప్రేమ స్వరూపిణి. తనను ఎవరు ప్రేమించినా, ప్రేమించకపోయినా, ద్వేషించినా, దూషించినా, హింసించినా, అందరినీ ప్రేమించే ఉదాత్తమనస్విని అమ్మ. మన యోగ్యతాయోగ్యతలతో అవసరం లేని అవ్యాజమైన, అనిర్వచనీయమైన అనంతమైన అమృతత్వం-అమ్మతత్వం

"దళమైన పుష్పమైనను
ఫలమైనను, సలిలమైన బాయని భక్తిన్
గొలిచిన, జనులర్పించిన
నెలమిన్ రుచిరాన్నాముగనే యొనుభుజింతున్"

అని కుచేలోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు అన్నట్లుగా అమ్మ మననుంచి ఏమీ కోరకనే ప్రేమతో, మనలో సమర్పణా భావం అంకురింపచేసి మనకు ముక్తి మార్గాన్ని చూపించింది.

"పితామహస్య జగతోమాతాధాతా పితామహః" నేనే తల్లిని, నేనే తండ్రిని అన్నాడు పరమాత్మ, పితృస్వరూపం, మాతృస్వరూపం ఆయనే ధరిస్తుంటాడు. ఏది ఎప్పుడు అవసరమవుతుందో, ముచ్చటవుతుందో ఆయనకే తెలియాలి.

"ఎక్కడైనా ఆధ్యాత్మిక గగనతలంలో నెలవంకలనే చూడగలం కాని జిల్లెళ్ళమూడిలో మాత్రమే పూర్ణచంద్రుణ్ణి చూడగలం" అన్న డాక్టర్ శ్రీపాదవారి వచనం ప్రత్యక్షసత్యం.

దైవాన్ని నమ్మడం కాదు, నమ్మినదే దైవం.

శ్రీ సత్యనారాయణగారు కోరమాండల్ ఫర్టిలైజర్స్‌లో పనిచేస్తున్నారు. ఆయన భార్య శ్రీమతి సరళ. వాళ్ళ పిల్లలు అమ్మ యందు అత్యంత భక్తి శ్రద్ధలు కలవారు. ఆయనకు వయోపరిమితితో సంబంధం లేకుండా ఉద్యోగం రావటం అమ్మ అమృతత్వానికి నిదర్శనం.

అమ్మ సన్నిధిలో ఒకమారు సరళగారితో రామకృష్ణ అన్నయ్య "మనకు బ్యాంకులో ఎకౌంటు వుంటేనే ఎవరైనా మనకు ఇవ్వాలనుకుంటే అందులో వేస్తారు. ఎకౌంటు లేకపోతే వేయలేరు కదా!" అని అన్నాడు. అక్కడే వున్న అమ్మ కాపురానికి వచ్చినప్పుడు "కాఫీ గింజలు వేయించి దంచి కాఫీ తయారు చేసేదాన్ని ఒకమాటు కాఫీ గింజలు దంచుతున్నప్పుడు ఒక అన్నయ్య వచ్చాడు. ఆయన చేతులు సన్నగా పుడకల్లాగా వున్నాయి. అమ్మా! 'నా చేతులు సరిగా లేవు లేకపోతే నీకు సాయం చేసేవాడిని' అన్నాడు. "ఇప్పుడు మాత్రం మించిపోయింది ఏముంది? ఒక చేయివేయ"మని అతని చేయి పట్టుకొని తాను దంచింది. ఆరు నెలల తరువాత అతను జిల్లెళ్ళమూడి వచ్చేటప్పటికి చేతులు మామూలుగా వున్నాయి. "అతని చేతులకు ఎక్సర్‌సైజ్ లేకపోవడం వల్ల సన్నబడ్డాయని కాఫీపొడి దంచటంతో సరిగా అయ్యాయని" అమ్మ చెప్పింది. అతనికి అమ్మ బ్యాంక్‌లో ఎకౌంటు వుందనిపించింది. అన్నయ్య అన్న మాటకు వివరణ అమ్మ పై సంఘటన ద్వారా తెలియజేసింది.

ఒకరు 'అమ్మ దీక్ష అంటే పేర్లు పెట్టడం" అని అన్నారు. వెంటనే రామకష్ణ అన్నయ్య "అన్నం పెట్టడం కూడా" అన్నాడు. దానికి అమ్మ "అవును అనసూయ దీక్ష అంటే పేర్లు పెట్టడం, అన్నం పెట్టడం" అని అంది. అమ్మ ఎక్కువగా రహి, వాత్సల్య, బంగారు, హైమ, భగవతి, చైతన్య, వంశీ మొదలగు పేర్లు పెట్టేది. అమ్మకు ఎంతసేపూ తన బిడ్డలు అన్నం తిన్నారో లేదో అన్న తపనే ఎక్కువగా వుండేది. తన దర్శనంకు వచ్చినవారిని ముందుగా భోజనానికి

వైకల్యం లేనిది కైవల్యం.

వెళ్ళండని చెప్పేది. మిమ్మల్ని చూడటానికి వచ్చామమ్మా! అంటే చూసారుగా వెళ్ళి భోజనం చేసిరమ్మనేది. వారు ఇంకా కదలకుండా అక్కడే వుంటే "నేను స్నానం చేసి వస్తానని" లోపలికి వెళ్ళేది. వారు చేసేదేమిలేక భోజనానికి వెళ్ళేవారు.

అమ్మ ఆకలి చావులు గురించి మాట్లాడుతూ "ఉడికించిన బియ్యం ఒక్కటే ఆహారం కాదు. రెండు అరటి పళ్ళు తిని వుండవచ్చు తాత్కాలికంగా. శ్రీ పొట్టి శ్రీరాములుగారు తిండి మాని మనకు స్వరాష్ట్రాన్ని సంపాదించారు. ఆయన పోతారని ఎవరూ అనుకోలేదు. ముందు రోజు వరకు బాగానే వున్నాడన్నారు. ఆ రాత్రి దగ్గుతుంటే రక్తం పడ్డది. బతకరని అన్నారు". అని అమ్మ చెప్తుంటే ఆ గొంతుకలో ధ్వనించిన బాధ మమ్మల్ని కలచివేసింది. ఎప్పుడో జరిగిన విషయానికి అమ్మ అంత బాధ పడ్తుంటే ఆమె యొక్క అవ్యాజ ప్రేమకు ఆశ్చర్య చకితులైనాము. అమ్మకు భూత, భవిష్యత్, వర్తమాన కాలాలన్నీ ఒకటే కదా!.

"పచ్చిపొట్లకాయ తిని బ్రతకవొచ్చు. తిండి దొరకక ఎవ్వరూ చనిపోవటం లేదు" అని అంది. ఆ సంవత్సరం ఫారినర్ భీమ్ (అమ్మ పెట్టిన పేరు) కొన్ని వందల పొట్లకాయలను కాయించాడు. మేము వైజాగ్ వెళుతున్నామమ్మా అంటే "వైజాగ్‌లో పొట్లకాయలు ఎంత"? అని అడిగింది. 2 రూపాయలు వుంటాయమ్మా అన్నాను. "తలో 10 కాయలు తీసుకువెళ్ళి పిల్లలకు కమ్మగా చేసి పెట్టుకోండే" అని అన్నది. అంతమటుకు హాయిగా నవ్వుతూ కబుర్లు చెప్తున్న అమ్మ "నాకు ఏడుపే ఇష్టం. నా స్వభావమే అంత" అని అంటుండగా ఏడుస్తూ ఒక ముసలమ్మ వచ్చింది. "అమ్మా! నాకు ఒక చీరె ఇవ్వమ్మా" అని అడిగింది. "గుంటూరు నుంచి తెప్పించి ఇస్తాను వరండాలో

ఇష్టదైవం తప్ప తాను లేననుకోవడం ఉపాసన.

కూర్చో"మంది. ఆమె వెళ్ళాక "వయస్సు గడుస్తుంది కాని వృద్ధాప్యం గడవదు. చూసేవారికి వీరి అవసరం వుండదు. అవసరం అన్నింటికంటే విలువైనది. ఎవరికైనా అంతే" అంటూ దగ్గుత్తికతో అమ్మ చెప్పే తీరుకు విస్మయం చెందాము. అమ్మ, ఆలోచనలు ఎంతసేపూ మనమీదే వుంటాయి కదా! తన బిడ్డలలో ఎవరు తినకపోయినా బాధపడ్తూ అన్నీ తాను స్వయంగా అనుభవిస్తుంది. అదే అమ్మ యొక్క మాతృత్వ ప్రతీక. మన కొరకు తన కన్న బిడ్డ హైమకు అమృతత్వాన్ని ప్రసాదించింది.

"మీ ఇష్టప్రకారం నడుస్తున్నట్లు కనిపిస్తాను కాని నిజానికి నా ఇష్టప్రకారమే మిమ్మల్ని నడుపుకుంటానని" తన విధానాన్ని వివరించింది. అమ్మ హైమ చేతనే అడిగించుకొని ఒక దివ్య ప్రణాళికను అమలు పరచింది. "హైమ తన ప్రతిబింబమేనని హైమను పూజించే రోజులు వస్తాయని" అమ్మ ప్రకటించింది. హైమక్క అమ్మతో "నీవు మాత్రమే కనిపిస్తున్నావు నీ వద్దకు వచ్చేస్తున్నానంటూ" చావు భయం లేకుండా అమ్మలో లీనమయింది.

హైమ మరణానంతరం ఆరు అడుగుల లోతున ఒక కందకం తవ్వించింది. అందులో నాల్గు నాపరాళ్ళను నాలుగు వైపులా అమర్చి దానిలో ఇసుక పోసి జింక చర్మం వేసి హైమ పూజ, జపం చేసుకునేటప్పుడు ఉపయోగించిన వస్తువులు అందులో వేయించి దాన్ని బ్రహ్మగ్రంథి అన్నది.

శ్రీసూక్తం పఠిస్తుండగా అమ్మ, నాన్నగారు శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావు గారు, అందరూ హైమను అభిషేకించారు. అప్పటివరకు హైమక్క చల్లదనంతో కూడిన కట్టెలా బిగుసుకుపోయి బరువుగా వున్నది. కాని అమ్మ ఎప్పుడైతే ప్రతిష్ఠ క్రతువు ఆరంభించిందో అప్పుడే పూర్వపు మృదుత్వం, నులివెచ్చదనం, శ్వాస ఏర్పడ్డాయి.

ఏం చేసినా ఎవరిమీద అయిష్టత కలగదో వాడే ఇష్టదైవం.

గోవిందరాజుల దత్తాత్రేయ శర్మగారు, అచ్యుతుని సుబ్బారావుగారు, శ్రీ భద్రాద్రి రామశాస్త్రి గారు, శ్రీ పొట్లూరి సుబ్బారావు గారు, రుక్మిణి అక్కయ్య, కృష్ణవేణి అక్కయ్య, వసుంధర అక్కయ్య, సావిత్రి, రమణ, రామకృష్ణ అన్నయ్య ఇంకా అనేక మంది ప్రత్యక్ష సాక్షులు వున్నారు.

హైమ కాళ్ళను మడవడం ఎలాగని ఆలోచన జరుగుతుండగానే, ఏ ప్రయత్నం లేకుండా హైమక్క పద్మాసనంలో కూర్చుంది. అది చూచిన వారందరూ ఆశ్చర్యచకితులయ్యారు. పూర్వాభిముఖంగా పై చెప్పిన బ్రహ్మగ్రంథిలో హైమక్కను కూర్చోబెట్టారు. ఆ సమయంలో పద్మాసనం సిద్ధాసనంగా మారింది. అమ్మ కూడ అందులోకి దిగి ఆ గ్రంథి చుట్టూ కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొట్టి పసుపు, కుంకుమ, పూలు చల్లింది.

కొబ్బరికాయలు కొట్టగానే ఆ గ్రంథిలో హైమ శిరస్సు మీద తన దక్షిణపాదం పెట్టి "నా అగ్ని ప్రవేశించిదని" చెప్పి శ్రీ సూక్తం చదవమంది. ఆ తరువాత ఒక వరుస విభూతి మరొక వరస లవణం పోసింది. విభూతి, లవణం కలసిన రాశిలో, విశిష్ట లావణ్యరాశి హైమ శిరస్సుపై అమ్మ కూర్చుని పైట చెరగు కప్పి శిరస్సు మధ్యభాగంలో కుడిచేతి వేలితో ఏమేమో వ్రాసింది.

ఆ తరువాత అమ్మ లేచి కొబ్బరికాయ కొట్టి ఆ నీళ్లు హైమ శిరస్సు మీద చల్లి విభూతి పోసింది. ఆ సమయంలో హఠాత్తుగా లైట్లు ఆరిపోయాయి. అయిదు నిమిషాలు తరువాత మళ్లీ వాటంతట అవే వెలిగాయి. ఆ వెలుగులో హైమ శిరస్సున రక్తం కనిపించింది. ఆ రక్తస్రావం సహస్రారభేదనం వల్లనే. ఈ క్రతువును నిర్వహించిన అమ్మ బ్రహ్మగ్రంథి విభేదిని కదా! జీవి పరిపూర్ణతకు అవసరమైన సోపాన పరంపరను అమ్మ హైమక్కకు ప్రసాదించింది. సాక్షాత్కారాన్ని, మృత్యుంజయత్వాన్ని, జ్ఞానాన్ని, సిద్ధిని ఆరోహణ క్రమంలో

సర్వత్రా అనురాగమే విరాగం.

అందించిందనటానికి చిహ్నమే సహస్రారభేధనం. ఆధ్యాత్మిక శిఖరాగ్రస్థితి యోగానికి పరాకాష్ఠ దశ అయిన బ్రహ్మగ్రంథి విభేదనం ద్వారా మాన అయిన హైమను మాధవిగా రూపొందించుటకే సమాధి ముందు అం క్రతువును నడిపి స్వయంగా శక్తిపాతం చేసింది అమ్మ.

"హైమ ప్రేమకు మారుపేరు. కరుణకు కాణాచి. ఆమె ఆకార లలితం. ఆమె ఆలాపన లలితం. అంతరంగం లలితం. ఆచరణ లలితం" అని మన రామకృష్ణ అన్నయ్య నిర్వచనం.

అమ్మ ప్రప్రథమంగా హైమాలయంలోనే లలితా కోటినామపారాయణ చేయించింది. కోటినామపారాయణ ప్రారంభవేళ ముముక్షుజన పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు "ఆవేదవేద్యుడే రాముడు, ఆ రాముడే లలిత, ఆ లలితయే మన అమ్మ. అమ్మ మరో రూపమే హైమ. అందరం హైమక్క అంటాం. అక్కరూపంలో వున్న అమ్మ, హైమ అని అమ్మకు హైమకు విభేదం లేదని నిర్వచించారు.

హైమ సిద్ధిపొందిన మర్నాటి నుంచీ ఆ పవిత్ర స్థలంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, లలితా సహస్రనామార్చన, శ్రీ భద్రాద్రి రామశాస్త్రిగారు ప్రారంభించారు. వారు హైమను శివశక్త్యైక్య రూపిణిగా దర్శించిన ద్రష్ఠ. ఆ రోజు నుంచీ ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం లలితా సహస్రనామం, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర అర్చన, ప్రతి శుక్రవారం లక్షనామార్చన, ప్రతి పౌర్ణమికి ఓం హైమ॥ నమో హైమ॥ శ్రీహైమ॥ జై హైమ అన్న నామంతో ఏకాహం అవిచ్ఛిన్నంగా జరుగుతున్నాయి.

"హైమ మనకు దారి అనుకొని ఇక ఎడతెరపి లేకుండా నామం చేయండి. ఇది ఆలయమై సాధకులకు, నిలయమవుతుంది" అని అమ్మ చెప్పింది.

మనస్సు లయమయ్యే చోటు ఆలయం.

జిల్లెళ్లమూడిలో ఏ నోము నోచినా, ఏ వ్రతాలు చేసినా అమ్మ ఎప్పుడూ హైమాలయంలోనే చేయించటం గమనార్హం. తన దర్శనానికి వచ్చేవారందరినీ హైమాలయంకు మళ్ళించేది.

అమ్మకు అత్యంత ప్రీతిపాత్రుడైన రాచర్ల లక్ష్మీనారాయణ అన్నయ్య పుష్కర కాలంలో కఠిన నియమ నిష్ఠలతో మండల దీక్షలు ఎన్నెన్నో చేసి లలితా కోటినామపారాయణ పూర్తిచేసాడు. శ్రీయుతులు తంగిరాల కేశవశర్మ, పి.ఎస్.ఆర్. ఆంజనేయులు, ఐ. రామకృష్ణ, కామరాజు మొ॥ వారంతా కఠిన నియమనిబద్ధమైన మండల దీక్షలు యజ్ఞయాగాదులు సలిపారు. కోటి నామపారాయణ సందర్భంగా 1979 నవంబరు 9వ తేదీన హైమాలయంలో మహారుద్రాభిషేకానికి శ్రీ వల్లూరి పాండురంగా రావుగారు దేశంలోని పుష్కర నదుల నుండి, కన్యాకుమారి వద్ద గల సాగర సంగమం నుండి పవిత్ర జలాలను తీసుకువచ్చారు.

ఎందరెందరో నిత్యం అభిషేకాలు, ప్రదక్షిణలు, అర్చనలు చేసుకుంటారు. ఆపద మొక్కులు మొక్కుకుంటారు. పెళ్ళికాని పిల్లలకు పెండ్లి అవుతుంది. పిల్లలు లేని వాళ్ళకు పిల్లలు పుడతారు. ఉద్యోగం లేని వాళ్ళకు ఉద్యోగం వస్తుంది. ఉద్యోగులకు ప్రమోషన్లు వస్తాయి, తగ్గని జబ్బులు నయమవుతాయి.

శ్రీ కొమరువోలు గోపాలరావుగారు, ఆయన భార్య సరోజినక్కయ్య, ఎన్నో సంవత్సరాలు అమ్మ సన్నిధిలో గడిపి అమ్మలో ఐక్యమయ్యారు. వారి అమ్మాయి శేష ప్రభావతి శారీరకంగా చాలా బలహీనంగా వుండి, తలనొప్పితో చాలా సంవత్సరాలు విపరీతమైన బాధపడింది. 1977లో అమ్మ హైమాలయంలో అర్చనకు నియమించింది. మహాన్యాసం, రుద్రం, శ్రీ సూక్తం, పురుష సూక్తం, మంత్రపుష్పం అన్నీ నేర్చుకొంది. వచ్చిన వారందరిచేత చాలా శ్రద్ధగా పూజలు చేయించేది.

వర్గం లేనిది స్వర్గం. సాహిత్యంతో రాహిత్యం రాదు.

ఆ పూజల ఫలితమే 1981మే 5న శ్రీరావూరి ప్రసాద్‌తో 'అమ్మే' తన చేతుల మీదుగా వివాహం జరిపించింది. ఆ ఆశీర్వాద ఫలితమే ఇద్దరు మొగపిల్లలు పుట్టారు. అసలు వివాహానికే తట్టుకోలేదు, పిల్లల్ని కనటానికి అవసరమైన బలం లేనటువంటి శేషుకి పెండ్లి అయి పిల్లలు పుట్టుటయే కాకుండా దీర్ఘవ్యాధి అయిన తలనొప్పి ఏమందూ లేకుండానే నయమయింది. "అది కేవలం హైమ అనుగ్రహమే" అంటుంది.

శ్రీ రాచర్ల శ్రీరామూర్తి భార్య లలిత. వారికి సంతాన యోగ్యత లేదని వైద్యులు నిర్ధారించారు. శ్రీమతి లలిత 1970లో హైమాలయంలో 40 రోజులు ప్రదక్షిణాలు చేసింది. చివరి రోజున లలిత హైమక్కకు నమస్కారం చేస్తూండగా ఆమె దోసిలిలో అరటిపళ్ళు వుంచుతూ హైమక్క కనిపించింది. ఆశ్చర్యం కళ్ళు తెరచి చూస్తే లలిత దోసిలిలో ఐదు అరటిపళ్ళు అందులో ఒక పండు జారిపోయింది. 1971 సం॥లో ఆమె మొగపిల్లవాడ్ని కన్నది. ఆ తరువాత నలుగురు పిల్లలకు తల్లి అయింది అందులో ఒకరిని నష్టపోయింది. పండు జారి పోవటంతో ఒక కాన్పు పోవటాన్ని ముందుగానే సూచించింది హైమక్క.

చీరాల వాస్తవ్యులు శ్రీ యనమండ్ర వెంకట సుబ్రహ్మణ్యం గారికి హైమ సాక్షాత్కారం అయింది. వీరు స్వీయానుభవంతో హైమకు, అమ్మకు భేదం లేదని విశ్వసించారు. వీరికి కొంతకాలంగా నిత్యం వచ్చే జ్వరం, హైమ అనుగ్రహమే దివ్యౌషదంగా పనిచేసి పూర్తిగా తగ్గింది. ఆయన వక్కపొడి విపరీతంగా తినేవారు. "ఒకమారు అమ్మ అన్నయ్యతో "ఒక్క పలుకు వినరా - వక్కపలుకు మానేయిరా" అంది.

మచిలీపట్నం మున్సిపల్ కమీషనరు శ్రీ మల్లా ప్రగడ సీతారామాంజనేయులు గారు, వారి కుటుంబమంతా అమ్మ భక్తులు. "అమ్మ

కాలమే కర్తవ్యాన్ని బోధిస్తుంది.

హైమలు కలిస్తేనే సంపూర్ణత్వం ఏ ఒక్కరికి పూజ చేసుకున్నా తృప్తిగా వుండదని అంటారు.

చీరాల వాస్తవ్యురాలు శ్రీమతి నక్కా శకుంతలమ్మ కూడ హైమాలయంలో 40 రోజులు ప్రదక్షిణాలు చేసింది. హైమ దివ్యత్వం వల్ల కాన్సర్ వ్యాధి నుండి బయటపడి పూర్తి ఆరోగ్యవంతురాలయింది.

అమ్మకు హైమకు భేదం లేదు. అందువల్లే ఎవరిని అర్చించినా ఒకటే. అందరి కోరికలు తీర్చే కామధేనువు, కల్పవృక్షమని హైమ ప్రసిద్ధి పొందింది. కారుణ్యపయోనిధి అయిన అమ్మ హైమకు అమృతత్వాన్ని అందించింది. మన కొరకే హైమకు దివ్యత్వాన్నిచ్చి అమ్మతత్వానికి అవధులు లేవని చాటింది.

౭. స్థితప్రజ్ఞత్వం - అమ్మ

సుఖం వస్తే పొంగిపోవటం, దుఃఖం వస్తే కృంగిపోవటమే కాకుండా ఏది జరిగినా ఒకేలా స్పందింపగలగటమే స్థితప్రజ్ఞత్వం. అట్టి ప్రజ్ఞ యోగులకు, అవతార పురుషులకు మాత్రమే సాధ్యం. కాని వారి కరుణామృత కిరణాలు మనమీద ప్రసారమైనప్పుడు మనకు వెలుగు-చీకటి, గొప్ప-బీద, సుఖం-దుఃఖము అనే ద్వంద్వాలు పోయి ఒకేలా స్పందించగలుగుతాము.

తూనుగుంట్ల త్రిలోక అప్పారావు గారు ఏలూరు వాస్తవ్యులు. అమ్మ సన్నిధికి చిరకాలం నుంచీ వచ్చేవారు. జీవితంలోని ప్రతిఘట్టంలోనూ అమ్మ సూక్తులను సమన్వయం చేసుకొనే సాధకుడు. అమ్మ కటాక్షాన్ని పొందిన భక్తుడు. ఆయన హోల్‌సేల్‌గా నూనె వ్యాపారం చేసేవారు. 1977 జూన్ 20వ తే॥ ఎమ్మిగనూరులో 70,000 రూపాయలకు 40 పీపాలనూనె కొని ఏలూరుకు లారీ ఎ.ఎ.టి. 2197. దాని ఓనరు, డ్రైవరు బిపిన్ కుమార్ బెహరా చేత పంపారు.

పరిస్థితులను మించిన గురువులేడు.

నిర్ణీత కాలంలో లారీ ఏలూరుకు రాకపోయేటప్పటికి అప్పారావన్నయ్యకు అనుమానం, భయం కలిగి వెంటనే ఎమ్మిగనూరు వెళ్ళి పోలీస్ రిపోర్ట్ ఇచ్చాడు. ఉన్నడబ్బంతా అందులో పెట్టుబడిగా పెట్టాడు. అంతకు పూర్వం ధాన్యం వ్యాపారంలో నష్టం వచ్చింది. ఆయన ఇంట్లో దొంగతనం జరిగి 20,000 రూపాయలు పోయాయి. ఒకదాని మీద ఒకటి పుటిమీద పుట్రలా జరగటంతో ఆయన మనస్సు బాధనొంది, పూర్తిగా చంచలమయింది.

అట్టి పరిస్థితిలో అమ్మతో ఫోనులో మొరపెట్టుకున్నాడు. అది విన్న అమ్మ "నాన్న అవతల మనిషి ఎంత అవసరంలో వుండి అట్లా చేసాడో అంటే మరి ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటావమ్మా అని అడిగేడు. నువ్వు చేసేదేముంది! ఏదో ఒకటి అదే జరుగుతుంది కదా! జరిగే దాన్నే చూస్తు వుండు" అని సలహా ఇచ్చింది. ఆ సలహా విన్న అన్నయ్యకు అమితమైన బాధతోపాటు కోపం వచ్చింది. అంతలో తమాయించుకొని అమ్మా 'నేను ఈ బాధను నష్టాన్ని తట్టుకునే శక్తినైనా ప్రసాదించమని' వేడుకున్నాడు. "నేను ప్రసాదించేది ఏముంది నాన్నా ఆ శక్తి నీలోనేవుంది" అని అమ్మ అన్నది. అమ్మ ఆదిశక్తి కదా! ఆ క్షణం నుంచీ అలమటించిపోతున్న అన్నయ్య మనస్సుకు స్థిమితం ఏర్పడింది. అంత నష్టం జరిగినా అమ్మ జరిగేది చూడమంది కదా అని అమ్మ మీద అచంచల విశ్వాసంతో వున్నాడు. 'మా ఆవిడకు ధైర్యం చెప్పమ్మా' అని వేడుకుంటే అమ్మ స్వయంగా అప్పారావన్నయ్య భార్య కుసుమాంబతో 'నువ్వేమీ భయపడవద్దు. నేనున్నాను, అన్నీ నేను చూచుకుంటానని' హామీ ఇచ్చింది. అప్పటి నుంచీ అక్కయ్యకు కూడా ఆందోళన తగ్గి గుండె నిబ్బరం కలిగింది.

అమ్మ హామీ ఇచ్చిననాటి నుంచీ నూనె ఎత్తుకుపోయిన బెహరాలో

తోచిందేదో చేయి. తోచింపచేసేది వాడేగా.

మునుపెన్నడూ కలగని భావనసంచలనాలు కలిగాయట. అనిర్వచనీయము, అదృశ్యము అయిన ఏదో దివ్యశక్తి తనను వెంటాడుతున్న అనుభూతి కలిగిందిట. జూలై 12వ తేదీన విజయవాడ వచ్చి తన తప్పును ఒప్పుకొని తాను కాజేసిన నూనెకు బదులుగా తనలారీని అప్పారావుగారికి ఇస్తానని వాగ్దానం చేసాడు. అతనికి కొద్దికాలం క్రితమే పెళ్ళి అయింది. తనను జైలులో పెడితే ఆవిడ దిక్కులేనిదవుతుందని, తనను పోలీసులకు అప్పజెప్పవద్దని వేడుకున్నాడు.

అతని జాలిగాథ వినేటప్పటికి అన్నయ్యకు అనురాగం పొంగిపొరలి అందరం అమ్మ బిడ్డలం అనుకున్నప్పుడు అతనూ తన సహోదరుడేకదా. తన తమ్ముడేదైనా తప్పుచేస్తే పోలీసులకు అప్పచెప్తానా అని అతనికి జామీను వుండి జైలునుంచి విడిపించాడు. కోర్టు విచారణ జరిగాక డిసెంబరు 31న తీర్పు చెప్పారు. 2000 రూపాయలు అపరాధ రుసుం విధించారు. బెహరా వద్ద పైకం ఏమీలేదు. అతని బంధువులు ఎవరూ అతని కోసం రాలేదు. అప్పారావు అన్నయ్య ఆ పైకాన్ని న్యాయస్థానంలో కట్టి అతణ్ణి విడుదల చేయించాడు.

బెహరా ఒక్క క్షణం కూడా వృధా చేయక అమ్మను చూపించమని అన్నయ్యను వేడుకున్నాడు. వెంటనే బెహరాను జిల్లెళ్ళమూడికి తీసుకువెళ్ళాడు. క్రొత్త మార్గాన్ని చూపి క్రొత్త జీవితాన్ని ప్రసాదించినందుకు బెహరా అమ్మ ముందు మోహరిల్లాడు. అమ్మ సందేశాన్ని ఆచరణలో పెట్టగలిగినందుకు అన్నయ్య అమ్మ పాదాలకు ప్రణమిల్లాడు.

ఒకమారు అమ్మ సన్నిధిలో వుండగా ఒక అన్నయ్య అమ్మతో "అమ్మా! దొంగతనానికి బయలు దేరుతూ దొంగ తనకు ఏదైనా దొరికేటట్లు చేయని నమస్కరించుకుంటాడు. ఇంటి యజమాని నా సంపదను ఎవరూ దోచుకుపోకుండా చూడమని ప్రార్థిస్తాడు. అప్పుడు నీవు ఎవరికి సాయం

సృష్టికి మించిన మహిమలేదు.

చేస్తావు?" అని ప్రశ్నించాడు. దానికి అమ్మ చిరునవ్వుతో "ఎవరికి అవసరమైతే వారికి తోడ్పడుతానని, అన్నింటికంటే అవసరం విలువైనది" అని జవాబిచ్చింది.

అప్పారావన్నయ్యవాళ్ళు 1978 సం॥లో ఏలూరు పవర్‌పేటలో ఒక ఇంట్లో అద్దెకుండేవారు. ఒకసారి ఇంటికి తాళం వేసి ఊరు వెళ్ళారు. ఊరి నుండి తిరిగి వచ్చిన తరువాత తలుపు తీసుకుని లోపలికి వస్తే, తలుపు ప్రక్కనే ఒక కుర్చీలో అమ్మ ఫోటో పెట్టి వుంది. ఆయన ఆశ్చర్యంతో చూస్తుంటే ఆయన భార్య "నేనే పెట్టి వచ్చానండీ అసలే దొంగలభయం ఎక్కువగా వుంది, మన ఇంటి తలుపులు సరిగాలేవుకదా అందుకని అమ్మ ఫోటోను తలుపుదగ్గర వుంచి మేము వచ్చేవరకూ ఇల్లు జాగ్రత్త అని చెప్పానని" అంది. ఆమె అపారమైన విశ్వాసానికి అన్నయ్యకు చాలా ఆనందం కలిగింది. కొన్ని రోజుల తరువాత అన్నయ్య ఆంధ్రాబ్యాంకు రామబ్రహ్మం గారు కలసి జిల్లెళ్ళమూడి వెళ్ళారు. అమ్మ రామబ్రహ్మం గారిని సంభోదిస్తూ యేం చేస్తాం నాన్నా కొంతమంది ఇళ్ళలో నన్ను కాపలాగా కూడా వుంచుతున్నారు' అంటూ నవ్వింది. జరిగిన సంఘటనకు అశ్రుతర్పణం చేస్తూ అమ్మకు, అన్నయ్య పాదాభివందనం చేసాడు.

అప్పారావన్నయ్య ప్రతిరోజూ సాయంత్రం సత్సంగానికి వెళ్తుండేవారు. అక్కయ్యకు ఇంటిపనుల వత్తిడి వల్ల బయటకు వెళ్ళటానికి కుదిరేది కాదు. అక్కయ్య తనకు సత్సంగానికి వెళ్ళి సాధనా విషయాలు తెలుసుకునే అవకాశం లేకపోతోందనుకుంది. గీతామకరందం శ్రీ కాళహస్తీ స్వామివారి పుస్తకం చదువుకుంటుంది. కొద్దిసేపటికి అమ్మ మాటలు వినిపించసాగాయి. అటూ ఇటూ చూచినా ఎవరూ కనిపించలేదు ఈ పుస్తకంలో ఫలానా పేజీ చూడమని అమ్మ గొంతు వినిపించింది. అమ్మ ఫోటోవైపు చూస్తే అమ్మ తల పంకించుతూ నవ్వుతున్నట్టుగా అనిపించింది. ఇది అమ్మ అనుగ్రహమే అనుకొని ఆ పేజీ తీయగా తొమ్మిదవ అధ్యాయం 27వ శ్లోకం

పెట్టింది ముహూర్తం కాదు. జరిగిందే ముహూర్తం.

"యత్కరోషియదశ్నాసి యజ్జు హోపిదదాసియత్

యత్తపస్యసి కౌన్తేయా తత్కురుష్వ మదర్పణమ్॥"

తా॥ ఓ అర్జునా నీవేది చేసిననూ, తినినను, హోమమొనర్చినను, దానం చేసినను, తపస్సు చేసినను దానిని నాకర్పింపుము. ఇదే విషయాన్ని శంకరాచార్యులవారు॥ శ్లో:-

"యద్యత్ కరోమితత్త దఖలంశంభోదవారాదనమ్"

తా॥ ఓ పరమశివా నేను ఏది చేసిననూ (కూర్చున్నా నడిచినా యేపని చేసినా) అంతయూ నీ ఆరాధనమే అన్నారు.

అన్నయ్య రాగానే పై సంఘటనను తెలియచేసి వివరం అడిగింది. అమ్మ ఇది నీకు ఇచ్చిన ఉపదేశం అని చెప్పారు. అది వినగానే ఆమె పరమానందపడి అమ్మకు నమస్కారం చేసుకుంది. ఆమె ప్రతినిమిషం ఏ పని 'చేస్తున్నా 'జయహోమాతా' అనే నామం మననం చేసుకుంటూ వండిన ప్రతి పదార్థాన్ని అమ్మకు నివేదిస్తూ నిత్యం అమ్మ ఆలోచనలతోనే కాలం గడుపుతున్న పుణ్యాత్మురాలు.

అమ్మ ఎవరిని ఏవిధంగా ఉద్ధరిస్తుందో మనకు తెలియదు కదా! "నమ్మకమే దైవం" అంటూ నమ్మినవారిని అపారకరుణతో, ఆప్యాయతతో ఉద్ధరించే అమ్మ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. లక్షల్లో నష్టం వచ్చినా జరిగేది చూస్తూ వుండమంటే, అది ఎలా సాధ్యమమ్మా అంటే హాయిగా గమనించమంది. "ఆ స్థితి నాకే వుంటే నీ దగ్గరకు ఎందుకు వస్తానంటూ, ఐతే తట్టుకునే స్థితి నైనా కలుగజేయమ్మా" అని ప్రార్థిస్తే "అలాగే అంది". ఆనాటి నుండి ఏది జరిగినా స్థితప్రజ్ఞుడిలా చూస్తూ వుండే స్థితిని కొంతవరకూ అన్నయ్యకు అమ్మ అనుగ్రహించింది.

మనశ్శుద్ధే మనస్సిద్ధి. మంత్రం రక్షిస్తుంది గానీ భక్షించదు.

హైమ మరణించినప్పుడు తాను ఎలా సుఖదుఃఖాలకు అతీతంగా స్థిత ప్రజ్ఞురాలిగా వుందో తన బిడ్డలకు కూడా సాధన చేస్తున్న వారికి కొంతలో కొంత అటువంటి స్థితిని అమ్మ కలుగజేస్తోంది. ఇంకా ఎందరెందరిని ఉద్ధరిస్తోందో అవి అన్నీ వెలుగులోకి వచ్చేలా చేయమని స్థితప్రజ్ఞ అయిన అమ్మను వేడుకుందాం.

3. యోగపరాకాష్ఠ - అమ్మ

"అణోరణీయన్ మహతోమహీయన్

ఆత్మా అస్యజంతోః నిహతోగుహయాం"

ఈ ఆత్మశక్తి అణువుకంటే సూక్ష్మాణువు. మహత్తుకంటే అతివ్యాప్తమైనది అని ఉపనిషద్ వాక్యం. భౌతికమైన శరీరం ఎంత స్థూలంగా వున్నా దానికి ఆధారమయిన శక్తి అతి సూక్ష్మంగా వుంటుంది. మఱ్ఱి విత్తనం ఆవగింజకంటే సూక్ష్మం. దానినుండి జనించిన మొలక మహావృక్షం అవుతోందికదా! అలాగే అమ్మ మనలో వున్న ఆత్మశక్తిని వెలికి తీస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

శ్రీ తూనుగుంట్ల త్రిలోక అప్పారావు గారికి ఏలూరులో రైస్‌మిల్లు వుండేది. మొదటి నుంచి వాళ్ళ కుటుంబం అకలంక రామభక్తులు. అమ్మను దర్శించినప్పటి నుంచి అమ్మను పరిపూర్ణంగా విశ్వసించి అనుక్షణం అమ్మనే స్మరిస్తూ ధ్యానించే వ్యక్తి. ఆయన భార్య శ్రీమతి కుసుమ, వారికి నలుగురు ఆడపిల్లలు, ఒక మొగపిల్లవాడు. అప్పారావన్నయ్య అమ్మ సూక్తులను అధ్యయనం చేస్తూ నియమబద్ధమైన జీవితం గడుపుతూ, నిత్యం సత్సంగం జరుపుతుంటారు. అమ్మ ఫిలాసఫీని ప్రచారం చేయ్యడం అన్నయ్యకు చాలా ఇష్టం. భగవద్గీత అన్నా, లలితా సహస్రనామమన్నా చాలా మక్కువ. అనేకమంది సాధు సత్‌పురుషులను సేవిస్తుంటారు.

తపనే తపస్సు. శ్రీ చక్రమంటే మన శరీరమే.

ది 26-7-1991 సంవత్సరంలో అప్పారావన్నయ్య శ్రీశైలం శ్రీశ్రీశ్రీ పూర్ణానందస్వామి దర్శనార్థం వెళ్ళారు. ఆ సాయంత్రం చల్లని మలయ మారుతాలు వీస్తుండగా స్వామీజీ శిష్యులతో పరివేష్ఠితులై, వారిని దగ్గరకు తీసుకొని తలనిమురుతూ ఆనందపరవశులౌతున్నారు. అది చూసిన అన్నయ్యకు, అమ్మ సన్నిధిలో ఆయనకు కలిగిన దివ్యానుభూతులు గుర్తుకువచ్చి నయనాలు అశ్రుపూరితాలైనాయి. "అమ్మా! నీ ఒడిలో వాలాలనిపిస్తున్నది. కాని ఇప్పుడు నీవు దేహధారిణివి కాదు గదా! ఇప్పుడు నన్ను ఎవరు దగ్గరకు తీస్తారు. ఆప్యాయంగా నాన్నా! అని ఎవరు తలనిమురుతూ గోరుముద్దలు తినిపిస్తారు. పోనీ స్వామీజీ అయినా దగ్గరకు తీస్తారేమోనని అనుకుంటే వారు, వారి శిష్యులు ఆనందంతో తేలియాడుతున్నారు. దాని వల్ల నాకేమిటి లాభం? దుఃఖం ఆగడం లేదు. దగ్గరకు తీసే అమ్మ కనిపించకుండా పోయింది. కనిపించని అమ్మతో ఆడుకునే స్థితి నాకు లేదు, నీ రెండవ రూపమైన నిరాకార అనుభవాన్ని అయినా ఇవ్వమని ప్రార్థించారు. అమ్మ దయామయి, ఆయన ప్రార్థనను ఆలకించింది.

ఒక్కసారిగా నడుము నిక్కబొడుచుకుంది. దృష్టి భూమధ్యంలో కేంద్రీకృతమయింది. ఎడతెగని ధారలాగ మూలాధారం నుండి భూమధ్యం వరకు ఒక సన్నని ధారలాగా చీమలబారు ప్రాకుతున్నట్లుగా వుంది. భూమధ్యం నుండి సహస్రారం వరకూ తేజోమండలం భాసించింది. ఆ కాంతి శరీరమంతా వ్యాపించింది. ఎనలేని ప్రశాంతత ఏర్పడింది. ఆ అనుభూతిని వర్ణించటానికి మాటలు చాలవు.

కంటికి కనిపించని అమ్మే అన్నయ్యలో శక్తి ప్రవాహరూపంలో నిండిపోయినట్లుగా అనిపించింది. అట్టి స్పందనను అమ్మే కలుగజేసిందని, ఆ స్పందనే అమ్మయని ఆయన ప్రగాఢవిశ్వాసం.

అనుకున్నది జరగదు. తనకున్నది తప్పదు.

"తటిల్లతాసమరుచి షట్చక్రోపరిసంస్థితా"॥

సాధకుని శరీరంలో సూక్ష్మరూపంలో దాగిన శక్తి క్రమ వికాశం పొంది సుధాసారాన్ని వర్షిస్తుంది. అప్పుడు దేవి మెరుపుతీగ వంటి శరీరకాంతితో శక్తి కలసి ప్రవహిస్తుంది. మూలాధార, స్వాధిష్టాన, మణిపూరక, అనాహత విశద్ధి అజ్ఞాచక్రాలను దాటి కుండలిని సహస్రారకమలాన్ని చేరిన అనుభూతి సాధకులకు కలుగుతుంది. అట్టి అనుభూతిని పొందిన అప్పారావన్నయ్య ధన్యజీవి. ఆయనలోని ఆత్మ శక్తిని అమ్మ వెలికితీసింది.

అన్నయ్యకు మహనీయులైన స్వామీజీ సన్నిధిలో దివ్యానుభూతిని కలిగించింది. అమ్మ కరుణామృతహృదయానికి నివాళులు సమర్పించుకుంటూ స్వామివారి వద్ద శలవు తీసుకుని ఆ ఆశ్రమంలో ఉన్న అమ్మ ఫోటోకు పూలదండవేసి సాష్టాంగ నమస్కారం చేసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు.

ఒకమారు అప్పారావన్నయ్య తిరువన్నామలై వెళ్ళారు. శ్రీ గుడిపాటి వెంకటచలం గారు స్త్రీ అభ్యుదయానికి ఎంతో పాటుపడిన వ్యక్తిగా మనందరికీ తెలిసిన విషయమే. ఆయన వృద్ధాప్యంలో ఆశ్రమస్వీకారం తీసుకుని తిరువన్నామలైలో నివాసమేర్పరచుకున్నారు. ఆయన కుమార్తె సౌరీస్ ఆయనతో పాటు వుండి, ఆయనకు సేవ చేసుకుంటూ ఆశ్రమ కార్యక్రమాలను నిర్వహించేవారు. అమ్మ మద్రాస్ టూరుకు వెళ్ళినప్పుడు, అనారోగ్యంగా వున్న ఆయన దగ్గరకు వెళ్ళి స్వయంగా అరటిపండు ఒలిచి నోట్లో పెట్టింది. ఆయనకు అమ్మయందున్న ఆర్తి, తపనలే, అమ్మను తన దగ్గరకు రప్పించుకోవటానికి కారణభూతమైనది. అమ్మ "తపనే తపస్సు" అంటుంది కదా!.

అప్పారావన్నయ్య చలం గారితో నేను జిల్లెళ్ళమూడి వాడ్ని అంటే ఎంతో పొంగిపోయి అమ్మనే చూచినంత సంబరపడ్డారు. అక్కడ నుంచి అన్నయ్య

మరుపురాకపోవడమే మంత్రసిద్ధి.

జిల్లెళ్ళమూడి వెడితే అమ్మ "సోరీస్ దగ్గరకు వెళ్ళివస్తున్నావా?" అని అడిగితే చాలా ఆశ్చర్యపోయారు. ఆయన అక్కడకు వెళ్ళినట్లు ఏ ఒక్కరితోనూ చెప్పలేదు.

పాల్ బ్రంటన్ అనే ప్రసిద్ధ ఆంగ్ల పత్రికా రచయిత 'అతీంద్రీయ శక్తులు సామాన్యులకు అతీతమైనవిగా తోచవచ్చు కానీ యోగిసత్తములకు, మహాభక్తులకు, అమరపురుషులకు మాత్రం అలా కాదని" అంటారు. అటువంటివి రాజరాజేశ్వరి అపరావతారమైన అమ్మకు తెలియంది ఏముంటుంది?

"అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖసుదుర్లభా"॥

యోగుల హృదయాలలో తేజోరూపిణిగా ఉన్న శ్రీమాతను అంతర్ముఖులైనవారు మాత్రమే చూడగలరు. అంతరంగంలో దేవిని దర్శించుటయే యోగానికి పరాకాష్ఠ. యోగులకందని అద్భుత, ఆశ్చర్య ప్రవాహాన్ని ఆయనలో ప్రవహింపచేసి ఆనందాన్ని పొందునట్లు చేసి తన ప్రేమకు అవధులు లేవని చాటింది.

ఆయన లలితా పారాయణం చేసేటప్పుడు దేవితో తాదాత్మ్యం చెందుతున్నట్లుగా అనుభవద్యోతకమవుతోంది. ఇప్పటికీ అన్నయ్య ధ్యానంలో వున్నప్పుడు శరీరంలోంచి తరంగాలు బయటకు వస్తున్నట్లు అవే కాంతి పుంజాలుగా మారుతున్నట్లు అనుభూతి చెందుతున్నాడు.

అమ్మ భౌతికంగా మన మధ్య లేకపోయినా మనలను అంతర్ముఖులుగా చేస్తుందనటానికి అన్నయ్య స్వానుభవమే మనకు ఆదర్శం. మనందరం కూడా అన్నయ్య అడుగుజాడలలో నడుస్తూ అటువంటి దివ్యస్థితిని పొందటానికి కృషి చేద్దాం.

"జయ హో మాత శ్రీ అనసూయ
రాజ రాజేశ్వరి శ్రీ పరాత్పరి"

క్షరం కానిది అక్షరమైనప్పుడు యే అక్షరం గొప్పది?

4. అనురాగవల్లరి - అమ్మ

అనురాగాన్ని, ప్రేమామృతాన్ని పంచి ఇవ్వటానికి అవతరించిన నందన పారిజాతం మన అమ్మ. ముగురమ్మల మూలపుటమ్మ, పరాశక్తి ధరించిన పరిమిత రూపం, మానవ లక్షణాలతో మరుగుపడ్డ దివ్యశక్తి "జిల్లెళ్ళమూడి అమ్మ".

ఉదయభానుని కాంతిలో ఆర్తులను ఆదరించే ఆప్యాయత గోచరిస్తుంది. అటువంటి అనురాగం, ఆప్యాయత, ఆదరణ అమ్మ దగ్గర పొందగలము. అమ్మ భూమధ్యంలో పెట్టుకునే బొట్టు మనకు ఆనందాన్ని, హాయిని ప్రసాదిస్తూ చూచిన కొద్దీ చూడాలనే వుంటుంది.

ఒకే నాణేనికి బొమ్మ, బొరుసు వలె రాగం వున్న చోట ద్వేషం కూడ వుండి తీరుతుంది. రాగద్వేషాలు, జనన మరణాలు, లాభనష్టాలు ఇలాంటి వాటిలో ఏ ఒక్కటి ఆశించినా రెండోదాన్ని స్వీకరించక తప్పదు.

"త్రివిధం నరక సేద్యం ద్వారం నాశనమాత్మనః" అని అర్జునునికి బోధిస్తూ శ్రీకృష్ణుడు "కామః, క్రోదః తథాలోభః తస్మాత్ ఏతత్త్రయంత్యజేత్" నరక ద్వారాలైన కామక్రోధాలను విడిచిపెట్టాలని హెచ్చరించాడు. అమ్మ మానవుని నడక నవగ్రహాలమీద ఆధారపడిలేదు. రాగద్వేషాలనే రెండు గ్రహాలమీద ఆధారపడి వుంటుందని అమ్మ అన్నది.

1969లో అమ్మ దర్శనానంతరం గుంటూరులోని మా నాన్నగారు శ్రీ అన్నంరాజు మాధవరావుగారింట్లో అమ్మ సుప్రభాతం ఎస్. రాజేశ్వరరావుగారు మ్యూజిక్ డైరెక్టుచేసింది వింటున్నాము. ఎస్. వరలక్ష్మిగారి పాట వస్తుంటే "ఏడుస్తున్నట్లే వుంటుందని" అన్నాను. జిల్లెళ్ళమూడి అమ్మకు ఎస్. వరలక్ష్మి

మంత్రం చేయించేది, తంత్రం చేసేది.

పాట అంటే చాలా ఇష్టమని మా నాన్నగారు అన్నారు. సాయంత్రం మానాన్న పిలుస్తుంటే "ఏమిటి నాన్నా?" అంటే "అదేమిటే ఏడుస్తున్నట్లు మాట్లాడుతున్నా"వని అన్నారు. ఆ రోజు అదే మాట ఇంట్లోవారందరూ అంటే ఆశ్చర్యపోవటం నా వంతయింది. వెంటనే ప్రొద్దున్న నేను అన్నమాటలు నాకు గుర్తుకు రావటంతో అమ్మ ఫోటోకి సాగిలబడి "అమ్మా! ఇంక ఎప్పుడూ జీవితంలో ఎవరినీ వెక్కిరించనని క్షమించమని మరీ మరీ వేడుకున్నాను." ఆ తరువాత నా గొంతు యధాప్రకారం వచ్చింది. అమ్మకు ఎవ్వరినీ విమర్శించటం, వ్యాఖ్యానించటం ఇష్టముండదని తేట తెల్లమవుతోంది. మరి అందరం అమ్మ పిల్లలమే కదా!

ఒకమారు చక్రవర్తిగారి బావగారు కంచి దుర్గాప్రసాదరావు గారు జిల్లెళ్ళమూడిలో అమ్మ దర్శనం చేసుకుని ప్రసాద స్వీకారానంతరం రాత్రి ఎక్కడ పడుకోవాలో అని తనలో తాను మధనపడ్తుండగా అమ్మ తన గదిలో వున్న రాజ్యంతో "స్టేజి దగ్గర ఒక ఆయన నుంచుని వున్నారు. ఆయనకు పడుకోవటానికి చాప, దిండు ఇచ్చి స్థలం చూపించమని" అన్నది. అమ్మ తన దర్శనార్థం వచ్చేవారి అవసరాలను ఎంతగా కనుక్కొనేదో మనకు ఈ సంఘటనవలన విశదమవుతుంది.

రాత్రి పదిగంటల తరువాత అన్నపూర్ణాలయంకు "పాయసం చేయమని కబురుచేసి, టార్చిలైట్ తీసుకొని కాస్త రోడ్డువరకూ వెళ్ళి రండిరా" అని చెప్పింది. 10గం॥లు దాటిన తరువాత ఇప్పుడు ఎవరు వస్తారమ్మా అని వూరుకున్నారు. తరువాత సరోజినక్కయ్యతో క్రింద పంపు దగ్గర బాబాయి కాళ్ళు కడుక్కుంటున్నాడు, టార్చిలైట్ తీసుకుని వెళ్ళమంటే అక్కయ్య క్రిందకు వెళ్ళగా కాళ్ళు కడుక్కొని వస్తూ మా నాన్నగారు కనిపించారు. బాబాయి నీవు వస్తున్నట్లు

రక్తమంతా ఈశ్వరతత్వమే. నాకంతా శిశువులే.

అమ్మకు కబురు చేసావా? అంటే నేను వస్తానని నాకే తెలియదు. ఈ రోజు నా పుట్టినరోజు. అమ్మ దగ్గరకు వచ్చి పూజ చేసుకుందామని అనుకున్నాను. కానీ వాయిదా వేయటానికి వీలులేని కేసులవటంతో కోర్టుకు వెళ్ళాను. 5గం॥లకు పని అయిపోగానే గుమాస్తాగారి ద్వారా ఇంటికి కబురు పెట్టి బాపట్ల వచ్చి పెదనందిపాడు బస్సులో 7వ మైలురాయి దగ్గర దిగి నడిచి వచ్చేటప్పటికి ఈ సమయం అయిందని చెప్పారు. జగన్మాత అయిన అమ్మకు తెలియంది ఏముంది. ఆయన కోర్కెను తీర్చటమే కాక, వేడివేడిగా పాయసంతో పాటు బట్టలు పెట్టింది. అమ్మా! "నేను తీసుకురావల్సింది పోయి నీ చేత పెట్టించుకున్నానమ్మా" అన్నారు. "అంతా అదే నాన్నా" అంది. మన చేత పెట్టించుకున్నా, తాను పెట్టినా తన కృపాకటాక్షమే కదా! మనస్ఫూర్తిగా మనం ఏం కోరుకుంటే అది తీర్చే కల్పవల్లి.

ఈతి బాధలకు తట్టుకోలేక, అప్పులపాలై వీధిన పడ్తానేమో అన్న భయంతో అమ్మతో "అప్పులు తీరి బయటపడ్తే చాలమ్మా ఇంకేం కోరికలు లేవని అన్నాను. అమ్మ ఓరకంట చూస్తూ, బుగ్గన వేలు పెట్టుకొని 'ఇంకేం కోరికలు లేవా' అంటూ మూడు మాట్లు అనే సరికి నాకేమీ అర్థం కాక తెల్లబోయి చూచాను. కాని తరువాత జరిగిన విషయాలను నెమరువేసుకుంటే అంత ఆర్థిక ఇబ్బందుల్లో వున్నా పిల్ల, పెళ్ళి వైభవంగా అమ్మ స్వహస్తాలతో చేయటం, అప్పులు తీరి మారుతీ వ్యాన్ కొనుక్కోవటం, హార్ట్ ఆఫ్ ది సిటీలో సొంతఫ్లాట్ తీసుకోవటం చూస్తే మనకు ఏది ఎప్పుడు అవసరమో మనకంటే అమ్మకే బాగా తెలుసనిపిస్తుంది. ముందు జరగబోయేది మనకైతే తెలియదు కాని సర్వవ్యాపిని, అనురాగ వల్లరి అయిన అమ్మకు తెలియంది లేదుకదా!

సాధారణంగా మానవ జీవితంలో సుఖదుఃఖాలు, రాగద్వేషాలు,

నిగ్రహం కొఱకే విగ్రహారాధన. ధ్యాసే ధ్యానం, ధ్యాస కూడా క్రియే.

లాభనష్టాలు కనిపిస్తూనే వుంటాయి, వాటి నుంచి విముక్తి పొందాలంటే ధైర్యస్థైర్యాలు, ఆత్మవిశ్వాసం కావాలి. మనస్సు సంకల్ప, వికల్పాలకు ఆటపట్టు. దాని నుండి కోరికలు తలెత్తుతాయి. ఆ కోరికలను నాశనం చేయటానికి మనస్సు లయం కావాలి. మన మనస్సును నమస్సుగా మార్చుకోవాలి. దాని కొరకు అమ్మ పాదాలను ఆశ్రయించటం చాలా అవసరం. అప్పుడు రాగద్వేషాలు ప్రతిబంధకాలు కావు. ప్రమాదాలు అంతకంటే కావు. అందుకే విశ్వజనని అయిన అమ్మను శరణు వేడుకోవటమొక్కటే మార్గం.

5. మహిమాన్విత - అమ్మ

భగవంతునియందు మనకు గల భక్తి, ప్రేమ, ఆరాధన అంతా ఒకే వైపుకు ప్రవహించాలి. పర్వతం మీద నుంచి ప్రవహిస్తున్న నీరు నలువైపులా చెదిరిపోతే తేలికగా ఇంకిపోతుంది. పర్వతం మీద నుంచి పడేనీరు అంతా ఒకే ప్రక్కగా ప్రవహిస్తే మహానదిగా మారి మానవుడి పిపాస తీరడమే కాక అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. అదేవిధంగా మనలోని భక్తిభావము నిలకడగా ఉండక నలువైపులా చెదిరిపోతే ఇగిరిపోతుంది. అలా కాకుండా మనలోని భక్తి, ఆరాధన ఒకే రకముగా ఉద్భవించి నిలకడగా ఉంటేనే మనలోని జ్ఞానపిపాస తీరుతుంది. అటు ఒక అడుగు ఇటు ఒక అడుగు వేయటం కాక మన జీవిత లక్ష్యం, గమ్యం ఒకటై సాగినప్పుడు భగవంతుడు నైతికంగా, సాంఘికంగా, ఆర్థికంగా కూడా మనకు సాయపడతాడు.

సావిత్రి తన భర్త ప్రాణాల కొరకు యమధర్మరాజుతో పోరాడినట్లు, సుమతి తన భర్త కొరకు సూర్యోదయాన్నే ఆపేసినట్లు మనలోని భక్తి ధృఢముగా పాతుకుపోవాలి. భగవంతుని చేరటానికి శాస్త్రజ్ఞానము అవసరం లేదని భక్తితో భగవంతుని చేరవచ్చని బోయవాడయిన కన్నప్ప నిరూపించాడు. కన్నప్పకున్న

నేను మీ గుణగణాలు చూచి ప్రేమించడం లేదు. నాకోసమే నేను ప్రేమిస్తున్నాను.

భక్తి నిరూపమానం "నామనస్సనే కీకరారణ్యంలో తిరుగుతూ నా లోని మదమాత్సర్యాలనే మృగాలను సంహరించమని" కోరుకుంటాడు. భగవంతునికి అర్పించటానికి అక్కడా ఇక్కడా తిరిగి ఫలపుష్పాలు సేకరించడం కంటే మన మనస్సనే "చేతన పుష్పాన్ని" సమర్పించాలి.

అమ్మ యొక్క ముఖపద్మాన్ని మనం అవలోకిస్తే "తారాకాంతి తిరస్కారి నాసా భరణ భాసురా" అన్న నామం స్ఫురిస్తుంది. అట్టి ఆభరణంతో కూడిన అమ్మ యొక్క సుందర దరహాస లావణ్యాన్ని మనం ఊహించుకో గలిగితే ప్రపంచంలో మిగిలిన లావణ్యం అంతా తీసికట్టేననిపిస్తుంది.

"పూజనీయ జనైర్దే విస్థానే పురే పురే।
గృహే గృహే శక్తి పరః గ్రామే గ్రామే వనే వనే॥"

ప్రతి గృహములో, ప్రతి దేశములో, ప్రతి వంశములో, ప్రతి దేహములో దేవి పూజింపబడుతుందని, భవిష్యత్ పురాణములో వర్ణింపబడినది. అదే విధముగా ప్రతి గృహములో ప్రతి దేశములో అమ్మ పూజింపబడినప్పుడు ఏకప్రపంచ భావన వస్తుందనటంలో సందేహం లేదు. అమ్మా మాకు అట్టి నమ్మకాన్ని కలుగజేసి మా హృదయమందిరములో స్థిర నివాసమేర్పరచుకుని మా వెన్నంటి వుండి మాకు అన్ని విధాలా సహాయ పడుతుందనటానికి నిదర్శనమే ఈ వ్యాసం.

1979 సం. దసరాలో అమ్మ దగ్గరకు వెళుతూ హైదరాబాదులో వున్న మా అమ్మగారిని, తమ్ముడిని చూసి చాలా రోజులైనందున, హైదరాబాదు దాకా వెళ్ళాలంటే ఆర్థిక పరమైన ఇబ్బందుల వలన వారిని జిల్లెళ్ళమూడి రమ్మని వ్రాసాను. ముందుగా గుంటూరు వెళ్లి అటునుంచి జిల్లెళ్ళమూడి వెళదామని నా ఆలోచన. గుంటూరులో సత్యాలక్కయ్య "ఎందుకే ఆ ముసలావిడిని

దేశ సేవ, దేవుని సేవ, రెండూ వేరుకాదు.

ఏడిపిస్తావు? నీ పిల్లకి తమ్ముడిని చేసుకుంటావో లేదో చెప్పవచ్చుకదా" అని అంది దానికి అమ్మ అనుజ్ఞ అయితే కాని నేను చెప్పలేను. భగవద్గీతలో చెప్పినట్లు నాకు గురువు, దైవం, సఖి, నెచ్చెలి అన్నీ అమ్మే అన్నాను.

జిల్లెళ్ళమూడి వెళ్ళి ఆ సాయంత్రం అమ్మ దగ్గర ఆ ప్రస్తావన తెచ్చాను. "అమ్మా తమ్ముడికి మా పెద్ద అమ్మాయిని చేసుకోవాలని నాన్నకు ఉండేదమ్మా" అంటే "మీ నాన్నకు సరే, అబ్బాయికి ఆ ఉద్దేశ్యం ఉందా" అంది నాకు, ఆయనకు ఇష్టమే అని అన్నాను. మరునాడు ఉదయం మా అమ్మ, తమ్ముడు సీతారాం హైదరాబాదు నుంచి వచ్చారు. అమ్మ దర్శనంకు వెళ్ళి కూర్చున్నాము. మా అమ్మ "అమ్మా! నీ దయవల్ల చిన్నవాడి దగ్గర ఉంటున్నాను. నీవు జీతం పెంచి మాకు సరిపోయేలా చేసావమ్మా' అని అంది. అది విని అమ్మ నవ్వి ఊరుకుంది. అక్కడ వున్న ఒక అన్నయ్య అబ్బాయికి పెళ్ళిఎప్పుడు చేస్తావంటే - వచ్చేది సరిపోవాలికదా। అని అంది. దానికి రామకృష్ణ అన్నయ్య ఇప్పుడేగా జీతం పెంచారన్నావు అదీ అమ్మే చూసుకుంటుందని అన్నాడు.

విశ్వజనని అయిన అమ్మకు తెలియంది ఏముంది? 'అమ్మ' మా తమ్ముడితో "మా అమ్మాయి ఉంది దానిని చేసుకోవటం నీకు ఇష్టమేనా? దాని చదువు అయిన తరువాత చేస్తామని (అప్పుడు మా అమ్మాయి బి.కాం. 2వ సం॥ చదువుతుంది) పదిమంది పెద్దల ముందు అడుగుతున్నాను నీ నిర్ణయం చెప్పమంది." మా తమ్ముడు అమ్మకు, నాకు ఇష్టమేనమ్మా అని చెప్పాడు. నాకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తానే నా తరుపున పెద్దగా వ్యవహరించి మా అమ్మగారికి మనశ్శాంతిని కలుగజేసింది.

1982 మే 5 న మా చెల్లెలి కూతురు పెళ్ళికి గుంటూరు వెళ్ళి, మా అమ్మాయి పెళ్ళికి జూన్ 11వ తేదీ ఉదయం ముహూర్తం పెట్టించాము. మా

ఆశా అసంతృప్తుల కలయికే జీవితం.

చెల్లీ వాళ్ళు పెళ్ళికూతుర్ని, పెళ్ళికొడుకుని జిల్లెళ్ళమూడి తీసుకు వెళుతుంటే నేనూ వెళ్ళి "అమ్మా! మా అమ్మాయి పెళ్ళి నీ సమక్షంలో జరిపించాలని" వేడుకున్నాను.

గుంటూరు నుంచి వైజాగ్ మా కుటుంబం రావటానికి సరిపడా డబ్బు మాత్రమే ఉంది. "నీకేమైనా మతిపోయిందా చేతిలో చిల్లిగవ్వ లేకుండా పిల్లపెళ్ళికి ముహూర్తం పెట్టించావు ఏ ధైర్యంతో నీవు పెళ్ళి చేద్దామనుకుంటున్నావు. పెళ్ళి అంటే మాటలా" అని ఆయన అన్నారు. మన మీద అమ్మకు అపారమైన ప్రేమ, పరిపూర్ణ కటాక్షం ఉన్నాయి. అమ్మ ఉండగా ఆమె సమక్షంలో పెళ్ళికి మనకు దిగులెందుకని అన్నాను.

యూనివర్సిటీలో 3 వేలు మ్యారేజి లోను ఇవ్వడానికి, శుభలేఖ ఉండాలని అన్నారు. ఆంధ్రా బ్యాంకులో 2వేలు లోను తీసుకుని శుభలేఖలు వేయించాము. ఆదికాలంలో బాబు యాక్సిడెంట్ అయినప్పుడు తట్టుకునేందుకు ధైర్యం నీవే ఇచ్చావు, అలాగే ఇప్పుడు పిల్ల పెళ్ళికి నీవు వున్నావనే మొండి ధైర్యంతో మొదలు పెట్టామని అమ్మకు మొరపెట్టుకున్నాను.

మేము అనేక ఇబ్బందులలో ఉన్నామని తెలిసి కూడా బట్టలకు, సరుకులకు వేలమీద అప్పు ఇవ్వటం అమ్మ కటాక్షమే. పుట్టిన ఊరు గుంటూరులో మట్టెలు, మంగళసూత్రాలు, దిద్దులు, భటువు మొదలైనవి అప్పుగా తీసుకున్నాము. నేను ఆ ఊరులో ఉండకపోయినా బంగారం వస్తువులు అప్పు ఇవ్వటానికి అమ్మ దయే కారణం అని నా నమ్మకం.

పెళ్ళికి నాలుగురోజులు ముందుగా నేను జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మ దగ్గర కూర్చొని ఉండగా "శుభలేఖలు మాతృశ్రీ ప్రెస్‌లో వేయించే వాళ్ళం, పిల్లవాడి ఒడుగు కూడా కలిపి వేయించేదాన్ని" అని అంది. నాకు నోట మాట

భావం మారేటీనూ, స్వభావం మారనిది.

రాక అలావుండిపోయాను. అమ్మే "ఇప్పుడు మాత్రం మించిపోయింది ఏముంది పెళ్ళికి అటువాళ్ళు, ఇటువాళ్ళు వస్తారు కదా" వాడికి పసుపు బట్టలు నేనే ఇస్తానంది. మాకు తోచకపోయినా పిల్లవాడి ఒడుగు చేస్తాననటంతో నాకు ఆనందంతో గుండె బరువెక్కి ఒక్కమాట కూడా రాలేదు. ఎలాగో తెప్పరిల్లి "అంతా నీ ఇష్టమేనమ్మా" అన్నాను.

పెళ్ళి రెండు రోజులుందనగా అమ్మ సమక్షంలో అన్నయ్యా వాళ్ళతో పెళ్ళికి ఎక్కువ ఖర్చు చేయవద్దని, పగలు ముహూర్తం కాబట్టి లైటింగుకు ఎక్కువ కరంటు వాడొద్దని చెప్పాను. అక్కడే వున్న అమ్మ "అబ్బాయి రాజమండ్రి వెళ్ళివచ్చాడుటే' అంటే ఆశ్చర్యపోవటం నా వంతుఅయ్యింది. ఆయన రాజమండ్రి వెళ్ళిన విషయం ఏ ఒక్కరికి చెప్పలేదు.

అప్పట్లో మాకు ఉన్న ఆస్తి ఒక సెకెండ్ హేండ్ స్కూటర్ మాత్రమే. అది విశాఖపట్నంలో తాకట్టు పెడితే పదిమందికి తెలుస్తుందని, పరువుపోతుందని ఒక స్నేహితుని ద్వారా రాజమండ్రిలో తాకట్టు పెట్టి డబ్బు తీసుకువస్తానని వెళ్ళారు. పెళ్ళి రేపనగా ఆయన, పిల్లలు వచ్చారు. ఆ రోజు అమ్మ మా అమ్మాయిని పెళ్ళికూతురిని చేసింది. అమ్మ పెళ్ళికూతుర్ని చేసే వేడుక చూసితీరవలసిందే కాని వర్ణింపనలవి కాదు. మా చిన్నమ్మాయిని తోడ పెళ్ళికూతుర్ని చేస్తూ దీనికీ పెళ్ళికళ వచ్చేసిందే అని కళ్యాణతిలకం దిద్దింది. దానితో అమ్మ పెళ్ళికూతుర్ని చేయలేదన్న బాధ లేకుండా చేసింది. (దాని వివాహంకు తాను అనసూయేశ్వరాలయంలో ఉంది. అమ్మకు కట్టించమని పట్టుచీర వైట్ కలర్‌కు రెడ్ బోర్డర్‌ది పంపించాను. అది చాలా మాట్లు కట్టిన తర్వాత అనుకోని విధంగా నా దగ్గరకు చేరింది) పెద్ద అమ్మాయి పెండ్లికి పెళ్ళికూతుర్ని చేసి అమ్మ పట్టుచీర పెట్టింది. చిన్న అమ్మాయి పెళ్ళికి తాను

తన కొఱకు చేసేది రాగమూ, ఇతరుల కొఱకు చేసేది త్యాగమూ.

కట్టుకున్న చీరె నాకు అందేలా చేసి నాకు ఆనందాన్ని కలిగించిన అమ్మకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను?

పెళ్ళిరోజు ఉదయం అమ్మ 7 గం॥లకు స్నానం చేసి తాను రెడీగా వున్నానని తన్ని ఎప్పుడు రమ్మంటే అప్పుడు స్టేజి దగ్గరకు వస్తానని, "పెట్టింది ముహూర్తం కాదు జరిగేది ముహూర్తమని, శుభలేఖల్లో టైమ్, అందరూ ఆ సమయానికి అక్కడకి చేరటానికని" విపులీకరించింది. అమ్మా అంతా "నీ ఇష్టప్రకారమే చేయమ్మా" అంటుండగా ఎస్.ఆర్.వై గారు వచ్చి అమ్మా, ఫోటో గ్రాఫర్ని బాపట్ల నుంచి తీసుకురావాలి అంతదాకా క్రిందకు రాకమ్మా అని ప్రార్థించారు. అమ్మ సమక్షంలో సాధారణంగా పెళ్ళిళ్ళు మధ్యాహ్నం 12గం॥లకు జరగటం విశేషం. అమ్మతో అన్ని ఫోటోలు వుండటం మా పూర్వజన్మ సుకృతమే.

ముహూర్తం అయిన తర్వాత పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు మధుపర్కం బట్టలు కట్టుకు రావటానికి సమయం పడ్తుంది కాబట్టి అప్పుడు బాబు ఒడుగు చేద్దామని రామకృష్ణ అన్నయ్య అన్నాడు. దానికి మా పినమామగారైన డా॥ ఎ.ఎన్.రావ్ గారు ఒప్పుకోక ముందు ఒడుగు చేసి తరువాత పెళ్ళి చేయటం పద్ధతి అన్నారు. అమ్మది "సరే మత్రం" కదా ఎవరినీ నొప్పించకుండా ఆ ప్రకారమే మొదట ఒడుగు చేసి తర్వాతే పెళ్ళి చేసింది.

మా బాబు యాక్సిడెంట్ నుంచి బయట పడటమే కాక అమ్మ చేత మంత్రోపదేశం అవ్వటం, అమ్మ చేత్తో జంధ్యం వేయించుకోవటం, మొదటి భిక్ష అమ్మచేత పెట్టించుకునే అదృష్టం వాడికి కలగటం చూచి మా బంధువులంతా ఎంతో సంతోషించారు.

అమ్మ తన స్వహస్తాలతో ఒడుగు, పెళ్ళి చేసి మా బంధువులందరికీ కన్నులపండుగ చేసింది. పెళ్ళికి అవసరమైన మిగిలిన బట్టలు నేను, సరోజిని

దయలేని వాళ్ళంతా దయ్యాలే.

అక్కయ్య, చీరాల వెళ్ళి బుద్ధిమంతుడన్నయ్య వాళ్ళ షాపులో తీసుకు వచ్చాము. పెళ్ళికి, ఒడుగుకు చదివింపుల్లో వచ్చిన డబ్బుతో గుంటూరు చీరాల్లో చేసిన అప్పు తీర్చాము. ఎవరినీ, దేహీ అని యాచించనవసరం లేకుండా, చేతిలో నయాపైసా లేకపోయినా పెండ్లి, ఒడుగు, వైభవంగా జరగటం అమ్మ మహిమే కదా!

ఎక్కువ ఖర్చు చేయవద్దని సింపుల్‌గా చేయమని నేను చెప్పాను. కాని అమ్మ, అన్నయ్య వాళ్ళని పిలిపించి "ఏ విషయంలోనూ లోటు రాకూడదని, పెళ్ళికి ఏమేమి చేయాలో భోజన పదార్థాలతో సహా తానే నిర్ణయించి, మర్యాదలకు భంగం కలుగకుండా చేయించిందని" తెలిసి ఆశ్చర్యానందాలలో మునిగితేలాను.

ఆ రాత్రి వెన్నెల భోజనాలంటూ అన్నీ తెల్లగా వుండే పదార్థాలే అంటే క్యాబేజికూర, కొబ్బరికాయ పెరుగుపచ్చడి, బాదుషా, అప్పడం, కట్టె పొంగలి, పాయసం మున్నగు వాటితో ఎంతో చక్కగా చేయించింది. మూడు పూటల పెళ్ళివారికి ఏ లోటు లేకుండా అందరికీ పిండివంటలతో సహా భోజనాల ఏర్పాటు చూస్తే, మేము ఏమిచ్చి అమ్మ ఋణం తీర్చుకోగలమనిపించింది. వేయిజన్మలెత్తినా మేమైతే ఆ సమయంలో ఏమీ చేయలేకపోయేవాళ్ళమే.

పెళ్ళివారు వెళ్ళిపోయిన తరువాత పైకి వెళ్ళి, ఆనంద భాష్పాలతో అమ్మ పాదాలకు అభిషేకం చేసుకున్నాను. అమ్మ దగ్గర శ్రీ ఉపద్రష్ట మధుసూధనరావుగారు, శ్రీ విఠాల రామచంద్రమూర్తి గారు కూర్చుని వుంటే వారితో అమ్మ "చక్రవర్తికి అన్నీ వేడివేడిగా వుండాలి అప్పటికప్పుడు అర్ధరాత్రి అయినా వాడు వచ్చాక రొట్టెలు చేసి పెడుతుందని" తాను చూసినట్లుగా చెప్పింది. నా పిచ్చికాని అంతా తానే అయినప్పుడు వేరే చూచేదేముంటుంది!

వింటే విమర్శకానీ, కంటే విమర్శలేదు.

"అమ్మా! మొగపెళ్ళివారిని పిలుచుకురమ్మంటే మొదటి పంక్తిలో తన స్నేహితులతో పాటు భోజనానికి కూర్చున్నారమ్మా" అన్నాను. "ఇంటి అల్లుడి హోదాలోనే కూర్చున్నాడు" అని అమ్మ అంది. మరి ఆడ పెళ్ళివారెవరమ్మా అన్నాను. "నువ్వూ నేను" అంది. ఆ మాటలకు నా మనస్సుప్పొంగిపోయింది.

రామకృష్ణ అన్నయ్యకు బట్టలు పెడుతుంటే నాకెందుకు అంటే, వశిష్ఠులవారిని నీవు తీసుకోకపోతే ఎలాగా అంది. అక్కడ ఏమి జరిగినా అమ్మ ఆదేశానుసారమే జరుగుతాయి. అమ్మ తన బిడ్డలందర్నీ ఎంతో ప్రేమగా, ఆదరంగా చూసుకుంటూ ఎవరికీ ఎక్కడా మాట రానీయకుండా, బాధపడకుండా, సంఘంలో ఎటువంటి అవమానాలపాలు కాకుండా వాళ్ళ వాళ్ళ అవసరాలను కనిపెట్టుకొని వుండటం చూస్తే అమ్మకు బిడ్డల యందు కల అపార కరుణకు నిదర్శనం ఇంతకంటే ఏముటుందనిపిస్తుంది.

6. విప్లవ శంఖారావం - అమ్మ

విశ్వంలోని మాధుర్యాన్ని మమతానురాగాల్ని దర్శించగలిగేటట్లు చేయగలగటం అమ్మకే సాధ్యమవుతుందనిపిస్తుంది. అంతర్మథనంతో అంతర్యామిని దర్శించగలగటం ఆధ్యాత్మికత యొక్క విశిష్టత. అమ్మ అలతి అలతి పదజాలంతో లౌకిక విషయాల ద్వారా తన బిడ్డలకు ఆధ్యాత్మికతను అరటిపండు వొలిచి నోట్లో పెట్టిన విధంగా అందించేది. అలాగే మూఢాచారాలను, మూఢనమ్మకాలను పారద్రోలటానికి విప్లవశంఖాన్ని పూరించింది.

మొదటి మెట్టుగా కులమతాలకు అతీతంగా తన దగ్గరకు వచ్చే వారందరికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసింది. స్వర్ణోత్సవాలల్లో ఎటువంటి తారతమ్యాలు లేకుండా అందరూ వడ్డనలో పాల్గొనేటట్లు చేసి అంతమటుకు

విన్నవాడు విమర్శిస్తాడు. కన్నవాడు వివరిస్తాడు.

వున్న బ్రాహ్మలు మాత్రమే వంట, వడ్డనలు చేస్తారన్న అపప్రదను దూరం చేసింది.

గాయత్రీ యాగంకు వెళ్తునప్పుడు చాలా మంది. "అమ్మ బ్రాహ్మల చేతనే ఈ యాగం చేయిస్తారా?" అని అడిగారు. "గాయత్రీ దీక్షనాడే వర్ణవిచక్షణ లేకుండా అమ్మ అందరికీ గాయత్రీ మంత్రం వున్న కాగితం, జపమాలా స్వయంగా అందచేసింది. ఇప్పుడు మాత్రం ఎందుకు వివక్షత చూపిస్తుందని" అన్నాను.

విశాఖపట్టణం నుంచి గాయత్రీ దీక్షకు వెళ్ళినప్పుడు, అందరం కూర్చుని వుండగా భవానీ ప్రసాదుగారిని చూచి "గాయత్రీ చేస్తావా నాన్నా?" అని అడిగింది. గాయత్రీ దీక్ష అమ్మ ఇస్తారన్న క్షణం నుంచీ తాను గాయత్రీ దీక్ష తీసుకోవాలని, తీసుకుంటే తను సరిగా నిర్వర్తించగలనో లేదో అని, పూజలు చేయటం అసలు అలవాటు లేదు. ఎలాగా అని మధన పడ్తున్నారు. అందరిలో, ఆయన మనస్సు కనిపెట్టి, ఆయన్నే ప్రత్యేకించి అడగడం చూస్తే అమ్మ యొక్క సర్వజ్ఞిత్వానికి ఇంతకంటే నిదర్శనమేమి వుంటుందనిపించింది.

గాయత్రీ యాగానంతరం అమ్మా "నీవు ఏ వివక్షత చూపించక అందరి చేత యాగం చేయించి అందరూ పాలు పంచుకొనే సువర్ణావకాశాన్ని కలుగచేసావని ఎంతో ఆనందంగా వుందని" అన్నాను. గాయత్రీ స్త్రీలు చేయరాదని, బ్రాహ్మలు మాత్రమే చేయాలని శాస్త్రాలు చెప్పాయన్నారు. గాయత్రీ అందరికీ చెప్పకూడదని అనేక మంది శ్రోత్రీయులు అమ్మను విమర్శించటం జరిగింది. ఆ విషయం అమ్మతో ప్రస్తావిస్తే "శాస్త్రాలు చెప్పవద్దంటున్నాయని కొన్నింటిని అందరికీ అందుబాటులోకి తేవటం లేదు. ఏ శాస్త్రాల ఆధారంగా చెప్పకూడదంటున్నారో, ఆ శాస్త్రాలతోనే ఖండిద్దామని కూర్చున్నాను. కానీ అక్కడా, అక్కడా విమర్శిస్తున్నారే కానీ నా దగ్గరకు ఎవ్వరూ రాలేదని" అంది.

సత్యమే కఠోరమైనది. కఠోరసత్యం కాదు.

"శాస్త్రాలు, చతుర్వర్ణాలకు, వారి వారి పనుల బట్టి వర్ణాలను నిర్ణయించాయి. బ్రాహ్మణులే వున్నారనుకో వాళ్ళకు విధించిన నిత్యాగ్నిహోత్రాన్ని ఎంతమంది పాటిస్తున్నారు? సిగరెట్లు తాగటమే కదా వీళ్ళు చేస్తున్న నిత్యాగ్నిహోత్రం. ఎంతమంది క్షత్రీయులు బలహీనులకు రక్షణ కల్పిస్తున్నారు. వైశ్యుల్ని సరుకుల్ని పంపిణీ చేయమంటే ఎంతమంది సక్రమంగా, వ్యాపారం చేయగల్గుతున్నారు ఎంతమంది తమ కులవృత్తులను నిర్వర్తిస్తున్నారని చాతుర్వర్ణాలకు పైన నిలబడి నిర్ధితిగా నిర్ద్వంద్వంగా ఖండించింది. తాను బ్రాహ్మణ స్త్రీయైనా ఎప్పుడు మన బ్రాహ్మలు అనకపోవటం గమనార్హం. సాధారణ మానవులం ఎవరి కులం వాళ్ళను, వాళ్ళు మనవాళ్ళే అంటూ వుంటాము. కానీ అమ్మ వాటన్నింటికీ అతీతమై తన విశ్వజనీనతను చాటుకుంది.

"దేముడికి బలి ఇస్తున్నామని చెప్పి జంతువుల్ని, కోళ్ళను కోసుకుతింటున్నారు. అసలు బలియంటే యాగ సమయంలో అంతా వెదికి జీవన్ముక్తికి, జ్ఞాన పరిపక్వతతో యున్న మేకను తీసుకువచ్చి దాని చెవులో మంత్రం చెప్పి సీసం కరిగించి చెవిలో పోసి ముక్తి కలిగించే వారని" అమ్మ చెప్పింది. అమ్మ చెప్పిన దాన్ని బట్టి చూస్తే వాటికి కూడ జ్ఞానము వున్నట్లే కదా! అదే విధంగా షిర్డీబాబా చెప్పిన "చెల్లిబల్లి అక్కబల్లిని కలుసుకుంటుందని సంతోషిస్తుందని" చెప్పిన విషయంలో వాటికి జ్ఞానము వున్నదన్న సామ్యం మనకు గోచరిస్తుంది.

ఈ విషయాన్నే దుర్గా సప్తశతిలో ఈక్రింది శ్లోకంలో

"జ్ఞాన మస్తి సమస్తస్య జన్తోర్విషయగోచరే!
విషయాశ్చ మహా భాగయాన్తి చైవం పృథంక్పృథక్"

అనుభవం లేకపోతే మహావాక్యాలు మన వాక్యాలే.

ఇంద్రియ గోచరమగు విషయజ్ఞానము సమస్త జంతువులకును కలదు. ఇంద్రియ గోచరమగు విషయములు వేర్వేరు విధములుగా తెలియవచ్చునని నిర్ధారింపబడినవి.

లలితాసహస్రాన్ని రహస్య నామమన్నారని రహస్యంగా వుంచాలంటూ అందరూ చేయరాదని, ఆడవాళ్ళు అసలే చేయరాదని, చేస్తే ఆహుతి కావాలట అన్నవారితో అమ్మ "అన్నీ చేయవచ్చు మనస్సునే ఆహుతి చేస్తే ఇంక వేరే ఆహుతి ఎందుకని" ప్రశ్నించింది. "అమ్మవారు నెత్తి అణుస్తుందని అంటారు. అదేమీ లేదని నేననుకుంటాను. ఎక్కడైనా తల్లినెత్తి అణుస్తుందా?" అని అన్నది.

రుద్రాభిషేకాలు స్త్రీలు చేయరాదని శాస్త్రాలు చెప్తున్నాయని శ్రోత్రీయులు గోలపెడ్తుంటే అక్కడ హైమాలయ, అనసూయేశ్వరాలయాలలో అమ్మ స్త్రీల చేత అభిషేకాలు చేయించింది. అనేక మందిని హైమాలయం అనసూయేశ్వరాలయాల్లో అభిషేకాలు చేసుకోమని, వారివారి ఈప్సితాలు తీరటానికి, ఇక్కట్లు తొలగిపోవటానికి మార్గం చూపించింది. ఇది అనుభవంతో చెప్తున్న విషయం. పాత ఆచారాలను పట్టుకొని వేళ్ళాడటం కాక, అందులోని మంచిని గ్రహించి, చెడును విసర్జించమంది. మడి అంటె హద్దు అని మడి అంటూ తడి బట్టలతో చేయటం కాదని వివరించింది.

ఒకప్పుడు సంప్రదాయమైన సతీసహగమనమనే కోరల నుంచి బయటపడ్డ స్త్రీ, మరణం కంటే బాధాకరమయిన విషయం మంగళ చిహ్నాలను విసర్జించటం. వారిని మంగళకరమయిన వేడుకలకు దూరంగా వుంచటం, భర్తృవిహీన అయిన స్త్రీ ఎదురువస్తే అపశకునంగా భావించటం మొదలైన దురాచారాలు మన హిందూ సమాజంలో వేళ్ళూని పాతుకుపోయాయి. వాటిని

అనుభవం శాస్త్రాన్నిస్తుంది. కాని శాస్త్రం అనుభవాన్నివ్వదు.

అమ్మ మొదలంటూ నరికివేసి మహిళాలోకానికే అనూహ్యమయిన మార్పులను అందించింది. "భర్తను గురించిన సజీవ భావన, నిరంతర స్మరణవున్న స్త్రీ ఏనాటికి భర్తృవిహీన కాదని" అమ్మ అభిప్రాయం. అందుకే అమ్మ సుమంగళీ చిహ్నాలను విసర్జించలేదు. ఎవరినీ విసర్జించమని చెప్పలేదు. భర్తృవిహీనలు కుంకుమ పూజ చేయరాదని శాస్త్రాలు నిషేధిస్తే అమ్మ సమక్షంలో అందరూ సమానమేనని వారి చేత కుంకుమ పూజలు చేయించింది. మా నాన్నగారు మరణించినప్పుడు మా అమ్మ గారికి పుట్టింటివారు ఎవరూ లేరని నెల లోపల తన దగ్గరకు పిలిపించుకొని, ఆమెచేత హైమలయ గర్భగుడిలో కుంకుమపూజ చేయించింది. అలాంటి అవకాశాలు ఎందరికో కలుగచేసింది. "మామగారు పోయారు ఏటి సూతకమమ్మా" అన్న అక్కయ్యతో "ఇక్కడ అలాంటివేమి లేవు పూజ చేసుకోవచ్చని" చెప్పింది.

జిల్లెళ్ళమూడి కాలేజీ లెక్చరర్‌గారు కాన్ఫరెన్సులో పాల్గొనటానికి కాశీవెడితే, వారి నాన్నగారు హఠాత్తుగా మరణించారు. ఒడుగు కాని ఆయన తమ్ముడికి అప్పటికప్పుడు తాను జంధ్యం వేసి తండ్రికి తలకొరివి పెట్టించి కర్మ చేయించింది. పోతుకూచి రవి మరణశయ్య మీద వుండగా, అతని మరణాన్ని వాయిదావేసి, జిల్లెళ్ళమూడిలో జరగవలసిన పెళ్ళి జరిపించి, తరువాత అమ్మ స్వయంగా శ్మశానానికి వెళ్ళింది. సాయంత్రం బూజంబంతి జరపాలో లేదో ఎటూ నిర్ణయించుకోలేక పెళ్ళివారు మధనపడ్తుంటే, "నేను స్నానం చేసి వస్తాను, మీ ఏర్పాట్లు మీరు చేసుకోండని" వారికి చెప్పింది. ఈ సంఘటన వలన అమ్మకు పెండ్లి, చావు అన్నీ సమానమేనని తేట తెల్లమవుతుంది. ఇలాగే అనేకరకాలుగా తన విప్లవశంఖాన్ని పూరించి మనకు మార్గదర్శిని అయ్యింది.

సవరణ లేనిది వివరణ. తల్లికి తప్పే కనబడదు.

7. కరుణామృతవర్షిణి - అమ్మ

శోక, మోహ, లోభ, భయాలను కలిగిస్తూ గమ్యం కన్పించనీయకుండా దట్టంగా వ్యాపించిన ఈ సంసారమనే అరణ్యం దేవి అనుగ్రహరూపమైన గొడ్డలి చేతనే నాశనమవుతుంది. రాగద్వేషాలతో, అరిషడ్వర్గాలతో నిండిన భవారణ్యానికి గొడ్డలిపెట్టు శ్రీమాత అయిన మన అమ్మ కరుణామృతవర్షిణి. అమ్మను స్మరించిన వారికి కష్టనష్టాలుండనే వుండవు.

1970లో మా బాబుకు ఉబ్బుకామెర్లు వచ్చాయి. ఒక్కరోజులో పిల్లవాడు బొద్దుగా తెల్లగా తయారయ్యాడు. అది గుండెకు సంబంధించిన వ్యాధి కాబట్టి పిల్లవాడ్ని చాలా జాగ్రత్తగా చూడాలని డాక్టర్లు చెప్పారు. 8 సం॥ పిల్లవాడ్ని నేను, మా అత్తగారు కళ్ళల్లో వొత్తులు వేసుకొని చూచేవాళ్ళం. కొద్దిగా నెమ్మదించిన తరువాత అమ్మ ఆశీస్సుల కొరకు నేను పిల్లలు జిల్లెళ్ళమూడి వెళ్ళాం.

ఆ సమయంలో అన్నంరాజు రామకృష్ణ అన్నయ్య భార్య, మా ఉషవదిన చూపిన ఆదరణ, ఆప్యాయతలు జీవితంలో మర్చిపోలేనివి. అమ్మ స్నానం చేసిన నీరు బకెట్లతో పట్టివుంచి, వీడికి ఆనీళ్ళతో స్నానం చేయిస్తే పూర్తిగా తగ్గుతుందని చెప్పి, పత్యం కూడా ఎంతో శ్రద్ధగా చేసి పెట్టేది. ఆ రోజుల్లో ఏది కావాలన్న బాపట్ల వెళ్ళవలసిందే ఎవరైనా వెళ్తుంటే, వాళ్ళద్వారా బన్ను, బ్రెడ్డు తెప్పించేది. ఎవరి దొడ్లో బీరకాయలు, పొట్లకాయలు కాస్తాయో కనుక్కొని తెచ్చివండేది. ఆ స్థల ప్రభావం ఎవరిని ఏది అడిగినా లేదనటం కాని, కాదనటం కాని వుండదు. ఏది చేసినా వారి ప్రయోజకత్వం అని అనుకునేవారు కాదు. అంతా అమ్మదయ అని, వారికి ఆ అవకాశం కలుగచేసిందనుకునేవారే కానీ మనం ఏదో చేస్తామని కాని, మన గొప్ప అనుకోవటం వుండనే వుండదు. రక్త సంబంధీకులకంటే అమ్మ బిడ్డలు ఆత్మబంధువులే అవుతారు.

మాతృత్వం వేరూ, మాతృతత్వం వేరు.

నిజమైన ప్రజాస్వామ్యం, సోషలిజం జిల్లెళ్లమూడిలోనే వున్నాయనిపిస్తుంది. బీదా, గొప్ప తారతమ్యాలు లేవు. అందరూ అక్కయ్య, అన్నయ్య అంటూ నోరార పిలుచుకోవటమే. ఉష వదినకు అసలు గుర్తుందో లేదో కానీ నేను మాత్రం జీవితంలో మర్చిపోలేను. అలాగే సరోజినక్కయ్య మా అమ్మాయి పెళ్ళికి చేసిన సాయం మరువలేను. వారికి సర్వదా కృతజ్ఞురాలిని.

జిల్లెళ్ళమూడిలో సరోజినక్కయ్య వాళ్ళింటిదగ్గర వుండగా ఒకాయన విస్తళ్ళకట్ట ఒకటి పట్టుకొని వస్తుంటే ఇంత సంస్థలో ఆ విస్తళ్ళకట్ట ఏమూల కొస్తుందనుకుంటుండగా భోజనాలగంట మోగింది. ఆ విస్తళ్ళకట్ట తీసుకొని విస్తళ్ళు వేయటానికి ఉపక్రమించను. ఎన్ని వరుసలు వేసినా ఆ కట్టలో విస్తళ్ళు మిగిలే వున్నాయి. దానితో ఎప్పుడూ ఎవరినీ విమర్శించకూడదని, ఆ బుద్ధి పోగొట్టమని ఎవరి భక్తి వారిదని చెంపలు వాయించుకున్నాను. అందుకే అమ్మ ఒక్కరు పదివేలు ఇచ్చేకంటే 10వేల మంది ఒక్కో రూపాయి ఇవ్వటమే సంస్థకు ముఖ్యమనేది. తలో చేయి వేసి ఆ సంస్థను, అన్నపూర్ణాలయాన్ని ఆపకుండా చూడవలసిన బాధ్యత అమ్మ పిల్లలమైన మన అందరిపైనా ఉన్నది.

"ఈ యజ్ఞగుండాలు, యాగహోమాలు కంటే నాకు గాడిపొయ్యే ముఖ్యం అనిపిస్తుంది. నేను ఏమైనా వెయ్యగలిగినా వెయ్యవలసి వచ్చినా అదిగాడిపొయ్యలోనే వేసుకుంటాను. నా ఆయుధాలు గిన్నెలు, గరిటెలే" అని అమ్మ అంది. అన్నపూర్ణాలయం అమ్మ గుండె అని, అక్కడి గుండి గల చప్పుళ్ళు తన గుండె కొట్టుకోవటమని అమ్మ నిర్ధారించింది.

అమ్మ పుట్టినరోజునాడు పూజ ఏర్పాటు చూసుకొని దండిగానే ప్రసాదాలు చేయించాము. ఆ రోజు మా అంచనాలకుమించి వచ్చారు. పులిహోర చాలా బాగుందని మళ్ళీ మళ్ళీ అడిగి వడ్డించుకుంటున్నారు. మా పిల్లలు బేసిన్లతో

తల్లికి బిడ్డ సొమ్ము. బిడ్డకు డబ్బు సొమ్ము.

తెచ్చి వడ్డిస్తుంటే లోపలే వున్న మా అత్తగారికి, సరిపోదేమోనని కంగారువేసి ఏమి చేయాలో తెలియక "నీ పూజకని చేసాము ఇప్పటికిప్పుడు ఏమి చేయగలం నీవే చూసుకో అమ్మా అని గిన్నెలో వున్న పులిహోరనే మళ్ళీ నివేదన చేసారు. ఇంకొక్క బేసిన్ కంటే వుండదనుకున్న పులిహోర నూతిలో నీరు వూరినట్లుగా అక్షయమయిందని చెపితే ఆశ్చర్యానందాలు పెనవేసుకున్నాయి. మిగిలినప్రసాదం మా ఇంటిల్లిపాది తినగా మర్నాడు పని అమ్మాయికి ఇవ్వటానికి కూడా సరిపోయింది.

ఒక సంవత్సరం దుర్గాష్టమికి కావేరీ కళ్యాణమండపంలో అఖండ లలితా సహస్రనామపారాయణ త్రికాల పూజలు బాల, కుమారి, సుహాసిని పూజలు జరిగాయి. అప్పుడు అక్కడ ప్రసాదం అలాగే అక్షయమయింది. చుట్టుప్రక్కల ప్లాట్లు కడ్తున్న కూలీలందర్నీ కూడా పిలిచి ప్రసాదాలు పంచాము. ఎంతకూ తరగకపోతే అమ్మా! మా ఓపికను పరిక్షించాలనుకున్నావా అని దండం పెట్టుకొని ఆ గిన్నెలతోనే వాళ్ళను తీసుకుని అవి కడిగి ఇచ్చేయమని చెప్పాల్సి వచ్చింది. ఆ రోజు ప్రసాద వినియోగం, అక్షయం అవటానికి సాక్షులు శ్రీ సన్యాసిరావుగారు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

అమ్మను గురించి విన్నవారు కోట్లలో వుంటే చూసిన వాళ్ళు లక్షల్లో వున్నారు. కాలమే కర్తవ్యాన్ని బోధిస్తుందని అమ్మ అంది. అమ్మ పిల్లలందరం మనకు వచ్చే ఆదాయంలో కనీసం వందకు ఒక రూపాయి చొప్పున ప్రతినెలా పంపగలిగితే అమ్మ గుండె అని చెప్పిన అన్నపూర్ణాలయ గంట నిర్విరామంగా మోగుతూనే వుంటుంది. కనుక ఆ బాధ్యతను చేపట్టవలసినదిగా అమ్మ పిల్లలందర్నీ వేదుకుంటున్నాయి.

"యస్యదేవేపరాభక్తిః యధాదేవే తధాగురౌ।
తస్యతే కధి తాహ్యర్థాః ప్రకాశంతేమహాత్మనః॥"

తిధులు విధిని మార్చలేవు.

దైవం గురువు ఒక్కటే. గురువు ఉపదేశించిన మంత్రం కూడా గురువుకంటే భిన్నం కాదు. అందుకే అమ్మ "నీకు ఇచ్చింది తృప్తిగా అనుభవించటం నీకున్నది ఇతరులకు ఆదరణగా పెట్టడం, అంతా వాడే చేస్తున్నాడని నమ్మడం యిదే నా సందేశం" అని అన్నది. ఆ విశ్వాసంతో ప్రయత్నిస్తే మనకు అమ్మ అనుగ్రహం వల్ల అమృతమయమైన ఆనందస్థితి కల్గుతుంది.

8. వాత్సల్యక్షీరజలధి - అమ్మ

అమ్మ, భూమిపై నడయాడే కాలంలో మనం మనగలగటం అమ్మతో సంభాషించడం, అమ్మచే లాలింపబడటం, పాలింపబడటం మన అదృష్టం. అమ్మ పరిపూర్ణ కటాక్షం వల్లనే, అనేక మధురస్మృతులు కలగటం, ఆ చరణ కమలాల్లోని మకరందాన్ని గ్రోలటం, ఆ కల్పతరుచ్ఛాయలో సేదతీరగలటం మన పూర్వజన్మ సుకృతమే.

అన్నంరాజు రామకృష్ణ అన్నయ్యకు జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గరనుంచి రమ్మని టెలిగ్రామ్ వచ్చింది. ఆమె ఎవరోలే అని అన్నయ్య వెళ్ళలేదు. మళ్ళీ రెండో టెలిగ్రామ్ వస్తే ఎందుకు పంపించిందో ఒకమారు వెళ్ళినందువల్ల నష్టం ఏమిటి? వెళ్ళి రమ్మని అంతా బలవంతం చేసారు. అన్నయ్య జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మ సమక్షంలో కూర్చోగా "నీవు ఏం చేస్తుంటావని" అమ్మ అడిగింది. దానికి అన్నయ్య "నేను భువనేశ్వరీ మంత్రం చేస్తుంటానని" అన్నాడు. ఆ మంత్ర జపం ఎందుకు చేస్తున్నావంటే, 'దేవి దర్శన భాగ్యం' కలగటం కోసం అని అన్నాడు. వెంటనే అమ్మ "భువనేశ్వరిని నేనే" అని అంది. ఆ తరువాత చాలా కాలం అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు.

తృప్తి కలవాడే నిజమైన భాగ్యవంతుడు.

కర్మలో జ్ఞానాన్ని మేళవింపచేసాడు హనుమంతుడు. జ్ఞాన ప్రధానమైన జన్మ కలిగినప్పటికీ భగవంతునితో సంబంధం ఏర్పడనప్పుడు మనజన్మ వ్యర్థం అవుతుంది. దైవంతో సంబంధం లేనిచో అన్నీ వ్యర్థమవుతాయి. ఉత్తముల సాంగత్యం వుంటేనే భగవంతుని దగ్గరకు చేరగల్గుతాయి. సిద్ధపురుషులు అయిన శ్రీశ్రీశ్రీ పూర్ణానందస్వామి, రామకృష్ణ అన్నయ్యకు భువనేశ్వరీ మంత్రాన్ని ఉపదేశించారు. దానినే అన్నయ్య మనసా, వాచా, కర్మణా అనుష్ఠానం చేస్తున్నాడు. అమ్మ 'నేనే భువనేశ్వరిని' అని తన సర్వజ్ఞత్వాన్ని' సర్వశక్తిమతత్వాన్ని, సర్వనియామకత్వాన్ని సర్వవ్యాపకత్వాన్ని అణువణువున ప్రతిబింబింపచేసింది.

మొట్టమొదట స్వామీజీని జిల్లెళ్ళమూడికి అన్నంరాజు రామకృష్ణ అన్నయ్య తీసుకువచ్చాడు. స్వామీజీ అమ్మను 'రాజరాజేశ్వరి అవతారంగా' కొలిచారు. స్వామీజీ జిల్లెళ్ళమూడికి రాకముందు గుంటూరులో 15రోజులు మా నాన్నగారింట్లో అభిషేకాలు, పూజలు ఒక ఉత్సవంలా జరిపారు. నేను వైజాగ్‌లో వున్నందున అప్పుడు వారి దర్శనభాగ్యం నాకు కలుగలేదు. స్వామీజీ భువన్వేరీ మంత్రాన్ని మా అమ్మగారికి, మరిదిగారికి ఉపదేశించడం జరిగింది. రెండవమారు స్వామీజీ వచ్చినపుడు ఎందరో ఆయన దగ్గర మంత్రోపదేశం అవ్వాలని వాంఛించినా వారికి ఆ అవకాశం లభ్యమవలేదు. నాకు ఆయన దర్శన భాగ్యంతో పాటు మంత్రోపదేశ భాగ్యం కలిగింది.

స్వామీజీని చాతుర్మాసవ్రతం జిల్లెళ్ళమూడిలో జరుపుకోమని దానికి కావలసిన వసతులను అమ్మ కలుగచేసింది. ఆయన బ్రహ్మచర్యానికి ఎన్నెన్నో కఠోర పరీక్షలు పెట్టి ఆయనను పరీక్షించి ఆయనకు పరిపూర్ణత్వాన్ని ప్రసాదించింది. ఆయన పేరును సార్థకం చేసింది. అంతమటుకు తాను తీర్థం ఇచ్చే గిన్నె ఆయనకు ఇచ్చింది. స్వామీజీతో "నీ తల్లిని కడ తేర్చటమే

ఇష్టం లేనిది కష్టం. బాధలో ఉన్న ఏకాగ్రత సుఖంలో లేదు.

నీ సన్యాసమని" అంది. "నేను గోచిపాతరాయుడ్ని, మా అమ్మను నేను ఎలా చూడగలనని అంటే, నీ శిష్యులను పంపి ఆమెను తెప్పించమంది. "స్వామీజీ తల్లి వస్తున్నారని ఆమెకు కొన్నివందల శ్లోకాలు వచ్చుని" మా అందరితో అమ్మ చెప్పింది. స్వామీజీ తల్లి శ్యామలాదండకం చదువుతుంటే వినేభాగ్యం నాకు కలిగింది. స్వామీజీ, "అమ్మకు అర్చన చేస్తుంటే సాక్షాత్తు పరమశివుడే దేవికి పూజ చేస్తున్నట్లు" భాసించింది. 'అమ్మ' ఎవరి ఇష్టానుసారం వారిని పూజ చేసుకోనిచ్చేది. అది అమ్మకు కల మాతృత్వానికి ప్రతీక.

అంతర్జాతీయ జంబూరీ హైద్రాబాద్ హిమాయత్‌సాగర్ దగ్గర జరిగింది. జిల్లా గైడు 'సెక్రటరీని అవటం వల్ల దానిలో పాల్గొనటానికి హైద్రాబాద్ వెళ్ళాను. స్వామీజీ అక్కడే వున్నారని తెలిసి, ఆయన దర్శనం చేసుకోవాలని తహతహ చెందాను. నా ఆర్తి, ఆరాటం గమనించి నా సోదరులు రామకృష్ణ అన్నయ్య, సీతాపతి అమీర్‌పేట తీసుకువెళ్ళారు. స్వామీజీ స్నానం చేయనిదే ఎవరికీ దర్శనమివ్వరని అక్కడివారు అన్నారు. ఆయన దర్శనభాగ్యం కలిగించమని అమ్మను మనసారా ప్రార్థించాను. ఆ ఇంటివారితో మాధవరావుగారి అమ్మాయి కుసుమ వచ్చిందని స్వామీజీకి తెలియచేయమన్నాను. నా ఆర్తి కనిపెట్టి ఆమె స్వామీజీతో చెప్పింది. "నిన్న ఫోటోలు పాడైపోతున్నాయని రీటేక్ తీయించామే ఆయన కూతురు ఈ కుసుమ" అని వారితో చెప్పి దర్శనానికి అనుమతినిచ్చారు.

మేము ఆ సంవత్సరం అమ్మ ఫోటోతో గ్రీటింగ్ కార్డు వేయించాము. ఆ గ్రీటింగ్‌కార్డు స్వామీజీకి ఇవ్వగా ఉదయమే అమ్మ నా దగ్గరకు వచ్చిందని ఎంతో సంబరపడ్డారు. మంత్రానుష్ఠానం సరిగా జరగటంలేదని బాధపడ్తూ, బాగా జరిగేలా ఆశీర్వదించవలసినదిగా స్వామీజీని కోరుకున్నాను. నా తల మీద ఆయన చేయివుంచి దీవించారు. ఆ రోజు నా ఆనందానికి అవధులు

భరించలేనిది బాధ, సహించలేనిది హింస.

లేవు. స్వామీజీ హైద్రాబాద్‌లో వుండే సమయంలో నాకు, అక్కడకు వెళ్ళే అవకాశం 'అమ్మే' ఏర్పాటు చేసిందని నా పరిపూర్ణ విశ్వాసం.

స్వామీజీ దీవించిన సంగతి మా ఇంటికి పూజకు వచ్చే కామేశ్వరమ్మ గారితో చెపితే "నీవు ఎంతో అదృష్టవంతురాలివి. గురువు శిష్యుని తలమీద చేయివుంచటాన్ని "హస్తమస్తక సంయోగం అంటారు. అది గొప్ప యోగం" అని చెప్పారు.

అమ్మ భౌతిక దేహానంతరం అమ్మ బిడ్డలందరికీ స్వామీజీయే పెద్దదిక్కుగా వుండి అందరి అవసరాలను కనిపెట్టి సలహా సంప్రదింపులను అందిస్తున్నారు. స్వామీజీ ఆశ్రమంలో 'అమ్మ' పెద్ద ఫోటో భోజనశాలలో పెట్టారు. అమ్మ నామస్మరణ తరువాతే ప్రసాద స్వీకారం జరుగుతున్నది. జిల్లెళ్ళమూడిలోలాగా అక్కడ వచ్చిన వారందరికీ లేదనకుండా ప్రసాదాన్ని అందిస్తున్నారు. అమ్మ తలపెట్టిన కార్యక్రమానికి విఘాతం కలగకుండా చూస్తున్న స్వామీజీకి, వారి శిష్యబృందానికి మనమందరం ఎంతో ఋణపడి వున్నాము. దానిని ఒరవడిగా తీసుకొని కొంతలో కొంత మనం కూడా ఆచరించగలిగిన నాడే అమ్మ బిడ్డలమని చెప్పుకోగలుగుతాము. స్వామీజీ దయ, అనుగ్రహానికి పాత్రులమౌవుతూ శారీరకంగా అమ్మ దూరమైనా, జీవనయాత్రను సాగిద్దాం.

౭. అపురూప ఆనందమయి - అమ్మ

సువాసినులచేత అర్చన చేయించుకోవటం అమ్మకు ఎంతో ప్రీతి. అలాగే సువాసినులు చేసే అర్చనల యందు అమ్మకు ప్రీతి మెండు. అమ్మ దృష్టిలో అంతా సువాసినులే పూర్వసువాసినులని వేరే లేరు. అమ్మ తన డిక్షనరీలో ఆ పదాన్నే తొలగించింది. అనేకులకు అనేక రకాలుగా సూచిస్తూ వ్రతాలు, నోములు ఎన్నెన్నో చేయించింది. అమ్మ సమక్షంలో ఎవరికి దేనియందు ప్రీతి

పెట్టినా విమర్శించేవాడు బిడ్డ, విమర్శించినా పెట్టేది తల్లి.

యెక్కువో అమ్మకు తెలిసినట్లుగా మనకు తెలియనే తెలియదు. వాటి ద్వారా మనకు అపురూపమైన ఆనందాన్ని కలుగచేసేది.

కొంతమందిని హైమాలయ, అనసూయేశ్వరాలయాల్లో అభిషేకాలు, కుంకుమ పూజలకు, మరికొంతమందిని సుప్రభాత సంధ్యావందనాలకు, అఖండనామానికి మరలించేది. వారివారి ఇష్టానుసారం పూజలు చేసుకోవటానికి, ప్రదక్షిణాలు చేసుకోవటానికి వీలు కలిగించేది. మామూలుగా గర్భగుడిలో పూజ చేసుకోవటానికి ఏ ఆలయంలో ఒప్పుకోరు. కాని అక్కడ అట్టి విధి నిషేధాలు లేవు.

కాకుమాను అక్కయ్య చిత్రగుప్తుడినోము చేసుకుందామనుకొని వెడితే పురుడు వచ్చిందని బాధపడ్తుంటే పెద్దవాళ్ళను కాని, బ్రాహ్మణులను కాని కనుక్కోమంది. దానికి ఆ అక్కయ్య "నిన్ను మించిన పెద్దలు కాని, బ్రాహ్మణులు కాని నాకు వేరే లేరు. నీవే ఆ పెద్దవని" అంది. అయితే "వాయనం నీకే ఇచ్చుకుంటానని" అక్కయ్య చెప్పింది "నాకే ఇచ్చుకొనేటట్లయితే ఏ తప్పులేదు మీరు చేసుకోండి. ఫలితాన్ని ఇచ్చేదాన్ని నేనున్నాను కదా" అని అంది.

"నాకు చాలా ఆకలిగా వుంది నీవు ఇంతపెడితే తినాలని వుంది. నందికేశుడినోము చేసుకోమని" అమ్మ అంది. దానికి అక్కయ్య "నాకు సాయంచేసే వాళ్ళు ఎవరూ లేరమ్మా" అంది. "నేను వున్నాను కదే నీకు సాయం చేయటానికి జిల్లెళ్ళమూడిలో చేసుకోమని" చెప్పింది. సర్వానందమయి కదా! అమ్మ, అక్కయ్య మనసులో వున్నకోరిక, ఆమె వెల్లడించకుండానే తెలుసుకొని తానే నడుం కట్టి ఆమె నోములు తన సమక్షంలో చేయించి, ఆమెను ఆనందపరచింది.

నందికేశుడినోము అమ్మ చేసుకోమంది కదా అని, తనకు ముందు

చేస్తున్నా పోట్లాడేది కుమారుడు. పోట్లాడుతన్న చేసేది తల్లి.

నుంచే ఆ నోము చేసుకోవాలని మక్కువ ఎక్కువగా వుండటంతో, పిండికొట్టించాలంటే మడికట్టుకొని కొట్టేవారు దొరకలేదు, రామకృష్ణ అన్నయ్య, మిగిలిన అన్నయ్యలు పిండి దంపి పెట్టారని చెపితే చాలా ఆశ్చర్యమనిపించింది. ఒకరు అప్పికట్ల కరణం మిగిలినవారు ఉద్యోగస్తులే, కాని అక్కడ డాబు దర్పప్రదర్శన కాక అందరూ ఒకే తల్లిబిడ్డలుగా మనగలగడం, అమ్మ ఇచ్చిన వరం. అదే వారింట్లో అక్కకో, చెల్లికో అవసరమయితే చేస్తారో, చేయరో కాని ఆ స్థల మహత్యమేమోకాని, ఎటువంటి భేషజాలు లేకుండా చేస్తారు. "పనికి ఆడపని, మగపని అనే భేదం వుండదని" అమ్మ అంటుంది.

కాకుమాను అక్కయ్య, వాళ్ళ అమ్మాయి చీరాల సుశీల, నందికేశుడి నోము కోసం వుండ్రాళ్ళు చేయిస్తే అందులోకి చింతపండు పచ్చడి చేయించండి బాగుంటుందని చెప్పింది అమ్మ. నివేదన ఇవ్వటానికి వెళ్ళినప్పుడు, నోము చేసుకునే మీ ఇద్దరే వుండండని మిగిలిన వారిని బయటకు పంపించింది. తాను స్నానం చేసి నగలన్నీ తీసి పొడవు చేతుల ఆంగరఖాలవున్నది ఒక్కటే ధరించి విబూది రాసుకొని, చిన్నబొట్టు పెట్టుకొని జుట్టు విరబోసుకుని వెనుక్కు ముందుకూ విరుచుకుంటూ, దర్శనమిచ్చింది. అక్కయ్యకు ముందు భయమనిపించింది. ఆమె, ఆమెకూతురు పూజచేసుకుని నివేదనిస్తే అచ్చంగా నందికేశునిలాగా ఛీత్కారం చేస్తూ, బుసలు కొడ్తూ వూగిపోయింది. వుండ్రాళ్ళలో నెయ్యి వెయ్యలేదని అంటే అక్కయ్య తీసుకువస్తానమ్మా అంది. "మీవూరు నుంచి నీవు తెచ్చావు కదమ్మా వంట ఇంట్లో వాళ్ళే వేయలేదని" అన్నది.

నెయ్యి వెయ్యలేదని గుర్తు చేస్తూనే, మళ్లీ అక్కయ్య బాధపడకుండా సర్ది చెప్పటం చూస్తే అమ్మ యొక్క అనురాగానికి అవధులుండవు కదా అనిపించింది. అమ్మే సర్వస్వం అని, అమ్మ కానిది ఈ ప్రపంచంలో ఏమీలేదని ఆ నందికేశుని

బానిసకు బాధ ఎక్కువ, స్వతంత్రుడికి బాధ్యతఎక్కువ.

చూచే అదృష్టం తనకు సుశీలకు కలిగిందని ఎంతో ఆనందంతో నేను కాకుమాను వెళ్ళినప్పుడు చెప్పింది అక్కయ్య.

నేను జూన్ 12కి జిల్లెళ్లమూడి వెళ్ళినప్పుడు కాకుమాను అక్కయ్య వాళ్ళ వూరు రమ్మని చేతులు పట్టుకు బతిమాలింది. ఇప్పుడు రావటం కుదరదని అన్నాను. నాతో వైజాగ్ నుంచి వచ్చిన అప్పన్న మహాలక్ష్మి గారు "ఆవిడ అంతగా అడుగుతున్నందుకు నేనైతే తప్పకవెళ్ళేదాన్నని" అన్నారు. అప్పుడు సావకాశం లేనందున మళ్లీ వచ్చినపుడు తప్పకుండ వస్తానని ఆవిడకు మాట ఇచ్చాను.

నేను హైమక్క జన్మదిన వేడుకలు ఎప్పుడూ చూడలేదని జిల్లెళ్ళమూడి వెళ్ళాలనుకున్నాను. 20వ తా॥ ఆదివారం విశాఖపట్టణంలో 150 మంది చేత హైమావతీ' వ్రతం మాతృశ్రీ అధ్యయనపరిషత్ వారు ఎంతో వైభవంగా, ఆనందదాయకంగా, సర్వులు మెచ్చేటట్లుగా చేయించారు. దానిలో పాల్గొని ఆ సాయంత్రం బయలుదేరి జిల్లెళ్ళమూడి వెళ్ళాను.

జిల్లెళ్ళమూడిలో హైమావతీవ్రతం మొదటిసారిగా అనసూయేశ్వరాలయంలో నాదెండ్ల లక్ష్మణరావుగారు, భ్రమరాంబక్కయ్యలచేత చేయించాలని అనుకున్నారు. రామకృష్ణ అన్నయ్య స్థానికులే కాక ఎవరైనా వస్తే బాగుండునని అనుకుంటుండగా, వైజాగ్ నుంచి కుసుమ వచ్చిందని చెపితే అమ్మ కరుణాకటాక్షాలకు అంతే లేదనిపించిందని అన్నాడు. మొదటిమాటు అమ్మ సన్నిధిలో హైమవతి వ్రతం జరపటం నా అదృష్టమే.

హైమక్క 52వ జన్మదిన సందర్భంగా 52 రకాల పిండివంటలు చేయాలని నిర్ణయించారు. అందులో ఒక అక్కయ్యకు ఇబ్బంది రావటంతో ఆవిడ చేయాలనుకున్న 5 రకాల పిండివంటలు భ్రమరాంబక్కయ్య ఇంట్లో చేసాను.

శిల్పానికి అందం రావలెనంటే ఉలిదెబ్బలు అవసరం.

తమ ఇంటి నుంచి హైమక్కకు 5రకాలు పంపాలనుకున్నది, నా ద్వారా జరిగిందని అక్కయ్య చాలా ఆనందపడింది. అక్కడ 5 రకాలు తక్కువ కాకుండా, అక్కయ్యకు తన ఇంట్లోనుంచీ నివేదనలు వెళ్ళేటట్లు చేసి, నేనూ అందులో పాలుపంచుకునే ఆనందాన్ని కలుగజేసి అందర్నీ తృప్తిపరచింది. అమ్మ అందరి కోర్కెలు తీర్చే కల్పవల్లి కదా!

ఆ మర్నాడు కాలేజీ అమ్మాయి రాధికను సాయం తీసుకుని 52 రకాల ప్రసాదాలు పట్టుకొని కాకుమాను వెళ్ళాను. ఆ అక్కయ్య హైమక్క జన్మదినమునకు తప్పకుండా వెడ్తుంది. హైమక్క జన్మదినం ఎప్పుడు అని అనుకుంటే వాళ్ళ అబ్బాయి పాత మాతృశ్రీలో హైమవతి జన్మదినం చూచి ఇంకా రెండు రోజులు తరువాత అని చెప్పాడు. హైమవతి జన్మదినం తిధుల ప్రకారం చేస్తారు అందువల్ల వాళ్ళ అబ్బాయి చెప్పిన రోజుకు రెండురోజులముందే జరిగింది. అక్కయ్య వాళ్ళ ఆయనకు సుస్తీగా వుండటం చేత ఎవరినైనా ఆయన దగ్గర వుంచి ఆ రోజుకు వెళ్దామనుకుంది. మేము వెళ్ళేటప్పటికి ఆ భార్యాభర్తలు అమందానంద భరితులయ్యారు.

ఆవిడ ఆదివారం హైమ పుట్టినరోజుకు వెళ్ళాలని పసుపు కుంకుమలు సర్దుకుంది. ఆయన పూర్వంలా జిల్లెళ్ళమూడి రాలేకపోతున్నానని చాలా బాధపడ్తున్నారు. నన్ను చూచి మేము రాలేమని హైమమ్మ మా కోసం ప్రసాదాలు పంపిందని పొంగిపోయారు. వారి అనుభవాల ముందు మనమెంత అని అనిపించింది.

అక్కయ్య దగ్గరకు వెడ్తున్నాను కదా అని చీర, పసుపుకుంకుమ పట్టుకు వెళ్ళాను. అమ్మ నాకు చీర పసుపు కుంకుమ నీ ద్వారా పంపించిందని ఎంతో సంతోషించింది. ఆ చీర కట్టుకొని నా చేత అమ్మ అష్టోత్తరం చదివించుకుని

అవసరమే విలువైనది. ఇష్టం-అయిష్టం తప్ప పాపపుణ్యాలు లేవు.

తాను పూజ చేసుకుంది. ఆ తరువాత వారం లోపలే ఆయన్ని 'అమ్మ' తనలో లీనం చేసుకుంది. నా ద్వారా వారికి ప్రసాదాలు పంపింది. ఆయన రాలేకపోతున్నానన్న తపనను నేను వెళ్ళటం ద్వారా దూరం చేసి ఆ రోజంతా అందరం అమ్మ స్మరణలో వుండేటట్లు చేసింది. ఆయనకు అపురూపమయిన ఆనందాన్ని కలుగచేసి ఆయన్ని తనలో కలుపుకోవటం ద్వారా లయకారిణి తానే అని స్పష్టం చేసింది.

10. సౌజన్య సింధువు - అమ్మ

"ఆచారః ప్రభువో ధర్మః ధర్మస్య ప్రచురచ్యుతః" ఆచారం నుండి ధర్మం పుడుతుందని, అలాంటి ధర్మానికి దైవమే ప్రభువని మహాభారతం వివరిస్తుంది.

ఆంగ్ల చరిత్రకారుడు ఆర్నాల్డ్‌టాయ్‌న్‌బీ "ఒక్కొక్క పొరని వలిచివేస్తే ఉల్లిపాయలో చిట్టచివరకు మిగిలేది శూన్యం. అదేవిధంగా మనకు అనుకూలించలేదని ఒక్కొక్క సాంప్రదాయాన్ని తోసి వేస్తే అసలు సంస్కృతికే నష్టం వాటిల్లుతుందని" అంటాడు.

విశ్వంలోని మాధుర్యాన్ని, లాలిత్యాన్ని, మమతానురాగాలను దర్శించగలిగేటట్లు చేయగలగటం అమ్మ యొక్క కరుణే కారణం. అంతర్మథనంతో అంతర్యామిని దర్శించగలగటం ఆధ్యాత్మికత యొక్క విశిష్టత. అమ్మ మన సంస్కృతికి నీరాజనం పడుతుంది. అమ్మ ఒడిలో మనకు కలిగిన దివ్యానుభూతులను పదిలపరుచుకొని మనకు కలిగే సంకల్ప వికల్పాలను, నిమ్నోన్నతాలలో, సుఖ దుఃఖాలలో చెక్కుచెదరనీయకుండా పదిమందికీ పంచిపెట్టినప్పుడే అమ్మ యొక్క దివ్యత్వం అందరికి అర్థమవుతుంది.

అమ్మ నిత్యసంసేవ్యా, నిత్యారాధ్య అన్ని లోకాలను అన్ని తీర్థాలను

నిప్పు ఎంత గొప్పదైనా కట్టె లేనప్పుడు మండదు.

అమ్మలోనే అవలోకించిన మనకు, "కాలచక్రం ఆగదు నాన్న" అన్నట్లుగా అమ్మ భౌతిక శరీరాన్ని పరిత్యజించింది. సర్వసృష్టిని అమ్మలో దర్శించిన మనం, సర్వసృష్టిలో అమ్మను దర్శించే ప్రయత్నం చేయాలి. పాదమంటేనే పొందించేది అని అర్థం కదా. భగవంతుని పొందటానికి పాదాలే కదా పరమసాధనాలు. అందుకనే భగవంతుని పాదుకలకు అంత వైభవం. పూజ చేసినా, నమస్కరించినా పాదాల ద్వారానే భగవంతుని పొందగల్గుతాము. ఆసేతు హిమాచలం పర్యటించి శంకర భగవత్పాదులు ఆ పాదాలనే శరణుజొచ్చారు.

ఏకా రాజేశ్వరరావు గారి అక్కయ్య అన్నపూర్ణ గారు చిన్నతనంలోనే విధివంచిత అయి భర్తను కోల్పోయారు. చిన్నతనంలోనే పుట్టింటికి చేరిన ఆమెకు తల్లితండ్రుల మరణం గొడ్డలిపెట్టు అయింది. ఆ దుఃఖంలో మనశ్శాంతిని కోల్పోయి అల్లాడుతున్న ఆమెను వారి అన్నయ్య ఏకా పుండరీకాక్షుడుగారి వదినగారు సత్యవతి, అమ్మ దర్శనార్థం జిల్లెళ్ళమూడి తీసుకువెళ్ళారు. అంతా అమ్మను చూచి భోజనానికి వెడ్తుంటే నేను అమ్మతో మాట్లాడిన తరువాత తింటానన్నారు. "నీవు భోజనం చేసి రామ్మా! నీతో మాట్లాడుతానుగా" అని అమ్మ అభయమిచ్చింది. బ్రహ్మాండమంతా నిండిన అమ్మను చూచి కౌగిలించుకుంటే చాలా పెద్దదిగా వుంది. ఇది ఏమిటి అమ్మ ఇంతగా వుందే మనుకుంటుండగానే తగ్గిపోయింది.

"అమ్మను చూచిన తరువాత తనకు తల్లిదండ్రులు లేరన్న బాధ మటుమాయమయింది" అని చెప్పారు. సర్వదేవతలను అమ్మలోనే చూచుకుంటూ జిల్లెళ్ళమూడిలో ఏ ఉత్సవం జరిగినా అందులో పాలు పంచుకునేది.

"కృష్ణాష్టమి చూడాలనివుందమ్మా" అని అన్నపూర్ణ అక్కయ్య అన్నది.

ఎన్నిసార్లు గీతను చదివినా మన గీతను బట్టే జరుగుతుంది.

"దానికేమే ఈమాటు కృష్ణాష్టమికి తప్పకుండా రమ్మని" అమ్మ ఆహ్వానించింది. అనివార్య కారణాలవల్ల ఎంతగా అభిలాషించినా కృష్ణాష్టమికి రాలేకపోయింది. తరువాత అమ్మ దగ్గరకు వెళ్ళినప్పుడు తలుపు తీయగానే "కృష్ణాష్టమికి రాలేదేమే" అని చేతులు చాచి అమ్మ అడిగింది. అక్కయ్యకు 'అమ్మ' కళ్ళల్లో శ్రీక్షష్ణుని విరాట్ స్వరూపం కనిపించింది. బృందావనంలో గోపికల రాసలీల మొత్తం దృశ్యమానమయింది. అంతమటుకు కృష్ణాష్టమికి అమ్మ రమ్మన్నా రాలేకపోయానన్న బాధ తొలగి ఆ స్థానే అపరిమిత ఆనందం నెలకొన్నది. బాహువులు చాచి అక్కయ్యను అమ్మ తన అక్కున చేర్చుకున్నది. ఆనాటి ఆనందం అనుభవేక వేద్యమే కాని వర్ణించనలవి కాదు అని అక్కయ్య చెప్పింది.

అన్నపూర్ణక్కయ్య చెల్లెలు కొడుక్కి అసలు వినిపించటం లేదని డాక్టరు దగ్గరకు వెడితే చెవిలో గూబ దెబ్బతిన్నదని, దానికి ఆపరేషన్ చేయాలన్నారు. ఆపరేషన్ చేయించేలోగా ఒక్కమారు అమ్మ దర్శనం చేయిస్తే అంతా అమ్మే చూచుకుంటుందని పట్టుబట్టి జిల్లెళ్ళమూడికి బయలుదేరారు. 7వ మైలురాయి దగ్గరకు వచ్చేటప్పటికి మేళతాళాలు వినిపిస్తున్నాయని బాబు అన్నాడు. మాకేమీ వినిపించటం లేదంటూ వీళ్ళంతా ఆశ్చర్యపోయారు. కొంతదూరం వచ్చేటప్పటికి వీళ్ళకూ ఆ మేళతాళాలు వినిపించాయి. అక్కడ పెళ్ళో, ఒడుగో జరుగుతుండచ్చుని అనుకున్నారు. ఆవరణలోకి వస్తే ఎటువంటి హడావిడీ లేక నిశ్శబ్దంగా వుంది.

ఆ మాటే అమ్మతో అంటే "ముందుగా వినిపించవలసిన వారికి వినిపించాయి కదా" అని అమ్మ అంటే అంతా తెల్లబోయారు. మర్నాడు డాక్టరు దగ్గరకు వెడితే ఆపరేషన్ అవసరం లేదనటం మహిమ కాక మరేమిటి?

అక్కయ్య రెండోమారు అమ్మ దర్శనంకు వెళ్ళినప్పుడు అమ్మ ఒక బెలూన్

నిర్ణయానికి నిర్ణయించిన వాడుకూడ బద్ధుడే.

తెప్పించి పూదమంది. బాగా పెద్దదిగా పూదించి దారం కట్టించి, అక్కడ వున్న అందర్నీ పగల గొట్టమంది ఎవ్వరూ పగలగొట్టలేకపోయారు. దాని 'అమ్మే' తీసుకుని పగలగొట్టింది. అమ్మ ఎందుకు ఇలా చేసిందో అని వీరంతా పరిపరివిధాల ఆలోచించినా ఆ చర్యకు సమాధానమేమి వీరికి దొరకలేదు.

వీరు తిరుగు ప్రయాణంలో కాలవ ప్రక్కగా కార్లో వెడ్తుంటే, కారు కాలవ ప్రక్కకు ఒరిగింది. ఎలాగో అందులోంచి బయటపడి చూస్తే ఒక మట్టిబెడ్డ కారుని కాలువలోకి దొర్లకుండా ఆపింది. పొలాల్లో వుండే రైతులు పరుగు పరుగున వచ్చి కారును సరిగాతీసారు. ముందుగా ప్రమాదాన్ని సూచించి, ఆ ప్రమాదాన్ని తాను తుడిచిపెట్టి వారిని కాచి రక్షించిందని అమితానందభరితులయ్యారు.

11. మమతాపూర్ణ మహిత - అమ్మ

కించిజ్ఞాత్వాది గుణాలను పోగొట్టుకోవటానికి, మనలోని బలహీనతలను తుడిచి పెట్టడానికి తగిన సాధన తెలిసిన గురువు కావాలి. ఈ గుణాలను పోగొట్టుకోవాలన్న జిజ్ఞాస కలిగితే గురువే వెతుక్కుంటూ వస్తాడు, లేదా మనల్ని తన దగ్గరకు రప్పించుకుంటాడు. ఆ గురువు మనలను ఎప్పుడూ కనిపెట్టే వుంటాడు. శ్రీమాత అయిన అమ్మే మన గురువు, దైవం. తన బిడ్డల క్షేమం గురించి తల్లి కంటే విచారించే వారెవరుంటారు. ఆమె సదా మనచుట్టూ ఆవరించే వున్నది. పక్షి రెక్కలతో గుడ్లను పొదిగి రక్షించినట్లు అమ్మ మనలను రక్షిస్తోంది. మనం హృదయపూర్వకంగా నమ్మాలి.

మేము అవస్థలు పడ్తున్నప్పుడు అమ్మ అనేక విధాలుగా తన సహాయ సహకారాలను, మనోధైర్యాన్ని అందించింది. విశాఖపట్టణం నుంచీ ఎవరు వెళ్ళినా అమ్మ మా గురించి, మా వ్యాపారం గురించి అడుగుతుండేది. దానిలో

ప్రజ్ఞానం బ్రహ్మైతే అజ్ఞానం ఎందుకు కాదు?.

అందరికీ మేము అమ్మకు చాలా కావల్సినవారమని అనుకునేవారు. మామూలు మానవులు మన సంపాదన, ఆస్తిపాస్తులను బట్టే గౌరవిస్తారు. కాని అమ్మ మనలోని ఆర్తి, ఆవేదనలకే కరిగిపోయి, పదిమందిలో మమ్మల్ని ఎంతో ఉన్నతంగా వుంచటం చూస్తే అమ్మ యొక్క మాతృత్వానికి అవధులు లేవనిపిస్తుంది.

మానవమాత్రులం కదా! చికాకులతో మన స్థైర్యాన్ని కోల్పోయి, ఆ కోపం ఎవరిమీద చూపించుకోవాలో తెలియక అమ్మనే పరివిధాలుగా ఆడిపోసుకునేదాన్ని ఒకమారు పరిస్థితులకు తట్టుకోలేక అమ్మ ఫోటోను పిడికిలి బిగించి గుద్దులు గుద్దాను. కాని అద్దం కూడ పగలలేదు. కొంచెం వత్తిడి తగులుతేనే విరిగిపోయే అద్దం అంత గట్టిగా కొట్టినా అద్దం పగులలేదంటే అమ్మ కరుణాకటాక్షాలే కారణం. తరువాత కొంతసేపటికి నేను స్పృహలోకి వచ్చి ఏమిటి నేను చేసిన పని, ఇన్ని విధాల కాచి రక్షిస్తున్న అమ్మనే కొట్టానని విపరీతంగా బాధపడ్డాను. ఆ తరువాత జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు నన్ను చూడగానే అమ్మ గుండె పట్టుకొని కూర్చుంటే నా తప్పు గుర్తుకు వచ్చి ఎంతగానో విలపించాను.

మా ఆయన పరిస్థితులకు తట్టుకోలేక "నీవేదో కాచి రక్షిస్తావని నిన్ను నమ్ముకుంటే నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నావా" అని అమ్మ ఫోటోల్ని అనేకమార్లు తీసేసారు. తీరా తీసిన మర్నాడే శ్రీ పన్నాల రాధాకృష్ణశర్మగారు, రామకృష్ణ అన్నయ్య భ్రమరాంబక్కయ్య మరొకమారు మా అమ్మగారు రావటంతో ఏమీ జరగనట్లే మళ్ళీ యధావిధిగా సర్దేసేవారు.

ఆ రోజుల్లో చికాకులకు తట్టుకోలేక పరిస్థితుల్లో మార్పు తీసుకురాకపోతే నేను వంట చేయను. ఈరోజు అందరం పస్తే వుంటామని భీష్మించుకు

అన్నం బ్రహ్మైతే అశుద్ధమో?.

కూర్చున్నాను. అమ్మ ఎవ్వరూ భోజనం చేయకపోయినా సహించలేదు కదా! ఈ లోగా భ్రమరాంబక్కయ్య "కుసుమా! అన్నయ్య ఊరు వెడితే ఒక్క దానివి ఏం చేసుకుంటావు మీ ఇంటికి వచ్చేయమన్నావు కదా" అని వచ్చానంది. అప్పుడు మధ్యాహ్నం 12 గం॥లు దాటింది. ఇంతమటుకు ఇల్లు సర్దుకుంటున్నానని చెప్పి వెంటనే వంటచేసి తనతో పాటు మేమందరం భోజనం చేసాము. అమ్మ లీలలు అనంతం, నూతిలో నీరు ఊరినట్లుగా అమ్మ లీలలను ఇంకా ఇంకా జ్ఞాపకం చేస్తూ నాకు రాయగలిగిన శక్తిని ఇస్తున్న అమ్మకు ఎల్లప్పుడూ ఋణపడి వుంటాను.

"చరమే జన్మని శ్రీవిద్యోపాసకో భవేత్" అని లలితా సహస్రనామ ఫలశృతి సూచిస్తోంది. అందుకే అమ్మ మనందరికీ ముక్తిని ప్రసాదించటానికీ మన చేత కోటి లలితానామపారాయణ చేయించింది. ఇప్పటికీ అనేక వేల గృహాల్లో అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తూనే వుంది.

అమ్మ దగ్గరకు వెళ్ళినప్పుడు "అమ్మా! లలితా సహస్రనామము నోటికి రావాలని ఖాళీ వున్నప్పుడల్లా ధారణ చేసానమ్మా. బయట చేరినప్పుడు కూడా నా ప్రమేయం లేకుండానే వచ్చేస్తోంది" అని అన్నాను. "నన్ను మర్చిపోగలిగితే చేయటం మానివేయమంది." మా కుటుంబాన్ని నిలబెట్టి మాకు క్రొత్త జీవితాన్ని ప్రసాదించిన దానిని నిన్ను ఎలా మరువగలనమ్మా" అంటే "దాన్ని అలాగే సాగనీ" అంది.

నిర్మలమైన ప్రేమ భావనతో భగవంతుని సేవించడమే భక్తి. "సాత్వస్మిన్ పరమ ప్రేమ రూప" అని నారదుడు తన భక్తి సూత్రాలలో భక్తిని నిర్వచించాడు. ఈ భక్తి ముఖ్యమని, గౌణమని రెండు విధాలు. నిరంతరం అనురాగముతో అమ్మను ఆరాధించుట ముఖ్య భక్తి. కోరికలతో ఉపాసించడం గౌణభక్తి.

కోడలిని, కూతురిని ఒకేవిధంగా చూడడమే అద్వైతం.

ఆర్తితో గజేంద్రునివలె, జిజ్ఞాసతో ఉద్ధవునివలె, ప్రయోజనాపేక్షతో ధృవునివలె, సర్వమన్నతని దివ్యకళామయమని ప్రహ్లాదునివలె జ్ఞానముతో ఏవిధంగా సేవించినా భక్తి ఫలప్రధమవుతుంది. మానవుడు సాధనవల్ల అంతర్ముఖుడై అమృతత్వాన్ని సంపాదించగలడు. వేలమందిలో ఒకడు సాధన చేయగలడు. సాధన చేసే వారిలో వేలమందిలో ఒకడు సిద్ధిపొందగలడని గీతాశాస్త్రము వివరించింది. ముక్తికి, మోక్షానికి భక్తి ఒక మార్గం.

18-2-1984 వైజాగ్ వాళ్ళందరం అమ్మ చేత బొట్టు పెట్టించుకుని వెళ్ళివస్తామని చెప్పటానికి వెళ్ళినప్పుడు ఉమాదేవిగారు తాను కొన్న ఫోటోలపై సంతకం చేయించమని రామకృష్ణ అన్నయ్యకు ఇస్తే, అన్నయ్య అమ్మ చేతికి ఇస్తూ "అమ్మా! ప్రాణ ప్రతిష్ఠ చేయమ్మా" అని అన్నాడు. వెంటనే అమ్మ 'ఇప్పుడు వీటికి ప్రాణము లేకపోతే కదా!" అని అంది. అప్పుడు అన్నయ్య అయితే "వీటికి ప్రాణం వున్నట్లేనా అని తిరిగి రెట్టించాడు." "ఉన్నాయా ఏమిటి? ఉంది అని" నిర్ధారణ చేసింది. అమ్మ ఫోటోను గుద్దిన సంఘటన గుర్తుకు వచ్చి గుండెలవిసేలా ఏడ్చాను.

ఒకమారు అమ్మ దగ్గర కూర్చుని వుండగా "అమ్మా! నీ దగ్గరకు అనేకమంది వస్తారుకదమ్మా వాళ్ళు ఏ వర్గానికి చెందుతారు" అని అడిగాను. "మామిడి పూత చాలా పూస్తుంది. అందులో మూడు వంతులు రాలిపోతుంది. కొంత పిందెగా రాలిపోతుంది. తర్వాత పక్షులు కొట్టడం, రాళ్ళ దెబ్బలతో కొన్ని పోతాయి. మూడు దశలు దాటి పూర్తిగా చెట్టునే పండే పళ్ళు చాలా తక్కువ. అలాగే ఇక్కడకు వచ్చే వాళ్ళల్లో ఒక మాటు చూసేవారు, ఒకటికి రెండు మార్లు వచ్చేవారు, కొంత కాలం వచ్చి ఆగిపోయేవారు, పూర్తిగా ఆత్మార్పణ గావించుకొనేవారు తక్కువగా వుంటారు" అని అంది.

విచక్షణలేని వీక్షణ అనుగ్రహం.

అమ్మ యొక్క మమతానురాగాలు తలచుకున్న కొద్దీ ఆనందాతిశయం కలుగుతుంది. 'అమ్మ ఒడి మమతల గర్భగుడి' అని నదీరా అన్నట్లుగా అమ్మ యొక్క మమత, పూర్ణతను పొంది తనదైన గొప్పదనముతో విరాజిల్లుతుంది.

12. అమృతమూర్తి - అమ్మ

"భగవంతుడు ప్రేమస్వరూపీ ఆయన అనుగ్రహం ఉంటేనే గాని మనకు ప్రేమ, జ్ఞానము లభించవని శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరస్వామివారి వాక్కు. మహాపురుషుల అనుగ్రహం వుంటే సాధించలేనిది అంటూ వుండదు. అమ్మ అనుగ్రహం వలన పునీతుడైన, ఇమామ్ అనే మహమ్మదీయుని ఉదంతమే ఈ క్రింద ఉదహరించబడినది.

"దృశాద్రాఘీయస్యాదరదలిత నీలోత్పలరుచా
దవీయాంసందీనం స్వపయకృపయామామపిశివే।"

"ఓ అమ్మా! పార్వతీ మిగుల నిడుదయై ఇంచుక విరిసిన నల్ల కలువ జిగి కలదైన నీ కడగంటి చూపు చేత, కనికరముచే దూరముగా నున్న దరిద్రుడనై, సామన్యుడనైన నన్ను నీ కృపచేత దడిపినంతనే కృతార్థుడనగుచున్నానని" శ్రీ శంకరాచార్యులవారు దేవిని స్తుతించారు.

జిల్లెళ్ళమూడి అమ్మ యొక్క కరుణాదృష్టి పడినంతనే దరిద్రులు భాగ్యవంతులు అవుతున్నారు. అలాగే కష్టాలకొలిమిలో ఉన్న జనులు అవాంతరాల నుండీ బయటపడుతున్నారు. కుల, మత విభేదాలు లేకుండా ఆవిడ దృష్టి అనెడి కరుణా వృష్టి కురిసినంతనే నాలాంటి వారు కూడా అమ్మ అనుభూతులను రాయగలగటం, అలాగే ఇమామ్ అనే మహమ్మదీయుడు అమ్మ సంకీర్తన "జయహోమాతా శ్రీ అనసూయా, రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి"

చేతలు చేతుల్లో లేవు.

నామాన్ని రూపొందించాడు. అదే నామం హైమాలయ ప్రాంగణంలో 1968 ఏప్రియల్ 5వ తేదీ నుంచి అమ్మ ఆదేశానుసారం అఖండంగా సంకీర్తన చేయబడుతోంది. ఆ నామం అంటే హైమక్కకు చాలా అనురక్తి.

రేటూరు వాస్తవ్యుడైన ఇమామ్ అనే మహమ్మదీయ బాలుడ్ని కుమారస్వామిగారి భార్య తాను పూజచేసుకుంటున్న బాలకృష్ణుడే అని దగ్గరకు తీసుకుని 'శ్యామ్' అని నామకరణం చేసి పెంచుకున్నారు. కుమారస్వామిగారు గుంటూరులో పేరున్న వ్యాపారవేత్త. ఆ కుటుంబమంతా రామభజన చేసేవారు.

ఇమామ్ జన్మస్థలమైన రేటూరు జిల్లెళ్ళమూడికి మూడు మైళ్ళు మాత్రమే. అతని తాలూకు వాళ్ళు జిల్లెళ్ళమూడి వస్తుండేవారు. అమ్మ దర్శనం చేసుకోవాలన్న తపనతో శ్యామ్, కుమారస్వామి దంపతులను ఒప్పించి జిల్లెళ్ళమూడికి తీసుకువచ్చాడు. ఆ దంపతులు అమ్మ దర్శనం చేసుకున్న వెంటనే అమ్మ యందు అమితమైన భక్తిశ్రద్ధలు ఏర్పడ్డాయి. "అమ్మా! మా ఇంట్లో ఏకాహం జరపాలని వుంది. దానికి నీవు తప్పక రావాలమ్మా" అని ప్రార్థించారు. "ఏకాహంలో ఏనామం చేయమంటారమ్మా!" అంటే అమ్మ నవ్వి వూరుకుంది. అమ్మ పూర్వం "జయజయరామ్ జానకిరామ్, జానకి వల్లభసీతారామ్" అని నామం చెప్పేది.

ఇమామ్ అకలంక రామభక్తుడు వాళ్ళ ఇంట్లో అందరూ రామనామాన్ని జపించేవారు. అతను బహిర్ భూమికి వెళ్ళినప్పుడు, అతనికి జయహో మాతా శ్రీ అనుసూయ, రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి అని వినిపించింది. దానినే అమ్మ 'మహామంత్రం' అన్నది. అది దైవప్రేరణ అని అతని విశ్వాసం. మొట్టమొదటి సారిగా అమ్మ నామంతో వారు ఏకాహం చేసారు. వాళ్ళు ఏకాహం జరుపుతుండగా ఒక వెలుగు వచ్చి గది అంతా తిరిగి వెళ్ళింది. తమ కోరిక

సర్వమూ సామాన్యమైనదే సర్వసామాన్యం.

మన్నించి వారింటికి వెలుగు రూపంలో అమ్మే వచ్చిందని వారి పరిపూర్ణ విశ్వాసం. ఆనాటి నుంచీ ఆ నామం అఖండమై, అజేయమై, మహామంత్రమై వెలుగొందుతోంది. ఎందరెందరినో ఆర్తి, ఆవేదనలకు దూరం చేసి మనశ్శాంతిని ప్రసాదిస్తోంది.

అమ్మ నామాన్ని లోకానికి అందించిన మహనీయుడు ధన్యజీవి, శ్యామ్. అమ్మ కరుణాకటాక్షాలను మిక్కుటంగా గ్రోలినవాడు. జీవిత చరమదశలో అమ్మ ఆయన్ని జిల్లెళ్ళమూడికి రప్పించింది. ఆయన హైమాలయ ప్రాంగణంలో తులసీ రామాయణం, పురాణ కాలక్షేపం చేయడం గమనించవలసిన విషయం. అంత మటుకు స్పర్థలతో వేగిపోతున్న పూరిజనంలో కొంతమంది మన మహమ్మదీయుడే పురాణం చెపుతూన్నాడని, వారంతా ప్రతిరోజూ పురాణశ్రవణానికి రావటం అమ్మ యొక్క అనురాగానికి ప్రతీక. అమ్మ తదనంతరం అందరినీ ఒకే తాటిమీద నడిపేందుకు చేసే అద్భుత సంఘటనే ఇది అనిపించింది. హైమాలయాన్ని ఆనుకొనే మహమ్మద్దీయుల మసీదు ఉండటం. ఎటువంటి గొడవలు లేక పోవటం గమనార్హం.

అమ్మ దర్శనమిచ్చేటప్పుడు అందరినీ పరికించేది. ఎంతో దూరంగా వున్నవారి మీద కూడ అమ్మ దృష్టిని ప్రసరింపచేసేది. ప్రతి ఒక్కరికీ అమ్మ తమనే చూస్తోందన్న భావన కలిగేది. అమ్మ యొక్క క్రీగంటి చూపును అమ్మతో పరిచయమున్న ఏ ఒక్కరూ మరిచిపోలేనిది. ఆవిడ దృష్టిలో మనం పడగలగటమే అదృష్టము.

ఒక అక్కయ్య అమ్మతో "బహిర్ భూమికి వెళ్ళినపుడు మంత్రం గుర్తుకు వస్తోందమ్మా" అని అన్నది. దానికి అమ్మ "మలం బయటకుపోతే మంత్రం వచ్చింది. తప్పులేదమ్మా! సర్వకాల సర్వావస్థల యందు గుర్తుండటమే

తానెప్పుడూ తనశక్తిని ఉపయోగించడమే ఆరాధన.

మంత్రసిద్ధి. దానిని మర్చిపోకుండా వుండటానికే అక్షరలక్షలు చేయమంటారు" అని అంది.

అమ్మ మత ప్రభోదం కొరకో, మత ప్రచారం కొరకో రాలేదు. మానవత్వాన్ని పెంపొందించటానికి, మానవత్వవిలువల్ని తెలియజేయటానికి, వాటిని పరిరక్షించటానికి అవతరించిన అమృతమూర్తి 'అమ్మ'.

13. మంగళప్రదాయిని - అమ్మ

"ఏ మానవ వ్యక్తిని గాని ప్రేమిస్తే నువ్వు అందుకు కష్టపడవలసి వుంటుంది. భగవంతుని మాత్రమే ప్రేమించేవారు నిజానికి ధన్యులు. భగవంతుని ప్రేమించటంలో ఎలాంటి కష్టం వాటిల్లదు. అది దివ్యప్రేమ "అని శారదామాయి ఉద్బోధ. అట్టి దివ్యప్రేమ అలవడిన నాడు మన జీవితాలు మంగళప్రదమై వెలుగొందుతాయి.

కేశవశర్మగారి భార్య, శారద అక్కయ్య మంగళ సూత్రం పడిపోయింది. అంతా వెతికితే ఒక్క ముక్క మాత్రమే దొరికింది. మిగిలిన ముక్కలు దొరకలేదని దిగులుపడ్తుంటే చాలా రోజుల తర్వాత స్నానాల గదిలో గోడమీద సబ్బు నురగకు అంటుకొని మంగళ సూత్రంలోని ఒక్క ముక్క కనిపించింది. కుంకుమ నిండుకుందని బజారు నుంచి కుంకుమ తెప్పిస్తే అందులో ఒక ముక్క దొరికింది. ఇంట్లో వున్న ముక్కలతో కలిపి చూస్తే తాళిబొట్టు ఒకటి అయిందట. ఇంట్లో పడిపోయిన ముక్క బజారులో కొన్నకుంకుమలోకి రావటం అనూహ్యం ఆవిడ బాధను తీసివేయటానికి అమ్మే అలా చేసిందనిపించింది.

గాయత్రీయాగంకు అందరం కలిసి వెడ్తుంటే శారద అక్కయ్య ఈ విషయాన్ని చెప్పింది. అది విన్న సరళ అక్కయ్య అమ్మ "మీకు ఎన్నెన్నో

విశ్వరూపదర్శనమంటే ఈ కనబడేదానిని భగవంతునిగా చూడటమే.

అనుభవాలు ఇచ్చింది. మాకేమీలేవని" అనుకుంది. తెల్లవారుఝామున 3 గం॥కు బాపట్ల చేరుకున్నాము. వెయిటింగ్ రూమ్‌లో పడుకున్నాము. సరళక్కయ్య స్నానం చేస్తుండగా మంగళ సూత్రాలు పెరిగిపోయి ఒక తాళిబొట్టు మాత్రమే వుంది. బయటకు వచ్చాక ఒక్క అంగుళం కూడా వదలకుండా అందరం వెదికాము. వేరే తాడు పేనుకోని ఆ ఒక్క తాళిబొట్టునే సూత్రంలో వేసుకున్నారు. ఆవిడ దిగులు వర్ణనాతీతం. ఏమి జరుగనున్నదో అని పరిపరి విధాల మనస్సు చికాకు చెందుతున్నది. ఎవరం మాత్రం ఏం ధైర్యం చెప్పగలము. అమ్మ దర్శనానికని అందరం ఎంతో సరదాగా వస్తుంటే ఇలా జరిగిందేమని బాధపడ్డాము.

జిల్లెళ్ళమూడిలో అమ్మదరి చేరి వెక్కి వెక్కి ఏడుస్తూ జరిగిన సంగతి అమ్మకు నివేదించింది. అమ్మ ఏమీ మాట్లాడలేదు. తాను అంతగా విలవిలలాడుతున్నా అమ్మ మౌనానికి అక్కయ్య చాలా బాధనొందింది. అమ్మ దృష్టిలో మాటలతో పనిలేదు, చేతలేకాని, అమ్మ సమక్షంలో చెప్పుకోగలగటమే మన సమస్యలకు పరిష్కారమన్నది ఎన్నెన్నో విషయాల ద్వారా ఋజువైంది.

అక్కడే వున్న రామకృష్ణ అన్నయ్య, సరళగారికి ధైర్యం చెప్పటం కోసం, కొంత ఉపశమనం కల్పించటం కోసం, "ఫరవాలేదమ్మా! అసలు రెండు మంగళసూత్రాలు ఆడవాళ్ళు అలంకారం కోసం వేసుకొంటారు. ఒక్కటి ధరించినా మంగళసూత్రమే" అన్నాడు. వెంటనే సరళగారు "తాళిబొట్లు రెండు భర్త పాదాలని కదా! అమ్మ అంటుందని" అన్నారు. ఎక్కడో దూరాన ఉన్న భర్త గురించి ఒక అక్కయ్య బాధపడ్తుంటే అమ్మ "వెళ్ళారంటే ఎక్కడకు వెళ్ళాడు. పాదాలు రెండు నీ హృదయం మీదే కుదువబెట్టి వెళ్ళాడని" ఆ అమ్మాయి మంగళ సూత్రాన్ని చూపించింది. ఇన్ని మాటలు, ఇంత చర్చ జరుగుతున్నా

నా సంకల్పంతోనే జన్మయెత్తి నాలోనే లీనం అవుతున్నారు.

తనకేమి సంబంధం లేనట్లే విని, నవ్వి వూరుకుంది. అదే సంగతి రాధ అన్నయ్యతో చెపితే ఆ మాట నిజమే ఒక్క మంగళసూత్రమే చాలు అని అన్నాడు. ఎవరు ఎంతగా చెప్పినా అక్కయ్య మనస్సు కుదుటపడకపోగా అమ్మ ఒక్క మాట కూడ మాట్లాడలేదని మరీ మరీ బాధపడింది.

అరగంట తర్వాత గాయత్రీయాగం కొరకు దీక్షా వస్త్రాలు ఇచ్చింది. ఆ బట్టలు కట్టుకొని గాయత్రీ హోమంలో పాల్గొనటానికి శ్రీమాతకు వెళ్ళాము. సరళ అక్కయ్య జాకెట్టు మార్చుకుంటుండగా టఫీమని మంగళసూత్రం బిళ్ళపడింది. జాకెట్టు క్రింద ఆ బిళ్ళ అచ్చు కూడా వుంది. ఆ రోజు ఉదయం రైల్వే రిటైరింగ్ రూమ్‌లో జాకెట్టు మార్చుకోవటానికి ముందుగానే బాపట్లలో పోయిన సూత్రం బిళ్ళ జిల్లెళ్ళమూడిలో దొరకటం అనూహ్యం. అంతా అమ్మ యొక్క అవ్యాజానురాగానికి చకితులయ్యాము. తనకు ఏమి అనుభవాలు ఇవ్వలేదనుకున్నందుకు ఆవిడ కోరికను ఈ రకంగా తీర్చిందనిపించింది.

మా అమ్మాయిని నాసిక్ తీసుకువెడ్తున్నాను. రాత్రి రైల్లో పడుకున్నాక తెల్లవారి లేచేటప్పటికి ఎదురు బర్త్ మీద వున్న ఆవిడ కిందకి చూస్తుంటే ఏమైవుంటాదా అని చూచాను. పై బర్త్ మీద మా అమ్మాయి అనూ నిద్రపోతుంది, క్రింద తన మంగళసూత్రాల గొలుసు రెండు తులాలది, సూత్రాలు క్రిందపడివున్నాయి. మా అమ్మాయిని లేపి చూస్తే తన మెడ బోసిగా వుంది. ఆ సమయానికి నాకు మెలకువ వచ్చేటట్లు చేసి ఆ గొలుసుపోకుండా అమ్మే కాపాడిందని మా విశ్వాసం.

గాయత్రీ యాగంకు ఋత్విక్కులకు ఒక యాగ గుండం, అమ్మ దగ్గర దీక్షతీసుకున్నవారికి ఒక గుండం ఏర్పాటు చేసారు. అమ్మ పై నుంచీ ఆ యాగాన్ని చూస్తూ "నా పిల్లలకున్న కళ వారికి లేదంది".

ఇది ఏమిటి? పంచాక్షరి. అసలు ఇదేమిటి అష్టాక్షరి.

అన్నంరాజు చంద్రమోహన్ విశాఖపట్టణంలో ఆడిటర్ ఆయన భార్య వరలక్ష్మి ఆ దంపతులకు అమ్మ యందు అచంచలమైన భక్తి విశ్వాసాలు కలవు. వాళ్ళు ఇబ్బందుల్లో వున్నప్పుడు ఎవరో మోహన్ అన్నయ్య దగ్గరకు వచ్చి టి.యస్.ఆర్ కాంప్లెక్స్‌లో షాపు పెడుతున్నామని దాని గురించి పార్టనర్‌షిప్ డి.డి రాసి పెట్టమన్నారు. షాపు పేరు చెప్పి వెయ్యి రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి మిగిలిన సొమ్ము తర్వాత ఇస్తామని చెప్పారు. ఆ వచ్చిన వాళ్ళు ఎన్నాళ్ళైనా తిరిగి రాలేదు. ఆ కాంప్లెక్స్‌కు వెళ్ళి షాపు గురించి వాకబు చేసారు. ఆ పేరుతో ఏ షాపూ లేదని తెలిసింది. తన బిడ్డలు ఆపదలో వుంటే సహించలేని అమ్మ ఆ రూపంగా వారిని ఆదుకుంది.

ప్రతి సంవత్సరం మాతృశ్రీ అధ్యయన పరిషత్ అఖండ లలితా సహస్రనామ పారాయణకు తప్పకుండా వచ్చేవారు. ఒకమారు దుర్గాష్టమి శాంతి ఆశ్రమంలో జరుగుతున్నది. వారికి రావటానికి కుదరక ఇంట్లోనే పారాయణ చేసుకున్నారు. అక్కడికి పూజకు వెళ్ళలేకపోయానన్న ఆర్తి, తపన ఎక్కువయ్యాయి. వాళ్ళు పారాయణ చేస్తుంటే కొంత సేపటికి 'అమ్మ' ఫోటో గులాబీ రంగులో కనిపించింది. రోజూ చూచే ఫోటోయే కదా! ఈ రోజు ఈ రంగులో కనిపిస్తోందని ఆశ్చర్యపడ్డారు. పారాయణకు తాము రాలేదన్న తపనను, ఆర్తిని దూరం చేయటానికే అమ్మ అలా కనిపించిందని వారి విశ్వాసం. ప్రతి నిమిషం తమ వెన్నంటి కాచి రక్షిస్తోందని, అమితానందంతో వరలక్ష్మి చెప్పింది.

అమ్మ అందరికీ శుభం జరగాలని అందరూ కష్టం లేకుండా మంగళప్రదంగా వారి జీవితాలు గడిచిపోవాలని ఆకాంక్షించేది. అందుకే 'అమ్మ'ను మంగళప్రదాయిని అంటాము.

చిన్నకాయ భక్తి, పెరిగినప్పుడు యోగం, పండినప్పుడు జ్ఞానం.

14. మహాప్రవక్త - అమ్మ

లోక సముద్ధరణ కొరకు, సమాజ శ్రేయస్సు కొరకు, వ్యక్తి వికాసం కొరకు, తమ జీవితాలనే అంకితం చేసిన మహానుభావులు, మహనీయులే ప్రవక్తలు. తమ వాక్కుతో, దృష్టితో, స్పర్శతో సంకల్పంతో అవతలి వారి అంతరంగాన్ని, వ్యష్టిగా సమిష్టిగా స్పృశించి స్పందింప చేయగలిగిన సర్వజ్ఞులు, సమర్థులు అయిన ప్రతిభావంతులే ప్రవక్తలు.

"మనం చేసే ప్రతిపని భగవత్సేవే అని అనుకోగలిగితే సంసారం ఆధ్యాత్మిక సాధనకు ప్రతిబంధకం కానేరదు" అని అమ్మ ప్రవచించింది. ఆదికాలం నుంచీ అనసూయ-అత్రి మహాముని, అరుంధతీ-వశిష్టులు, లోపాముద్ర-అగస్త్యులు మొదలగు మహాపురుషులంతా గృహస్త్రాశ్రమంలో వుండి తరించిన వారే కదా! అంతదాకా ఎందుకు మనకు ప్రత్యక్షసాక్షి అమ్మ వుందిగా! తాను గృహస్థాశ్రమంలో వుంటూ మనకు మార్గదర్శిని అయింది. అభయమున్నది ఒక్క వైరాగ్యంలో అంటే "సర్వత్రా అనురాగమే విరాగము" అని అన్నది. అపరిశుద్ధమైన మనస్సుకు, అపరిశుద్ధమైన వాక్కుకు శ్రీమాత గోచరం కాదు. మనోవాక్కాయ కర్మలు నిర్మలమై వెలుగొందితే సాధకుని హృదయం శ్రీ మాతకు నిలయం, దేవాలయం అవుతుంది. పూర్వం భగవంతుడు దుష్టశిక్షణ కొరకు అవతరిస్తే, మన అమ్మ దుష్టులను కూడ సంస్కరించి తన మార్గంలోకి తిప్పుకుందుకు అవతరించింది. అమ్మ అరుణారుణ చరణకమలాలను ధ్యానిస్తూ 'అమ్మ' మనోగత భావాలకు అనుగుణంగా సంచరిస్తూ 'అమ్మ' బాటలో పయనించాలి. అమ్మను పూజించటానికి అమ్మ శరీరం మనకు ఆధారమయినట్లే ప్రస్తుతం 'అమ్మ సంస్థే' అమ్మకు ప్రతినిధి. మన పూజకు ప్రతీక. అమ్మ ప్రవచనాలే మనకు భూమికలు. అందుకే "నీ మనస్సుకు తోచినట్లు చేయి, తోపింపచేసేది వాడేగా" అని అమ్మ అంటుంది.

సర్వత్రా సమమైన మమకారం వుంటే వికారానికి తావులేదు.

అమ్మ మనలను మానవతా పరిధి నుండి అతిలోక సీమలకు తీసుకువెళ్తుంది. అమ్మ దృష్టిలో పడిన వారెవ్వరూ దేనికీ చింతించవలసిన పని వుండదు. 'అమ్మ' స్టేజి మీద వున్నప్పుడు కొన్ని వేల మంది కూర్చుని వున్నా ఎవరికి వారికే అమ్మ మనల్నే చూస్తోందనిపించేది. అంతమంది ప్రేక్షకులున్నా ఒక్కొక్కరి మీద ఏదో విద్యుత్ కాంతి ప్రసారమై మెరుపు మెరిసినట్లుండేది. అమ్మ వీక్షణం శీతలోదకం వలె ప్రసన్నాతి ప్రసన్నంగా జాబిల్లి నుంచి వచ్చిన పండువెన్నెలలా, బిడ్డల హృదయాలను తాకేది. ఆ చూపులకు ఎవరికి వారమే పరవశులమైపోయేవారం. "నా దృష్టిలో అంతా చైతన్యమే, జడమేమీలేదు" అని అమ్మ అంటుంది.

కంచి పరమాచార్యులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వాములవారు "మీరందరూ నా వద్దకు అనేక కానుకలు తీసుకొనివస్తున్నారు. ఫలపుష్పాదులు తెస్తున్నారు. ధనమిస్తున్నారు. వీటిని వేటిని నేను కోరటం లేదు. దినానికి రెండు నిమిషాలు మాత్రం నాకివ్వండి. ఆ రెండు నిమిషాలు నిశ్చలమైన భక్తితో పరమేశ్వరుని ధ్యానించండి. అదే నాకు అత్యంత ప్రీతికరమైన కానుక" అని తన దగ్గరకు వచ్చే భక్తులనుద్దేశించి నుడివారు. అది ఎంతటి ఉదాత్తమైన కోరిక. మహాత్ములకు, వారికంటూ ఏమీ అవసరం వుండదు, కాని మనసుద్ధరించటానికే వారు ఆవిధంగా చెప్పారు. అందుకే అమ్మ "అందరికీ సుగతే" అని అంటుంది.

అమ్మ "ఒక్కరు పదివేలు ఇచ్చేకంటే, పది వేలమంది హృదయపూర్వకంగా ఒక్కో రూపాయి ఇచ్చినా చాలు" అని అంటుంది. ఎందుకంటే తాను పదివేల మంది హృదయాలలో చోటు చేసుకొని వారిని పునీతులుగా చేయటానికి ఆ కోరిక వెలిబుచ్చింది. అందుకే అమ్మ "కమిటెడ్ మెంబర్లు కావాలిగాని, కమిటీ

మనిషికి మరణం ఒక వరం. మరణం అమంగళకరం కాదు.

మెంబర్లు కాదు అంటుంది". అరబిందో డాక్యుమెంటరీ చూస్తున్నప్పుడు 'మదర్' బాల్కనీలో వుండి దర్శనమిస్తున్నది. ఆవిడను చూస్తుంటే అమ్మలాగానే అనిపించింది. మహాత్ములందరిలో వుండే శక్తి ఒక్కటే కదా! అందుకే ఆ రకంగా కనిపించిందని అనుకున్నాను.

ఒకమారు మద్రాసు వెళ్ళి అట్నుంచి ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన కంచి పీఠాన్ని, కంచి కామాక్షీ దేవిని దర్శించుకుందామని నేను, మా ఆయన వెళ్ళాము. అప్పటికి పరమాచార్యులవారు దర్శనమివ్వటం లేదని అన్నారు. కంచి పీఠాన్ని శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారిని దర్శించకుందామనుకున్నాము. శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు పాదయాత్రలో వున్నారు.

శ్రీశ్రీశ్రీ పరమాచార్యులవారు మాట్లాడరని నిశ్శబ్దంగా పూజ చేసుకుంటున్న వారిని తిలకించవచ్చని మఠాధికారులు తెలియచేసారు. అంతకంటే కావల్సింది ఏముందని, అట్టి అదృష్టాన్ని కలుగచేసిన కామితార్థ ప్రదాయిని అమ్మకు మనసారా నమస్కరించుకున్నాము.

దాదాపు గంటసేపు ఆయన పూజను చూస్తూ మా బాహ్యస్మృతిని కోల్పోయాము. శ్రీవారి దర్శన భాగ్యమే కలగదనుకున్న మాకు, ఆయన సమక్షంలో దాదాపు గంటసేపు వుండగల్గటం, ఆ పూజను వీక్షించగల్గటం మా పూర్వజన్మ సుకృతమే. వారి దర్శన భాగ్యంతో పునీతుల మయ్యామనిపించింది.

శ్రీవారి సమక్షంలో ఆయన పూజ చూస్తున్నంత సేపు వారి ముద్రలు, కదలికలు అమ్మనే తలపింపచేసాయి. ఆయన దేహకాంతి, లావణ్యం అమ్మతో పోటీ పడిందా అనిపించింది. ఆ సమయంలో అమ్మకు, వారికి బేధంలేదని స్ఫురించింది. మహాత్ములందరూ ఒకే శక్తి నుంచి ఉద్భవించిన వారే కదా!

సాధ్యమైనదే సాధన. అంతే మోక్షానికి ఇదీ అంటూ దారిలేదు.

వారి సన్నిధిలో అనిర్వచనీయమైన శాంతిని, ఆనందాన్ని పొంది, దోసిళ్ళకొద్దీ సుధామృతాన్ని గ్రోలిన అనుభూతి చెందాము.

శ్రీశ్రీశ్రీ పూర్ణానంద స్వామీజీ సమక్షంలో అప్పారావన్నయ్య కూర్చుని వుండగా పక్కనే వున్న ఒక చెట్టులోంచి నాదం వినిపించిందిట. అక్కడ ఆశీనులైనవారిని అడిగితే అది పవిత్రమైనదని, ఆ చెట్టునుండి నాదం వినిపిస్తుందని చెప్పారు. మహాత్ములకు సాధ్యము కానిదంటూ వుండదుకదా స్వామీజీ సన్నిధిలో చెట్టునుంచే నాదం ఉద్భవించింది. అటువంటి వారిని శరణు జొచ్చినచో మనలో వున్న ఓంకారాన్ని మనం వినగలిగేటట్లు చేయగల్గుతారు. అందుకనే సజ్జన సాంగత్యం, సాధుసత్పురుషుల సందర్శనం, సద్గ్రంథ పఠనం ఆవశ్యకమని పెద్దలు తెలియచేసారు. మనం ఏ మార్గాన్ననుసరించినా గమ్యానికి చేరటానికి త్రికరణ శుద్ధిగా మనవంతు కృషి మనం సలిపినప్పుడు మహాత్ముల అండ మనకు వుండనే వుంటుంది. ఒక గమ్యానికి పెక్కు మార్గాలున్నాయని వేదం ఒక్కటే చెప్తున్నది.

రామకృష్ణ అన్నయ్య "పరిస్థితులు తారుమారైనప్పుడు తాడే పామై కరుస్తుందంటాడు. కనుకనే అనుగ్రహవృష్టిని కురిపించిన నవగ్రహాలు గదులు మార్చి వ్యయస్థానాలలో చేరుతాయట. కన్నీటికి పట్టాభిషేకం జరగటం, విషాదం, వికటాట్టహాసం చేయటం, హృదయం భగ్నశిల్పం కావటం, బ్రతుకు భస్మతల్పం కావటం, వేదనాగ్నులు ప్రజ్వరిల్లటం అనివార్యమయిందని "శ్రీ చరణ వైభవం"లో పరమాత్మ వియోగాన్ని కూడ మనస్సుకు హత్తుకునేలా, మర్చిపోలేనట్లుగా, పరమాద్భుతంగా వచించాడు. మామూలుగా అమ్మతో అనుబంధమున్న మనమే ఇంత విలపిస్తుంటే, అహర్నిశలు అమ్మ సన్నిధిలో గడిపిన అన్నయ్య దుఃఖానికి అంతేముంటుంది. "అనుకున్నది జరుగదు

తృప్తిని హాయిని ఇచ్చి సందేహానివృత్తి చేయగలిగిందే మంత్రం.

తనకున్నది తప్పదు. ఒకటి అనుకున్నప్పుడు మరొకటి జరిగితే మనల్ని మించినదేదో ఉన్నదనిపిస్తుంది" అని అమ్మ వచించింది.

అనిర్వచనీయమైన, అఖిల జనానందకరమయిన ఏదో ఒక తేజోవర్చస్సు మహాత్ముల వదన మండలంలో ప్రకాశిస్తుంటుంది. అదే బ్రహ్మతేజస్సేమో! అమ్మ, శ్రీశ్రీశ్రీ పరమాచార్యులువారు, శ్రీశ్రీశ్రీ పూర్ణనందస్వామివారి ముఖమండలంలో నేనటువంటి వర్చస్సును గాంచిన అదృష్టశాలిని. జన్మలంటూవుంటే మళ్ళీ జన్మలో కూడ ఇటువంటి మహాత్ముల సన్నిధిలో గడపగలిగే అవకాశాన్ని కలుగచేయమని మనసా, వాచా, కర్మణా అమ్మను కోరకుంటున్నాను.

"వర్గం లేనిది స్వర్గం, వైకల్యం లేనిది కైవల్యం, తృప్తే ముక్తి, ఇష్టం లేనిది కష్టం, భరించలేనిది బాధ, సహించలేనిది హింస" అని అమ్మ అంటుంది. అమ్మ అనసూయేశ్వరాలయంలో సుస్థిరమై, సంసార సాగరం ఈదుతూ అలసిపోయిన వారికి, దుఃఖార్తులకు, బాధాసర్పద్రష్టులకు, ఆధ్యాత్మికవాదులకు ఆశాకిరణమై వెలుగొందుతున్నది. 44 సం॥లు జిల్లెళ్ళమూడిని తాను, నివాసంగా ఏర్పరచుకొని దాన్ని పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దింది. జిల్లెళ్ళమూడి అన్ని క్షేత్రాలకు మించిన పుణ్యక్షేత్రమవుతుందని ప్రవచించింది. ప్రపంచానికే ఆధ్యాత్మిక కేంద్రమవుతుందని చెప్పింది. శ్రీశ్రీశ్రీ పూర్ణానందస్వామి జిల్లెళ్ళమూడిని శ్రీ లలితా పరమేశ్వరీ మహాసామ్రాజ్యంగా వర్ణించారు. "ఇక్కడకు అనేక మంది ఆధ్యాత్మిక సాధకులు వచ్చి తపస్సు చేసి సిద్ధిపొందుతారని" అమ్మ చెప్పింది. దేవతలు వచ్చి నృత్యగానాదులతో అమ్మను అర్చించుకున్నట్లు, నామయోగి రాధ అన్నయ్యకు దివ్య దర్శనాలు కలిగాయి.

ఆధ్యాత్మిక రంగంలో ప్రప్రథమంగా సంపూర్ణతత్వాన్ని సందర్శించి, ఇప్పటి

భగవత్సంకల్పం కాదు, సంకల్పమే భగవంతుడు.

సమాజానికి అవసరమైన సామ్యవాదాన్ని ప్రవేశపెట్టి, అనర్ఘరత్నాలను వెదజల్లిన అమ్మ క్రాంతదర్శిని, తత్వవేదిని, సద్గురువు, మహాప్రవక్త అనటంలో ఎటువంటి సందేహం లేదు.

15. అమోఘవచని - అమ్మ

"కర్మఫలేషుజుష్టాం దుర్గాం దేవీంశరణ మహం ప్రపద్యే" పాప పుణ్యాలకు దేవి అతీతురాలైనా, "జీవుల బుద్ధి ప్రవృత్తులననుసరించి వారి వారి పుణ్యాలకు తగిన ఫలితాలను వారికి కలిగిస్తుందని" దుర్గా సూక్తంలో చెప్పబడింది.

అమ్మ దగ్గరకు వెళ్ళాం, బాబాదగ్గరకు వెళ్ళాం మార్పులేదనో, ఇబ్బందులు తీరలేదనో లేదా ఇది జరిగితే వెడతామనో తలో రకంగా భావిస్తుంటారు. ఎవరినో ఒకరిని, బాబానో, అమ్మనో, రాముడ్నో, కృష్ణుడ్నో నమ్ముకుని మంచి జరిగినా, చెడు జరిగినా నీదే భారమని, పాలముంచినా, నీటముంచినా నీవే శరణ్యమన్నపుడు అన్నీ తానై ఆ భగవంతుడే చూచుకుంటాడు.

ఏది చేస్తున్నా, ఏది చూస్తున్నా మన ఆత్మ గౌరవం చెడకుండా కాపాడుకోవాలి. ఆత్మ గౌరవాన్ని మించింది లేదు. ఆత్మ గౌరవాన్ని చెడగొట్టే దురాలోచనలకు, దురభ్యాసాలకు దూరంగా వుంచమని అమ్మనే మనసారా ప్రార్థించుదాము. మనస్సుకు యజమాని బుద్ధి. మన హృదయం నిర్మలమైతే మనం చేసే పనిలో విజయం లభిస్తుంది. అచంచలమైన విశ్వాసమే మన విజయానికి సోపానం అవుతుంది.

ఓటమి కలిగినప్పుడు కృంగిపోవటం, విజయం కలిగినప్పుడు పొంగిపోవటం అజ్ఞానానికి లక్షణం. ఓటమి, విజయం ప్రతి నెలా వచ్చే పౌర్ణమి, అమావాస్య లాంటివి అన్న విషయాన్ని గుర్తు పెట్టుకొని జీవనయాత్ర సాగించాలి. దానికి కావలసిన నమ్మకాన్ని 'అమ్మే' కలుగచేస్తుంది.

దుఃఖానికి చరమ దశ సంతోషం.

ప్రతి ప్రాణి పట్ల ద్వేషం లేని ప్రేమభావమే భక్తి అని భగవద్గీత బోధిస్తున్నది. ఈ కలియుగంలో భగవంతుడు భక్తసులభుడు. "ఏది చదివినా, ఆచరించేవాడికి ఒకటే. ఆచరించనివాడే దీనిలో ఏముంది, దానిలో ఏముందని వెతుకుతుంటాడు. కాని చివరకు వెతకటంతోనే సరిపోతుందని" అమ్మ అన్నది. సంసారమనే పెద్ద సుడిగుండంలో జీవులు పడిపోతుంటారు. జీవితనౌక సంసార సాగరంలో ప్రయాణం చేసేటప్పుడు నీటిలో నౌక వుండాలి కాని, పడవలో నీరు వుండకూడదు కాని అమ్మ వంటి అవతార పురుషుల అండ వుండి, మనసా వాచా కర్మణా నమ్మినవారికి సముద్రజలం మన జీవితనౌకలోకి ప్రవేశించటమనేది వుండదు.

మా షాపు నష్టాల్లో వున్నప్పుడు "పరిస్థితులను చక్కబరచమని అడగరాదా అని మా వాళ్ళంతా అన్నా ఆవిడ తల్లి, మేము బిడ్డలం అనుకున్నప్పుడు వేరే అడగటమెందుకు అంతా అమ్మే చూచుకుంటుందని" అన్నాను. దానికి తోడు "అడగందే అమ్మైనా పెట్టదు కాదు అడగకుండా పెట్టేదే అమ్మ, ఎంతమంది పిల్లలున్నా తల్లికి ఏ పిల్లలకు ఆ పిల్లలే ఎక్కువ అనిపిస్తుంది. పెట్టుపోతల్లో, వాళ్ళ ఆరోగ్య పరిస్థితిని బట్టి తేడా వుండవచ్చును కాని ప్రేమ మాత్రం సమానంగానే వుంటుందని అందులో తేడాలు వుండవని" అమ్మ అంటుందని చెప్పాను. ఏ రోజుకైనా మంచిరోజులు రాకపోతాయా అని ఎదురు తెన్నులు చూస్తున్న సమయంలో అనుకోని పరిస్థితులు ఎదురయ్యాయి. కొంత అద్దె బాకీ వున్నామని షాపు ఓనరు కోర్టు ద్వారా ఎవిక్షన్ ఆర్డరు పొందారు. రెండురోజుల్లో షాపు ఖాళీ చేయటం తప్పనిసరి. ఆయన బాకీ చెల్లించి, షాపు ఖాళీ చేయాలి. డబ్బు చెల్లించకపోతే షాపులో సామాను వేలం చేయబడుతుంది. ఆ షాపు మీద బ్యాంకులోను వుంది. కొత్తషాపుకు అడ్వాన్సు చెల్లించాలి. చేతిలో పైసా లేదు. కుదువ పెట్టటానికి కూడా ఏమీ మిగలలేదు. ఏమీ

తరుణమంటే తప్పించుకుందామన్నా తప్పనిది చేద్దామనుకున్న చేయనీయనిది.

పాలుపోని పరిస్థితులలో మాష్టారు ఎ.వి.వి. ప్రసాదరావుగారి దగ్గరకు వెళ్ళాము. "అమ్మ పరిపూర్ణ కటాక్షం మీకు వుంది. ఆవిడే సర్దుబాటు చేస్తుందని" అన్నారు.

మర్నాడు ఎట్టి పరిస్థితుల్లో అయినా సరే షాపు ఖాళీ చేయాలి. ఎక్కడా పైసా పుట్టలేదు. రాత్రి 9 గం॥లు అయ్యింది. ఆయన ఇంటికి రాలేదు. రేపటి పరిస్థితిని తలచుకొని దిగులు పడ్తున్నాను. రేపు షాపు ఖాళీ చేయకపోతే షాపులో సామాను బయట పడేస్తారు. ఇది కోర్టు ఉత్తరువు. తింటున్నామో లేదో కూడా రెండో కంటికి తెలియకుండా గుంభనంగా గడుపుకు వస్తున్నాము. పరువు పోతుంది. ఇంట్లో వుండే వెండి, బంగారాలకు పూర్వమే కాళ్ళు వచ్చాయి. ఎటూ తోచక, ఏమి చేయలేని స్థితిలో ఈ గండం నుంచి బయట పడేయమ్మా! అని అమ్మనే ప్రార్థించాను.

ఆ విపత్తునుంచి బయట పడవేయటానికి, ధైర్యాన్నివ్వటానికే అన్నట్లుగా "అమ్మ గుమ్మంలో నుంచి లోపలకు వస్తున్నట్లు కనిపించింది. ఏమిటి? ఇది కలా, నిజమా! అని ఆశ్చర్యపోయాను. "కుసుమా! చక్రవర్తి ఇంటికి వచ్చారా?" అంటూ మాష్టారు ప్రసాదరావుగారు అడుగటంతో స్పృహలోకి వచ్చాను. అమ్మ లోపలికి అడుగు పెట్టడం స్పష్టంగా కనిపించింది. ఇది ఏమిటి మాష్టారుగారు అడుగుతున్నారనుకుంటూ" "ఇంకా రాలేదండి, మధ్యాహ్నమనగా వెళ్ళార"ని దిగులుగా చెప్పాను. "రేపు ఉదయం 7 గం॥లకు నువ్వు, చక్రవర్తి మా ఇంటికి రండి. అక్కడ నుంచి మనం ఒక చోటికి వెళ్ళాలి. అతన్ని దిగులు పడవద్దని, అన్నీ సర్దుకుంటాయని, మర్చిపోకుండా తప్పకుండా రమ్మని" మరీ మరీ చెప్పి వెళ్ళారు.

మర్నాడు ఉదయం ఆయన శిష్యులైన శ్రీ చిట్టిబాబు చౌదరి గారి భార్య దగ్గరకు తీసుకువెళ్ళి "ఒక కుటుంబాన్ని నిలబెట్టిన దానివి అవుతావు.

శిక్షణ కూడ రక్షణే.

అమ్మాయిది యూనివర్సిటీ ఉద్యోగం తాను నీకు నోటు రాసిస్తుంది నీవు ఎలాగైనా ఈ సహాయం చేసి తీరాలన్నారు". "కష్టంలో వున్న జనాన్ని చూచి కరుణతో స్పందించగల మనస్తత్వమే నిజమైన మనస్తత్వం, అదే దైవత్వం అని అమ్మ అంటుంది.

మాష్టారు గారి మీద గౌరవంతో, మేము ఎవరమో తెలియకపోయినా, ఆవిడ వడ్డీ లేకుండా సహాయం చేసారు. అది కూడ మేము ఎప్పటికో తీర్చాము. పైసా వడ్డీ తీసుకోకుండా, ఆవిడ చేసిన సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేము. వారి కుటుంబానికి ఆయురారోగ్య సంపదలివ్వాలని అమ్మను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ఇంతమటుకు ముహూర్తాలు పెట్టి చేసాము. ఏమి ఒరిగింది ఇప్పటి వరకూ ఏదీ కలిసి రాలేదు కదా! కాబట్టి ముహూర్తాలు వద్దు. అమ్మ కళ్యాణదినం. మహత్తరమైన రోజు. ఆ రోజు ఏ పనులు తలపెట్టినా దిగ్విజయంగా జరుగుతాయన్న నమ్మకంతో మే '5' ఉదయం 7.30 గం॥లకు పాలు పొంగించాము. మా మరిదిగారు, ప్రసన్నకుమార్ గారు సిద్ధాంతిగారిని కనుక్కుంటే ఆ సమయం చాలా మంచిదని, దాన్ని మించిన ముహూర్తం లేదని, వాళ్ళు బాగా అభివృద్ధిలోకి వస్తారని చెప్పారట. అంతకు ముందు ఎన్ని ముహుర్తాలు పెట్టినా బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. ఇది అమ్మ నిర్ణయించిన ముహూర్తం కదా! ఆ తరువాతే మేము జీవితంలో నిలదొక్కుకో గలిగాము.

అమ్మ దగ్గర వుండగా ఎవరో అప్పులకు తట్టుకోలేక పారిపోయారని అనుకుంటుంటే "అమ్మా మాకూ చాలా అప్పులున్నాయమ్మా అంటే మీకు వడ్డీ లేకుండా అప్పులిచ్చేవారు వున్నారు. మీరు అన్నీ తీర్చుకుంటారు నాన్నా" అని అమ్మ ఆయనతో అంది. అలాగే అప్పు ఇచ్చిన మార్వాడీ, వైశ్యులాయన,

---

అధైర్యమే ధైర్యానికి ఆధారం.

చౌదరి గారి భార్య ఎన్నో సంవత్సరాల తరువాత కూడ అసలు తీసుకొని, వడ్డీ మాఫీ చేయటం అంటే అమ్మ మాటే మహా మంత్రంలా పని చేసింది. ఆ తరువాత మిగిలిన అప్పులు కూడ తీర్చుకోగలిగాము. ఈ విధంగా ఎన్నో ఒడిదుడుకులకు లోనైనా పెనుతుఫానులో, నడి సముద్రంలో నావలాగా వూగిసలాడుతున్న, మా జీవితాలను అమోఘవచనియైన అమ్మ అనుగ్రహమనే చుక్కానితో ఒక దరికి చేరగలిగాము.

16. అభ్యుదయవాది - అమ్మ

పూర్వం స్త్రీ వంట ఇంటికే పరిమితమయ్యేది. కాని ఈ ఆధునిక కాలంలో పురుషునితో సమానంగా అన్నిరంగాలలో ముందంజ వేస్తున్నది. సమాన హక్కుల పోరాటం కంటే స్త్రీ, పురుషులు సమన్వయం చెంది జీవించటం మేలు. ఎవరికి వారుగా జీవించటం అభ్యుదయం కాదు. వేరొకరి కొరకు జీవించటం, వారి కొరకు పనిచెయ్యటమే అభ్యుదయం. దానిని ఆచరించి చూపి అమ్మ మనకు ఆరాధ్యదేవత అయింది. అమ్మ అభ్యుదయవాది. "భర్త భార్యకు దైవం, అయితే భార్య భర్తకు దేవత" అని తన ఉద్దేశ్యాన్ని అభ్యుదయపదంలో నుడివింది. "మంగళసూత్రాన్ని తలవంచి కట్టించుకునేది భార్య, నడుం వంచి కట్టేది భర్త, కనుక ఇద్దరికీ సంసార రథాన్ని లాగటానికి సమానవిధి, నియమాలున్నాయని" తెలియచేసింది.

మరొకరి కొరకు చేసే పని భగవంతుని కొరకే చేస్తున్నామని అనుకుంటే జీవితం ధన్యమవుతుంది. మన పాపాలు ప్రక్షాళనం అవుతాయి. కుటుంబమే ఒక యజ్ఞవాటిక. మహాకవి కాళిదాసు "ఎవరికి వారుగా జీవించిన వారు వివాహానంతరం భార్యకొరకు భర్త, భర్త కొరకు భార్య జీవిస్తారు. మంగళసూత్రాన్ని తలవంచి కట్టించుకునేది భార్య. నడుం వంచి కట్టేది భర్త. పిల్లలు జన్మించిన

ఆకారమే వికారం.

తరువాత భార్యాభర్తలిద్దరూ పిల్లల కొరకు జీవిస్తూ, తాము బండి చక్రాలవలె పిల్లలను ఆ బండి మీద గమ్యానికి తీసుకువెళ్తారని" అంటాడు. భార్యా భర్తలమాట ఒకటైననాడు జీవితం నల్లేరు మీద బండిలా సాగుతుంది.

అమ్మ అనుగ్రహం వల్ల ఎన్ని ఆటుపోటులు ఎదురైనా ఇద్దరిదీ ఒకే మాటగా జీవిస్తూ కాళిదాసు చెప్పినట్లు పిల్లలను వారి వారి గమ్యాలకు చేర్చగలిగాము. మా కుటుంబమనే భూమిపై భక్తి అనే బీజాన్ని నాటితే, అమ్మ దయామృత వర్షం కురిసి అభివృద్ధి అనే మహావృక్షం ఉద్భవించి అభ్యుదయానికి దారి తీసింది. మా బాబు యాక్సిడెంట్ తరువాత ఇంటర్ చదివాడు. క్లాసు రానందున బెటర్‌మెంట్‌కు కట్టించాలనుకున్నాను. కానీ ఒక సంవత్సరం వృధా ఎందుకని దగ్గరలో వున్న నైట్ కాలేజిలో చేర్పించారు. చిల్లపిల్లవాడికి నైట్ కాలేజి ఏమిటి అని బాధపడ్డాను. ఫస్ట్ టర్మ్ అయిన తరువాత సెకెండ్ టర్మ్ ఫీజు కట్టద్దన్నాను.

జిల్లెళ్ళమూడి వెళ్లినప్పుడు అమ్మ దగ్గర వాడి విషయమై బెటర్‌మెంటుకు కట్టించాలని ఉందమ్మా అని మొరపెట్టుకున్నాను. "ముందు జరగబోయేది మనం ఏమి చెప్పగలం, నీవు అనుకున్నట్లుగానే మళ్ళీ పరీక్షకు కట్టించమంది" అమ్మ తన మీద కర్తృత్వం వుంచుకోదు కదా! అమ్మ నోటి వెంట వచ్చిందని వెంటనే పరీక్ష ఫీజు కట్టాను. నేను చదవమని ఎంత ప్రోత్సహించినా మొదటి మాటంత కూడా చదవలేదు, కానీ అమ్మ మాటే మంత్రంలా పనిచేసి క్లాసువచ్చింది. మామూలుగా అయితే ఆ మార్కులకు సీటురావటం చాలా కష్టం.

సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఎ.యు. ఇంజనీరింగ్ కాలేజీలో రెండు బ్రాంచ్‌లను పెంచటం వల్ల యూనివర్సిటీ స్టాఫ్‌కోటాలో మా వాడికి బి.ఫార్మసీలో

విధి అంటే తప్పనిసరి.

సీటు వచ్చింది. మా ఆయన మెడికల్ లైన్‌లో ఉండటంతో భవిష్యత్‌లో వాడికి అది చాలా ఉపయోగపడింది. అమ్మ దయవల్ల ఎమ్. ఫార్మసీలో ఫస్ట్‌క్లాస్ వచ్చింది. మొదట్నించి పిల్లల చదువు సంధ్యలు ఆయన పట్టించుకోకపోయినా అమ్మ అనుగ్రహకారణంగా పిల్లలు మంచి వృద్ధిలోకి రాగలిగారు.

నీవు, నీవుగా జీవించు కాని, నివురుగా జీవించవద్దని పెద్దలు చెప్తారు. భగవత్సాన్నిధ్యం కోరేవారం, సాదాగా వెళ్ళడం కాక సాధన మార్గంలో పయనించాలి. నిశ్చింత లేని జీవితం చుక్కానిలేని నావ వంటిది. నిశ్చింతంగా వుండాలంటే సర్వకర్మలను బుద్ధితో నిర్ణయించుకోవాలి, కాని మనస్సుతో నిర్ణయించుకోకూడదు. వివేకంతో మన బుద్ధిని పెంపొందించుకోవాలి. దానికి పెద్దల సాంగత్యం అవసరం. మన అదృష్టవశాత్తూ అమ్మ యొక్క శరణు మనకు పూర్తిగా లభించింది. నిరంతరం అమ్మను తలచుకుంటూ మన పనిని మనం చేసుకుపోవాలి. భగవంతుని సర్వాత్మనా నమ్మినవారు లేదా నాస్తికులు భగవంతుని చేరుతారు. "నమ్మినవారు, నమ్మనివారు నను చేరగలరు. నమ్మీ నమ్మని నాయనమ్మలు నను చేరలేరని కృష్ణుడు అంటాడని" జానపదుల పాటలలో వింటుంటాం. ఇది యదార్థగాథ అన్న వ్యాసం 1990 సెప్టెంబరు మాతృశ్రీలో ప్రచురితమైన దానిని ఇక్కడ ఉదహరించటం సమంజస మనిపించింది. హస్సేన్‌ఖాన్ అనే అతను హేతువాది. నాస్తికుడు. అమ్మ చుట్టూ అందరూ తిరుగుతున్నారని, దేవుడే లేనప్పుడు అమ్మ దేవత ఎలా అవుతుందని వాదించేవాడు.

ఒకమారు కొంతమంది అమ్మ భక్తులతో కలసి రాత్రి బస్సులో ప్రయాణం చేయటం తటస్థించిందిట. ఆ రాత్రి భయంకరమైనగాలి, విపరీతమైన వర్షంతో బస్సు పడిపోయే స్థితి ఏర్పడింది. అమ్మ భక్తులు అమ్మ తమను రక్షిస్తుందన్న

విరామం లేనిది రామం.

నమ్మకంతో అమ్మ మీద పాటలు పాడుతుంటే వీళ్ళకు అమ్మ పిచ్చి బాగా ముదిరిందని గొణుక్కున్నాడు. గాలి, వర్షం, పెనుతుఫానుగా మారింది. బస్సుమాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తుంటే ఆశ్చర్యమనిపించి కిటికీలో నుండి వెనక్కి చూస్తే, ఆ బస్సు వెనక తెల్లటి వస్త్రములు ధరించి చిరునవ్వులు చిందిస్తూ చంద్రతేజస్సును పోలిన మహిళ వర్షంలో తడుస్తూ బస్సును పట్టుకు నడిపిస్తోందట. అమ్మ తనువు చాలించిన అనంతరం అనేక విధాలుగా అమ్మ తన పిల్లల్ని కాచి రక్షించిదనటానికి నిదర్శనమే ఈ సంఘటన. అమ్మ దగ్గరకు వచ్చే మహమ్మదీయులలో ఎంతోమంది భగవద్గీత భక్తితో చదివే వారున్నారు. భగవంతుని చేరటానికి మతంతో పనిలేదని ఎవరు ఏవిధంగా సంస్మరించినా తనను చేరుతారనే భగవంతుడు తెలియచేసాడు. అందుకే అమ్మ "అందరికీ సుగతే" అని అంది.

ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకుడైన శ్రీ వీరమాచినేని ప్రసాదరావు గారిని అమ్మ తన అనుంగు బిడ్డగా స్వీకరించటం చూస్తే అమ్మ యొక్క అభ్యుదయ భావాలకు అంతే లేదనిపిస్తుంది. ఆయన అనేక సభల్లో అమ్మ గురించి అనర్గళంగా ఉపన్యసించారు. నదీరా కమ్యూనిష్టు, అమ్మమీద అనేక గేయాలు రాసాడు. ప్రఖ్యాత సైంటిస్టు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు అమ్మ సాన్నిధ్యంలో గడపగలగటమే కాక అమ్మ జీవితాన్ని అధ్యయనం చేసి డైరీలలో నిక్షిప్తమైన అమ్మ సంభాషణలను విడదీసి అమ్మతో సంభాషణలను పేర మూడు వాల్యూమ్స్ అమ్మ - అమ్మ వాక్యాలు అను పేర మూడు వాల్యూమ్స్ ప్రచురింప చేసారు. ఆ సంభాషణలు మనం చదువుతున్నట్లుండదు, మనమే అమ్మకు ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నట్లే వుంటుంది. అభ్యుదయవాది అయిన అమ్మకు నమస్సుమాంజలులర్పిస్తున్నాము.

చెప్పేది సాంఖ్యం, చేసేది తారకం చూచేది అమనస్కం.

17. దయామృతవర్షిణి - అమ్మ

వేద వేదాంగాలు, అష్టాదశ పురాణాలు, భారత భాగవత రామాయణాది ఇతిహాసములు మన సంస్కృతికి పెట్టని కోటవలె వున్నాయి. వీటన్నింటిలో మహాభారతంలోని కురుక్షేత్రంలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి బోధించిన భగవద్గీత ఆబాలగోపాలాన్ని అలరిస్తున్నది. దానిలో కర్మ, భక్తి, జ్ఞాన యోగాలు ముఖ్యమయినవి ప్రతీ మనిషీ తన నిత్యజీవితంలో ఆచరించవలసినవి.

కర్మయోగం : శరీరం ద్వారా కోరికలను విసర్జించి, మన పనులను మనం చేసుకుంటూ ఫలితాన్ని ఆశించకుండటం.

భక్తియోగం : మనస్సు, ప్రేమలో అటూ ఇటూ కొట్టుకుంటూ వుంటుంది. ఆ ప్రేమనే భగవంతుని యందు నిలుపకలిగిననాడు అది భక్తియోగం అవుతుంది.

జ్ఞానయోగం : భక్తి ద్వారా దేవుడు తనలోనే వున్నాడని తెలుసుకోగలిగినది జ్ఞాన యోగం. నది సముద్రంలో కలిసినట్లుగా, జీవాత్మ పరమాత్మలో కలిసిపోతుంది.

భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు నుడివిన రీతిలో కర్మ, భక్తి యోగాలను అనుష్ఠానం చేస్తూ ఇబ్బందులకు గురియైన వాటివల్ల వచ్చే కష్టనష్టాలు బరువు బాధ్యతలు అమ్మవే అని సర్వాత్మనా నమ్ముకొని రోజులు నెట్టుకొస్తున్నాం. అమ్మ తన స్మరణకు, స్ఫురణకు దూరం చేయని దయామృతవర్షిణి. అమ్మ తన దయామృత వర్షాన్ని మా మీద ఏవిధంగా వర్షింప చేసిందో తెలియచేసే ప్రయత్నమే ఇది.

ఆశావాదికి ప్రతిఘోరమైన సన్నివేశంలో ఒక అవకాశం కనిపిస్తే, నిరాశావాదికి ప్రతి అవకాశంలో ఒక ఘోరం కనిపిస్తుంది. ఎటువంటి

అందరూ అన్నీ కాలం మీదే ఆధారపడ్డాయి.

పరిస్థితులు ఎదురైనా అమ్మ దయవున్నదన్న కొండంత ఆశయే మమ్మల్ని నిలబెట్టిందనిపిస్తుంది. శరత్కాల చంద్రికవంటి అమ్మ మోము గాంచిన వారికి నిరాశ అన్నది దరిదాపులకు కూడా రాదు. ఒక సంచీతో మా అమ్మాయి రెండు కేజీల బియ్యం తీసుకుని మా బంధువుల ఇంటి ముందు నుంచి వస్తోంది, "ఆ సంచిలో ఏమిటీ అని అడిగితే వేరుశెనగపిండి, చెట్లకు ఎఱువుగా వేయటానికి తీసుకువెడ్తున్నానని, ఏదీ చూస్తామంటారేమోనని, అక్కడ ఒక్క క్షణం కూడా ఆగకుండా వచ్చేసింది. ఆ సమయానికి అమ్మే నాకు అలా తోపింపచేసిందని" చెప్పింది. ఇదే విధంగా ఎన్నో ఇక్కట్ల నుంచి, అవమానాల నుంచి అమ్మ తప్పించింది. ఉన్నదానిలో సర్దుకోవటమే కాని ఎన్నడూ బయటపడి ఎరుగము.

మా కజిన్, కూతురు పెండ్లి అయిన తరువాత కాపురం పెట్టించటానికి వచ్చింది. వాళ్ళను భోజనానికి పిలిచి జాకెట్టు గుడ్డలు పెడదామనుకుంటే చేతిలో పైసాలేదు. ఏమి చేయాలా అని మదనపడ్తుంటే మిట్టమధ్యాహ్నం పాతపేపర్లు కొంటాం అంటూ వినిపించింది. వెంటనే ఇంట్లో వున్న పాత పేపర్లు అమ్మి ఆ డబ్బుతో రెండు జాకెట్లు గుడ్డలు తెప్పించాను. సాధారణంగా పేపరు వాళ్ళు ఉదయమే వస్తారు. ఆ సమయానికి పేపర్లవాడి రూపంలో అమ్మే వచ్చి ఆదుకుంది.

మందులషాపుకు అద్దె బాకీ పడిపోయాము. ఎటూ పాలు పోక, ఏమీ చేయలేని పరిస్థితులలో అమ్మ దగ్గరకు వెళ్ళాము. పరిస్థితులు చక్కబరుస్తానంటే ఇంకో రెండు రోజులు ఉంటానని ఆయన నా చేత అమ్మకు కబురుపెట్టారు. "వాడికి వుండాలంటే వుండమను, నేను ఎప్పుడైనా వద్దన్నానా" అని అమ్మ. ఇద్దరి మధ్య తడిక రాయబారంలా నేను. అమ్మ ఖచ్చితంగా వుండమంటే వుంటానని ఆయన అన్నారు. "సరే వుండాలంటే వుండమని" అమ్మ చెప్పింది.

సత్రమంటే అందరికీ స్వతంత్రమైనది.

అమ్మ వుండమంటే అక్కడి పరిస్థితులు చక్కబడతాయని ఈయన విశ్వాసం. షాపులో మా బాబు వున్నాడు. వాడు వెళ్ళి అప్పటి పరిస్థితి గురించి ఈయన స్నేహితులలో ఒకరికి చెపితే ఆ సమయంలో ఆదుకుని 3,000/- కట్టారు. ఈయన వూళ్ళో వున్నప్పుడే తెలిసిన వారందర్నీ అడిగిలేదనిపించుకోవటం అయింది. ఆ పరిస్థితిని ఎదుర్కొనే సాహసం లేకనే అమ్మను శరణుజొచ్చాం. మా ఇద్దరినీ తన సన్నిధానంలో వుంచుకొని, ఆ స్నేహితునికి సహాయం చేసే బుద్ధి పుట్టించి, ఆ గండం నుంచి కాపాడింది.

ఇంకొకమారు మా దంపతులిద్దర్నీ వచ్చి వారం రోజులుండమని నలుగురి చేత కబురు పెట్టింది, ఉత్తరాలు రాయించింది. విశాఖపట్నం నుంచి వెళ్ళిన వారితో మరీ మరీ చెప్పి పంపించింది. అమ్మ ఇన్ని సార్లు రమ్మంటుందంటే ఏదో పరమార్థం వుంటుందనిపించింది. నేను ముందుగా వెళ్ళాను. తరువాత ఆయన వచ్చారు. మా దంపతులం ఆ గడ్డమీద 4 రోజులు కలసి అమ్మ సమక్షంలో వుండగల్గటం మా జీవిత కేదారాల్లో సస్యశ్యామలమైన మరుపురాని మధురక్షణాలు భ్రమరాంబక్కయ్య జిల్లెళ్ళమూడి నుంచి వస్తుంటే అమ్మ "మీ దంపతులు వాళ్ళింట్లో భోజనం చేయండి లేదా వాళ్ళను మీ ఇంటికి పిలవమని" మరీ మరీ చెప్పింది. దానిలో ఏమి అంతరార్థమున్నదో ఎవరికెరుక! అప్పటికి వాళ్ళు వైజాగ్ వచ్చి ఎక్కువ కాలం కానందున ఈయనకు, లక్ష్మణరావు గారికి పరిచయం ఏర్పడలేదు.

అమ్మ చెప్పింది కదా! అని ఆ శుభ ఘడియలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నాము. శ్రీ పన్నాల రాధాకృష్ణ శర్మగారు వారింటికి వచ్చారని తెలిసి ఉగాదిపండుగ సందర్భంగా ప్రిన్సిపాల్ గారిని, లక్ష్మణరావు గారిని, అక్కయ్యను అమ్మ చెప్పిన విధంగా భోజనానికి పిలవటం, 4 రోజులు

జ్ఞానం కలగటానికి మానవ జన్మే అక్కర లేదు.

జిల్లెళ్ళమూడిలో వుండగలగడం 'అమ్మ కరుణే' అనిపించింది. ఆ తరువాతే మా జీవితాల్లో అనుకోని మార్పులు సంభవించాయి.

1972 ఏప్రియల్ 25న మా నాన్నగారు పోవటంతో మా కంటూ పెద్ద దిక్కుగా అమ్మే నిలచి మాకు కావల్సిన ధైర్యస్థైర్యాలను కలుగచేసి తన దయకు హద్దులు లేవని నిరూపించింది.

ఏనాడూ అప్పులు తీరి బయట పడ్తామని అనుకోలేదు. పుట్టిన చోటు, మెట్టినచోటు ఎంతో ఉన్నతమైనవి వాటి పేరు ఎక్కడ పోగొడ్తామో, పరుపుపోయి రోడ్డున పడవలసి వస్తుందనుకున్న మా కుటుంబాన్ని ఆదుకొని దారి చూపిన దయామృతవర్షిణి అమ్మ. ఆవిడ దయకు తారతమ్యాలు, హద్దుపద్దులు లేవు, ఇదేవిధంగా తన భౌతిక దేహానంతరం ఎందరినో అమ్మ సేద తీరుస్తున్నది.

18. పరమ దయాళువు - అమ్మ

అవతార పురుషుల జీవితాలు వారి శరీర పతనంతో అంతమయ్యేవి కావు. వారిలోని అనంతమైన ఆధ్యాత్మిక శక్తి, జీవులనుద్ధరించే శక్తి ఎన్ని సంవత్సరాలైన అమరమై వుంటుంది. అటువంటి వారిల్లో 'జిల్లెళ్ళమూడి అమ్మ' ఒకరు. అనంతమైన, పరమదయా స్వరూపమే అమ్మగా రూపుదిద్దుకుంది. అమ్మ చెప్పిన సూక్తులు, వేదాలవలె సార్వత్రికమైనవి. సర్వజనామోదమైనవి. వేదాలు లాగానే అమ్మ సూక్తులు కులగోత్రాలకు, ప్రాంతీయ భాషావిబేధాలకు అతీతమైనవి.

ఒకసారి పోప్ మన దేశాన్ని సందర్శించడానికి వచ్చినప్పుడు హిందూ సభవారు నల్లజెండాల ప్రదర్శన చేయాలని సంకల్పించారు. దానికి శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీ పరమాచార్యులవారు తమ అసమ్మతిని తెలియచేసి, ఏ

ఎవరూ ఉన్నది వదిలించలేరు. లేనిది తెచ్చిపెట్టలేరు.

సరస్వతీదేవి దయవల్ల హిందూదేశములోని మతాచార్యులందరూ బోధచేస్తున్నారో, ఆ సరస్వతీదేవి దయవల్లనే ఇతర మతప్రవక్తలు బోధ చేస్తున్నారని చెప్పి మన హిందూమతం యొక్క ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. అదేవిధంగా అమ్మ "ఆచరించే వాడికి ఏ మతమైనా ఒకటేనని, సర్వ సమ్మతమే తన మతమని" అన్నది.

సామాన్య మానవులను ఉద్ధరించడానికి అవతరించినవారు, వారి ఆధ్యాత్మిక శక్తిద్వారా ప్రజలను ప్రభావితులను చేస్తారు. అమ్మ "సాధ్యమైనదే సాధన, శరీరమే శ్రీచక్రం, ఇహానికి ఏదో పరానికి అదేనని". మొదలగు సూక్తుల ద్వారా లౌకిక విషయాలతో కలిపి తన బిడ్డలకు ఆధ్యాత్మికతను బోధించింది.

శరీరానికి దెబ్బ తగిలితే గాయం తగ్గటానికి ఎంతో కాలం పట్టదు. కాలక్రమేణ మచ్చకూడా పోవటానికి అనేక రకాల క్రీములు వచ్చాయి. కాని మనస్సు ముక్కలైతే అతకలేము. ఎంతో అభిమానించే వ్యక్తుల ద్వారా అది జరిగితే ఆ బాధకు అంతు దరి వుండదు. ఎవరైనా అన్నారన్నా పట్టించుకోవలసిన అవసరం అంతగా వుండదు. కాని మన కుటుంబశ్రేయస్సు కోరే వ్యక్తుల తీరుమారటం గొడ్డలిపెట్టులా, పిడుగుపాటులా వుంటుంది. చితి చచ్చిన శవాన్ని కాలుస్తే, చింత బ్రతికివున్న మనల్ని కాలుస్తుంది.

అలాంటి ఆవేదనతో అలమటిస్తున్న నేను, హార్టుపేషంటును అవటంతో, ఆ రాత్రి మళ్ళీ ఆసుపత్రి పాలవ్వాలేమో అన్నంతగా గాభరా చేసింది. అన్నింటికీ అమ్మే వున్నదన్న నమ్మకంతో మందులు డోసు పెంచుకొని వేసుకొని అమ్మ కుంకుమ పెట్టుకున్నాను. "నాకు చచ్చిపోతానన్న బెంగలేదు. హాయిగా నీ దగ్గరకే వచ్చేస్తానన్న నమ్మకం వుంది. కాని ఆయనకు అసలు బాగుండటం

పనికిమాలిన గుణములను విడిచిన వాడే వివేకుడు.

లేదు. ఇప్పుడు నాకేమైనా అయితే ఆయన తట్టుకోలేరు. ఆయన గురించే నా తపన. కాబట్టి నాకు తగ్గించమ్మా" అని ప్రార్థించాను. అమ్మ పరమదయాళువు కదా! మన బాధలను తాను అనుభవించి మనకు స్వస్థత చేకూరుస్తుందన్న విషయం అమ్మ పిల్లలందరికీ విదితమే.

కొంతసేపటికి తేరుకుని నిద్రమాత్ర వేసుకున్నాను. మండుటెండలకు ఎండుటాకులు మండకపోవచ్చును కాని, నిండుగుండెలు నిందల మాటలకు మండిపోతాయి. నన్ను మానసిక వ్యధనుండి దూరం చేయటానికే అన్నట్లు ఉదయం 8.30 గం॥కు శ్రీ విశ్వజననీ పరిషత్ ప్రెసిడెంట్ గారయిన శ్రీ బూదరాజు శేషగిరిరావు గారు, వారి సతీమణి ఫోనులో మాట్లాడటం జరిగింది. నాడు మా బాధను చూడలేక రామకృష్ణ అన్నయ్యను, శ్రీ పన్నాల రాధాకృష్ణ శర్మ గారని, భ్రమరాంబక్కయ్యను పంపించి మాకు కావల్సిన ధైర్యాన్ని కలుగచేసింది. నేడు తాను భౌతికంగా మన మధ్య లేకపోయినా శేషగిరిరావుగారి దంపతులచే ఫోనులో మాట్లాడించి నాకు కావల్సిన సహాయాన్ని అందించి ఎల్లవేళలా తన బిడ్డలతోనే వుంటూ తన సర్వమాతృత్వాన్ని తెలియచేసిది. అమ్మ. ఎల్లప్పుడు 'నా నీడలా వుండాలమ్మా అంటే నీడలాకాదు నీతోనే వుంటానని' నిరూపించింది. వారితో ఫోనులో మాట్లాడగానే అమ్మతోనే సంభాషించినంత ఆనందం కలిగింది, "దేవుడులా వచ్చాడు కాదు వచ్చినవాడే దేవుడు అనుకోవచ్చు కదా" అని అమ్మ అంటుంది. "మీరు రమ్మని పిలవనక్ఖరలేదు. మీ బాధే నన్ను రప్పిస్తుంది. అదీ పిలుపే. నీ వెన్నంటే వుందినాన్నా, అమ్మ అంటే జిల్లెళ్ళమూడిలో ఈ నాలుగు గోడల మధ్య మంచం మీద కూర్చున్నదే కాదు. దేనికయితే ఆది, అంతములేదో, ఏది సర్వానికి ఆదీ, అంతమో అదీ అమ్మ" అని నిర్ధారించింది.

భక్తి అంటే మనోవాక్కాయ కర్మలకు అతీతమైన స్థితి.

నా ఆవేదన, మానసిక వ్యధ తాత్కాలికంగా ఉపశమించినా, మళ్ళీ నాలో నాకే తెలియని సంచలనం కలిగింది. రాత్రి పడుకుంటూ ఎందుకమ్మా ఇంత ఆవేదనకు గురిచేస్తున్నావని పరిపరి విధాల అమ్మనే ప్రార్థించాను. ఏమిటో చెప్పలేని బాధ. ఇదమిద్ధంగా నాబాధేమిటో నాకే అర్థం కాలేదు. ఆ రోజు తెల్లవారుఝామున మేము మరికొంతమందితో జిల్లెళ్ళమూడి వెళ్ళినట్లు అమ్మ గదిలో చాలాసేపు గడిపినట్లు వారం వారం పూజలు జరుగుతున్నాయి. కామేశ్వరరావుగారు పూజలకు వస్తుంటారు. వాళ్ళ అబ్బాయి పెళ్ళి కుదిరిందని అమ్మతో నేను చెప్పినట్లు, అమ్మ కుంకుమ పొట్లాలు ప్రసాదించినట్లు, ఆ తరువాత అన్నపూర్ణాలయంలో ప్రసాదం ఆరగించినట్లు కలవచ్చింది. ఆ తరువాత నా మనస్సు స్థిమితత చెందినది. అమ్మ భౌతికంగా వున్నప్పుడు ఎట్టి అనుభూతిని పొందానో మళ్ళీ 12 సంవత్సరాల అనంతరం అటువంటి అనుభూతిని పొందాను.

"యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవత రోజనః" శ్రేష్ఠ పురుషుడు ఎలా ఆచరిస్తాడో, ఇతర జనులు కూడా అలాగే ఆచరిస్తారు. అమ్మ కూడా తాను ఆచరించి మనకు తెలియపరచినది. ఆదర్శవంతమైన స్నేహం అనేది ఎలా వుండాలో సామాన్యుడికి తెలియచేయటం కోసం రాముడు సుగ్రీవునితో స్నేహం చేసాడు. అంతేకాని, అతని ద్వారా ఏదో కార్యం సాధించాలని కాదు. సాధించలేడని కాదు. రాముడికి నిజానికి ఎవరి సహాయం అవసరం లేదు. భగవత్సేవ చేసుకొనడానికి ఒక అవకాశాన్ని సుగ్రీవునికి కల్పించాడు రాముడు. అలాగే అమ్మ నాకు 'మధురస్మృతులు' అన్న పుస్తకాన్ని వ్రాయడానికి తగిన శక్తినిచ్చి అమ్మ సేవ చేసుకొనే అవకాశాన్ని కల్పించింది.

నేనెప్పుడూ ఒంటరి దాన్ని కాను. నాలోనే అందరూ ఉన్నారు.

౹౮. సర్వాధికారిణి - అమ్మ

అమ్మ మహాయోగిని, పరమజ్ఞాని, ప్రతిభాశాలిని అయిన గురువు. తన ఇష్టప్రకారం అందరిని నడుపుతూ అందరి ఇష్టప్రకారం తాను నడుస్తున్నట్లు కనిపించే పరమలౌక్యం అమ్మతత్వం. ప్రకృతి శక్తులపై అధికారం చలాయిస్తుందని అనటానికి అనేక నిదర్శనాలున్నాయి. వర్షం కురవమంటే కురుస్తుంది. ఆగమంటే ఆగుతుంది. అలాగే ఎండ తన తీవ్రతను తగ్గిస్తుంది.

1971లో మా పెద్దనాన్నగారు శ్రీ అన్నంరాజు వేంకటేశ్వరరావు గారి కుమారుడు చంద్రమోహన్ వివాహము కొండముది గోపాలన్నయ్య కూతురు వరలక్ష్మితో జిల్లెళ్ళమూడిలో జరుప నిశ్చయించారు. మోహనన్నయ్య పెండ్లికి తెనాలి, పెదనందిపాడు, బాపట్ల, గుంటూరు అన్నిచోట్ల వర్షమే, కాని జిల్లెళ్ళమూడిలో ఒక్క చినుకు లేకుండానే ముహూర్తం అయింది. భోజనాలు అయిన తరువాత దడదడా ఒకటే వర్షం. పెళ్ళి అయ్యి, భోజనాలు అయ్యే వరకు అభయదాయిని అయిన 'అమ్మే' ఆ వర్షాన్ని ఆపిందని మా విశ్వాసం.

ఎందరో వర్షాకాలం అని సందేహించకుండా జిల్లెళ్ళమూడిలో వివాహము ఏర్పాటు చేసుకోవటం, అమ్మా! నీదే భారమని ప్రాధేయపడటము అనుగ్రహ స్వరూపిణి అమ్మ కనికరించడమూ అందరికీ తెలిసిన విషయమే.

1978 జూన్ 17న రామకృష్ణ అన్నయ్య మేనల్లుడు లాలా పెళ్ళి. ఆ పెళ్ళికి రెండురోజులు ముందుగానే తుఫాన్ అంటూ రేడియోలో హెచ్చరికలు. జిల్లెళ్ళమూడికి 5 మైళ్ళ పరిధి తప్పించి దేశమంతా భారీ వర్షాలే, అలాగే అన్నపూర్ణాలయ వార్షికోత్సవం రేపు అనగా 14వ తారీఖున వర్షం కురుస్తూనే వుంది. తెల్లవారింది వాన బాగా ఎక్కువైంది. రేడియోలు ప్రమాదపు హెచ్చరికలు చేస్తున్నాయి. నదులు పొంగుతున్నాయి. ప్రకృతి విజృంభిస్తోంది. విచిత్రంగా

నీవు నాకు పెట్టుకుంటే ఎంత తృప్తో నాకు ఎవరికన్నా పెట్టుకుంటే అంత తృప్తి

మధ్యాహ్నం 12 గం॥లకు వర్షం వెలిసింది. ఆకాశం నిర్మలమయింది. సోదర సోదరీమణులు అనేకులు వచ్చారు. బాపట్ల నుంచి పూలు తెప్పించటానికి కుదరక ఎలాగా అని మదనపడుతున్నారు. ఈ లోగా గుడియాత్తం నుంచి దండిగా పూలదండలు, పూలు వచ్చాయి. పూజ యధావిధిగా జరిగింది. వచ్చిన వారంతా తృప్తిగా భోజనం చేసి వారివారి స్వస్థలాలకు చేరారు. మళ్ళీ కన్ను మిన్ను గానక వర్షం. జిల్లెళ్ళమూడి ద్వీపమే అయింది. చుట్టూ సముద్రంగా భాసిల్లింది.

విశాఖపట్టణం షీలానగర్‌లో అమ్మ బిడ్డ ఒకరు శ్లాబ్ వేయిస్తున్నారు. ఆకాశం మేఘావృతమై ఇప్పుడో, కాసేపటికో కుండపోతగా వర్షం కురిసేటట్లు వుంది. శ్లాబ్ వేయటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ దంపతులకు ఏమి చేయాలో తోచక అమ్మనే ఆ గండం గడిచేటట్లు చేయమని హృదయ పూర్వకంగా ప్రార్థించి, 'అమ్మ' మీదే భారం వేసి శ్లాబ్ వేయించారు. అమ్మ కరుణసముద్ర కదా! తాను ఎంతైనా బాధపడ్తుంది కాని తన బిడ్డల దుఃఖాన్ని చూచి సహించలేదు. చుట్టూ వర్షం పడుతూ కనిపిస్తూనే వుంది, కానీ శ్లాబ్ వేస్తున్న ఇంటికి ఎవరో గొడుగు పట్టినట్లుగా ఒక్క చినుకు లేకుండా, వారి పని సజావుగా జరిగిపోయింది. శ్లాబ్ తడపవలసిన సమయంలో రెండు రోజులు వర్షం పడటం చూస్తే అమ్మను అనుసరించి ప్రకృతియే, అమ్మకు అనుగుణంగా ప్రవర్తిస్తుందనటానికి సందేహం లేదని ఘంటాపదంగా చెప్పగలం.

ఒకమారు అమ్మ నివాసమైన మేడమీద వరకు వరద వచ్చింది. ఇంటికి ఆడపిల్ల వస్తే వూరికే పంపిస్తామా అంటూ చీరె, జాకట్టు గుడ్డ, పసుపు, కుంకుమ, పళ్ళు పెట్టాలంది. మేడదాకా వచ్చిన వరదలో అవి వేసి వెనక్కు వెళ్ళమంది. వెంటనే వదర వుధృతం తగ్గి వెనక్కు వెళ్ళటం చూస్తే ప్రకృతి శక్తుల మీద అమ్మకు గల అధికారానికి విస్తుపోవటం తప్పించి మనమేం చేయగలం.

ఎవరూ ఉన్నది వదిలించలేరు. లేనిది తెచ్చిపెట్టలేరు.

అమ్మ వాత్సల్య యాత్రలో గుంటూరు వెళ్ళినప్పుడు చాలా ఎండగా వుంది. అమ్మకు ఎండ తగులుతోందని స్థానికులు ఒకరు గొడుగు తెచ్చి అమ్మకు వేయమన్నారు. రామకృష్ణ అన్నయ్య అమ్మకు గొడుగు పట్టబోతుంటే అన్నయ్యతో అమ్మ 'ఏం చేస్తున్నావని" అడిగింది. నీకు గొడుగు వేస్తున్నానమ్మా అన్నాడు. లక్షగొడుగులు తెప్పించమంది. అన్నయ్య ఆశ్చర్యంతో లక్షగొడుగులా అంటే నేను గొడుగు నీడన వుంటూ నా బిడ్డలు ఎండలో మలమల మాడిపోతుంటే నేను చూడలేనంటూ ఒక్కమారు ఆకాశం వైపు చూచింది. భగభగ మండుతున్న సూర్యభగవానుడు మబ్బుల్లో దాక్కొని చల్లని మలయ మారుతాలు వీచటం చూస్తే అమ్మకు బిడ్డలయందు కల అనురాగం ద్యోతకమవుతుంది.

ఇవన్నీ అమ్మ సర్వ సామర్థ్యానికి, పంచభూతాలపై అమ్మకు గల అధికారానికి నిదర్శనాలని మనం భావిస్తాము. కానీ అమ్మ మాత్రం సాధారణమయిన సంఘటనలే అంటుంది. ఇందులో నా ప్రయత్నమేమి లేదంటుంది. కనుకనే ప్రకృతియే అమ్మని అనుసరించి అమ్మకు అనుగుణంగా ప్రవర్తిస్తుందని భావిస్తాము.

శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు అమ్మ పతిదేవులు. ఆయన్ని అందరం నాన్నగారనే పిలుస్తాము. ఆయన జిల్లెళ్ళమూడి కరణం గారు. 1971లో అసలు వర్షాలు లేవు. అప్పుడు నాన్నగారు "అమ్మగారికి సహస్రఘటాభిషేకం చేస్తే వర్షం కురుస్తుందని" అన్నారు. సహస్రఘటాభిషేకం చేసిన మర్నాడు వర్షం కురిసింది. వర్షంలో తడుస్తూ ఇద్దరన్నయ్యలు వెళ్తున్నారు. 'ఆ అన్నయ్యలు తడిసిపోతున్నారమ్మా!' అని అమ్మతో అంటే ఘటాభిషేకం చేస్తే వర్షం కురుస్తుందని చేస్తున్నారు కదా! నిజంగా వర్షం కురుస్తుందో లేదో అని చూడటానికి వచ్చారు. అందుకని వాళ్ళను వర్షంలోనే వెళ్ళనీ అంది.

వాడు మూవాడు కావడం చేత మూలవాడుగా నాకు కనపడలా.

౨౦. సర్వానందమయి - అమ్మ

ఒక గమ్యానికే పెక్కు మార్గాలున్నాయని వేదం ఒక్కటే చెప్తున్నది. అట్లే అమ్మ ఎవ్వరినీ వారి వారి మార్గాలు మార్చుకోమని ఎప్పుడూ చెప్పలేదు. నీరు ఏవిధంగా నిమ్న ప్రదేశం వచ్చే వరకూ అల్లాడుతుంటుందో అదే విధంగా ఒక వస్తువు యొక్క వాస్తవస్థితి తెలియనంత వరకూ బుద్ధికూడా అల్లాడుతుంటుంది. నిజం తెలిసిన తరువాత శాంతిని పొందుతుంది.

పట్టాభిషేకానంతరం రాముల వారు వానరసేనను సంభావించినప్పుడు వానరులు ఒక్కొక్కరూ ప్రభువు నన్ను చూచి నవ్వాడని, నావైపే చేతులు చాచాడని నన్నే పలకరించాడని, నన్ను మెచ్చుకున్నాడని పలు విధాల సంతోషించారు. అదే విధంగా అమ్మ సమక్షంలో ఎంతమందిమి కూర్చున్నా అమ్మ నన్ను చూచే నవ్విందని, నన్నే చూస్తోందనీ, నన్నే పలకరించిదనీ ప్రతి ఒక్కరం భావించేవారం. అంతమటుకు మనలో వున్న ఆర్తి, ఆవేదనలు తీరిపోయి మనసమస్యలకు చక్కని పరిష్కారాలు లభించేవి.

శ్రీకృష్ణుడు గోపకాంతలతో రాసకేళి నలిపేటప్పుడు "ఆత్మారాముడయ్యును, గోపసతులతోడ అందరకు అందరై నిజ ప్రతిబింబము తోడన్ గ్రీడించు బాలుర పోలిక కేళిసలిపెనట". భాగవతదశమస్కందములో శ్రీకృష్ణుని రాసకేళి గురించి పోతనగారు వర్ణించారు. అట్టి భావం కలుగచేయటం దివ్యపురుషులకు మాత్రమే సాధ్యం కాని ఇతరులకు అనితర సాధ్యమే అవుతుంది.

అమ్మ సిద్ధి పొందిన అనంతరం అమ్మ శక్తి విశ్వవ్యాప్తమై విరాజిల్లుతోంది. అమ్మ తదనంతరం ఆవరణలో అందరికీ చీరెలు ఇచ్చారు. లలితాంబక్కయ్యకు, అమ్మ ఇస్తే అమ్మ కనిపిస్తేనే ఆ చీరె కట్టుకుంటాను, లేకపోతే లేదని అనుకుంది. ఆ రాత్రి అమ్మ అక్కయ్యకు కలలో కనిపించింది. అన్నయ్య ఎవరినో

బాలత్రిపుర సుందరి అంటే బాల్య, యవ్వన, కౌమారస్థితులు కలిసినటువంటిది.

వెళ్ళమంటుంటే, అమ్మ "ఒక నెల వుండనీయండిరా" అని అంటోంది. 'ఒక వందరూపాయలే కదా వుండనిస్తే బాగుండునని' అక్కయ్య అనుకున్నట్లుగా కలవచ్చింది. ఆ తరువాత వందరూపాయలు హుండీలో వేసింది.

ఐ. రామకృష్ణగారు బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన భార్య లక్ష్మికి రెండో కాన్పు అయిన తరువాత చాలా సుస్తీ చేసింది. అమ్మ కలలో కనిపించి "పాపక్కయ్య దగ్గరకు వెళ్ళమ్మా! తను ఎక్కడకు అవసరమనిపిస్తే అక్కడకు తీసుకువెడ్తుందని" అందిట. ఆ కలలోనే "పాపక్కయ్య దగ్గరకు వచ్చినట్లు, వేరే ఆసుపత్రికి తీసుకువెళ్ళినట్లు కనిపించింది. ఆ తరువాత అమ్మ చెప్పింది కదా! అని పాపక్క దగ్గరకు వస్తే, పాపక్క రాజమండ్రి జస్వంత్ ఆసుపత్రికి తీసుకువెళ్ళింది. అది చూడగానే కలలో అమ్మ నాకు చూపించిన ఆసుపత్రి ఇదే అని" లక్ష్మి చెప్పింది. ఎవరికి ఎప్పుడు ఏది అవసరమో అది అమ్మ వున్నప్పటి కంటే ఎక్కువ శ్రద్ధగా మన అవసరాలను కనిపెట్టే వుంటోందనటానికి నిదర్శనమే పై సంఘటన. ఒకమారు ఎమీబియాసిస్‌తో చాలా బాధపడ్తూ అమ్మ దగ్గరకు వెళ్ళాను. అక్కడ వారం రోజుల పైనే నన్ను వుంచి నెల్లూరు డాక్టరు సుబ్బారావుగారికి, జానకీదేవిగారికి ప్రత్యేకించి నా గురించి చెప్పి నాకు వైద్యం చేయించింది. అమ్మ దయ, ఆ జబ్బు అంతటితో నిమ్మళించింది. అమ్మకు పిల్లలయందు కల అపారమైన దయ, కరుణలకు నిదర్శనమే ఈ క్రింది సంఘటన.

ఒక అక్కయ్యకు ఇంట్లో గొడవలు ఎక్కువగా వున్నాయని, వాటిలో మార్పు రాకపోతే తాను ఇంటికి తిరిగి వెళ్ళేదిలేదని అమ్మ దగ్గర భీష్మించుకొని కూర్చుంది. అమ్మ ప్రతిరోజు తిరిగి వెళ్ళమని పోరేది. లలితాంబక్కయ్య 'సరస్వతీ, ఇలాంటివి మనం భరించాల్సిందే కాని దీనికి అమ్మ ఏం చేస్తుందని',

---

ప్రేమ నాకు సహజం.

ఎన్నెన్నో విధాలుగా చెప్పింది. అమ్మ తనకు పరిష్కారమార్గం చూపెడితే కాని వెళ్ళేదిలేదని హఠం వేసుకుంది.

ఏలూరులో వాళ్ళ బంధువులు వున్నారు. సరస్వతక్కయ్య వాళ్ళ ఆయన ఏలూరు వచ్చి అక్కడకు అర్జంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చారు. ఏం జరిగిందో ఏమైవుంటుందో అని కంగారుగా ఏలూరు వెళ్ళింది. ఏలూరులో ఆ బంధువు ఇంట్లో భార్యాభర్తలు కలుసుకోవటం జరిగింది. అక్కడ వాళ్ళ బాబాయిగారు ఇద్దరికీ సయోధ్య కుదిర్చి పంపించారు. కొన్నింటిని అమ్మ తానే స్వయంగా పరిష్కరిస్తుంది. కొన్నింటికి మనల్నే పనిముట్లుగా వాడుకొని ఇతరుల జీవితాలను నందన వనాలుగా మారుస్తుంది. ఇప్పుడు వారిరువురు ఎంతో హాయిగా, ఆనందంగా, అమ్మ సేవ చేసుకుంటూ, మనశ్శాంతితో కాలం గడుపుతున్నారు. ఇప్పుడు ఆయనకు భార్యే గురువు ఆ అన్నయ్యకు అమ్మ చింతన తప్పించి వేరే ఏమి లేక హాయిగా వున్నారు.

లలితాంబక్కయ్య జిల్లెళ్ళమూడిలో స్థిరనివాస మేర్పరచుకున్నది. ఆమె మనవరాలు అనసూయ, గుంటూరులో లక్ష్మీనారాయణ అన్నయ్యను, హైమకు దైవత్వం ఎలా వచ్చిందని అడిగింది. అన్నయ్య గంటకు పైగా తన అనుభూతులను వర్ణించి చెప్పాడు. ఎంసెట్‌కు అప్లై చేయటం కొరకు తన ఒరిజినల్ సర్టిఫికెట్లు ఒక బ్యాగ్‌లో పెట్టి పట్టుకుని వెళ్ళింది. వాటిని పని అమ్మాయి అడిగినా ఇవ్వకుండా ఎంతో జాగ్రత్తగా తన దగ్గరే వుంచుకుని సిటిబస్‌లో ప్రయాణం చేసింది. తాను స్టాపులో దిగి చూసుకుంటే బ్యాగ్ లేదు. పని అమ్మాయిని అడిగితే "నాకు మీరు ఇవ్వలేదని అంది. పక్కనే వున్న కమలక్కయ్య రాత్రి హైమక్కదైవత్వం మీద అపనమ్మకంతో అన్నయ్యను అడిగావు కదా! తన దైవత్వ నిరూపణకు ఈవిధంగా చేసిందేమో అంటూ, నీ సర్టిఫికెట్లు

సమయము, తెలిసి వచ్చేది కాదు. వస్తే తెలిసేది కాదు.

నీకు తప్పక దొరుకుతాయని ధైర్యం చెప్పింది. ఆటోలో ఆ సిటీ బస్సు కొరకు గాలిస్తూ తిరిగారు. 70-/ ఖర్చు అయ్యింది. బస్సు కనిపించగానే పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టయి, ఆ డ్రైవర్నీ, కండక్టర్నీ అడిగితే గుజ్జన్న గూళ్ళ ప్రాంతంలో ఒక చిన్న పిల్లవాడు బ్యాగ్ పట్టుకుని దిగటం చూసామని చెప్పారు. సాధారణంగా బస్సుల్లో ఎంతోమంది ఎక్కుతుంటారు, దిగుతుంటారు. డ్రైవర్ గాని కండక్టరు గాని గుర్తు పెట్టుకోవడం చాలా కష్టం. కాని అమ్మ , హైమల దయవల్ల వారికి ఆ చిన్న ఆచూకీ దొరికింది. అక్కడికి ఆ ఆటోలోనే వెళ్ళారు.

ఒక చిన్న పిల్లవాని చేతిలో తన బ్యాగ్ చూడగానే విపరీతమైన ఆనందంతో 'అదే నా బ్యాగ్ అని అరుస్తుంటే, ఆటో డ్రైవరు అరవకండమ్మా! అరిస్తే అది పుచ్చుకుని పారిపోతే అతన్ని పట్టుకోవడం కష్టమవుతుందని' ఆ సమయంలో వారికి కావలసిన సలహానిచ్చాడు. మీరేమీ మాట్లాడకండి అంటూ ఆ పిల్లవాడి దగ్గరగా తీసుకువెళ్ళి ఆటోను ఆపాడు. ఆ పిల్లవాడి దగ్గర బ్యాగ్ చూచుకుంటే అన్ని సర్టిఫికెట్లు వున్నాయి. వాళ్ళ పెద్దవాళ్ళు ఇప్పుడే పోలీసుస్టేషన్‌లో రిపోర్టు ఇద్దామనుకుంటున్నామని అన్నారు. ఏదిఏమైనా తన సర్టిఫికెట్లు అన్నీ వున్నాయని, అది హైమక్క తన యందు నమ్మకం ఏర్పరచటం కోసమే ఈ రకంగా తనతో ఆట ఆడుకుందని అనసూయ విశ్వాసం.

21. సర్వసిద్ధిప్రదాయిని - అమ్మ

రామానుజులు "నేను ఏపని చేసినా, మాట్లాడినా, తలచినా నీ ముఖం విప్పారాలి. దానిని నేను అనుభవించాలి. దానిద్వారా నా ముఖం వికసించాలి" అని అంటారు. భగవంతునితో తాదాత్మ్యం చెందటానికి అందరం కృషి చేయాలి. ఆయనతో తాదాత్మ్యం చెందిన నాడు నీవు నేను అని వుండదు. అంతా ఒక్కటే. అందుకే ఉపనిషత్తుల్లో "అహం బ్రహ్మాస్మి" అని చెప్పబడింది.

త్యాగం యొక్క చరమదశ సర్వసంగపరిత్యాగము.

కాసు రాధాకృష్ణ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి ఇద్దరూ అన్నదమ్ములు, వారిద్దరూ పుట్టు గుడ్డివాళ్ళు ఆధ్యాత్మిక చింతన ఉన్నవారు, శ్రీశ్రీశ్రీ సత్యసాయి బాబాగారి దర్శనార్థం పుట్టపర్తి వెళ్ళారు. బాబాగారు వారికి అన్ని సదుపాయాలు చేయించి, ఏలోటూ రాకుండా ఎంతో వాత్సల్యంతో చూచారు. అన్నదమ్ములిద్దరూ అమీతుమీ తేల్చుకునేవరకూ పట్టువదలని ధీరులు. బాబాగారు "మీకు చూపుకావాలా?" అని అడిగారు. దానికి వాళ్ళు, ఇచ్చేవాళ్ళు అడిగి ఇస్తారా అని మొండిగా అన్నారు. బాబాగారు "జిల్లెళ్ళమూడి అమ్మ రాజరాజేశ్వరీ అవతారం" అని అన్నారు. అది విన్న అన్నదమ్ములిద్దరూ జిల్లెళ్లమూడి వెళ్ళి "అమ్మ పరమాత్మ ఔనోకాదో తేల్చుకోవాలని" అనుకున్నారు.

వాళ్లు జిల్లెళ్ళమూడి వచ్చేరోజు విపరీతమైన వర్షం బురద, అంధులు. అక్కడి మట్టి సువాసనలు వెదజల్లుతోంది. అది తీసి నోట్లో వేసుకుంటే అద్భుతం. చాలా రుచిగా వుందని చెప్పారు. మొదట్లో అమ్మను దర్శించటానికి వచ్చేవాళ్ళకు అమ్మ మట్టినే ప్రసాదంగా ఇచ్చేదని, అది సువాసనలు వెదజల్లుతూ, రుచిగా వుండేదని చరిత్రవలన మనకు తెలుస్తోంది. అమ్మకు భూదేవి అంటే ఎక్కువ మక్కువ, తన్నినా, కొట్టినా, ఆఖరికి ఉమ్మివేసినా, మలమూత్ర విసర్జన చేసినా ఊరుకుంటుందని ఆవిడకు వుండే సహనాన్ని మనం అలవర్చుకోవాలని అనేది.

వేళగాని వేళల్లో వాళ్ళకు గారెలు కావాలని హఠం చేసేవారు. కొట్టేవారు. అన్నింటిని అమ్మ సహనంతో ఓర్చుకొని వాళ్ళకు కావలసినవన్నీ అమర్చి పెట్టించేది. అమ్మ మంచం ఎక్కటం, పాటలు పాడుతూ అమ్మ తొడమీద గట్టిగా తాళం వేస్తుంటే, అక్కడ వున్నవారు ఏమైనా అనబోయినా, ముక్కుమీద వేలువుంచి 'అమ్మ' వారిని వారించేది. వాళ్ళు వచ్చినరోజు రాత్రి పడుకోవటానికి స్థలం చూపించమని అమ్మమ్మకు చెప్పింది. ఆవరణంతా తిరిగినా ఎక్కడా

తప్పించుకోలేనిదే తరుణం.

నచ్చక అనసూయేశ్వరాలయ గర్భగుడిలో పడుకుంటానని రాధ అన్నయ్య చెప్పాడు. నాన్నగారున్నంత వరకూ తాను అక్కడే నివాసమేర్పరచుకున్నాడు.

అమ్మ వుండగానే హైమాలయం ప్రక్కనే దక్షిణాదిలో మాదిరిగా ఆలయం కట్టించింది. రాధ అన్నయ్య అక్కడ అనేక మహిమలను దర్శించాడు. దేవతల నృత్యగానాలతో గజ్జలచప్పుళ్ళతో అమ్మ నామం చేస్తూ కనిపించేవారనీ ఆయన స్వయంగా చెప్పిన విషయాలే.

అతని నివాసం మార్చమని అమ్మ కబురు పెట్టింది. కాని అక్కడ నుంచి కదలలేదు. గర్భగుడిలో పెట్టుకున్న దుప్పట్లు పోయాయి. "గుడి వుంటే మేడలు, మిద్దెలతో పని ఏముందని?" అమ్మ అంది. లలితాంబక్కయ్య చోటు మార్చరాదా దుప్పట్లు కూడా పోయాయి కదా! అన్నది. "నా జీతగాడిస్తాడు అంతే కాని నేను ఇక్కడ నుంచి కదిలేదిలేదని ఢంకామీద దెబ్బకొట్టి మరీ" చెప్పాడు.

ఆ తరువాత వరుసగా మూడురోజులు ఎందుకు ఆ గుడి ఖాళీ చేయమని అమ్మ అన్నది. ఇప్పుడు ఆ గుడితో పనిఏమివుందమ్మా అని వసుంధరక్కయ్య అన్నది. "గుడిలో చోటువుంటే ఈ మేడల్లో వుండాల్సినపని ఏమిటి?" అని అన్నది అమ్మ. 3వ రోజున అక్కడ విగ్రహం పెట్టించాలని వుందేమోనని లలితాంబక్కయ్య అన్నది. నాన్నగారు పోయిన మర్నాడు రాధ అన్నయ్యను లేపి, గర్భగుడిలో నాన్నగారి సమాధికోసం తవ్వించి, నాన్నగారిని అందులో సమాధిచేయించి సహస్రదీపాలు వెలిగించారు. అంత వేడిలో కూడా నిద్ర బాగా పట్టిందని అన్నాడు.

అమ్మను కొట్టినందుకు పశ్చాత్తాపంతో నిద్రాహారాలు మాని "అమ్మ నామసప్తాహం" చేసాడు. రాధఅన్నయ్య కనీసం మంచినీళ్ళు కూడా తీసుకోవడం

భర్త అంటే శరీరము కాదు; భావన. భర్త భావాన్ని గమనించి మెలిగేది భార్య

లేదంటే అమ్మ స్వయంగా వెళ్ళి అన్నయ్యకు తీర్థం వేసి దీక్ష విరమింపచేసింది. హైమక్క సిద్ధి పొందిననాడు "రాధ అన్నయ్య చేసే జపం చూచి హైమ లేచి వస్తుందేమో అనుకున్నానని అమ్మే" అంటే అందరూ ఆశ్చర్యపోయారు. ఆయన చేసే నామానికి అమ్మ ఎంతో తృప్తి చెంది ఆయనకు సిద్ధులను ప్రసాదించిందా అనిపిస్తుంది. దీక్షలో వుండగా లలితాంబక్కయ్య అనసూయేశ్వరాలయంలో జీవిత మహోదధిలో తరంగాల పారాయణ మొదలు పెట్టి అవతరణ అన్న అధ్యాయం చదివింది. ఆ రాత్రంతా పురిటివాసనే అన్నాడు. ఏమిటా ఈవిధంగా అంటున్నాడని అనుకుంది. రెండురోజుల తరువాత గర్భగుడిలో అవతరణ అన్న అధ్యాయం చదివినందువల్ల అలా వచ్చి వుంటుందని అనుకున్నారు.

ప్రతి పౌర్ణమికి హైమాలయంలో ఏకాహం జరుగుతుంది. అందులో ఓం హైమ నమోహైమ శ్రీహైమ జై హైమ అన్న నామ సంకీర్తన జరుగుతుంది. ఈ మధురనామాన్ని పరమభక్తుడు, మౌని, నామయోగి అయిన శ్రీ కాసు రాధాకృష్ణ రెడ్డి రూపొందించాడు. అతడు తన జీవితాన్ని నామాంకితం చేసుకున్న ధన్యజీవి.

వరంగల్ స్టేట్ బ్యాంక్‌లో అమ్మ రెండవ కుమారుడు బ్రహ్మాండం రవీంద్రనాథ్ అని చేస్తున్నాడు. రాధ అన్నయ్య వరంగల్‌లో రవి అన్నయ్య దగ్గర వుండగా సుస్తీచేస్తే డా॥ ఇనజకుమారి బాపట్ల తీసుకువచ్చింది. ఆపరేషన్ ధియేటర్‌లోకి తీసుకువెళుతుంటే అమ్మ కనిపించి "ఎవ్వరూ లేరనుకున్నావా? నీకు నేను, నాకు నీవు" అని చెప్పింది ఆపరేషన్ టేబిల్ మీద వుండగా డా॥లక్ష్మయ్యగారు ఆపరేషన్ చేయించుకునే నీవు, చేసేనేను, ఆ పైన భగవంతుడు వున్నాడని అన్నారు. అన్నయ్య నెలరోజులకు పోతాడనగా "నేను నీకు ఏమీ చేయలేకపోతున్నాను, నాలోనే నిన్ను చేర్చుకుంటానని" అమ్మ హామీ ఇచ్చింది.

అన్ని ఒక్కటిగా గుర్తించేవాడు జ్ఞాని, అన్నీ తానైనవాడు దైవం.

అతని మరణానంతరం అన్నయ్యను జిల్లెళ్ళమూడిలో సమాధి చేసారు. రాధ అన్నయ్య కర్మయోగి, తపస్వి, తన జీవితాన్నంతా అమ్మ నామంతో పునీతం అవ్వటమే కాక ఇతరులకు మార్గదర్శి అయ్యాడు. అతని సమాధి మీద గణపతి విగ్రహం పెట్టి ఛత్రం అమర్చటం ఎంతైనా ముదావహం. అన్నయ్య అమ్మతో తాదాత్మ్యం చెందినమౌని.

౨౨. సర్వవ్యాపిని - అమ్మ

"జన్మౌషధి మంత్రతపః
సమాధిజాః సిద్ధయః"

"సిద్ధులు పుట్టుకతోనే సిద్ధించవచ్చునంటాడు" పతంజలి మహర్షి. అమ్మ ఎటువంటి పూజలు చేయలేదు. ఏ వ్రతాలు చేయలేదు. అమ్మ, తల్లి గర్భములో పడ్డప్పటి నుంచీ వాళ్ళకుటుంబంలో ఎందరెందరో కాలం చేసారని చరిత్ర మనకు తెలియచేస్తోంది. వారందరికీ భూమి మీదకు రాకపూర్వమే సద్గతి కలుగచేసింది అమ్మ. భూమి మీద అవతరణ జరిగినప్పటినుంచీ ఎందరికో సద్గతి కలుగచేయటమే కాక మనలాంటి వారెందరికో మంచి మార్గాన్ని చూపించి, మనందరినీ తన ఒడిలో ఓలలాడించింది.

శరభలింగంగారు హిందుస్థాన్ జింక్‌లో ఎక్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. 1979లో శ్రావణ శుక్రవారం శరభలింగం గారింటికి ఆయన స్నేహితులు ఐ. రామకృష్ణగారు భోజనానికి వచ్చారు. భోజనం చేస్తున్నంత సేపూ "డివైన్ మదర్" గురించి ఆయన అనుభవాలు చెప్తూ మీరు తప్పక జిల్లెళ్ళమూడి వెళ్ళి 'అమ్మ'ను చూచిరమ్మని మరీ మరీ చెప్పారు. భోజనానంతరం అన్నీ సర్దుకొని శరభలింగం గారి భార్య సువర్చలగారు పడుకొని వుండగా

ఎట్లా చూచే వారికి అట్లా కనబడతాను.

“10 సం॥ల పిల్ల పట్టు పరికిణీ కట్టుకొని పెద్ద బొట్టు పెట్టుకుని మీ ఇంటికి వచ్చేసానని” కలలో చెప్పింది. నిద్రలేచాక ఆమె, అత్తగారితో కలలో కనిపించిన వైనం చెప్పగా శ్రావణ శుక్రవారం పూజ చేసుకున్నావుకదా! ఆ ఆలోచనతో పడుకున్నందున అలా కనిపించి వుంటుందని అనటంతో ఆ విషయం అంతటితో వదిలేసారు.

రామకృష్ణ గారు మరీ మరీ చెప్పారు కదా! అని శెలవు పెట్టుకొని జిల్లెళ్ళమూడి వెళ్ళాలనుకున్నా వీలుపడలేదు. ఒకరోజు ఉదయం నిద్రలేవగానే 5 సం॥ల వాళ్ళ అమ్మాయి ఇందూ మీరు జిల్లెళ్ళమూడి వెళ్దామనుకున్నారు కదా! ఎందుకు వెళ్ళలేదని అడిగితే చాలా ఆశ్చర్యమనిపించి, చిన్న పిల్లవు నీకెందుకే అని అన్నా మళ్ళీ మళ్ళీ జిల్లెళ్ళమూడి ఎప్పుడు వెళ్దామని అడిగింది. శరభలింగం గారు ఆఫీసుకు వెళ్ళగానే వాళ్ళ ఆఫీసర్ పిలిచి మీరు నాగ్‌పూర్ వెళ్ళి ఆఫీసు పని పూర్తి చేసుకుని రమ్మన్నారు. ఇంతకు ముందు వెళ్ళినవాళ్ళు ఏమీ చేయలేకపోయారు, నేను మాత్రం ఏమి చేయగలనని అనుకుంటూ అమ్మ దగ్గరకు వెళ్దామనుకుంటే కుదరటంలేదు, నాగపూర్‌లో పని అయిపోతే జిల్లెళ్ళమూడి వెళ్దామనుకున్నారు. నాగపూర్ వెళ్ళగానే ఇటువంటి ఇబ్బందులు లేకుండా సలక్షణంగా పని జరిగిపోయింది.

నాగపూర్ నుంచి వచ్చిన వెంటనే వారి కుటుంబం అక్టోబర్‌లో జిల్లెళ్ళమూడి వెళ్ళారు. అమ్మ దర్శనార్థం వెళ్ళగానే సువర్చలగారికి శ్రావణ శుక్రవారం కనిపించిన 10 సం॥ల బాలికలాగానే అమ్మ దర్శనమిచ్చింది. దానితో ఆమెకు ఆశ్చర్యానందాలు ముప్పిరి గొన్నవి. దర్శనానంతరం అమ్మ “మీ ఇంటికి ఆగష్టులోనే వచ్చానని” చెప్పింది. దానితో అమ్మ రెండు నెలలు ముందే మనింటికి వచ్చినా గుర్తించలేకపోయినందుకు ఎంతో బాధపడ్డారు.

తృప్తి అంటే ఇంతకంటే మరి ఒకటి లేదనే స్థితి.

అమ్మకు నమస్కారం చేసుకుంటూ మనస్సులో ఏదో విషయమై మధన పడ్తుంటే దానికి తగిన జవాబు స్ఫురించింది. దానితో ఆమెకు ఎనలేని నమ్మకం కుదిరింది.

1980 ఫిబ్రవరి 18 సం॥ల పిల్ల వెంకటరమణమూర్తి ఫోటో పట్టుకొని ఇద్దరు చిన్నపిల్లల్ని వెంట పెట్టుకుని వచ్చింది. తిరుపతి వెడ్తూ జోగి దండుకుందుకు వచ్చామని చెప్పింది. ఆయన ఐదు రూపాయలు ఇవ్వగా, అన్ని ఇళ్ళకు వెళ్ళను. 25రూపాయలు ఇమ్మని అడిగింది. "మాకు తోచింది ఇస్తాము కాని ఇంత అని ఏముందని" అన్నారు. అయిన వాళ్ళంటికే వెడ్తాను. అయిన వాళ్ళనే గుర్తుపట్టలేదా అంటే నీవు ఎవరి తాలూకని అడిగారు. సుబ్బారావు చెల్లెల్ని నన్నే గుర్తు పట్టలేదా అన్నది. క్వార్టర్సులో ఎవరైనా ఏమో అనుకొని 25/- రూ॥ ఇచ్చారు. అమ్మ, పెద్ద కుమారుడు శ్రీ బ్రహ్మాండం సుబ్బారావు. ఆమె అటు వెళ్ళగానే సుబ్బారావు చెల్లెలు అంటే హైమక్క ఏమో అని అనుమానమొచ్చి, వెంటనే స్కూటరు వేసుకుని వీధిలో, అటూ ఇటూ వెతికారు. ఎవ్వరూ కనిపించలేదు. చుట్టుప్రక్కల ఇళ్ళల్లో అడిగితే అటువంటి వాళ్ళెవ్వరూ రాలేదని చెప్పారు. హైమక్కే వాళ్ళింటికి వచ్చిందని పరమానందభరితులయ్యారు.

1986 మే॥ 5న అమ్మ కళ్యాణ వేడుకలు తిలకించి అట్నుంచి 7వ తారీఖుకు కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్ళారు. ఆవిడ కొండమీదకు వెళ్ళాక బయట చేరటంతో శరభలింగం గారు వాళ్ళ అమ్మాయిని తీసుకొని వెంకట రమణమూర్తి దర్శనానికి వెళ్ళారు. అక్కడ నుంచి విమాన వెంకటేశ్వర్లుని చూపించటానికి వెళ్ళారు. వాళ్ళ పాప ఈపాటికి రిజల్ట్స్ వచ్చి వుంటాయని ఆయనతో అంటుంటే, పక్కనే ఉన్న ఒక పెద్ద ముత్తైదువ నీకేమే నీవు ఫస్ట్

బ్రహ్మతత్వమే బ్రాహ్మణత్వము.

క్లాసులో పాస్ అవుతావని అంది. “పెద్దవారు మీ నోటి వాక్యాన, దానికి క్లాసు వస్తే సంతోషం” అని అన్నారు. “నేను చెప్తున్నదాని మీద నమ్మకం లేకపోతే పద్మావతిని అడుగు” అంది. ఎక్కడ్నించి వస్తున్నారమ్మా, ఇక్కడ కూర్చున్నారేం అని అడిగారు. “అజ్మీరు, త్రివేణి సంగమం, కుంభమేళ అన్ని యాత్రలు చేస్తూ తిరుపతి వచ్చాను” అంది ఆమె. “జిల్లెళ్ళమూడి అమ్మ తెలుసా? అక్కడికి వెళ్ళారా” అని అడిగారు. “శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారికి అన్నం పెట్టింది నేనే, నన్నే గుర్తుపట్టలేదా?” అని అంటే ఆయనకు గుర్తురాలేదు. ఎందుకంటె రూపంలో మార్పువుంది. వయస్సు, బొట్టు మాత్రం అమ్మవి లాగానే వున్నాయి. “నేను వెళ్ళాలంటే డబ్బు కావాలి, కొంచెం డబ్బు ఇమ్మని” అడిగింది. 100 రూపాయలు ఇస్తూ సరిపోతుందా? అని అన్నారు. “సరిపోవటానికి అంతేముంది. సరిపెట్టుకోవటమే” అని లోగడ జిల్లెళ్ళమూడి అమ్మ పలికిన పలుకులనే పలికింది. దానితో ఆ స్త్రీమూర్తి అమ్మే అని అమ్మ తదనంతరం కూడా తనకు దర్శనభాగ్యం కలుగచేసిందని మురిసిపోయారు.

రాత్రి 10గం॥లు అవుతుంది, గుడి తలుపులు వేస్తారు కదా! అన్నారు. “నాకు తలుపులు అడ్డు కాదంటుంటే మరీ ఆశ్చర్యమనిపించింది. ఆయనకు, పాపకు బొట్టు పెట్టి అంక్షింతలు వేసి, మీ ఆవిడకు స్నానం అయ్యాక వెయ్యమని” ఇచ్చింది.

జిల్లెళ్ళమూడిలో శ్రీమాత బిల్డింగ్ నుంచీ సువర్చలగారు అమ్మ దర్శనానికి వెళ్తూ లెక్చరర్స్ క్వార్టర్ల మధ్యలో మెట్లు కట్టి వుండటం, చూచి “క్వార్టర్సు అందమే పోయిందని” అనుకున్నారు. అమ్మ దగ్గర కూర్చునివుండగా అమ్మ శరభలింగంగార్ని చూస్తూ “నీ లాంటి ఇంజనీర్లు చెపితేనే మధ్యలో మెట్లు పెట్టించాం నాన్నా! నేనేమి ఇంజనీరును కాదు కదా! నాకు తెలియటానికి”

నాకు నేర్పు గల ఓర్పు అక్కరలేదు. సహజమైన ఓర్పు కావాలి.

అంది. అమ్మ ఆ మాట అనటంతో "నాకు దిమ్మతిరిగిపోయింది, నా మనస్సులో అనుకున్నది గ్రహించి అమ్మ జవాబు ఇచ్చిన తీరుకు ముగ్ధురాలనయ్యాను ఏమిటి? ఈ అమ్మ మనస్సులో దూరి చూడగలదని, అమ్మ సర్వాంతర్యామి అని, అమ్మ కానిది ఏదీ లేదని" ఆమె ఎంతో విశ్వాసంతో తెలియచేసారు.

శరభలింగంగారి అబ్బాయికి మంచి ర్యాంకు రానందున సీటు రాదేమోనని ఆవిడ బాధపడ్తుంటే అమ్మ కలలో కన్పించి "ప్రదక్షిణాలు చేయమంది". వెంటనే వారింటి దగ్గరలో వున్న శివాలయంలో ప్రదక్షిణాలు చేసారు. సీటుకోసం వారి ప్రయత్నాలు వారు చేస్తుండగా వాళ్ళబాబు యూనివర్సిటీ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు. అమ్మ అనుగ్రహం వల్ల కష్టమనుకున్న సీటు వచ్చింది. సీటు వచ్చిన సందర్భంగా అన్ని గుళ్ళల్లో కొబ్బరికాయలు కొట్టాలని ముందుగా లలిత కోవెలకు వెళ్ళారు. పూజారి నిర్మాల్యం తొలగించే పనిలో వున్నందున ఒక ప్రక్కగా నుంచున్నారు. "పూరికే నుంచోపోతే ప్రదక్షిణాలు చేయరాదా?" అని ఎవరో అన్నారు. వీళ్ళు తెల్లబోయి చూస్తుంటే "నేనుగా అనలేదు ఏదో శక్తి నా చేత అలా పలికించిందని" అన్నారు. దానితో వీళ్ళు మా అమ్మే మీ చేత అలా పలికించింది అంటూ ప్రదక్షిణాలు చేసారు. పని జరిగినా ప్రదక్షిణాలు మానవద్దని అమ్మ ఆదేశించిందనిపించింది. కుంభాభిషేకంకు జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు హైమాలయంలో ప్రదక్షిణాలు చేసారు.

తాను భౌతికంగా ఉన్నప్పటికంటే ఎక్కువగా మన బాగోగులు చూచుకుంటున్న సౌజన్యమూర్తి అమ్మ. స్వప్నంలోనో, వేరొకరి చేత చెప్పించో, లేదా మనకే తోచేలా చేసో మనలను సరియైన మార్గంలో నడిపిస్తుంది. అది అర్థం చేసుకొని ఆచరణలో పెట్టి మన జీవితాలను సుగమం చేసుకోవాలి. "తోచినట్లు చేయి, తోపించే వాడు వాడే కదా" అని అంటుంది.

ఒకటి అనుకొన్నప్పుడు ఒకటి జరిగితే మనలను మించినదేదో వున్నదనిపిస్తుంది.

అమెరికాలో వున్న వాళ్ళ అమ్మాయి ఇందూకు అమ్మ కనిపించి "నా ఫోటో ఏదే" అని అడిగింది. మనం మరిచినా తాను మరువదు. మనల్ని మంచి పంథాలో అమ్మే నడిపిస్తుంది. మన గమ్యానికి చేరటానికి అమ్మ సూచించిన విధంగా మన వంతు కృషిని మనం చేయాలి. పురుష ప్రయత్నం వున్న చోట్ల దైవ సహాయం తప్పక అందుతుంది. ఆ నమ్మకంతోనే శరభలింగంగారి దంపతులు అమ్మను అర్చించుకుంటున్నారు. సర్వవ్యాపిని అయిన అమ్మకు తెలియంది ఏముంటుంది?

౨౩. తల్లిధర్మం - డోలోత్సవం

'రాముడు ఏకపత్నీవ్రతం, రాజధర్మం కోసం పుడితే, కృష్ణుడు యుద్ధం ఎట్లా చేయాలో నేర్పటానికి వస్తే, ఇప్పుడు తల్లి ధర్మం కోసం తాను అవతరించానని' అమ్మ నిర్ద్వంద్వంగా ప్రకటించింది. 'మీకు అందరూ సమానమేనా అమ్మా" అని ఒకరు ప్రశ్నిస్తే "పెట్టులో లోటు లేదు. నాకు బిడ్డగా కాక మరొకరకంగా కనపడరు. నేను రాజరాజేశ్వరినని లేదా గురువునని చెప్పలేదు. నేను తల్లిని మీరు బిడ్డలు. నాకు అంతా శిశువులే కాని శిష్యులు లేరు" అని తన సర్వమాతృత్వాన్ని వెల్లడి చేసింది.

అమ్మకు చిన్న పిల్లలంటే ప్రాణం. రెండున్నర సం॥ల పిల్లకు అమ్మచేత అక్షరాభ్యాసం చేయించాలని తీసుకువచ్చారు. అమ్మ పలక మీద 'ఓం' అని రాసి పాప చేత రాయించాలనుకుంటే, ఆ పాప పలకమీద రాసింది చూడక అమ్మ ముఖంలోకే చూస్తోంది, పాప తల్లిదండ్రులు పలక మీద రాసింది చూడమని పాపతో అన్నారు. అదీ, ఇదీ ఒకటే, దాన్నే చూడనీ అని తనే ఓంకార స్వరూపిణినని తెలియచేసింది.

విధి వర్షంలాంటిది. కొందరికి అనుకూలం, కొందరికి ప్రతికూలం.

అమ్మ సమక్షంలో కూర్చుని వుండగా ఒకమారు అమ్మ డోలోత్సవం గురించి వర్ణిస్తుంటే అక్కడ వున్న అందరం ఆనందంతో సూది పడ్డా వినిపించేటంత నిశ్శబ్ధంగా అచేతునలమై వుండిపోయాము. తన ఒడిలో చేమంతి పూలను తుంపి ఆ రేకులను ఎగరవేస్తూ, వాటితో ఆడుకుంటూ "లక్షమంది పసిపిల్లలతో ఆడుకుంటున్నట్లుగా వుందని అంది. ఆ లక్షమంది పిల్లలకు కచ్చూరాలు, భావంచాలూ వేసి సున్నిపిండి పట్టించి కాళ్ళమీద పడుకోబెట్టుకుని నూనెరాసి నలుగుపెట్టి లక్షగంగాళాలతో వారికి వేడినీళ్ళు తోడిపోస్తే ఎంత బావుంటుందో" అని తాను ఊహించుకుంటూ మమ్మల్ని ఊహాలోకంలోకి తీసుకువెళ్ళింది. నలుగు పెట్టిన పిండి గుట్టలు, కొండలుగా అవుతుందని అమ్మ చెప్తుంటే నిజంగానే అంతమంది పిల్లలను కాళ్ళమీద పడుకోబెట్టుకొని స్నానం చేయిస్తూన్నట్లే మా అందరికీ దృశ్యమానమయింది. "పిల్లలకు పోసిన నీరు కాలవల్లాగా పారుతూ అన్నీ కలసి ఒక నదిలా ప్రవహించాలని, అంతమందికి తుడవటానికి మెత్తని తెల్లని గ్లాస్కో గుడ్డలు వుండాలని, స్నానానంతరం వారందరికీ సాంబ్రాణి పొగ వేయాలని ఆ పొగ విశ్వమంతా వ్యాపించాలని" చెప్తుంటే ఆనందసాగరంలో ఓలలాడటమే మా పని అయింది. "లక్ష వుయ్యాలల్లో ఆ పిల్లల్ని ఊపుతూ జోలపాడుతూంటే ఆ లాలిపాటలు వేదంలా మారుమ్రోగాలని" అమ్మ చెప్పింది.

చిలువలు, పలువలుగా ఆ డోలోత్సవాన్ని వర్ణిస్తుంటే విని తీరవలసిందే కాని వర్ణించనలవికాదు. ఆ రేకులన్నీ వాళ్ళో పోసుకొని ఒక్కోరేకు ఒక్కో శిశువులా వుందని అమ్మ చెప్తూ ఆనందించే తీరు జన్మ జన్మలకీ మర్చిపోలేమనిపిస్తుంది. అమ్మ వర్ణిస్తున్నంతసేపు ఆ లక్ష ఉయ్యాలలూగుతున్నట్లే, వానితో పాటు జోలపాటలు వీనుల విందు కలిగించిన అనుభూతి కలిగింది.

తరుణమంటే తప్పించుకుందామన్నా తప్పనిది. చేద్దామనుకొన్నా చేయనీయనిది.

ఆ సమయంలో అమ్మ పొందిన పారవశ్యానికి, ఆనందానికి విలువ కట్టలేమనిపించింది.

ఆ రోజు అమ్మ వర్ణించిన డోలోత్సవం గురించి వింటూ 'అమ్మా లక్షమంది పిల్లలకు ఒకేమారు నలుగు పెట్టి స్నానం చేయించాలని అంటున్నావు, గవర్నమెంట్ కుటుంబనియంత్రణో అని నెత్తీనోరు బాదుకొంటున్నది కదా!' అని అన్నాను. "నేను తల్లి ధర్మం కొరకు వచ్చాను. నా పని నిత్య చూలింత, నిత్యబాలింతనని మనందర్నీ కని, మన తల్లులకు పెంపుడిచ్చాను" అని అంది. 'అందరూ నీ బిడ్డలే అయినప్పుడు కొందరికి బాధలు, కొందరికి సుఖాలు ఎందుకని' అన్నాను "అన్నింటికంటే అవసరం విలువైనదని, పూలు మాలగా కావాలనుకుంటున్నాను కనుక దారంతో బిగించక తప్పదు. మాలను ధరించానుకుంటున్నాను, కనుక బిగిస్తాను" అంటూ మనందర్నీ మాలలో పూలుగా వర్ణిస్తూ, మన విధి విలాసాలపై తనకు గల సర్వాధికారాన్ని గుర్తు చేసింది. అమ్మ జగన్నాటక సూత్రధారిణి కదా!

అమ్మ వర్ణించిన డోలోత్సవం ఎంత తొందర్లో మన చర్మ చక్షువులకు గోచరిస్తాయా అని ఎదురుచూచాము. అమ్మ స్వర్ణోత్సవ, వజ్రోత్సవ వేడుకలను తిలకించిన మేము డోలోత్సవాన్ని ఎప్పుడెప్పుడు పరికిస్తామో అని వువ్విళ్ళూరాము. కానీ కాలపురుషుని కోరికను మన్నించి 'అమ్మ' భౌతిక శరీరాన్ని పరిత్యజించింది. అప్పుడు నాతోపాటు కొంతమంది అన్నయ్యలు, అక్కయ్యలు ఆ గదిలో వుండటం సంభవించినది. ఇది చదివిన వారికి ఆ పాత రోజులు జ్ఞాపకం వచ్చి వారు కూడా అమితానంద భరితులవుతారని నా నమ్మకం.

"తినకపోతే మీరు చిక్కిపోతారు. మీకు పెట్టుకోకపోతే నేను చిక్కిపోతాను.

నన్ను ఎవరూ, కొట్టీ తిట్టీ ఏడిపించలేరు. వాళ్ళ మంచితనంతో ఏడిపించగలరు.

మీరు తింటే నేను తిన్నట్లే" అని చెప్పింది. "పెట్టుపోతల్లో దగ్గరవున్నవాడు అనుభవించవచ్చుగాని, తల్లికి మానసికంగా దూరంగా వున్న వాడిమీదే వుంటుంది. ఎవరు చిన్నవాడో, ఎవరు నలిగినవాడో వాడిగురించి ఆలోచించినట్లుగా పుష్టిగా వుండే పిల్లల గురించి ఆలోచించదు. కాని ప్రేమలో మార్పు వుండదు. అందర్నీ ఒకేలా ప్రేమిస్తుందని" అంటుంది.

అలాగే నాలుగు రూపాయలు హుండీలో వేసే వాడిమీద ఎంతప్రేమ వుంటుందో, అన్నం వండే వాడిమీద, దొడ్లు తుడిచేవాడి మీద అంతేప్రేమ వుంటుంది. ఇందులో ఎవరికీ ప్రత్యేకతలు లేవని తన విశ్వజనీనతను చాటుకుంది.

24. సర్వజనీనత - అమ్మ

"ఎఱుక గలవారి చరితలు
గఱచుచుసజ్జనుల గోష్ఠికదలక ధర్మం
బెఱుగుచునెఱిగిన దానిని
మఱువకనుష్ఠించునది సమంజసబుద్ధిన్".

జ్ఞానవంతుల చరిత్రలు తెలిసికొనుచు, సత్పురుషుల సాంగత్యము విడువక ధర్మము తెలిసికొనుచు, దానిని మఱచిపోక సమంజసబుద్ధితో ఆచరించవలెనని మహాభారతంలో చెప్పబడినది. మహాభారతం సూక్తుల నిధి. చతుర్విధపురుషార్థ సాధకములగు ఈ సూక్తులు నిత్యజీవితంలో మనము ఆచరించవలసినవి.

మానవుని యొక్క ఋజుమార్గ ప్రవర్తనమే మనలనుద్ధరించు కొని, సమాజాన్ని కూడా సంస్కరించగలదు. దానికి ఉదాహరణమే శ్రీ వివేకానందస్వామి. ప్రతివారు ఎవరికి వారు ఋజుమార్గంలో పయనిస్తే దేశం అభ్యుదయ మార్గంలో దానంతటదే పయనిస్తుంది.

సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజాద్రవ్యాలు కావాలి.

దసరాల్లో అమ్మ దగ్గర పూజ చేసుకుందామని వెళ్ళాను. హైమక్క పుట్టి 35 వసంతాలు నిండిన సందర్భంగా సరస్వతీ పూజ నుండి నాలుగు రోజులు పూటకు మూడేసి రకాల స్వీట్సు చొప్పున, అనగా రోజుకు 9 రకాలు, రకానికి 36 చొప్పున చేయించింది, సరోజినక్కయ్య వాళ్ళింట్లో మొసలికంటి ఉషను, సరోజినక్కయ్యను సాయం తీసుకుని చేయమంది. ఆ విధంగా 4 రోజులు గడచిన పిమ్మట అమ్మ దర్శనానికి వెళ్ళినప్పుడు శేషు, అమ్మతో “కుసుమపిన్ని దసరాపూజలు చేసుకుందామని వస్తే కుంపటి అంటగట్టావేమమ్మా” అంటే “ఇది మాత్రం పూజకాకపోతే కదా! పూజ చేసుకుందామన్న సంకల్పం కలిగినప్పటినుంచి, పూజ కొరకు చేసే ప్రతిపని పూజలో భాగమే” అంది.

అమ్మ అపార కరుణా సముద్ర. ఆర్థికంగా బాగా ఇబ్బందుల్లో మునిగి తేలుతున్న నా చేత అమ్మ ఎన్నెన్నో పూజలు చేయించింది. నేనుగా అంతఖర్చులు పెట్టుకొని చేసుకునే అవకాశమేలేదు. ఒక ఏడాది లక్ష్మీనారాయణ అన్నయ్య దసరాకు అమ్మకు పట్టుచీరెలు కొని ఒక్కొక్క రోజు ఒక్కొక్కరిచేత అమ్మకు పెట్టించాడు. ఆ అదృష్టం నాకు కలిగింది. ఎప్పటికైనా నేను పెట్టుకోగలనా అని అనుకున్నాను. అమ్మాయి పెళ్ళికి, మళ్ళీ దసరాల్లో పట్టుచీరె నాచేత పెట్టించుకొని నా కోరికను నెరవేర్చిన కల్పతరువు అమ్మ. బస్తాలతో పసుపు, కుంకుమలు, వందలాది కొబ్బరికాయలు, గంపలకొద్దీ పువ్వులతో తనివితీరా అర్చించుకునేదాన్ని, నాలా ఎందరో ఆ అవకాశాలను వినియోగించుకున్నారు. ఇది అమ్మ యొక్క సర్వజనీనతకు ప్రతీక.

మన యొక్క నిర్వ్యాజప్రేమయే అమ్మ యందు మనకు భక్తి కలిగేటట్లు చేస్తుంది. అవకాశాలు రెండుసార్లు వచ్చి మన తలుపు తట్టవు. తట్టినప్పుడు ఆహ్వానించి వినియోగించుకునే శక్తి అమ్మ మనకు కలుగచేస్తుంది.

మనస్సే మంత్రం, శబ్దమే బీజం. దాని నిలకడకు అక్షరాలు.

హైమాలయంలో నేను, భట్టి ప్రోలులో వున్న రామకృష్ణ అన్నయ్య చెల్లెలు, బావగారు అభిషేకాలు చేసుకుంటున్నాము. "నూతిలో నీళ్ళకేమీ కొదువలేదు, ఎక్కువ నీళ్ళతో అభిషేకం చేయమని" కబురు పెట్టింది. ఆ తరువాత నీళ్ళు అందించేవాళ్ళు అందిస్తున్నారు. ఎన్ని బిందెల నీళ్ళు అభిషేకము చేసామో లెఖ్ఖలేదు.

ప్రత్యేకించి దసరాలకు అమ్మ దగ్గరకు వెళ్ళటానికి కారణం పదిరోజులూ తెల్లవారుఝామున పూజలు మొదలుపెట్టకముందే నేను, శేషు అమ్మచేత బొట్టు పెట్టించుకునేవాళ్ళం. అమ్మ మొదట్లో తన దర్శనానికి వచ్చిన అందరికీ తన స్వహస్తాలతో బొట్టు పెట్టేది. అమ్మ దర్శనానికి వచ్చే జనం ఎక్కువ అవటం, మనందరి రోగాలను తాను తీసుకోవటంతో శారీరకంగా అమ్మ చాలా బాధపడటంతో చివర్లో ఆ అవకాశం వుండేది కాదు. శారీరకంగా ఎంత బాధపడ్తున్నా ఎంతమంది జనం వచ్చినా అందరికీ లేదనకుండా దర్శమిచ్చే ఆ సర్వజనీనత ఇంకెవరికీ లేదేమో అనిపిస్తుంది.

దసరాపూజల్లో టిఫిన్ తిని పూజ చేయటమేమిటని, ఏమీ తినకుండా కాఫీ మాత్రం తాగి అభిషేకానికి కూర్చున్నాను. ప్రొద్దున్న పూజ అవ్వగానే బాలభోగం తిని అభిషేకానికి కూర్చోవచ్చుని అక్కడి అక్కయ్యలు చెప్పినా తినలేదు. అభిషేకానికి పూలు కావాలంటే హైమాలయం దగ్గరవున్న తోటలో పూలు కోస్తున్నాను. "హైమాలయం వెనకాల, అలంకార హైమ దగ్గర కుసుమ వుంది. దాని ప్రసాదం నేను తినమన్నానని" ప్రత్యేకించి అమ్మ కబురు చేసింది. నేను తినకుండా వున్న సంగతి అమ్మకు తెలిసే అవకాశమే లేదు. అమ్మ సర్వజ్ఞిని కాబట్టే నాకు ఆవిధంగా కబురుపెట్టింది. ఆ ప్రసాదం తినకుండా వుంటే అభిషేకాలు, మధ్యాహ్నం పూజా కార్యక్రమాలు, మళ్ళీ వడ్డన, వీటితో

అడిగిన వాళ్ళకు అడిగినదే ఇస్తాను. అడగని వాళ్ళకు అవసరమైనది ఇస్తాను.

భోజనం చేసే అవకాశమేలేదు. సాయంత్రం 5 గం॥కు భోజనం చేసి వెంటనే స్నానం చేసి సాయంత్రం పూజకు కూర్చునే వాళ్ళం. పూజ, మంత్రపుష్పము, భోజనం అయ్యేటప్పటికి రాత్రి 10గం॥లు దాటేది. ఆ తరువాత అమ్మ దగ్గరకు చేరేదాన్ని, ఎవరైనా ఏదైనా అమ్మతో మాట్లాడుతుంటే వినటం, లేదా ఆమాటా, ఈ మాటా మాట్లాడుకుంటూ అక్కడే నిద్రించేదాన్ని. అలా పదిరోజులు గడపగలగటం కోసమే దసరా సెలవలివ్వగానే జిల్లెళ్ళమూడి వెళ్ళి మళ్ళీ స్కూలు తెరిచే రోజుకు వచ్చేదాన్ని. నేను అంత హాయిగా, సంతోషంగా అమ్మ దగ్గర గడపగలగటానికి మా ఆయన, అత్తగారు, పిల్లలయొక్క సహాయ సహకారాలు ఎంతో తోడ్పడ్డాయి.

బాబు యాక్సిడెంట్ అయి వాడు నడవటం మొదలు పెట్టిన తరువాత దసరాల్లో మా కుటుంబసమేతంగా అమ్మను అర్చించుకున్నాము. నీవు, పిల్లవాడు వెళ్ళివస్తే చాలదా అని మా వాళ్ళు అంటే మీ అందరికీ తిరుపతి మొక్కు ఎలాంటిదో నాకు జిల్లెళ్ళమూడి అలాంటిదని చెప్పాను.

మొదటిసారి అమ్మను దర్శించుకున్న తరువాత, మురళీ అన్నయ్య హైద్రాబాద్ రమ్మంటే అమ్మ అనుమతి తీసుకుని వెళ్ళాను. మా వదినకు రెండవ కాన్పు తరువాత నెత్తిమీద ఒక్క వెంట్రుక కూడా లేకుండా పూర్తిగా ఊడిపోయింది. ఎంతమంది స్పెషలిస్టులకు చూపించినా ఒక్కరూ దానికి కారణం చెప్పలేకపోయారు. మళ్ళీ జుట్టు వస్తుందో లేదో కూడా చెప్పలేకపోయారు. ఆ విషయం అమ్మకు చెప్తూ వెంకటరమణమూర్తి మొక్కు తీర్చకపోవటం వల్ల వూడిపోయిందంటున్నారమ్మా అని మురళీఅన్నయ్య అన్నాడు. "వెంకట రమణమూర్తి కావాలంటే గుర్తు చేస్తాడు కాని ఆయనెందుకు పూర్తిగా తీసేస్తాడు" శశిని దిగులు పడవద్దని చెప్తూ అని వదిన తల మీద వున్న

చెప్పేదీ, వినేదీ, కానిది వేదాంతం. అర్థం కావడమే అనుభవం.

స్కార్ఫు తొలగించి ఎడం చేత్తో గుండు నిమిరింది. 6 నెలలగా నున్నగా వున్న తల మీద అమ్మ చేత్తో రాసిన మర్నాడే గరుకుగా అవటం అమ్మ మహిమ కాక మరేమిటి.

మా వదిన జుట్టు వస్తే తిరుపతిలో తలనీలాలు ఇచ్చుకుంటానని మొక్కుకుంది. మురళీ అన్నయ్య, "అమ్మా నాకు తిరుపతి ఇదే, వెంకటరమణమూర్తివి నీవే, ఇక్కడే తలనీలాలు ఇస్తానని" అన్నాడు. దానికి అమ్మ "నీకు పూర్తిగా ఆ మాట మీదే విశ్వాసం వుంటే నాకు కావలసినది నేను తీసుకుంటానంటూ మూడు కత్తెర్లు వేసింది." ఏ డాక్టర్లు చెప్పలేనిది రెండు ముక్కల్లో తేల్చివేసిందంటే అమ్మ యొక్క లీలావిశేషాలకు ఇది ఒక మచ్చుతునక.

"సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానేపరిసమాప్యతే" అని గీతాకారుని ప్రబోధం. సకల కర్మలు జ్ఞానంతోనే పర్యవసిస్తున్నాయి. కాబట్టి జ్ఞానపూర్వకమైన కర్మాచరణం ఆధ్యాత్మిక సాధనకు ఆధారం, అజ్ఞానాన్ని పారద్రోలి అంతర్ముఖం కోసం మనం ప్రయత్నించినప్పుడు అమ్మ చేయూత మనకు సర్వదా లభిస్తుంది.

సమర్పణ భావం మనలో పెరిగి అంతా అమ్మగా తోచిననాడు అమ్మ యొక్క పరిపూర్ణ కటాక్షం మనకు లభ్యమవుతుంది. దాని వలన మనం తలపెట్టిన కార్యక్రమాలకు విఘ్నములు తొలగి కార్యసిద్ధి కలుగుతుంది. అమ్మను సర్వాత్మగా భావించిన నాడు దీప కాంతి ప్రసరించగానే చీకట్లు నశించినట్లు, మనలోని అజ్ఞానం తొలగి జ్ఞానయుతమవుతుంది. అమ్మ తలపెట్టిన సేవా కార్యక్రమాలలో పాల్గొని ఆ దివ్య ఔషధాన్ని పానం చేసినట్లయితే భవరోగాలనుండి మనకు విముక్తి లభిస్తుంది.

సంసార బాధ్యతలే ఆధ్యాత్మిక సాధన. ఆధ్యాత్మిక సాధన అంటే అదేదో వేరుకాదు.

25. మాతృతత్వం - అమ్మ

షోడశ కళాప్రపూర్ణ సుధాకరబింబము వలె అమ్మ వదనమండలం చిరునవ్వుల వెన్నెలలు విరజిల్లుతూ చూచేవారికి పరమసుఖంగా, హాయిగా వుంటుంది. కఠోర నియమ నిష్ఠలతో, అష్టాంగ యోగప్రక్రియలతో నిద్రాహారాలు విసర్జించి, సంసారాలను వాటి కర్మకు వదిలేసి, ఎండమావులలో నీటి కోసం అన్వేషించే కంటే తాము హాయిగా వుంటూ ఇతరుల కన్నీళ్ళు తుడుస్తూ, ఇతరుల దరహాసాలలో తమ జీవన శరశ్చంద్రికలను వెతుక్కోవడం సులభం కదా!

అమ్మ దగ్గర వుండగా మా మరిదిగారు కుటుంబరావుగారు మంత్రాలయం, శ్రీశైలం తీసుకువెడ్తానంటే అమ్మ అనుజ్ఞ పొంది వెళ్ళాము. మంత్రాలయంలో మా మరిదిగారి కొత్త గడియారం పోవటంతో అమ్మనే నిలదీసాను. పూజించినా, తిట్టినా, కొట్టినా అమ్మనే కదా! ఎక్కడైతే ప్రేమ, ఆరాధన, వుంటాయో అక్కడే కోపం తిష్టవేసుకొని వుంటుంది. లాడ్జిలో మర్చిపోయి వుంటారేమోనని వెడితే నీళ్ళు పోసేవాడు ఆ వాచీ తెచ్చి ఇచ్చాడని ఆ మేనేజర్ ఇచ్చాడు. ఈ కలియుగంలో ఇలాంటి వారుండబట్టే ధర్మం ఒక పాదానన్నా నడుస్తోంది.

మంత్రాలయం నుంచి శ్రీశైలం వెళ్ళి భ్రమరాంబికా మల్లిఖార్జునుల దర్శనానంతరం హటకేశ్వరంలో, శ్రీశ్రీశ్రీ పూర్ణానంద స్వామీజీని దర్శించాము. జిల్లెళ్ళమూడిలో పూటకు మూడురకాల స్వీట్సు చొప్పున 4 రోజులు 36 రకాల స్వీట్సు హైమక్క 36వ జన్మదిన శుభసందర్భంగా నేను చేసానని మా చెల్లెలు వసంత స్వామీజీతో చెప్పింది. "గురు పౌర్ణమికి వచ్చి స్వీట్సు చేసి పెట్టమని" స్వామీజీ అడిగితే అలాగే అన్నాను. కానీ వెళ్ళటమే కుదరలేదు. నాకు కాలు విరిగి మంచంపై ఉన్నప్పుడు "కుసుమ చాలా బాధపడ్తున్నది. దాన్ని నేను

రోగికి వైద్యుడు నారాయణ స్వరూపుడే కాదు, వైద్యునికి రోగికూడా అంతే.

రమ్మన్నానని, వైద్యం చేయించి పంపుతానని" కబురు చేసారు. నా ప్రమేయం లేకుండానే నా విషయం స్వామీజీ తలపుల్లోకి వచ్చినందుకు చాలా ఆనందం, ఆశ్చర్యమనిపించింది. అప్పటి నుంచి స్వామీజీ దగ్గరకు వెళ్ళాలన్న ఆర్తి, తపన ఎక్కువైంది. మహాత్ముల అనుమతి లేనిదే వారి దర్శనం చేయలేము. అమ్మతో "ఎన్ని రోజుల నుంచో నిన్ను చూడాలనుకున్నానమ్మా" అన్నాను. "నీవు చూడాలని అనుకున్నావు కానీ నేను అనుకోలేదు కదా" అని అన్నది. అందుకే స్వామీజీ దర్శనం కోసం తహతహ లాడాను.

స్వామీజీ సమక్షంలో మా చెల్లెలు రాజ్యం కొడుకు, దత్తు ఒడుగు జరుగుతోందని తెల్సి కోణార్క్‌కు విజయవాడ వరకు రిజర్వు చేయించుకున్నాము. రాత్రి వెడతామనగా సాయంత్రం స్వామీజీకి స్వీట్సు చేసి పెడ్తానన్న విషయం జ్ఞప్తికి వచ్చింది. అప్పటికప్పుడు బర్ఫీ చేసి తీసుకువెళ్ళాను. 13 సం॥రాల క్రిందటి మాట ఆ సమయంలో గుర్తు రావడం నిజంగా అమ్మ దయే కారణం. మనస్ఫూర్తిగా ఏది అనుకున్నా తక్షణమే అది సానుకూలపడేలా అమ్మ చేస్తుంది.

స్వామీజీ వైజాగ్ వచ్చిన సందర్భంగా ఆయన్ని దర్శించుకునేందుకు వెళ్ళాము. స్వామీజీ కాలు మీద కాలు వేసుకు కూర్చుంటే అప్రయత్నంగా ఆయన పాదాన్ని స్పృశించాను. వెంటనే నాలో నాకే తెలియని పరమానందస్థితిని పొందాను. ఒడలు మరిచి దాదాపు గంటసేపు అలాగే వుండిపోయాను.

మర్నాడు నేను, మా కొలీగ్ రవిబాబు గారు స్వామీజీని దర్శించుకోవటానికి వెళ్తున్నాము. ఆ రోజు జనవరి 1 అవటం వలన ఎక్కడా పూలు దొరకలేదు. అమ్మను రాజరాజేశ్వరిగా అర్చించుకుంటున్న రవిబాబుగారు, స్వామీజీని, అపరశివావతారం అంటారు కదా! నిజంగా ఆయన

ఏది వచ్చినా, సమంగా చూడగలిగిన గాఢమైన మార్పులేని భావమే బ్రహ్మానందం.

ఈశ్వరుడే అయితే ఆయన్ను అర్చించుకోవటానికి తెల్లగులాబులు దొరకాలని మనస్సులో అనుకున్నారు. అలా అని ఎవ్వరికి చెప్పలేదు. ప్రతి పూలకొట్టులో చూచుకుంటూ వచ్చాము. ఎక్కడా పువ్వులు దొరకలేదు. అక్కయ్యపాలెం దాకా వచ్చాక స్కూటర్ వెనక్కి తిప్పుతుంటే "ఎందుకు వెనక్కు తిప్పుతున్నారని" అన్నాను. "ఒక అమ్మాయి బుట్ట పట్టుకు వస్తోంది. అందులో పూలు వున్నాయేమోనని తిప్పానని" అన్నారు. ఆమె బుట్టమీద గుడ్డతీయగానే ఎఱ్ఱగులాబులు వుంటే వాటన్నింటినీ బేరం చేసి తీసుకున్నాము. తీరా చూస్తే పూల అడుగున రెండు తెల్లగులాబులున్నాయి. దానితో ఆయన మానసం ఉప్పొంగిపోయింది. ఆ పూలు తీసుకువెళ్ళి ఒకటి స్వామీజీ పాదాల మీద పెట్టాను. రవిబాబుగారు స్వామీజీ చేతికి పువ్వు ఇచ్చి నమస్కారం చేసుకున్నారు. అమ్మ చేత బొట్టు పెట్టించుకోలేదన్న కొరతను స్వామీజీ బొట్టు పెట్టటంతో తీరిందని ఎంతో ఆనందంతో చెప్పారు. ఆయన కోరికను మన్నించిన స్వామీజీకి నమస్సుమాంజలులు అర్పించారు. మహాత్ములకు తెలియంది లేదుకదా! మన మనస్సులోని కోరికలను ముందుగానే గ్రహించి మనలను అనుగ్రహిస్తారు.

మా అమ్మాయి మాధవి ఆయన దర్శనార్థం వస్తే దానికి బొట్టుపెట్టి పెద్ద పూలమాల వేసి తల మీద పూలు చల్లారు. అది చూచిన నాకు 'అమ్మ' పెళ్ళికూతుర్ని చేసే ఘట్టం గుర్తుకువచ్చి అంతమటుకు నాలోవున్న వ్యధ దూరమై, అది కోరుకున్న వరునితో వివాహం చేయ సంకల్పించాము. ఆ సమయంలో నన్ను వ్యధ నుండి దూరం చేయటానికే స్వామీజీ వైజాగ్ వచ్చి, మా ఇంట్లో మా కుటుంబ సభ్యులతో గడపగల్గటం నిజంగా మా అదృష్టం. మహాత్ముల అనురాగానికి అవధులుండవు కదా!

వివాహం ఎలా చేయాలో తేల్చుకోలేని విషమ పరిస్థితిలో దత్తు పెళ్లి

మనిషికి సంతృప్తే నిజమైన భాగ్యం. అసంతృప్తిని మించిన దరిద్రం లేదు.

శ్రీశైలంలో జరుగుతోందని తెల్సి వెళ్ళాను. మనస్సు వ్యాకులత చెందిన నాకు, సరియైన పరిష్కార మార్గాన్ని సూచించి ఎవరికీ, ఎటువంటి ఇబ్బంది, కష్టం కలుగకుండా స్వామీజీ కాపాడారు. అమ్మ సిద్ధిపొందిన అనంతరం స్వామీజీ సలహా సంప్రదింపులే మాకు కొండంత అండగా వున్నాయి. ఆయన సమక్షంలో మేము అమ్మ దగ్గర పొందిన ఆనందాన్ని, తృప్తిని, హాయిగా పొందగల్గుతున్నాము.

శ్రీశ్రీశ్రీ పూర్ణానందస్వామీజీ సిద్ధ పురుషులే కాదు, అవతార పురుషులు కూడా. ఆయనను ఎందరో పరమశివునిగా దర్శించుకున్నారు. మేము పరమశివుని అవతారంగా భావిస్తాము. భగవంతుని స్త్రీ రూపంలో కొలిచినా బొమ్మా, బొరుసులుగా ఇటునుంచి చూస్తే అమ్మవారు, అటునుంచి చూస్తే అయ్యావారు. అట్టి అర్ధనారీశ్వరతత్వమే భగవంతుడు. అణువు మొదలు బ్రహ్మాండము వరకూ అంతటా అర్థవంతమైన ఈ అర్తనారీశ్వర తత్వ వైభవమే. ప్రతి దంపతులు అట్టి అర్ధనారీశ్వర తత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి.

మనకు కనిపించేదంతా ఆ మాత రూపమే. కన్ను మూసినా, తెరచినా కనిపించేది అమ్మ మాత్రమే. మనకు బోధ పరచుటకు మాయ అని వివరించినా అనుభవంలోకి వచ్చే సరికి 'మాతా' అంటూ మోకరిల్లారు "శ్రీ ఆదిశంకరులు".

బిడ్డకు కష్టం వచ్చినా, సుఖం వచ్చినా ముందుగా తల్లితో చెప్పుకుంటాడు. బిడ్డ అవసరాలకు, శ్రేయస్సుకు అనుగుణంగా తల్లి తన పాత్రను పోషిస్తూనే వుంటుంది. "అసలైన అమ్మకు ఎవరిని చూచినా బిడ్డే అనిపిస్తుంది" అని అమ్మ అంటుంది. మాతృత్వం స్త్రీకే పరిమితమైనా మాతృతత్వం స్త్రీ పురుషులిద్దరికీ సమానమేనని, ఆ తత్వాన్ని పెంపొందించుకొనటానికి అందరం కృషి చేయాలని పదేపదే తెలియచేసింది. అందరిలో ఆ మాతృతత్వాన్ని పెంపొదించేందుకు సహకరించవలసినదిగా మాతృమూర్తియైన అమ్మను వేడుకుందాము.

కళంకరహితమైన మనస్సును కళంకరహితంగా మరొక వ్యక్తికి అర్పణ చేయడం కళ్యాణం.

26. వరప్రదాయిని - అమ్మ

శరత్కాలపు నీలాకాశం నిండా వెన్నెల వెలుగుల్ని వెదజల్లుతూ సౌందర్యపు కొలనులో విరిసిన తెల్ల కలువలాంటి అమ్మను చూస్తూ కూర్చున్న సంఘటన గుర్తుకు వచ్చినప్పుడల్లా మనస్సు వివశతను పొందుతుంది.

మా మరిదిగారు కుటుంబరావుగారు పి.డబ్ల్యు.డిలో ఇంజనీర్‌గా పనిచేసారు. ఆయనకు మొదటి నుంచీ దైవభక్తి ఎక్కువ. సాధువుల సాంగత్యమన్నా మక్కువ మెండు. విజయవాడలో వున్నప్పుడు ఆయన లలితా సహస్రనామం చేస్తుంటే నీవు జిల్లెళ్ళమూడి వస్తున్నావు. నీవు జిల్లెళ్ళమూడి వస్తున్నావంటూ అదే పనిగా వినిపించింది. "నా దగ్గర డబ్బులు లేవు. నేను అడగకుండా ఎవరైనా డబ్బులు ఇస్తే నీ దగ్గరకు వస్తానమ్మా! అని అనుకున్నారు. అంతమటుకు అమ్మ గురించి వినివున్నారు కానీ అమ్మను దర్శించలేదు.

ఆ సమయంలో ఆయన స్నేహితులు 50 రూపాయలు ఇచ్చి నా దగ్గరవుంటే ఖర్చు అయిపోతాయి, నీ దగ్గర వుంచు నాకు అవసరమొచ్చినప్పుడు తీసుకుంటానని అన్నారు. ఎప్పుడూ లేనిది ఆయన అనుకున్న తరుణంలో స్నేహితుడు డబ్బుతెచ్చి దాచమనటం అమ్మ కరుణ కాక మరి ఏముంటుంది?.

"లోకోత్తరాణాం చేతాంసి
కోను విజ్ఞాంతుమర్హతి"

లోకోత్తరులైన మహాత్ముల మనస్సును తెలుసుకోవటం ఎవరితరం? జిల్లెళ్ళమూడి అంతా డొంక. దారి, తెన్ను వుండదు. ఎలా వెడ్తావని అంటున్నారమ్మా అని ప్రార్థించారు. దానికి అమ్మ 'నేను తీసుకువెడ్తాను నాన్నా! నీవు బయలుదేరిరా' అని వినిపించింది.

కాలవనిండా నీరు ప్రవహిస్తున్నా దాహమయితే నీరు త్రాగడానికి రేవుకావాలి.

అమ్మ ఆదేశానుసారం కుటుంబరావుగారు బాపట్ల వెళ్ళి అక్కడి నుంచి జిల్లెళ్ళమూడి ఎటువెళ్ళాలని అడిగారు. ఆజానుబాహువు అయిన ఒకరు మెడలో పులిగోరు వేసుకున్నాయన పెదనందిపాడు వెళ్ళే బస్సు ఎక్కుతూ, 'నేను అక్కడికే వెళ్తున్నాను' రమ్మన్నారు.

7వ మైలురాయి దగ్గర దిగి లోపలికి నడిచారు. అతను వూళ్ళోకి వెడ్తూ ఆ దీపాలు కనిపిస్తున్న దగ్గరికి వెళ్ళమన్నాడు. ఏమిటమ్మా! నీవు తీసుకువెళ్తానన్నావని బయలుదేరానే, వదిలేసావా అనుకుంటూ ఆ దీపం కనబడే దారివెంట వెళ్ళారు. అప్పుడే సరోజినక్కయ్య తలుపు తీసుకొని బయటకు వచ్చింది. సరోజినక్కయ్య మా పెద్దనాన్నగారు శ్రీ అన్నంరాజు వెంకటేశ్వరరావు గారి కూతురు మా బంధువు అవటం వల్ల ఆయన్ని చూడగానే గుర్తుపట్టి లోపలికి వెళ్ళింది. అమ్మ ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లుగా కూర్చునివుంది. దానితో ఆయన అమ్మ దర్శనం చేసుకుని పరమానంద భరితులయ్యారు. మర్నాడు ప్రొద్దున్న దర్శనానికి వెళ్ళినప్పుడు "అమ్మా! నీవు ఎప్పుడూ నా వెంట వుండాలమ్మా" అని వరం కోరుకున్నారు.

శ్రీమతి కామేశ్వరమ్మ గారు సాయి భక్తురాలు. గుంటూరులో నల్ల చెఱువు దగ్గర షిర్డీబాబా నల్లరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠింపచేసిన మహా ఇల్లాలు. ఆవిడను అందరూ "పూలమ్మా" అనేవారు. ఒకమారు శ్రీ సత్యసాయిబాబా గారు రేపల్లె వస్తున్నారని కొన్నివేల మంది ఆయన దర్శనార్థం వెళ్ళారు. వారిలో శ్రీమతి కామేశ్వరమ్మ గారు వున్నారు. సత్యసాయిబాబా గారు "ఇంతమందిలో ఒకే ఒక మహనీయ వ్యక్తి వున్నదని ఆమె శ్రీమతి కామేశ్వరమ్మ గారని" తెలియచేసారు.

ఆమె నందూరులో కట్టించిన షిర్డీబాబా గుడి చూడటానికి అన్నంరాజు

అడిగిన వాటికి సమాధానం మీరు ఎంత లోతుకు తీసుకువెళితే అంతలోతుకు వచ్చి సమాధానం ఇస్తా.

రామకృష్ణ అన్నయ్య, కుటుంబరావుగారు వెళ్ళారు, కామేశ్వరమ్మ గారు కనిపిస్తే ఏ పూజ చేయాలమ్మా! అని కుటుంబరావుగారు అడిగారు. "అదేమిటి నాన్నా నీ వెనకాలే త్రిశూలం పట్టుకొని అమ్మ వుంది. ఆమెనే పూజ చేసుకోమని" చెప్పారు. నా వెంట ఎప్పుడూ వుండాలన్న నా కోరికను మన్నించి, తాను నా వెంటే వున్నానని ఈ రకంగా తెలియచేసిందని ఆనందంతో చెప్పారు.

అప్పటి నుంచి అమ్మ యందు శ్రద్ధాభక్తులతో ఆయన, మా చెల్లెలు వసంత, వారితో పాటు ఎంతో మందిని అమ్మ దర్శనార్థం తీసుకువెళ్ళేవారు. ఏ వూళ్ళో వుంటే అక్కడ దొరికే కాయగూరలను పెద్ద మొత్తంలో అన్నపూర్ణాలయంకు తీసుకువచ్చేవారు. హైమక్కకు బంగారం గొలుసు చేయించారు.

కుటుంబరావు గారి స్నేహితులు దీక్షితులు గారు లెప్రసీతో బాధపడ్తున్నారు. ఎన్నిరకాల వైద్యాలు చేయించుకున్నా ఏమీ మార్పులేదు. 1976లో అమ్మ గురించి చెప్పగా విని దీక్షితులుగారి భార్య జిల్లెళ్ళమూడి వస్తానన్నారు. కుటుంబరావుగారు "ఆవిడ మహామాయ, నీవు తప్ప వేరే దిక్కు లేదని, ఎంతమంది అమ్మ దగ్గర కూర్చుని వున్నా సరే అమ్మ పాదాలు పట్టుకొని వేడుకోమన్నారు. ఆమె అలాగే చేసింది. అమ్మ కొత్త చింతకాయ పచ్చడి, అన్నం కలిపి ఆవిడకు ఇచ్చి మీ ఆయనకు పెట్టమని చెప్పింది. ఆమె ఆ ప్రసాదాన్ని జాగ్రత్తగా ఇంటికి తీసుకువెళ్ళి ఆయనకు పెట్టిన తరువాత ఉధృతం తగ్గింది.

1978లో వారితో పాటు ఇంకో ఇద్దరు వస్తామంటే తీసుకువెళ్ళారు. ఒకరు కరీమ్‌గారి భార్య, ఇంకొకరు సుబ్బలక్ష్మిగారు. కరీమ్‌గారి భార్యకు ఇద్దరు ఆడపిల్లలు, సుబ్బలక్ష్మిగారికి ఒక ఆడపిల్ల వున్నారు. వారిద్దరూ

జ్ఞాని మానవుడిలో దైవాన్ని చూస్తాడు. అజ్ఞాని దైవంలో మానవుణ్ణి చూస్తాడు.

మగపిల్లలు కావాలని అమ్మను ప్రార్థించారు. అమ్మ పక్కనే వున్న మామిడి పళ్ళను ఇద్దరికీ చెరొకటి ఇచ్చి ఇంటికి వెళ్ళాక తినమంది. కరీంగారి భార్య ఆ పండును జాగ్రత్తగా ఇంటికి తీసుకువెళ్ళి భర్తకు పెట్టి తాను తింది. రెండో ఆమె ఆ పండును జిల్లెళ్ళమూడిలోనే మర్చిపోవటం జరిగింది. ముందుగా అమ్మకు తెలిసే ఇద్దరు అడిగినప్పుడు ఒకరికి ఇచ్చి మరొకరికి ఇవ్వకపోతే బాధపడ్తారని, ఆమెను బాధపెట్టడం ఇష్టం లేక ఇద్దరికీ ఇచ్చింది. రెండో ఆమెకు ప్రాప్తం లేదు. కాబట్టే అక్కడే మర్చిపోయేలా చేసింది. కర్తృత్వం తనమీద వుంచుకోదు కదా! కరీంగారి భార్యకు మగపిల్లవాడు పుట్టాడు. అక్కడే మనకు అమ్మ యొక్క మాతృత్వ పరాకాష్ఠ అవగతమవుతుంది.

అమ్మ దర్శనార్థం కుటుంబరావుగారు వస్తే ఆయనకు 500 రూపాయలు ఇచ్చి జిల్లెళ్ళమూడికి అవసరమైన పరికరం కొనమంది. ఆయన దానిని ఖర్చుచేసుకున్నారు. అమ్మ దగ్గర ఎంతో బాధతో కుంచించుకుపోతుంటే, ఆయన్ని తన దగ్గరకు తీసుకొని "నీ ద్వారా ఆ పని అవ్వదని తెలుసు, నేనే నీ అవసరాలను కనిపెట్టి అలా ఇచ్చానని" చెప్పింది. "మీ చేత చేయించేదైనా నేనే, ఫలితమూ నాదే, మీదేమీ లేదని" తెలియచేసింది. అమ్మ అలా ఎన్నోరకాలుగా ఎంతమందికో అవసరాలు కనిపెట్టి చూసింది.

లలితా సహస్రం గడప మీద దీపం లాంటిది. అది లోపలికి, వెలుపలికి వెలుగునిస్తుంది. ఆ నామసహస్రం చేసినవారికి లౌకికావసరాలతో పాటు, వారిని అంతర్ముఖులుగా చేసి వారిలో అంతర్మథనాన్ని కలుగచేసి ముక్తిని, మోక్షాన్ని ప్రసాదిస్తుంది. అమ్మ హైమక్క చేత గూడా లలితా సహస్రనామాన్ని చేయించింది. అలాగే మనందరి చేత చేయించి ఇంకెందరికో మార్గదర్శిని అయింది.

నవ్వుతూ అనుభవించేవాడే దగ్గరకు ఏడుస్తూ అనుభవించేవాడు సలహాకు వస్తాడు.

1980వ సం॥లో కుటుంబరావుగారు ఆఫీసు పనిమీద జీపులో వెళ్తుండగా ప్రమాదం జరిగి జీపు పూర్తిగా తల్లక్రిందులు అయి, దానంతటదే మళ్ళీ సరిగా అవ్వటం అమ్మ కరుణా కటాక్షాలే కారణమని ఆయన విశ్వాసం. నరసంచారం లేనిచోట తల్లక్రిందులయిన జీపును తిరగతీయటానికి ఎంతోమంది అవసరమవుతారు. అమ్మ అనుగ్రహ కారణంగానే జీపు సరిగా వచ్చిందని ఆయన నమ్మకం.

జీపు అద్దం పగిలిపోయి చిన్న చిన్న గాజు ముక్కలు రెండు చేతుల నిండా బాగా లోపలికి దిగిపోయాయి. వెంటనే దగ్గర్లో వున్న ఆసుపత్రికి వెళ్ళారు. చిన్న పల్లెల్లోని ఆసుపత్రి అవటంతో కుట్టు వేయటానికి కావలసిన పరికరాలేమీ లేవు. స్పిరిట్‌తో తుడిచి పెద్ద సూది దారంతో కుట్లు వేసారు. బాగా లోపలికి గుచ్చుకున్న గాజుముక్కలు తీస్తున్నా ఆయనకు ఏమీ బాధ అనిపించలేదు. ఆయన ధైర్యంకు కుట్లు వేస్తున్న డాక్టరు, నర్సు ఆశ్చర్యపోతూ ఇంత బాధ ఎలా ఓర్చుకున్నారంటే "జిల్లెళ్ళమూడి అమ్మ కృపాకటాక్షాలే కారణం" అన్నారు. లెక్కపెట్టలేనన్ని గాజుముక్కలు గుచ్చుకున్న ఆయన నవ్వుతూ వుండటం వారిని అయోమయంలో పడేసింది.

అమ్మ దర్శనం కొఱకు వెడితే "నాన్నా, ఎలా ఓర్చుకున్నావురా!" అని అమ్మ అన్నది. "నా వెంటే వుంటానని నాకు వరం ఇచ్చావు కదా! నీవుండగా నాకు దిగులేమిటమ్మా, నా బాధను నీవు తీసుకున్నావు కదా!" అన్నారు. మామూలు సూదితో కుట్లు వేసినా, అంత లోపలికి గుచ్చుకుపోయినా సెప్టిక్ అవ్వలేదు. షుగర్ కంప్లైంట్ వున్నా చీము పట్టకుండా గాయాలు మానటం అమ్మ అనుగ్రహమే కారణమంటారు.

అమ్మ వరాలిచ్చే దేవత. ఆ దేవత అనుంగు బిడ్డలమయిన మనకు దేనికీ

ఒకదాని యందు ఉంటే మమకారము మానవత్వాన్నీ, సర్వత్రా ఉంటే మమకారం మధవత్వాన్నీ గుర్తింప చేస్తుంది.

కొరత వుండదు. శ్రీరామతీర్థ "మాత అనే పదం భారతీయ వాఙ్మయములో అతి పవిత్రమయినది. హిందువు జబ్బుతో భరించలేని బాధపడ్తున్నప్పుడు అతని నోటి వెంట భగవంతుడా అని కాదు వచ్చేది అమ్మా, అమ్మా అని వస్తుంది. అమ్మ అనేమాట ప్రతి హృదయంలో గాఢోద్వేగాన్ని కలిగిస్తుంది. అమ్మలేని జీవితం చుక్కానిలేని నావ వంటిది. జన్మనిచ్చిన తల్లిని, సృష్టినిచ్చిన దైవంతో సమానంగా భావిస్తాడు ప్రతి హిందువు. పాశ్చాత్యదేశాలలో భగవంతుని తండ్రిగా భావిస్తారు. అందుకనే భారతదేశంలో స్త్రీకి అత్యున్నత స్థానం వున్నది" అంటారు. అమ్మ సూక్తులను అధ్యయనం చేస్తూ తెలియని వారికి తెలియచేయటమే మనవంతు కర్తవ్యము.

27. అమృతకలశ - అమ్మ

"పూజామూలం గురోర్మూర్తిః ధ్యానమూలం గురుఃపథమ్
మంత్రమూలం గురుర్వాక్యమ్ మోక్షమూలం గురుః॥"

హైందవ సాంప్రదాయం ప్రకారం గురువే అన్నింటికీ మూలం. పూజ, ధ్యాన, మననాల ద్వారా మనలను మోక్షమార్గంలో పయనించేటట్లు చేయగలడు.

మా బంధువుల అమ్మాయి సుధ కాకినాడలో వుంటుంది వాళ్ళ ఆయన చంద్రశేఖర్, మెడికల్ రిప్రజెంటేటివ్. చాలా చికాకులతో వుండి, ఏమి చేయాలో పాలుపోక మాకు ఫోను చేసింది. మనను ఒక దరి చేర్చిన అమ్మ వుండనే వుంది కదా! ఆమె చూచుకుంటుందన్న విశ్వాసంతో, అమ్మ ఫోటో, కుంకుమ పంపించి అమ్మ నామం చేసుకోమని మా ఆయన చెప్పారు. ఫోటో అందిన వెంటనే అమ్మ ఫోటో పెట్టి పూలు పెట్టింది. అప్పుడే వాళ్ళింటికి వచ్చిన ఒకామె చూడటానికి వచ్చింది. అమ్మకు పెట్టిన పూలల్లో ఒక పువ్వు క్రింద

కష్టంలోవున్న జనాన్ని చూచి స్పందించగల మనస్తత్వమే నిజమైన మానవత్వం, అదే దైవత్వం కూడా.

పడింది. అమ్మ ఆశీర్వదించి ఇచ్చిన పూవు తనకు ఇమ్మని కళ్ళకు అద్దుకొని తల్లో పెట్టుకుంది. పెద్దావిడవచ్చింది కదా అని బొట్టు పెట్టి జాకెట్టు గుడ్డ ఇచ్చింది. "నన్ను ఆశీర్వదించటానికి అమ్మే ఆ రూపంలో వచ్చిందని ఎంతో ఆనందంతో సుధ మాకు ఫోను చేసింది.

బ్యూటీషియన్ కోర్సు చేసినందున ఇంట్లో వూరికే కూర్చోవటమెందుకని బ్యూటీ క్లినిక్ పెట్టుకోవాలని దానికి కావల్సిన సరంజామా అంతా తెప్పించుకుంది. కాని ఆరోగ్యం సరిగా లేనందున దాన్ని నడపలేక ఇన్నివేలు బూడిదలో పోసిన పన్నీరు అయిందన్న బెంగతో మనశ్శాంతి కోల్పోయి తద్వారా ఆరోగ్యం క్షీణించసాగింది. ఒక పెద్ద అద్దం 12వేలు రూపాయిలది అమ్మాలనుకున్నా అంతకు ముందు ఎవరూ రాలేదు. అమ్మ ఫోటోను పెట్టిన తరువాత అనుకున్న దాని కంటె ఎక్కువ ధర వచ్చింది. మిగిలిన సామాన్లు అన్నీ ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్ముడుపోయాయి. అప్పట్నుంచి ఎంతో నమ్మకంతో అమ్మను కొలుచుకుంటున్నది.

సుధ చిన్నప్పుడు, వాళ్ళ మామ్మగారు లలితాదేవిని కొలిచేవారు. ఆ లలిత అమ్మవారే అమ్మ అన్న నమ్మకం కలిగింది. చిన్నప్పట్నుంచి వాళ్ళ మామ్మగారితో కలిసి పూజ చేసుకునేది. అన్ని పూజలు చేసినా నా జీవితం ఇలా అయిందేమిటని వాళ్ళ మామ్మగారిని నిలదీసింది. ఆమె బాధపడ్తుంటే అమ్మవారు కనిపించి "నీ మనుమరాలికి ఎటువంటి కష్టం వుండదు. అంతా సవ్యంగా జరిగేటట్లు నేను చూసుకుంటానని" హామీ ఇచ్చింది.

ఆ అమ్మవారే అమ్మగా తన జీవితంలోకి వచ్చిందని సుధ పరిపూర్ణ విశ్వాసం. రోజుకో రకంగా తన అనుభూతులను ఎప్పటికప్పుడు కాకినాడ నుంచి ఫోనులో చెప్తుండేది. వాళ్ళ అమ్మగారు సుధా వాళ్ళ ఇంటికి వచ్చారు.

తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడు కాదు. దైవం తలిస్తేనే తాను తలుస్తాడు.

ఆ రాత్రి ఆవిడకు కలలో నల్లగా, కళగా సర్వాలంకార భూషిత అయ్యి, ముక్కుకు బులాకీ పెట్టుకుని అమ్మ ఇంట్లోకి వస్తున్నట్లుగా కనిపించింది. ఆమె ఈ సంగతి సుధకు చెపితే అమ్మ తెల్లగా వుంటారు కదా! మా అమ్మకు నల్లగా, కళగా కన్పించిందని ఫోను చేసింది. జిల్లెళ్ళమూడి అనసూయేశ్వరాలయంలో నల్లరాతి నిగ్రహమే వుంటుందని నేను చెపితే ఆశ్చర్యపోయారు. అమ్మ మిమ్మల్ని తన ఒడిలోకి తీసుకుంది. మీరు దేనికీ దిగులు పడవలసిన పనిలేదని చెప్పాను. సుధకు ఎప్పుడు అమ్మ గురించిన ఆలోచనే. ఎవరిని కలిసినా మీకు అమ్మ తెలుసా అని వారి దగ్గర్నుంచి అమ్మ విషయాలు తెలుసుకునేది. హైద్రాబాదు వెళ్ళినప్పుడు అక్కడ అమ్మ ఫోటో చూసి మీరు అమ్మను చూసారా? ఎంత అదృష్టవంతులు, అమ్మ గురించి చెప్పమంది. ఆ ఇంటి యజమానికి ఆరోగ్యం సరిగా లేనందున అమ్మ ఆశీస్సుల కోసం జిల్లెళ్ళమూడి వెళ్ళాలని బాపట్ల వెళ్ళేటప్పటికి చాలా చీకటి పడింది. ఎలా వెళ్ళడమా అని దిగులుపడుతూ అమ్మనే ప్రార్థించసాగారు. నమ్మినవారి దిగులును పారద్రోలటమే కదా! అమ్మ పని, అందులో ఆవిడ ఒంటినిండా నగలు వున్నాయి. ఏమమ్మా! రాత్రి పూట ఇన్ని నగలతో ప్రయాణం చేయవచ్చా! అందులో ఇక్కడ దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయని అక్కడ వాళ్ళు అంటే మరీ భయం వేసింది.

అమ్మా! నీ దర్శనార్థం వస్తున్నాము. ఏమిటమ్మా ఈ విషమ పరీక్ష అని పరి పరి విధాల ప్రార్థించారు. బస్సు స్టాపులో ఒక్క పురుగు కూడా లేకుండా అంతా వెళ్ళిపోవటంతో వీళ్ళకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఇంతలో వీరి మొరను ఆలకించి అమ్మే వచ్చిందన్నట్లుగా ఆజానుబాహుడైన మనిషి వచ్చి, ఇక్కడ వున్నారేమిటి అన్నారు. జిల్లెళ్ళమూడి వెళ్ళటానికని చెప్పారు. జిల్లెళ్ళమూడి వెళ్ళే వ్యాను వుంది మీరు నాతో రండి అంటూ మాతృశ్రీ ప్రెస్‌కి తీసుకువెళ్ళి వాళ్ళను వ్యాను ఎక్కించారు.

తనను తాను విమర్శించుకోవడం వివేకం. ఇతరులను విమర్శించడం అవివేకం.

హైద్రాబాదు నుంచి వస్తూ దానిమ్మపళ్ళు తీసుకువచ్చారు. అమ్మ దర్శనానికి వెడితే మూడురోజులు వుండమంది. పక్కనే కూర్చుని దానిమ్మపళ్ళ గింజలన్ని వొలిచి అమ్మకు ఇస్తే రసం తీసి ఇమ్మంది. ఆమె రసం తీయగా గ్లాసుడు రసం వచ్చింది. ఆ గ్లాసుడు రసం అమ్మ స్వీకరించింది. ఆయనకు వూపిరితిత్తులలో నీరు చేరినందున అమితంగా బాధపడ్తున్నారు. అటువంటి సమయంలో అమ్మ రసం తీసుకోగానే వూపిరితిత్తులలో నీరు పిండేసినట్లయి, ఆయన ఎటువంటి బాధా లేకుండా హాయిగా వున్నారు.

జిల్లెళ్ళమూడి నుంచి వస్తూ పుస్తకాలను డబ్బు కట్టి వచ్చారు. ఇంటికి వచ్చాక అడ్రసు ఇవ్వలేదన్న సంగతి గుర్తుకు వచ్చి చింతించారు. వారి అడ్రసు లేకుండానే వారికి అమ్మ పుస్తకాలు అందటం అమ్మ దయే కారణమని, అమ్మ యొక్క అవ్యాజ ప్రేమకు ముగ్ధులయ్యారు. ఆ సంగతులు అన్నీ తెలిపి నన్ను తృప్తి పరచటానికి అమ్మ హైద్రాబాదు పంపించిందని సుధ పొంగిపోయింది.

మొట్టమొదట సుధ మా ఇంటికి వచ్చినపుడు ఇంటినిండా అమ్మ ఫోటోలు, అన్ని సైజుల్లోవి, లార్జ్ సైజు అమ్మ ఆయిల్ పెయింటింగ్ వుండి, వీళ్ళకు పిచ్చా ఏమిటి? ఇన్ని ఫోటోలు వుంచారనుకుని సరిగ్గా వాటిని చూడను కూడా చూడలేదు. కాని ఇప్పుడు నా ఆలోచనల్లో ఇంత మార్పు వచ్చిందంటూ ఒక్క ఫోటో కూడా విడువకుండా తనివితీరా చూసుకుంది. అది విన్న మాకు అమ్మ యొక్క కరుణకు అవధులు లేవనిపించింది. వాళ్ళ ఆయన బిజినెస్ ఒక దారిలోకి తెచ్చి, సుధని ఆరోగ్యవంతురాలిని చేసింది. అమ్మ యొక్క కరుణా కటాక్షాలే కారణమని ఏమి మాట్లాడినా అమృతకలశ అయిన అమ్మ గురించి మాట్లాడుతూ అమ్మ ఆలోచనల్లో అవ్యక్తానందాన్ని పొందుతున్న ధన్యజీవి సుధ.

మృత్యుంజయుడంటే చనిపోకుండా ఎల్లకాలం వుండటం కాదు. చావుని గురించి ఆలోచనా, భయమూ లేనివాడు.

౨౮. సర్వసమర్థ - అమ్మ

శ్రీ స్వామి రామదాసు "జీవన్ముక్తులు శరీరం విడిచిపెట్టాక, వారిని దహనంగాని, సమాధిగాని చేసిన చోట ప్రతి అణువులో మహత్తరమైన దివ్యశక్తి వుంటుంది. వారు శరీరాన్ని త్యజించిన అనంతరం కూడా వారి శక్తి, దానికి సంబంధించిన విభూతి అక్కడి ప్రతి అణువులోనూ నిండివుండి ఆధ్యాత్మిక శక్తిని ప్రసరిస్తుంటాయి. అందుకే సమాధులను పూజిస్తూ వుంటారు. లౌకికమైన మేలు కోరి ఎన్నో వేలమంది వెళ్ళి వాని దగ్గర లౌకికమైన మేలుతో పాటు, అలౌకికమైన శాంతిని పొందుతున్నారు. ఆ శక్తి సంపూర్ణంగా ప్రకటితమయ్యేలా చేసేది భక్తుని యొక్క భక్తి శ్రద్ధలే. మహాత్ములు మరణించరు. సమాధి చెందుతారని" అంటారు.

వానికి ఉదాహరణయే షిర్డీసాయిబాబా సమాధి, మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి సమాధి, జిల్లెళ్ళమూడిలోని హైమా, అనసూయేశ్వరాలయాలు. అవి అనేక లక్షలమందికి అభయాన్ని, శాంతిని కలుగచేస్తున్నాయి.

శ్రీ యు. అప్పల నరసింహారాజుగారు విశాఖపట్టణంలో పేరుపొందిన కాంట్రాక్టరు. ఆయన భార్య శ్రీమతి రాధ. వారి కుటుంబం ముందు నుంచి భక్తి శ్రద్ధలు కలవారు. శుక్రవారం అమ్మ పూజకు వస్తుంటారు. వారి యందు అమ్మకు కల వాత్సల్యం, ఆప్యాయత, అనురాగం అపారం. అమ్మ తన భౌతిక దేహానంతరం అనేక మందిని కాచి రక్షిస్తుందనటానికి, నిదర్శనమే ఈ క్రింది వ్యాసము.

శ్రీమతి రాధగారి ఆరోగ్యం సరిగాలేనందున దిగులుపడ్తున్నారు. ఆవిడకు విపరీతమైన తలనొప్పి, ఆపరేషన్ చేయనిదే తగ్గదన్నారు డాక్టర్లు. ఈ పెద్ద తనంలో ఆపరేషన్ అనటంతో ఆవిడ విపరీతమైన ఆవేదనకు గురిఅయ్యారు.

చింతకు కారణం సొంతం అనుకోవడమే

ఒక రాత్రి కునుకు పట్టీ పట్టకుండా వున్న సమయంలో 'అమ్మ' ఆమె తల దగ్గర కూర్చుని 'నీ ఆరోగ్యం గురించి ఏమీ బెంగపడకు, నేను ఉన్నానని, అంతా నేను చూసుకుంటానని తల నిమురుతూ, ఇప్పుడు కొంత తగ్గుతుంది. 1998 కి పూర్తిగా తగ్గుతుందని" అమ్మ హామీ ఇచ్చింది. కల అనుకుందామా అనుకుంటే అమ్మ అమృతకరస్పర్శచే కలిగిన ఆనందాన్ని ప్రత్యక్షంగా అనుభవించారు. "అమ్మ మాటే మంత్రంలా" పనిచేసి ముందు అనుకున్న విధంగా ఆపరేషన్ అవసరం లేకుండానే తలనొప్పి తగ్గుతోందని, 1998 నాటికి పూర్తిగా తగ్గుతుందన్న తన నమ్మకాన్ని జోడించి ఎంతో ఆనందంతో చెప్పారు.

రాధగారి పెద్ద కుమారుడు శ్రీ కాశీరాజుగారు, ఆయన భార్య రాజేశ్వరి. రాజేశ్వరిగారికి అమ్మ యందు అత్యంత విశ్వాసము. 1997 ఆగస్టు 6వ తేదిన శ్రీ కాశీరాజుగారు కాంట్రాక్టు పనిమీద ఢిల్లీ వెళ్ళి కెన్యా వెళ్దామనుకున్నారు. కాని మాష్టారుగారు ఇప్పుడు కెన్యా వెళ్ళద్దు. నేపాల్, కాశీ వెళ్ళమన్నారు. వాళ్ళు టూర్‌కి వెళ్ళిన తరువాత వాళ్ళ దగ్గర నుంచి ఫోను కానీ, ఎటువంటి సమాచారం కానీ అందలేదు. రాజేశ్వరిగారు చాలా ఆందోళన చెంది త్రికరణశుద్ధిగా అమ్మనే ప్రార్థించారు. అమ్మ తన బిడ్డల బాధ చూడలేదు కదా! వెంటనే ఆమె సమస్యను పరిష్కరించింది. కాశీరాజుగారు మర్నాడు ఆమెకు ఫోను చేసి "నీవు ఈ నెంబరుకు ఫోను చేయమన్నావని రికార్డెడ్ మెసేజ్ వుంది" అని చెప్పారు. ఆవిడ ఆశ్చర్యపడి "అసలు మీరు ఎక్కడవున్నారో తెలియందే నేను ఎక్కడకని ఫోన్ చేస్తాను, నెంబర్ ఇలా ఇస్తాను అన్నారు" అది వాళ్ళ పర్సనల్ ఫోను. ఆ నెంబర్ ఎవరికీ తెలియదు. ఆ నెంబర్ తెలిసిన స్నేహితునకు ఫోను చేసి నీవు నెంబరిచ్చావా అని అడిగితే నేను ఇవ్వలేదని ఆయన చెప్పారు. కాశీరాజుగారు మద్రాసునుంచి ఫోను చేసారు. ఆయన ఆ ట్రిప్‌లో మద్రాసు వెళ్ళిన సంగతే ఎవరికీ తెలియదు. ఆమె, ఆవేదనను

ఆకారం లేనిదానిని తెలుసుకోవడానికి ఆకారమే ఆధారం.

దూరం చేయటానికి 'అమ్మే' ఆ నెంబరు ఇచ్చి వుంటుందని ఆమె పరిపూర్ణ విశ్వాసం. అందుకే అమ్మ "మీకు గోడలు అడ్డుగాని, నాకు కాదని" అంటుంది.

1996 ఆగష్టులో రాజేశ్వరిగారు లలితాసహస్రం పారాయణ చేసుకునేందుకు దేముడి గదిలో అమ్మ ఫోటో ఎదురుగా కూర్చోవాలనుకుంటూనే ఎప్పుడు కూర్చునే చోటే కూర్చున్నారు. కూర్చున్నాక మళ్ళీ లేవటం ఇష్టం లేక అక్కడే కూర్చుని చేసుకొనేవారు. అమ్మ ఫోటో కొంచెం పక్కకు ఉండేది. అలవాటుగా కూర్చోవటం మళ్ళీ ఇలా కూర్చున్నాననుకోవటం ఎప్పటికప్పుడు అలాగే జరుగుతుంది. ఒక రోజు యధాప్రకారం కూర్చున్నారు. ఎదురుగా అమ్మ కనిపించేసరికి గగుర్పాటు చెంది, ఒళ్ళు తెలియని స్థితి ఏర్పడి అమితమైన ఆనందాన్ని పొందారు. ఆ రోజునుంచీ ఆమె ఎక్కడ కూర్చున్నా 'అమ్మ' ఎదురుగా ఉన్నదన్న భావన కలుగుతోందన్నారు.

శ్రీ యు.ఎ.ఎస్. రాజుగారి కూతురు శ్రీదేవిగారు. అల్లుడు కె.కె.వి. నరసింహవర్మగారు. వారికి అమ్మ యందు అనురక్తి మెండు. కాంట్రాక్టు పనిమీద నరసింహవర్మగారు నెల్లూరు వెడుతున్నారు. వర్జ్యం టైమ్‌లో బయలుదేరుతున్నాము అమ్మకు నమస్కరించుకుందామని శ్రీదేవి గారు చెప్పారు. వారు అమ్మకు దణ్ణం పెట్టుకోవటం వల్లే అక్కడి పనులన్నీ సజావుగా జరిగిపోయాయని, హైదరాబాదులో వుండే ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగారు నెల్లూరులో ఉండడంతో ఆయన సంతకం కూడా ఎలాంటి జాప్యం లేకుండా పని పూర్తి అయ్యింది. దానికి అమ్మ యొక్క కరుణాకటాక్షాలే కారణమని వారి ఉద్దేశం. తిరుగు ప్రయాణంలో జిల్లెళ్ళమూడి వెడదామనుకున్నారు. వారు ఇంటికి ఎన్నిమార్లు ఫోను చేసినా లైను దొరకలేదు. ఆ రాత్రి శ్రీదేవిగారి ఆడపడుచు "అమ్మ మిమ్మల్ని రమ్మంటున్నారు, లేదా ఆవిడే వస్తానన్నారని"

ఎదుటి వారిలో దైవత్వాన్ని చూస్తున్నంతసేపు మనలో దైవత్వం కలుగుతుంది.

చెపితే "అమ్మ రావటం ఏమిటి మేము జిల్లెళ్ళమూడి వెళ్దామనుకున్నట్లు" కల వచ్చింది. అమ్మకు మన మీద అపారమైన వాత్సల్యం ఉండబట్టే, మన ఆలోచనలకు బలం చేకూరేలా కల వచ్చిందనుకుని, జిల్లెళ్ళమూడి వెళ్ళి హైమను, అమ్మను దర్శించుకుని ఎనలేని తృప్తిని, హాయిని పొందారు.

వైజాగ్‌లో శ్రీదేవిగారి మేనకోడలు పెద్దపిల్ల అయిన విషయం వీరికి తెలియచేయాలని ఎంత ప్రయత్నించినా లైన్ దొరకలేదు. ఆ కబురు తెలిస్తే ఆమె వెంటనే వైజాగ్ వచ్చేవారు. వాళ్ళకు అమ్మ దర్శనభాగ్యం వుంది. కాబట్టే అటూ, ఇటూ ఎవరు ఫోను చేసినా లైను దొరకలేదని వారి నమ్మకం. అమ్మను దర్శించుకోవటమనేది ఒక మధురానుభూతి అని వర్ణించనలవికాని ఆనందంతో తెలియచేసారు.

శ్రీదేవి గారికి "వాళ్ల అమ్మగారు లలితాపారాయణ చేసుకోమన్నట్లు, వాళ్ళు బాబా దర్శనం చేసుకుంటుంటే భూమికి తగలకుండా తాను పైన వున్నట్లుగా అనిపించింది. ఇంతలో ఎవరో ఇప్పుడు నీ స్థితి ఏమిటి? అని అడిగారు. ఇప్పటి వరకు ఎప్పుడూ ఇటువంటి అనుభూతిని పొందలేదని చాలా ఆనందంగా హాయిగా వుందని చెప్పినట్లు" కల వచ్చింది. అంతటి ఆనందానుభూతిని అమ్మ ఇచ్చిన వరంగా ఆమె భావిస్తున్నారు.

శ్రీదేవిగారు ఇంట్లో అమ్మ ఫోటోకి బొట్టుపెడితే కొంచెం కారింది. కుంకుమ కారడం ఏమిటని వాళ్ళ అమ్మాయి చేత్తో తీస్తే బొట్టు పెట్టుకునేందుకు సరిపడా వచ్చింది. అదే విధంగా వారి పిన్నిగారు పద్మగారి ఇంట్లో 'అమ్మ' సైడు ఫోజులో వున్న ఫోటోలో బొట్టు జారినట్లుగా అనిపిస్తే తుడిచేసారు. మర్నాడు మళ్ళీ ముక్కు దాకా కారింది. చేత్తో తీస్తే పద్మగారి కోడలికి మనుమరాలికి సరిపోయింది. అమ్మ అందరికి అనుభవాలిస్తుంది. మా ఇంట్లోనే

మృత్యువు అంటే భయములేనివాడు మృత్యుంజయుడు.

ఏమీ లేదనుకున్నందుకు "నీ వెంటే నేను ఉన్నానని" అమ్మ తెలియచేసిందని పరవశంతో చెప్పారు.

గొప్పతనము-మంచితనము అనునవి మానవుని జీవితమునకు మార్గదర్శకములు. గొప్పతనము సుందరివలె ఆకర్షించును. మంచితనం మాతవలె పోషించును. గొప్పవారు ఇతరుల వలె పెక్కు లాభములు పొందగలరు. గొప్పతనం వలన తృష్ణ కలుగుతుంది. స్వర్గసుఖములను అనుభవిస్తారు. మంచితనం వలన తృష్ణ తీరుతుంది. బంధవిమోచన కలుగును. కాబట్టి గొప్పవారు మంచివారగుటకు ప్రయత్నించవలెను. మన ప్రయత్నలోపం లేకుండా చేసినప్పుడు తప్పక సిద్ధించును.

యు. అప్పలనరసింహరాజుగారు వారి కుటుంబ సభ్యులందరూ ఎంతగానో కొనియాడదగినవారు. పైన చెప్పిన గొప్పతనం వారందరిలో వున్నది. 'అమ్మ' ఒడిలో పిల్లలైనారు కాబట్టి వారంతా తప్పక మంచివారు కాగలరు.

1958 ఆగష్టు 15వ తేది అన్నపూర్ణాలయ ఆవిర్భావం. "భారతదేశానికే కాక జిల్లెళ్ళమూడికి సంబంధించినంతవరకు ప్రపంచ పౌరులందరికి స్వాతంత్ర్యము ప్రసాదించిన పుణ్యదినం" అని అమ్మ చారిత్రాత్మక ప్రకటన చేసింది. జాతి, కుల, మత విభేదరహితంగా నిత్యం అక్కడ అమ్మ ప్రసాదం పంచబడ్తుంది. "ఈ యజ్ఞగుండాలు, యాగహోమాలు కంటే నాకు గాడిపొయ్యే ముఖ్యం అనిపిస్తుంది. నేను ఏమైనా వెయ్యగలిగినా, వెయ్యవలసి వచ్చినా అదీ గాడిపొయ్యి లోనే వేసుకుంటాను. నా ఆయుధాలు గిన్నెలు, గరిటలే అని, అన్నపూర్ణాలయం తన గుండె అని అక్కడి గుండిగల చప్పుళ్ళు తన గుండె కొట్టుకోవటం" అని అమ్మ నిర్ధారించింది. అక్కడ "డ్రస్‌ను బట్టి కానీ అడ్రస్‌ను

అంతా జీవమయమేగాని నా దృష్టిలో జడం లేదు.

బట్టి కానీ భోజనం పెట్టటం జరుగదు. వచ్చినవాడి ఆకలిని బట్టి పెడతారని" అంది.

గొప్పవారు-మంచివారుగా కావటానికి నాందిగానే యు. అప్పల నరసింహారాజుగారు రెండు లక్షలరూపాయలను పైన చెప్పిన అన్నపూర్ణాలయానికి విరాళంగా ఇచ్చారు. ఆ రెండు లక్షలను వైజాగ్ బ్యాంక్‌లో వేసి దానిమీద వచ్చే వడ్డీ నిరాటంకంగా అక్కడకు వెళ్ళే ఏర్పాటు చేసారు. ఇది వారి యొక్క మంచితనమునకు తార్కాణం. మిగిలిన వారి కుటుంబ సభ్యుల ద్వారా వారివారి శక్త్యానుసారం అన్నపూర్ణాలయంకు పంపే ఏర్పాటు చేసుకోవలసినదిగా అమ్మను మనసారా ప్రార్థించుదాము. గొప్పవారెందరో వుండవచ్చును కాని ఇంతటి మంచి బుద్ధి వారికి కలిగి మిగిలినవారికి మార్గదర్శకులయ్యారు. వారికి వారి కుటుంబసభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించవలసినదిగా సర్వసమర్ధ అయిన అమ్మను వేదుకుందాము. ఇంకా ఎన్నెన్నో మంచి కార్యక్రమాలు వారి ద్వారా జరగాలని ఆశించుదాము.

అన్నపూర్ణాలయం దాదాపు 40 సం॥ల నుండి నిర్విఘ్నంగా కొనసాగుతున్నది. అది అమ్మ మహిమకు, అమ్మ సర్వసామర్థ్యానికి, అమ్మ దివ్యత్వానికి తార్కాణం. 1958 ఆగష్టు 15వ తేదీన అన్నపూర్ణాలయం ఏర్పడినది. దాని వార్షికోత్సవం అత్యంత వైభవంగా ప్రతి ఏడాది ఆగష్టు 15వ తేదిన జరుపబడుతుంది. 1958న గాడిపొయ్యిలో వేసిన నిప్పే ఇప్పటికినీ. అందుకే అమ్మ "సర్వసమర్ధ" అని అందాము.

దేవుని చూడకుండా ఉండలేనంత ఆవేదన నీలోఉంటే తప్పక చూస్తావు.

౭౮. భారతీయ సంస్కృతి - అమ్మ

పవిత్ర భారతీయ సంస్కృతీ ప్రవంతిలో సౌందర్య భరితమైన అనేకానేక విశిష్ట ఘట్టాలు, అద్భుతమైన తేజోదీపికలు వున్నాయి. అవి వ్యక్తిగత సామరస్యానికి పట్టుగొమ్మలు. వ్యక్తికి సనాతన ధర్మాన్ని అందించిన మహోన్నత పరిమళాలు.

మన పండుగలు, ఆచారాలు కేవలం సరదాలకు, కాలక్షేపాలకు పరిమితం కాదు. భారతీయులు జరుపుకునే ప్రతి పండుగ వెనక, ఆచరించే ప్రతి అంశం వెనక అమూల్యమయిన సత్సందేశం, మానవమహోదయానికి ఒక మహాసంకల్పం ప్రస్ఫుటమౌతాయి. పండుగ పేరుతో భగవంతుని మూర్తిని మనలో భావించుకోవటంతో మనం భగవత్సాన్నిధ్యాన్ని పొందగలం. భగవత్సాన్నిధ్యం ద్వారా పరమ పదాన్ని పొందగలుగుతాము. అందుకే జిల్లెళ్ళమూడి అమ్మ "దేవుని చూడకుండా వుండలేనంత తపన, ఆవేదన నీలో వుంటే తప్పక చూస్తావు" అని అంటుంది. భగవదనుగ్రహం చేత మనలను మనం ఎప్పుడు తెలుసుకోగలగుతామో అప్పుడు మన శరీరం భగవంతుని విలాస కేంద్రం అవుతుంది.

మోక్షసాధనకు ఆర్తి, ఆవేదన, తపన అనన్యభక్తి ప్రపత్తులు, పరిపూర్ణ విశ్వాసమే అవసరం. అందుకే అమ్మ "వాళ్ళ వాళ్ళ ఆర్తి, ఆవేదనలే నన్ను కదిలిస్తాయి' అని అంటుంది. అమ్మ సనాతన సంస్కృతికే నీరాజనం పడుతుందేమో అనిపిస్తుంది. అందుకనే అమ్మ దసరా, సంక్రాంతి, దీపావళి మొ॥లగు పెద్ద పండుగలనుంచి అట్లతద్ది, చిలుకు ద్వాదశి వరకూ అన్ని పండుగలు జిల్లెళ్ళమూడిలో జరిపించేది, అవే కాకుండా ఇతర మతాల పండుగలైన క్రిస్మస్, రంజాన్, జనవరి 1వ తేదీన కొత్త సంవత్సరం వేడుకలను మహోజ్వలంగా జరిపించటం మనందరికీ తెలిసిన విషయమే.

నీవు అనుకున్న రూపంలో భగవంతుడు కనిపిస్తే గుర్తిస్తావు. లేనప్పుడు నీ ముందున్నా గుర్తించలేవు.

నిర్గుణ పరబ్రహ్మను, ఏక రూపమైన సత్యాన్ని తనంతట తానుగా ప్రకాశించే జ్ఞానంతో తెలుసుకొని మోక్ష సామ్రాజ్యాన్ని పొందగలగాలి. మహాత్ముల అనుగ్రహంతో ఇది సుగమమవుతుంది. దేశ, కాల, వర్ణ, వర్గ, పరిమితులతో నిమిత్తం లేని "మన అమ్మ" మన బాటను సుగమం చేసింది. జిల్లెళ్ళమూడి శరద్ నవరాత్రుల పూజలలో పాల్గొన్న ఎందరెందరో తమ ఇంట ఆ పూజలు జరుపుకోవటం లోకవిదితమే. ఇప్పటికి ఇంటి దగ్గర చేసుకునే అవకాశం లేని అక్కయ్యలు, అన్నయ్యలు దసరా పూజలు జిల్లెళ్ళమూడిలో యదేచ్ఛగా జరుపుకుంటున్నారు.

శాస్త్ర జ్ఞానమొక్కటే పనికిరాదు. జ్ఞానం భక్తితో కూడినప్పుడే భగవంతుడు కనిపిస్తాడు. మన భాగ్యవశాన పరమాత్మ "అమ్మ"గా మనమధ్య ఆటలాడి, మనలో ఒకరిగా జీవించింది. భగవంతుని గూర్చిన ప్రసంగాలను వింటూ, ఈ శరీరంతోపాటు, మనస్సును భగవంతుని యందుంచగలిగిన వారే మోక్షానికి అర్హులు. కేవలం జ్ఞానం వున్నచో 'ధాన్యం కోసం పొల్లు దంపుతున్న వాడిలా క్లేశమే మిగులుతుంది'.

అమ్మ ప్రసంగాలు చేయకున్నా మనతో సంభాషిస్తున్నప్పుడే మన యోగ్యతలతో "నాస్తికునికైనా, ఆస్తికునికైనా ప్రతిఫలం ఒకటిగానే వుంటుందని అంతా తనదే అనుకున్నప్పుడు బరువు మోస్తున్నట్లుగా వుంటుంది. భారం దైవం మీద వేసినప్పుడు హాయిగా, నిశ్చింతంగా బ్రతకగల్గుతాడు" అని అమ్మ అంటుంది.

అమ్మ భౌతిక దేహానంతరం చాలామందికి ధ్యానంలో, కలలో కనిపిస్తోందని చెప్పారు. "అమ్మా! నేను ఏం పాపం చేసుకున్నాను. నాకు ఎందుకు కనిపించవని' పరిపరి విధాల పరితపించాను. 1989 మార్చి 8వ

సృష్టినంతా దైవంగా చూడడమే దివ్యదృష్టి.

తారీఖు రాత్రి అంతా కలత నిద్దరే అయింది. అమ్మ నన్ను కరుణించలేదని కలత చెందాను. మర్నాడు మార్చి 9వ తారీఖు రాత్రి బందరునుంచి అమ్మ ఆయిల్‌పెయింటింగ్ ఫోటో లైఫ్ సైజుది పంపుతున్నట్లు శ్రీమంత్ ప్రసాద్‌గారి దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. ఆ కబురు విని ఆశ్చర్యపోవటం నావంతు అయ్యింది. మార్చి 10 తారీఖు ఉదయమే అమ్మ మా ఇంటికి వేంచేసి, నా జిజ్ఞాసను, తృష్ణను తీర్చింది.

ఆ రోజు అమ్మ ఫోటోను ఇంట్లోకి తీసుకురావటానికి సాయపడిన రమేష్‌గారి అబ్బాయి 10 సం॥ల బాబు మూడో అంతస్తు నుంచి క్రిందకు పడిపోయాడు. కాని ఏవిధమైన గాయాలు కాని, ఎముకలు విరగటం కాని జరగలేదు. "అమ్మ ఫోటోను మోసిన ఫలితమే నా పిల్లాడు నాకు దక్కేడని" అచంచలమైన భక్తి విశ్వాసాలతో ఆయన వర్ణిస్తుంటే ఆనంద సాగరంలో మునిగిపోయాము.

ఆ ఫోటోను చూచిన ఒక అక్కయ్య "నేను మొట్టమొదటిసారిగా అమ్మను చూచినపుడు సరిగ్గా ఇలానే వుంది. మళ్ళీ మీ ఇంట్లో అమ్మ దర్శనభాగ్యం కలిగింది. అమ్మ ఇక్కడే వుందంటూ" సంబరంతో చెప్పింది. ఆమె మాటలతో అంతకు పూర్వం నాకు వున్న విచారం దూరమయింది. నా ఆర్తి, ఆవేదనలు తీర్చటానికే అమ్మ ఆ రూపంలో మా ఇంటికి వచ్చిందని పొంగిపోయాను. పూజకు వచ్చే ఎందరికో అమ్మ నవ్వుతున్నట్లు, తలపంకిస్తున్నట్లు, మా పూజ వింటున్నట్లుగా వుంటోందని వాళ్ళ వాళ్ళ అనుభవాలు చెప్తుంటే అమ్మ యొక్క వాత్సల్యానికి అవధులు లేవుకదా! అని అనిపిస్తుంది.

సృష్టికంతటికీ మూలమైన దివ్యశక్తి చరాచర జగత్తునంతటిలో వ్యాపించి విశ్వజననియై మనకు ఆరాధ్యదేవత అయింది. తాను తల్లి ధర్మం కోసం

పంచభూతములే శక్తి ద్వారా నడువబడుతున్నాయో ఆశక్తే భగవంతుడు.

వచ్చానని, మనం వెతుక్కోవటం కాక, తానే మనల్ని వెతుక్కుంటూ మాతృత్వాన్ని వహించింది. అందుకే "నేను దగ్గరకు తీయటమే కాని, మీరు దగ్గరకు రావటం అంటూ లేదు" అని తన సర్వజనీనతను చాటింది. పరిపూర్ణమనస్సుతో, నిష్కామకర్మతో మనం అమ్మ సూక్తులను ఆచరించగలిగిననాడే మన జీవితాలకు ధన్యత చేకూరుతుంది. మన జీవన కేదారాలు, సస్యశ్యామలమై వెలుగొందుతాము. లోకంలో ఎందరో మహానుభావులు తమ అమూల్యమైన అనుభవాలను, అభిప్రాయాలను వెల్లడింపచేసారు. కాని అమ్మ సూక్తులు అన్నింటికీ అతీతమై, సత్యమై, సమగ్రమై, సుందరమై, విశ్వజనీనమై అలరారుతున్నాయి.

"జీవితం-సమస్యలతోరణం, జీవితం సమస్యలతో-రణం". జీవితం సమస్యల తోరణమే అనగా సమస్యలతో కూడినది. జీవితం సమస్యలతో-రణం అనగా జీవితం అనేది సమస్యలతో యుద్ధం చేయునట్టిది అని నిర్వచించింది. "బాధే భగవంతుడ'ని అంటుంది. అమ్మ సూక్తులను అధ్యయనం చేసి ఆచరణలో పెట్టిననాడు అమ్మకు నిజమైన వారసులవుతాము. అందుకే అమ్మ సూక్తులు ఆస్తికులకే కాక నాస్తికులకు శిరోధ్యార్యమవుతున్నాయి.

సికింద్రాబాద్‌లో వీరమాచనేని ప్రసాదరావుగారి కొడుకు, కోడలు జీపులో ప్రయాణం చేస్తుంటే లారీ ఢీకొని ప్రమాదం జరిగింది. కోడలికి మెదడు దెబ్బతిన్నది. ఫాలభాగలోని శల్యాలు శిథిలమయినాయి. ఆపరేషన్ చేసినా నమ్మకం చెప్పలేమని, డాక్టర్లు వారి ప్రయత్నం వారు చేస్తున్నారు. ఆ క్లిష్ట సమయంలో శ్రీ జమ్మి వెంకటరత్నం గారు అమ్మ దగ్గర నుంచి ప్రసాదం, తీర్థము తీసుకువెళ్ళారు. ఆ తీర్థాన్ని చూచేటప్పటికి ప్రసాదరావు గారికి సంజీవిని చూచినంత ధైర్యం వచ్చింది. శ్రద్ధగా తీర్థం నోటిలో పోసారు. స్పృహ లేకపోయినా ఆమె తీర్థం తాగింది.

భావం మార్పుతో మానవుడు మాధవుడవుతాడు.

ప్రసాదరావుగారికి 'అమ్మ' డాక్టర్ డ్రస్సులో ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళినట్లు దృశ్యమానమయింది. వెనకనే వారి కోడలిని స్ట్రెచర్‌మీద థియేటర్‌లోకి తీసుకువెళ్ళారు. అమ్మను గాంచిన అన్నయ్యకు ఆనందాశ్చర్యాలతో మేను పులకరించింది. అమ్మయే స్వయంగా ఆపరేషన్ జరుపుతున్నట్లు వారి ప్రగాఢ విశ్వాసం. ఆపరేషన్ జయప్రదమయింది.

ఈ సంఘటన ప్రసాదరావుగారు వివరిస్తే మాజీ కమ్యూనిష్టు పార్లమెంటు మెంబరు ఆశ్చర్యచకితులయ్యారు. ప్రసాదరావుగారు కూడ కమ్యూనిష్టు పార్లమెంటు మెంబరు, హేతువాది. ఇదేమిటి ఇలా మారిపోయాడు? అని అదే విషయాన్ని ప్రసాదరావుగారిని అడిగితే "పూర్వం ఏ అనుభవమూ, ఏ దర్శనమూ లేదు-ఏమీ నమ్మలేదు". ఇప్పుడు "ఎన్నో అనుభవాలు, నిదర్శనాలు, నిరూపణలు మరి, నమ్మకపోతే ఎట్లా? ఏమీ లేక నమ్మితే ఎట్లా మూఢత్వం అని అనుకున్నానో ఎన్నెన్నో ఆవలోకిస్తూ, అనుభవిస్తూ కూడా లేదనుకుంటే అంతే మూర్ఖత్వమన భావిస్తాను' అని చెప్పారు ఏప్రకోపం లేకుండా.

గ్రీకు సోదరుడు పాలోకి ఒక స్నేహితురాలు "ప్రపంచంలో ఏ మూల కొంచెం ప్రేమ కనిపించినా, దానికి మూలం ఒకటే. ఆ మూలం ఇండియాలో వున్నది వెళ్ళి చూడమని" సలహా ఇచ్చింది. ఆరు నెలలకు పైగా ఆ ప్రేమను చూడటమే కాదు, ఆ అమృతాన్ని పుక్కిటి బంటిగా త్రాగి స్వదేశానికి చేరుకున్నాడు పాలో, ఆ మూలం ఎవరో కాదు 'మన అమ్మే'.

మన ఆశయాలు, ఆకాంక్షలు సమసిపోకుండా పెరుగుతుండాలి. అవి ఉన్నతమైనప్పుడే మానవుడు అభివృద్ధిని పొందగల్గుతాడు. దేశం నా కోసం ఏమి చేసిందని కాక, దేశం కోసం మనం ఏమి చేస్తున్నామని ప్రశ్నించుకోవాలి. శ్రీ రామకృష్ణ పరమహంస ఆ దేశాన్ని శ్రీ వివేకానందులు ఏవిధంగా ఆచరణలో

నేను చేస్తున్నాను అనుకునేది బాధగల బాధ్యత. నిమిత్తమాత్రుడను అనుకునేది బాధలేని బాధ్యత.

పెట్టారో అదే ఒరవడితో మనం కొంతలో కొంత అయినా అమ్మ సూక్తులు ఆచరణలో పెట్టాలి. దేశ పురోగమనానికి, మానవాళి పురోభివృద్ధికి మనవంతు కర్తవ్యాన్ని మనం నిర్వహించాలి. అట్టి నిర్వహణకు కావలసిన ధైర్యాన్ని, స్థైర్యాన్ని అమ్మ కలుగచేయాలి. మన సంస్కృతిని మనం పటిష్ఠం చేసుకుంటూ ఆ సంస్కృతిని మన తరువాతి తరం వాళ్ళకు అందించటానికి మనం వారధులుగా ఉపయోగపడగలగాలి.

30. కైవల్యప్రదాయిని - అమ్మ

"అనన్యాశ్చింతయంతో మాంయేజనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహః॥

ఎవరు ఇతర భావములు లేనివారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడూ నాయందే నిష్ఠ కలిగియున్నవారి యొక్క యోగక్షేమములను వహించుచున్నాను అని, శ్రీ కృష్ణభగవానుడు హామీ ఇచ్చెను. అట్టి కర్మ యోగిని లలితాంబక్కయ్య డి.ఎస్.పి. సత్యనారాయణగారి భార్య.

ఆయన మరణానంతరం అక్కయ్య జిల్లెళ్ళమూడిలో స్థిర నివాస మేర్పరచుకుంది. అమ్మ సూక్తులను తన జీవితంలో అన్వయించుకుంటూ ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా అమ్మ యందు విశ్వాసాన్ని కోల్పోని అమృతమూర్తి. ఆమె పూజలలో పాల్గొనక ధ్యానమార్గాన్ని ఎన్నుకున్నది. తాను చేసే ప్రతి పనిలో అమ్మనే తలంపుకు తెచ్చేటటువంటి వ్యక్తి. అందుకే అమ్మ రాధన్నయ్య మంచిచెడులు చూడటానికి అక్కయ్యనే ఎన్నుకున్నది. డా॥ ఇనజకుమారి అమ్మ సన్నిధిలో వుండి అమ్మకే తన జీవితాన్ని అర్పణ చేసుకున్నది. ఆమెను జిల్లెళ్ళమూడిలో అంతా పాపక్కయ్య అంటారు.

లేనిదాని కొరకు ఆశించేది .... దుఃఖం. ఉన్నది చాలనుకునేది సంతోషం.

లలితాంబక్కయ్య వాళ్ళింట్లో పనిమనిషిని, అత్తవారు తీసుకువెళ్ళటంలేదు. అమ్మ దర్శనం చేయిస్తేనన్నా ఆమె భవిష్యత్ బాగుంటుందన్న తపనతో ఆ అమ్మాయిని అమ్మ దగ్గరకు తీసుకువెళ్ళింది. అమ్మ దర్శనం కొరకు వెళ్ళగానే అక్కయ్య ఏమీ చెప్పకుండానే అమ్మ "తెల్లచీర తీసుకురామ్మా! అది కాపరానికి అత్తవారింటికి వెళ్ళాలని అంది" అమ్మ ఆమె భవిష్యత్‌ని తీర్చి దిద్దిందనటానికి ఇంతకంటే నిదర్శనమేమున్నది.

"తమ బతుకు తాము బతుకలేని అనేక విధాల బలహీనతలు ఉన్నారు, వారికి తోడుపడండి. అది వారిపై జాలితో చేసే సహాయమని అనుకోక వారిని భగవత్స్వరూపులుగా భావించి సేవచేయండి. కనిపించని దేవునిపై మనస్సు నిలవడంలేదనీ, ఏకాగ్రత కుదరటంలేదని బాధపడక మానవరూపంలో కనిపించే యీ దేవుళ్ళను ప్రేమతో ఆరాధించండి. ఆ సేవలో కలిగే తృప్తే ముక్తి" అని అమ్మ సందేశం.

ఆ సందేశాన్ని అక్షరాలా అమలు పరిచే వ్యక్తి లలితాంబక్కయ్య ఎవరికి ఏ బాధ కలిగినా తనకు చేతనైన సాయం చేస్తుంది. హరిదాసుగారి భార్య క్రిష్ణవేణక్కయ్య మంచంలో వుంటే, మనిషిని పెట్టి సేవ చేయిస్తున్నది. ఎవరికి బాగాలేదన్నా మందులు ఇచ్చి వాళ్ళను ఆదుకుంటుంది. పల్లెటూరు, ఏది కావాలన్నా దొరకదని ప్రథమ చికిత్సకు అవసరమైన సరంజామా అంతా తన దగ్గర వుంచుకుంటుంది.

లలితాంబక్కయ్య వైజాగ్‌లో వుండగా అమ్మ "లలితాంబ వచ్చిందా?" అని అడుగుతున్నట్లుగా కలలో స్పష్టంగా శబ్దం వినిపించింది. శబ్దం వినిపించేటప్పటికి మెలుకువ వచ్చి, అమ్మ మాటలు వినిపించాయి కదా! అని తలుపుతీసి చూస్తే ఎవ్వరూ లేరు. అమ్మ తదనంతరం క్యాసెట్ పెట్టుకు

ధ్వనులు అనేకం శబ్దం ఒక్కటే.

వింటూ అమ్మ "రూపం వుండదు, గొంతు వినిపిస్తుంది" అని చెప్పటానికే అమ్మ గొంతు కలలో వినిపించిందని అనుకుంది.

అమ్మ సిద్ధిపొందిన అనంతరం ఆవరణలోని వారందరికీ సంస్థవాళ్ళు చీరెలు ఇచ్చారు. లలితాంబక్కయ్యకు ఇస్తే అమ్మ కనిపిస్తే కాని నేను చీరకట్టుకోనని అనుకుంది. ఆ రాత్రి అక్కయ్యకు కలలో "అన్నయ్య ఎవరినో ముసలమ్మను వెళ్ళమన్నాడు" దానికి అమ్మ "ఒక నెల వుండనీయండిరా!" అని అంటోంది. పక్కనే వున్న అక్కయ్య "ఆమె కింద ఒక వందరూపాయలు ఖర్చు అవుతాయేమోనని" అనుకున్నట్లుగా కల వచ్చింది. ఆ తరువాత ఆ వందరూపాయలు హుండీలో వేసింది. అమ్మ తాను కోరుకున్న విధంగా దర్శనమిచ్చిందని ఆనందపడింది.

లలితాంబక్కయ్య తమ్ముళ్ళు కాంతారావుగారు, శ్యామ్ కూడా అమ్మ యందు అనురక్తి కలవారే. కాంతారావుగారు షిప్‌యార్డులో అకౌంట్సు సెక్షన్‌లో పనిచేసేవారు. ఆయన తన టేబుల్‌గ్లాసు కింద అమ్మ ఫోటో పెట్టుకునేవారు. ఒకమారు ఆయన సిగరెట్టు తాగుతూ వుంటే ఆయన బాస్ వచ్చి "అమ్మ ఫోటో దగ్గర సిగరెట్టు తాగుతున్నారా?" అన్నారు. ఆయన అమ్మ దర్శనం చేసుకున్న వ్యక్తి. ఆ ఫోటో టేబుల్ మీద పెట్టుకోమని వాళ్ల బాస్‌కి ఇచ్చారు. మళ్ళీ కొద్దిరోజుల్లోనే కాంతారావుగారికి ప్రమోషన్ రావటంతో అమ్మ ఫోటో వున్న రూమ్‌కు వెళ్ళటం సంభవించింది. అమ్మ ఫోటో ఫ్రేమ్ కట్టించి దసరాల్లో పూజలో పెట్టుకున్నారు.

పదవీ విరమణ తరువాత ఆయన నాసిక్ వెళ్ళారు. అట్నుంచి వచ్చిన తరువాత ఫోటో కనిపించలేదనుకున్నారు. 'దివ్యానుభూతులు' పుస్తకం లోపల వేయించిన ఫోటో లాంటిదే కాంతారావుగారు అర్చించుకునేది. ఆయన దగ్గర

మంత్రమంటే భగవంతుని అక్షర రూపమే.

వున్న పుస్తకం లోపల రెండు ఫోటోలు వున్నాయి. అమ్మే తన కొరకు రెండు ఫోటోలున్న పుస్తకం అందచేసిందని ఆయన విశ్వాసం. ఒకటి తీసి ఫ్రేమ్ కట్టించుకున్నారు. అమ్మ తనను ఆ విధంగా అనుగ్రహించిందని ఎంతో ఆనందంగా తెలియచేసారు. "మనం మరచినా తాను మరవదు, మనం వదిలినా తాను వదలనని" అంటుంది. దానికి తార్కాణమే ఈ సంఘటన.

31. ఉపాసనా - అమ్మ

"ఉపాసనా కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా"

ఉపాసకుల సౌకర్యం కోసం నిరాకారమైన, నిర్గుణమైన బ్రహ్మతత్వం సాకారమై, సగుణమై భాసిస్తుంది. సాధన కాలంలో సజ్జన సాంగత్యం, నియమనిష్ఠలు అవసరం. మొక్కగా వున్నప్పుడు రక్షణ అవసరమైనట్లే మాను అయిన తరువాత రక్షణ అవసరం వుండదు. అలాగే సాధన కాలంలో రక్షణ అవసరం వుంటుంది. సర్వకాల సర్వావస్థలయందు సర్వాంతర్యామిని తలుచుకో గలిగిననాడు అజ్ఞానాన్ని పారద్రోల గలుగుతాము. మనకు నచ్చిన రూపాన్ని, నచ్చిన నామంతో భగవంతుని స్మరణ చేసుకోవచ్చు. శరీరం వున్నన్నాళ్ళు దాని ప్రభావం మన మీద వుంటుంది. కాని సర్వాంతర్యామిని సర్వదా తలుచుకోగలిగిననాడు దాని ప్రభావం మనల్ని ఏమి చేయలేదు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు అనన్యచింతన వుండాలని అర్జునునికి బోధించాడు. దానిని మనం ఆదర్శంగా తీసుకోవాలి. సృష్టి అంతా ఒకే దైవంగా చూడటానికి అలవాటుపడితే మన కర్తవ్యం ఆగదు, సాగిపోతూనే వుంటుంది. ఆధ్యాత్మిక దోవలో పయనించటానికి సిద్ధ పురుషులు యొక్క అవసరం ఎంతైనా వుంటుంది. మన అదృష్టం కొద్దీ జగన్మాత యొక్క సాంగత్యం

నేను నీవుగా ఉంటే అహంకార బ్రహ్మ (రెండుగా ఉన్న స్థితి)

మనకు లభించటంతో మనకు ప్రియా ప్రియములులేవు. అప్రియం జరిగినా ఆ నిమిషాన ఉద్వేగం చెందినా, మళ్ళీ మామూలు స్థితికి వచ్చేలా అమ్మ చూచుకుంటుంది. కర్తవ్య పాలనను చేసుకుంటూ పోయే స్థితిని అమ్మ కల్పిస్తుంది. ఆనందాతిరేకతవలన కూడా కర్తవ్య విముఖత కల్గుతుంది. స్థిత ప్రజ్ఞుడు ఆనందమునందు, దుఃఖమునందు ఒకేలా వుండగల్గుతాడు. కర్తవ్య ఉన్ముఖత్వం వుంటుంది. వివశత్వం చెందదు. అట్టి స్థితిని అందుకొనుటకే మనం చేసే సాధన ఉపయోగపడాలి.

ఒక సంవత్సరం మహాశివరాత్రికి అమ్మ 24 గం.లు హైమాలయంలో అభిషేకాలు చేయించింది. ఆ శుభసందర్భంలో పాలు పంచుకొనే అవకాశాన్ని అమ్మ నాకు కలుగచేసింది. ఆరోజు ఉదయం అమ్మ దగ్గర నేను, శ్రీగంటి వెంకట్రావుగారు కూర్చున్నాము. అక్కడ నుండి వచ్చేస్తుంటే "ఎక్కడికి వెళ్తున్నారని" అమ్మ అడిగింది. హైమాలయంలో అభిషేకాలు చేసుకోవటానికి కంటే "పగలు చేసేవాళ్ళు చాలామందే వుంటారంది". అన్యాపదేశంగా మా ఇద్దర్నీ రాత్రి చేయమందనకుని మళ్ళీ అమ్మ సమక్షంలో ఎక్కువ సేపు వుండగల్గుతున్నందుకు మురిసిపోయాము.

"ఉపవాసం వుండాలన్న నియమము ఏమీ లేదని, ఎవరి ఇచ్ఛానుసారం వాళ్ళు చేసుకోవచ్చుని" అంది. అమ్మ సన్నిధిలో ఎక్కువసేపు వుండాలన్న తపనతో భోజనానికి వెళ్ళకుండా అక్కడే కూర్చున్నాం. అన్నపూర్ణాలయం నుంచీ అమ్మకు నివేదన వచ్చింది. అందులో నుంచి రెండు పెద్ద బూరెలు తీసి వాటితోపాటు రెండు సపోటాలు, రెండు అరటిపళ్ళు నాకు వెంకట్రావుగారికి ఇచ్చింది. చేతిలో పెట్టుకు కూర్చుంటే "అక్కడే తినమంటూ, మీరు కావాలనుకుంటే భోజనం చేయవచ్చుని" అమ్మ అన్నది. "ఇంటి కంటే గుడి

'నేను' నేనుగా ఉంటే అహం బ్రహ్మోస్మి.

పదిలం అన్నట్లు మా చేత బూరెలు, పళ్ళు తినిపించావు. ఇంక భోజనమెందుకమ్మా!" అన్నాం. మామూలు రోజుల్లో అమ్మ భోజనం చేసి పూజ చేసుకోమన్నా, కొన్ని సమయాల్లో భోజనం చేయకుండా పూజ చేయించేది. అలాగని ఉపవాసం వుంచేది కాదు. సాయంత్రం దాకా అమ్మ సన్నిధిలో గడిపి రాత్రి అభిషేకానికి హైమాలయంకు వెళ్ళాము.

హైమాలయంలో అభిషేకాలు చేయటానికి ఆసీనులమవుతుండగా గర్భగుడిలో అభిషేకాలకు వస్తామన్నవారు రానందున, మా ఇద్దర్నీ చేసుకోమని శేషు అన్నది. అది మహద్భాగ్యంగా భావించి రాత్రి 8 గం॥లు నుంచి అభిషేకాలు చేసుకున్నాము. లింగోద్భవ వేళ గర్భగుడిలో పూజ చేసుకోగలగటం మా అదృష్టమే. రాత్రి 2.30 గం॥లకు వెంకట్రావుగారు తిరిగి అమ్మ దగ్గరకు వెడితే, ఆయనకు హార్లిక్సు కలిపి ఇవ్వమని వసుంధరక్కయ్యకు చెప్పి, కుసుమ అక్కడే వుంది అదీ వచ్చి తాగితే బాగుండునని తన మాతృత్వానికి పరిధులు లేవని, అందరి చుట్టూ తన ఆలోచనలు పరిభ్రమిస్తాయని తెలియచేసింది. దయామయి, కరుణాసముద్ర అయిన అమ్మను తలుచుకోగలగటం కంటే మనం చేయగలిగిన కార్యమేముంది.

తెల్లవారుఝామున 5.30 గం॥లకు అభిషేకాలు అయిపోయాయని వెళ్ళిపోదామనుకున్నాను. గోపాలన్నయ్య వాళ్ళు ఎలాగూ ఇంతసేపు వున్నావు. మంత్రపుష్పం కూడా అయ్యే వరకూ వుండమన్నారు. తెల్లవారి 7 గం॥ల వరకూ హైమాలయంలో గడపగల్గటంతో నా మానసం ఉప్పొంగిపోయింది. అమ్మకు నా యందు కల కరుణా, వాత్సల్యాలకు అవధులు లేవనిపించింది.

ఒక్క సంవత్సరంలో 10 మార్లు అమ్మ దగ్గరకు వైజాగ్ నుంచి జిల్లెళ్ళమూడికి వెళ్ళగలగటం ఆర్థిక పరంగా ఇబ్బందుల్లో వున్న నాకు 'అమ్మ'

కదిలే కాలు కనిపిస్తుంది కదిలించే శక్తి కనిపించదు.

వరంగా ప్రసాదించిందనే చెప్పవచ్చు. అనేక ఈతిబాధలకు గురి అవుతున్నా తన మీద నమ్మకం సడలిపోకుండా చేసింది. జిల్లెళ్ళమూడిలో మామిడి తోరణం కట్టటం ఆలస్యం నీవు తయారవుతున్నావని సరోజినక్కయ్య, ఆటపట్టించింది. జిల్లెళ్ళమూడిలోని స్థానికులు కూడా చేసుకోలేని పూజలు, వ్రతాలు అమ్మ నాచేత చేయించింది.

మంగళగౌరీ వ్రతం క్రొత్తగా పెళ్ళి అయినవాళ్ళు చేసుకుంటుంటే వారితో పాటు నేను మళ్ళీ చేసుకున్నాను. శ్రావణ శుక్రవారం నవకాయ పిండివంటలతో అర్చించుకున్నాను. 5సం॥లు దసరాల్లో త్రికాల పూజలు చేసుకున్నాను. పదహారు ఫలాల నోము, పసుపు తాంబూలోవుద్యాపన అమ్మ దగ్గర నవనవోన్మేషంగా జరిగాయి. 108 రూపాయి కాసులతో స్వయంగా అమ్మకే పూజ చేసుకోగలగటం నా జీవితంలో మరపురాని సంఘటన, అందులో నుంచి 2 రూపాయలు తీసి అమ్మ నాకు ఇచ్చింది. అప్పటి నుంచి జీవితంలో వెనక్కి చూసుకోవలన అవసరం లేకుండా ఆర్థికంగా నిలదొక్కుకున్నాము. గాయత్రీ దీక్ష తీసుకొని రోజుకు రెండువేల జపం చేసి గాయత్రీ యాగంలో పాలు పంచుకున్నాం. కేశవశర్మగారు వాళ్ళు మండల దీక్ష తీసుకోని శ్రీయాగం చేయాలనుకున్నప్పుడు, దీక్ష తీసుకున్నవారిలో దంపతులు రానందున మా ఇద్దర్నీ వాళ్ళతో పాటు యాగం చేయమన్నారు. ఏ దీక్ష తీసుకోకపోయినా ఆ గడ్డమీద శ్రీయాగం చేసుకోగలగటం అమ్మ యొక్క అనుగ్రహమే కారణం. జిల్లెళ్లమూడిలో అంతా మమ్మల్ని సోమయాజులు, సోమిదేవమ్మ అంటూ మేలమాడారు. అమ్మ సమక్షంలో బాబు ఒడుగు, మా అమ్మాయి పెండ్లి చేసుకోవటం మా పూర్వజన్మ సుకృతమే.

నడి సముద్రంలో ఓడ మీద పక్షి నిలబడినప్పుడు ఎంత దూరం ఎగిరినా

చేతులు నీవి గాని చేతలు నీవికావు.

మళ్ళీ నిలబడాలంటే ఆ ఓడ మీదకే రావాలి. అలాగే మనస్సు విషయవాంఛలకు లోనైనా ఎప్పుడో అప్పుడు మనస్సుకు నిలకడ, నిగ్రహం కొరకు భగవతారాధననే ఆశ్రయించాలి. జీవితంలో సాధన జరుగుతున్నప్పుడు జగన్మాత, సాధకుడైన తన బిడ్డను చేతబట్టుకొని మూలాధారం నుండి అలా సుషుమ్నానాడి వెంట సాగి సాగి మధ్యనున్న చక్రాలను దాటుకుంటూ చిట్టచివర సహస్రారం దాక తీసుకువెడ్తుంది అదే ముక్తి, మోక్షం. సహస్రారంలో ఓలలాడిన వారికి కావల్సిందంటూ వేరేమీ వుండదు. దాని కొరకే అమ్మ మన చేత ఒక్కొక్క మెట్టూ ఎక్కిస్తోందా అని అనిపిస్తుంది.

అమ్మ ప్రేమ అధిపత్యాన్ని కోరదు. అనురాగాన్ని పంచుతుంది. హక్కులను ఏకరవు పెట్టదు. బాధ్యతలను చేపడ్తుంది. ఎవరికి వారుగా బతకనివ్వక, అందరం ఒకే తల్లి బిడ్డలమన్న తృప్తి మనందరికి నిరంతరం అందిస్తుంది. ఇట్టి, మధురస్మృతులను ఇంతకంటే మరెన్నో అనుభవాలను 'అమ్మ' తన బిడ్డలకు అందిస్తుందనటంలో సందేహం లేదు. అవి అన్నీ వెలుగులోకి వచ్చి అమ్మ యొక్క అనురాగం, ప్రేమ, వాత్సల్యం లోకానికంతా చాటవలసిన బాధ్యత అమ్మ బిడ్డలమైన మనందరి మీద వుంది. అట్టి అవకాశాన్ని కలుగ చేయవలసినదిగా మనోజ్ఞమూర్తియైన అమ్మకు మనఃప్రమాణములర్పిస్తున్నాను.

32. ఆధ్యాత్మిక స్థితి - అమ్మ

భగవంతుడు సర్వాంతర్యామి, అజ్ఞానాంధకారంలో పడి దారి తెన్ను తెలియక పరితపించే మానవాళికి తరుణోపాయం చూపాలని ప్రవక్తలు, అవతారపురుషులు ఈ లోకంలో ఉద్భవిస్తుంటారు. మనకు నచ్చిన భగవంతుడి రూపాన్ని ధ్యానిస్తుండాలి. ధ్యానం హృదయంలో ప్రారంభమై శిరస్సులోని సహస్రారంలో ముగుస్తుంది. భక్తికి సాధ్యం కానిది ఏదీ లేదు. గురువు, ఇష్టదైవం ఒకరే.

దేహమున్నవాళ్ళు సందేహం తప్పదు.

మా అదృష్టవశాత్తు 1969 నుంచి అమ్మ ఒడిలో పిల్లలమయినాము. పురుషయత్నం వున్నచోట దైవసహాయం తప్పక లభిస్తుందని అంటారు కదా! మనకు కష్టాలు వచ్చినపుడు హిమాలయంలా స్థిరంగా నిలబడాలని, ఇతరుల కష్టాలకు గంగలా కరిగి ప్రవహించాలని మహాత్ముల ఉవాచ. అమ్మ అనుగ్రహం వలన మా ఇద్దరి అభిరుచులు ఒకటే, అవటం వలన ఎన్నెన్నో సహాయ సహకారాలను పొందాము. అమ్మ అడుగుజాడలలో కొంతలో కొంతైనా పసిపిల్లల్లా తప్పటడుగులు వేస్తున్నాము. ఇది ఆత్మవిశ్వాసంతో చెప్తున్న విషయమే కాని, అహంకారంతో చెప్తున్నది కాదని మనవి చేస్తున్నాను.

1974 వ సం॥లో తలమీద కాన్సర్ వుందని నెలరోజుల కంటే బతకవని డాక్టర్లు చెప్పారని ఒక అతను ఈయన దగ్గరకు వచ్చి బాధపడ్డాడు. ఈయనకు ఏమీ పాలుపోని స్థితిలో అమ్మను తలుచుకొని, అమ్మ కుంకుమనే ప్రసాదమంటుంది కదా! అది ఇచ్చి తలమీద రాసుకొని, కొంచెం నీళ్ళలో వేసుకొని త్రాగమన్నారు. అమ్మ నామం “జయహో మాతాశ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి” దానిని అమ్మ మహామంత్రమంటుందని, దానిని విడవకుండా చేయమని చెప్పారు.

అతను ఎంతో నమ్మకంతో ఈయన చెప్పినట్లు చేసాడు. 4 నెలల తరువాత ఆరోగ్యంగా వచ్చిన అతన్ని చూచి ఈయన ఆశ్చర్యపోయారు. తాను తలమీద కుంకుమ రాసిన క్షణం నుంచే చాలా బాధ తగ్గిందని, కులాసాగా, ఆరోగ్యంగా వున్నానని చెప్పాడు. డాక్టర్లు నెలరోజుల కంటే బతకవని చెప్పినా అమ్మ కరుణా కటాక్షాల వల్ల హాయిగా వున్నాడు.

జిల్లెళ్ళమూడికి అమ్మ దర్శనంకు వెళ్ళి వచ్చేటప్పుడు అమ్మ బొట్టు పెట్టి కుంకుమ పొట్లాలు స్వయంగా ‘ప్రసాదం’గా ఇచ్చేది. ఆ కుంకుమతో భవరోగాలు తగ్గిన వారెందరో వున్నారు.

ఆశ అసంతృప్తుల కలయికయే జీవితం.

1975లో మా మందులషాపుకు వచ్చే ఒకామె తన భర్త ఇంకొక ఆమెతో వుంటూ తనని, పిల్లల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయింది. మమ్మల్ని ఒడ్డున పడేసిన అమ్మనే తలుచుకొని ఆమెకు అమ్మ కుంకుమ ఇచ్చి 40 రోజులు లలితా సహస్రనామాన్ని సంపుటిగా చేయమన్నారు.

సంపుటి :- అనగా మన అవసరాన్ని కోరికను అనుసరించి లలితా సహస్రనామంలో ఒక లైన్ తీసుకొని ఆ నామాన్ని లలితాసహస్రనామంతో కలిపి చేయటం.

ఈక్రింది సంపుటి ఎలా చేయాలో ఉదహరించాను.

ఉదా॥ శివకామేశ్వరాంకస్థా శివ స్వాధీనవల్లభా అని చేసి
శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీ మత్సింహాసనేశ్వరి,
చిదగ్నికుండ సంభూతా దేవకార్య సముద్యతా
శివకామేశ్వరాంకస్థా శివస్వాధీనవల్లభా అని

ప్రతీరెండు లైనులకు అటూ ఇటూ మనకు కావలసిన నామాన్ని కలిపి చేయాలి. ఆమె ఆవిధంగా నిష్ఠగా ఆచరించింది. 39 వ రోజు అవతలి ఆమెతో తెగతెంపులు చేసుకొని భర్త తన దగ్గరకు వచ్చారని విపరీతమైన సంతోషంతో చెప్పింది.

ఆరోగ్యం కోసం :-

1. "సర్వవ్యాధి ప్రశమిని, సర్వమృత్యునివారిణి"
2. "రోగపర్వత దంభోళిః మృత్యుదారుకుఠారికా"

ధనం కోసం :-

"మహాభోగా మహైశ్వర్యా మహావీర్యా మహాబలా"

ఒకదాని మీద ఉంటే మమత సర్వత్రా ఉంటే సమత.

ఈ రకంగా చేస్తే నెరవేరవనుకున్న యెన్నెన్నో సమస్యలు పటాపంచలయినాయి. శరభలింగంగారు 'ఇచ్ఛా శక్తిః జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణి' సంపుటిలా చేసారు. ఇలాగే అనేకమంది అనేక రకాలుగా చేసి అమ్మ అనుగ్రహానికి పాత్రులయ్యారు.

అమ్మ సందర్భవశాన లలితాసహస్రం 11సార్లు చొప్పున 40 రోజులు చేయమని చెప్పిందని రావూరి ప్రసాద్ మా బాబుకు చెప్పాడు. వాడు నిష్ఠగా ప్రొద్దున 11 సార్లు, సాయంత్రం 11 సార్లు చొప్పున రోజుకు 22 మార్లు 40 రోజులు లలితాసహస్రనామాన్ని చేసాడు. రాదనుకున్న సీటు రావడం జరిగింది. అలాగే మా మరిదిగారు అబ్బాయికి, శ్రీ వి.వి.ఎస్. తిలక్‌గారి పెద్ద అమ్మాయి పద్మారమణికి 40 రోజులు కాకుండానే, రోజుకు ఒకమారు చేస్తేనే ఉద్యోగాలు వచ్చాయి. కొంతమందికి వివాహాలు అయ్యాయి. మరికొంతమందికి ఆరోగ్యం కుదుటపడింది. మా అమ్మగారు "సర్వవ్యాధి ప్రశమని సర్వమృత్యునివారిణి" అని సంపుటి చేసారు. ఆవిడకు అంతకు పూర్వం చెవిలో వున్న కాయ మటుమాయమయింది. ఈ విషయాన్ని "దివ్యానుభూతులలో" వివరించడం జరిగింది.

విశాఖ వైర్‌రోప్స్ శ్రీవెంకటపతి రాజుగారు రోజూ లలితాపారాయణ చేస్తున్నారు. ఖడ్గమాలను రోజుకు 11 మార్లు చేస్తున్నారు. ఆయనకు వున్న అనేక సమస్యలను 'అమ్మ' తన ఖడ్గంతో ఛేదిస్తున్నది.

శ్రీ పి. నరసింహంగారు పెద్దవారు. అడుగు తీసి అడుగు వేయటానికి కూడా చాలా ఇబ్బంది పడతారు. అలాంటిది ప్రతి శుక్రవారం పూజకోసం ఆటోలో వస్తారు. అలాగే ఎంతో ప్రయాసతో మెట్లు ఎక్కుతారు. అమ్మా, హైమల నామజపం దీక్షగా జపిస్తారు. సౌందర్యలహరి పారాయణ

నిర్వికారం మారనిది ఆకారం మారేది.

చేయగలగటం, ఇదంతా అమ్మ తనకు కలుగజేసిన దివ్యావకాశమని ఆయన పూర్తి విశ్వాసం.

విశాఖపట్టణంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి గురించి తెలియని వారుండరు. దూరప్రాంతాలనుంచి అమ్మవారి దర్శనం కొరకు ఎందరెందరో వస్తారు. కామితార్థాలను తీర్చే కల్పవల్లి శ్రీ కనకమహాలక్ష్మి మార్గశిరమాసమంతా ఉత్సవాలు కనులపండుగగా జరుగుతాయి. మార్గశిర లక్ష్మివారాలకు ఇక్కడ ఎంతో ప్రత్యేకత.

శ్రీ నరసింహంగారిని గాజువాకలో ఆంజనేయోపాశకులు శ్రీ రామకృష్ణ గారు కలిసారు. చిన్నవాల్తేరులో వున్న నరసింహంగారింటికి రామకృష్ణ గారు కారు పంపించి కనకమహాలక్ష్మికి ఈయన చేత అభిషేకం చేయించారు. కనకమహాలక్ష్మి అమ్మవారి శేషవస్త్రాలతో నరసింహం గారిని సత్కరించారు. తాను జీవితంలో ఎన్నడూ ఊహించని విధంగా జరిగిందని ఎంతో ఆనందంతో తెలియచేసారు. ఇది అంతా అమ్మ, హైమల మహిమే అని జీవితంలో, ఇంత ఆనందాన్ని ఎన్నడూ పొందలేదని చెప్పారు. వారికి మనశ్శాంతిని కలుగచేసి వారి కోడలికి పర్మినెంట్ ఉద్యోగం 'అమ్మ' తెప్పించిందని ఆనందంతో తెలియచేసారు.

ఆధ్యాత్మికుడు తాను నిర్వర్తించవలసిన కర్మలను చేస్తాడు. ఏది కావాలన్నా కోరిక వుండదు. అతనికి కావాలిసినవి అతని దగ్గరికే వస్తాయి. పరమాత్మ వాడి అవసరాలను కనిపెట్టి చేస్తుంటాడు. వాడికి కావాలనిగాని, వద్దనిగాని వుండదు. హంసతూలికా తల్పంగాని చింకిచాపకాని ఒకటే. వాడు కర్తవ్యం నందు శయనిస్తాడు. యోగస్థితిలో వున్నవాడికి వానికి కావలసిన దానిమీదే కాని, మిగిలిన వాటిమీద దృష్టి వుండదు. వాడికి బ్రహ్మస్పర్శ వుంటుంది.

ప్రేమ యొక్క రూపాంతరమే ద్వేషం.

బ్రహ్మస్పర్శ లేనివాడికి బాహ్యస్పర్శ, బాహ్మస్మృతే వుంటుంది. ఆధ్యాత్మికుడికి ఇంద్రియముల ద్వారా పొందేది వుండదు. కాబట్టి శాశ్వత స్థితి సర్వసముదర్శన స్థితి వుంటుంది.

మన అదృష్టవశాత్తు విశ్వజనని అయిన అమ్మ సహచర్యం మనకు లభించింది. 'అమ్మే మనకు దైవం గురువు'. మనల్నందర్ని ఆధ్యాత్మిక వాదులుగా చేయుటకే అమ్మ మన మధ్య సంచరించింది. ఇహలోక కోరికలన్నింటిని తీర్చే కల్పవల్లి అయింది. కడుపునిండిన వానికి తిండిమీద ఇచ్ఛ ఏ రకంగా వుండదో! ఇహలోకంలో మనకు కావలసినవన్నీ అమ్మ సమకూర్చి ఆధ్యాత్మికత యందు మనలను కర్తవ్యోన్ముఖులుగా చేసి శాశ్వతానందస్థితిని, సమదర్శన స్థితిని పెంచేందుకు తీర్చి దిద్దుతున్నది. అట్టి జగన్మాత అయిన అమ్మకు సభక్తికంగా సహస్రాధిక ప్రణామములు సమర్పించుకుందాము.

33. ఈప్సితార్థదాయిని - అమ్మ

అలౌకిక సౌందర్యామృతం చిలికే మందహాసభరితమైన ముఖారవిందంతో చిందులాడుతుంటే 'అమ్మను' అవలోకించిన క్షణాలను గుర్తుకు తెచ్చుకుంటుంటే విపరీతమయిన ఆనందంతో మూగబోవటమే మనవంతవుతుంది. ఇక్కడ జరుగుతున్న పూజల్లో పాల్గొనే ప్రొఫెసర్ కవిరాయని కామేశ్వరరావుగారు ఆంధ్రాయూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. కామేశ్వరరావుగారు, ఆయన భార్య శ్రీమతి రాధగారు అమ్మను అనన్యభక్తి ప్రపత్తులతో కొలుస్తుంటారు. వారు తెలియచేసిన ఉదంతాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

1983వ సం॥లో అమ్మ షష్టిపూర్తికి చేయవలసిన కార్యక్రమముల గురించి, ఏడవ మైలురాయి దగ్గర వుండే ఆర్చిని గురించి చర్చించుకుంటున్నారు.

తననితాను గుర్తించినవాడు సర్వాన్ని గుర్తిస్తాడు.

ఆర్చిమీద "జయహోమాతా శ్రీ అనసూయ రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి" అన్న నామం చెక్కించాలని వాటిని కాంక్రీటుతో చేయిస్తే మంచిదని ఓ అన్నయ్య అన్నారు. దానికి కామేశ్వరరావుగారు "అమ్మా! ఏదైనా శిలాక్షరాలంటారు కదా! శిలతో చేయిస్తే బాగుంటుందేమో అని ఆయన సందేహం వెలిబుచ్చారు. అది విని అమ్మ "ఆ పనేదో నువ్వే చేయించు నాన్నా" అని అంది.

శిలాక్షరాలని అన్నారు కాని ఏం చేయాలో ఎక్కడ చేయిస్తారో కూడా ఆయనకు తెలియదు. ఎప్పుడో ఒకాయన కంచిలో గ్రానైట్ ఫినిషింగ్స్ చేస్తారని అనటం గుర్తొచ్చి కంచికి వెళ్ళారు.

కామాక్షీ దేవాలయంకు వెళ్ళి కళ్ళు మూసుకుని దణ్ణం పెట్టుకుంటుండగా భుజం మీద ఓ చెయ్యి పడింది. ఆశ్చర్యపోయి చూస్తే ఒకాయన నవ్వుతూ "నేను ఎలక్ట్రికల్ బోర్డులో పని చేస్తున్నారు. మీరు గ్రానైట్ లెటర్స్ కోసం కదూ వచ్చిందని' అన్నారు. అది వినటంతో కామేశ్వరరావుగారికి ఒళ్ళు జలదరించి కళ్ళమ్మట నీళ్ళు కారటం మొదలయింది. ఆయన "ఇక్కడకు 5 మైళ్ళదూరంలో 'విల్లివాకం' అన్న ఊరులో అమరేంద్రకుమార్ అనే ఆయన ఈపని చేస్తారు అక్కడికి వెళ్ళమని" తాను నిష్క్రమించారు.

ఆయన చెప్పిన చోటికి ఒక రిక్షా కుదుర్చుకుని వెళుతున్నారు. ఆయనకు ఎదురుగా వస్తున్న కారులోంచి డ్రైవరు వంగి వంగి వెనక్కి చూడ సాగాడు. కామేశ్వరరావు గారు అమరేంద్రకుమార్ గారింటికి వెళ్ళారు. ఒక 10 నిమిషాలలో ఈయన అంతకు ముందు చూసిన కారు వచ్చి ఆగింది. ఆయనే అమరేంద్రకుమార్. ఆయన కామేశ్వరరావుగారిని రిక్షాలో చూడగానే "ఈయన వచ్చేది మనింటికేనేమో!" అన్న అనుమానం వచ్చి మద్రాసు వెళ్లకుండా వెనక్కు వచ్చారుట. "దట్ ఈజ్ మదర్!"

మారేది భావం, మారంది స్వభావం.

కామేశ్వరరావుగారు వచ్చిన పని చెప్పారు. అందుకు ఆయన ఆనందించి తాను ఎప్పటినుంచో అమ్మను దర్శించుకోవాలని అనుకుంటున్నట్లు తనకు ఈవిధంగా పిలుపు వచ్చిందని పొంగిపోయారు.

మర్నాడు ఇద్దరూ జిల్లెళ్ళమూడికి వెళ్ళారు. రైలులో దోవ పొడుగునా ఆయనతో అమ్మ గురించిన సంగతులే కామేశ్వరరావుగారు చెప్పటంతో ఆయన ఆనందానికి అంతేలేకపోయింది. అన్ని విషయాలు చర్చించుకున్నాక మొత్తం 30 వేలరూపాయలకు కుదిరింది. అమ్మ "అబ్బాయికి 3వేలు అడ్వాన్సుగా ఇమ్మని" చెప్పింది. అది వినేసరికి అమరేంద్రకుమార్‌గారు "నాకు 3 వేలు అడ్వాన్సు ఇస్తే బాగుండునని అనుకున్నానని" చెప్పారు. "సర్వాంతర్యామి, అవ్యాజకరుణామయి, కరుణారస సాగర అయిన అమ్మకు ఇది నిత్యకృత్యం కదా!" అని కామేశ్వరరావుగారు అనుకున్నారు.

ఈవిధంగా ఆయన్ని ప్రేరేపించి, ఆయన వంతుగా ఈ కార్యాన్ని నడిపించింది. ఆ ఆర్చిని చూసినప్పుడల్లా, ఆలోచించినప్పుడల్లా ఆ సంఘటన గుర్తుకువచ్చి

ఇదంతా నేనే
మీరంతా నేనే
మీదంతా నేనే
మిమ్ము నడిపించేది నేనే

అన్న అమ్మ అమృత వాక్కులు గుర్తుకు వస్తాయని అంతులేని ఆనందంతో ఆయన వివరించిన రీతికి ముగ్ధులమయ్యాము.

కామేశ్వరరావు గారింట్లో పనిమనిషి అమ్మ ఫోటో, కుంకుమ తీసుకువెళ్ళి రోజూ పూజ చేసుకునేది. ఆమె పేరు రాజేశ్వరి ఇంట్లోవాళ్ళు చిట్టెమ్మ అని

చీమలో దోమలో కాదు చీమగా దోమగా ఉన్నాడు.

పిలుస్తారు ఆమె మేనకోడలు అరుణకుమారికి గుండెల్లో నొప్పిగా వుంటే వైజాగ్ సి.డి.ఆర్‌లో చేర్చారు అక్కడ కొంత వైద్యం జరిగిన తరువాత ఆ పిల్లలకు బైపాస్ సర్జరీ చేయాలని హైదరాబాదులోని 'నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌స్"కు తీసుకువెళ్లమని సలహా ఇచ్చారు.

చిట్టెమ్మ దిగులు పడుతుంటే కామేశ్వరరావుగారి దంపతులు అమ్మ వుంది ధైర్యంగా వుండు ఆవిడే చూసుకుంటుందని అమ్మ ఫోటో, కుంకుమ ఇచ్చారు. 'నిమ్స్'లో మధ్యాహ్నం 12 గం॥లకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్ళి ఆపరేషన్ చేసారు. 3 గం॥లకు ఫౌంటెన్ లాగా రక్తం విరజిమ్మింది. డాక్టర్లు ఏవేవో పరికరాలు తెచ్చి రక్తస్రావాన్ని తగ్గించాలని ప్రయత్నించారు. రాత్రి 11గం॥లు అయినా రక్తం కారటం తగ్గలేదు. ఎన్ని గం॥లు అయినా తగ్గకపోవటంతో పెద్ద డాక్టరును పిలుచుకు రావటానికి వెళ్ళారు.

ఆ సమయంలో చిట్టెమ్మ తన మేనకోడలు దగ్గరకు వెళ్ళి అమ్మ కుంకుమను రక్తం స్రవిస్తున్న చోట పెట్టి నొక్కిపెట్టి వుంచి అమ్మనే ధ్యానించుకుంటున్నది. ఆశ్చర్యం! పెద్దడాక్టర్లు వచ్చి చూసేటప్పటికి రక్తప్రవాహం తగ్గింది. అసలే రక్తం తక్కువగా వుందనుకున్న పిల్లకు 3 గం॥ల నుంచి రాత్రి 11గం॥ల దాకా రక్తం ఎలా వచ్చిందో అని డాక్టర్లు విస్మయచకితులయ్యారు. ప్రక్కనే వున్న చిట్టెమ్మను డాక్టర్లు ఏమి జరిగిందని ప్రశ్నించారు.

మేము 'జిల్లెళ్ళమూడి అమ్మకు పూజ చేసుకుంటాము. అమ్మను తలుచుకొని అమ్మ రక్తం వస్తున్నచోట కుంకుమ పెట్టానని' చెప్పింది. రక్తం కారే చోట దూదితో తుడిచినా ఎప్పుడో రక్తం కారి ఆరిపోయినట్లుంది. వెంటనే కుట్లు వేసి 3 సీసాల రక్తం ఎక్కించారు. "ఇప్పుడు ఎటువంటి కంప్లైంట్ లేక హాయిగా ఆడుకుంటుందని" చిట్టెమ్మ చెపితే అమ్మ యొక్క అనురాగానికి అవధులు లేవనిపించింది.

పుట్టుకలో జ్ఞానమున్నవాడు అవతారుడు, వచ్చి సాధన చేసేవాడు జ్ఞాని.

హైదరాబాదులో ఆపరేషన్ అయి ఆ అమ్మాయికి కొంచెం స్వస్థత చిక్కింది విశాఖపట్టణంలో వున్న ఆ పిల్ల నాయనమ్మకు అమ్మ కనిపించి "పిల్లకు ఆపరేషన్ అయింది. హాయిగా తిరిగివస్తుంది దిగులు చెందవలసిన పనిలేదని నాకు 15 రోజులుగా దీపం పెట్టటం లేదేమని" అడిగింది. ఆపరేషన్ అయ్యి కులాసాగా వుందన్న కబురు హైదరాబాదు నుంచి వీళ్ళకు రాకముందే అమ్మ తెలియచేసింది.

చిట్టెమ్మ తిరుపతి వెళ్ళి అట్నించి జిల్లెళ్ళమూడి వెళ్ళాలని బాపట్లలో దిగింది. జిల్లెళ్ళమూడి గురించి వాకబుచేస్తే తుఫాన్‌లో పూర్తిగా మునిగిపోయిందని చెప్పారు. ఏది ఏమయినా అమ్మను దర్శించుకోవాలని నిశ్చయించుకుంది. ఈ లోగా ఒకతను నేను జిల్లెళ్ళమూడి వెడుతున్నానని తనతో పాటు ఆమెను పెదనందిపాడు బస్సు ఎక్కమని 7వ మైలురాయి దగ్గర దిగారు. "అమ్మ సింహద్వారం" కనిపించేటప్పటికే చిట్టెమ్మలో ఏదో తెలియని ఆనందం పరవళ్లు తొక్కింది.

అక్కడ నుంచి రోడ్డు ఏదో తెలియనంతగా నీరు. అమ్మనే తలుచుకుంటూ బయలుదేరారు. ఆమె సామాను కూడా అతనే మోసాడు. దాదాపు 2 కిలోమీటర్లు నీళ్లలో, బురదలో నడుచుకుంటూ వెళ్ళారు. ఆమె సామాను ఆమె కిచ్చి ఆ దీపాలు కనిపించే తావుకు వెళ్ళమని చెప్పాడు. తిరిగి అతనికోసం చూస్తే కనపడలేదు.

ఆవరణలోకి వెళ్ళి కామేశ్వరరావుగారు వ్రాసిచ్చిన వుత్తరం రామకృష్ణ అన్నయ్యకు ఇచ్చింది. వెంటనే ఒక గది ఇచ్చి స్నానం చేసి రమ్మన్నారు. వసుంధరక్కయ్య ఆమెకు భోజనం పెట్టించింది. మర్నాడు అనసూయేశ్వరాలయంలో పద్మావతక్కయ్య చిట్టెమ్మ చేత స్వయంగా గర్భగుడిలో పూజ చేయించిందని విపరీతమయిన ఆనందంతో చెప్పింది. సాధారణంగా

రాయిలో చైతన్యాన్ని చూడగల మనం మనిషిలో చూడలేకపోతున్నాం.

గర్భగుడిలోకి అందరినీ రానివ్వరు కదా! సంస్థ వాళ్లు అమ్మ ప్రసాదంగా చీరె పెట్టారని మితిమీరిన ఆనందంతో తెలియచేసింది. రామకృష్ణ అన్నయ్యే స్వయంగా బస్సు ఎక్కించారని తెలియచేసింది.

బాపట్లలో రైలు ఎక్కి అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామిని దర్శించి వచ్చేటప్పటికి సింహాచలం వెళ్ళే బస్సు రెడీగా వుండటంతో సింహాద్రి అప్పన్నను దర్శించుకొని విశాఖపట్టణం వచ్చింది. అమ్మ అనుగ్రహం వుండబట్టే తన కోరికలు తీరి ఎటువంటి కష్టం లేకుండా ఒక్కదాన్నే తీర్థయాత్రలు చేయగలిగానని ఎంతో నమ్మకంతో చెప్పింది. అందరి ఈప్సితాలను తీర్చే కల్పవల్లి అమ్మ. అట్టి ఈప్సితార్థదాయిని అయిన అమ్మకు అంజలి ఘటిస్తున్నాము.

34. అవ్యాజకరుణామూర్తి - అమ్మ

"పరిమితమయిన మమకారం మానవత్వమని" అమ్మ అంటుంది. పరిమితత్వాన్నించి అపరిమితమైన తత్వానికి తన పిల్లలను తీసుకువెళ్తుంది. మనలో వున్న అహంకారాన్ని, అపనమ్మకాన్ని తన అవ్యాజకరుణతో తుడిచిపెట్టి మనకు పరిష్కార మార్గాన్ని చూపిస్తుంది. మనలను దాసోహం చేసుకొని మన మీద చెరగని ముద్రవేస్తుందని అపరిమితమైన విశ్వాసంతో జె.ఎస్.ఎన్. మూర్తిగారు చెప్పిన సంగతులు ఎవరినైనా ఆశ్చర్యానందాలలో ముంచి వేస్తాయి.

జె.ఎస్.ఎన్. మూర్తిగారు విశాఖపట్టణం షిప్‌యార్డులో చైర్మన్‌కు పర్సనల్ సెక్రటరీగా పనిచేసేవారు. అమ్మ దయవల్ల ఎంతమంది చైర్మన్లు మారినా అక్కడే ప్రమోషన్లు, మన్ననలు పొందుతూ మంచిపేరు సంపాదించుకున్నారు. వచ్చిన ప్రతి చైర్మన్ మూర్తిగారే వారి సెక్రటరీగా ఉండాలని కోరుకునేవారు. దానికి ఆయన క్రమశిక్షణ, కార్యదక్షతే కారణం.

ఆశయం మూరాలిగారి ఆశ్రమం కాదు.

జె.ఎస్.ఎన్. మూర్తిగారికి మాష్టరు ఏ.వి.వి. ప్రసాద్‌రావుగారు చిరకాల పరిచితులు, శ్రేయోభిలాషులు. అనేక కష్టాలు, బాధలలో ఆయన సలహాలు పొందిన అదృష్టవంతులు. మాష్టారు ప్రసాదరావుగారు ఆదేశానుసారం నిత్యం లలితాసహస్రనామపారాయణతో అమ్మను అర్చించుకుంటున్నారు.

చిన్నతనంలోనే మాతృవియోగం కలగటం చేత 'అమ్మ' అనే మాటయొక్క తీపి తెలియనివారు. అజ్ఞానము వలన వయస్సుతో కూడిన అహంకారంతో పెద్దలకు, మహాత్ములకు పాదాభివందనం చేసేవారిని అపహాస్యం చేసేవారు. అందరిలోను దైవం ఉన్నప్పుడు ఇతరుల పాదాలకు ఎందుకు మొక్కాలని వితండవాదన చేసేవారు.

మొదటిసారిగా కుటుంబ సమేతంగా మాష్టరుగారితో కలసి జిల్లెళ్ళమూడి వెళ్ళారు. అమ్మ పాదాలకు అందరూ నమస్కరిస్తున్నారు. ఆయన, తాను మాత్రం నమస్కారం చేయకూడదని అనుకున్నారు. కాని అమ్మ సమీపంకు వెళ్ళిన వెంటనే ఆయన అహంకారం మాయమై అమ్మ పాదాలు స్పృశించి పరవశం చెందారు. 'అమ్మ కరుణావృష్టి ఎంతటివారినైనా మార్చేటప్పుడు నేనెంత?" అనుకున్నారు. అమ్మ పాదపూజ చేసుకొన్న తరువాత "ఆ పాదాల మహత్యమేమిటో గాని చెప్పలేనంత ఆనందంతో కళ్ళు చెమర్చాయి. ఇప్పటికీ ఆ సంఘటన తలిస్తేనే ఒళ్ళు పులకరిస్తుందని" చెప్పారు.

ఒకమారు జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మ దర్శనం చేసుకొని వెంటనే డ్యూటీలో చేరటానికి తప్పనిసరిగా విశాఖపట్టణం రావాలి. మాష్టరు ప్రసాదరావుగారు అమ్మ అనుమతి తీసుకోకుండా వెళ్ళరాదని ఆదేశించారు. అమ్మ అనారోగ్యకారణంగా ఆ సాయంత్రం దాకా అమ్మ దర్శనభాగ్యం కలుగలేదు. రాత్రి 7 గం॥లు దాటితే బాపట్ల వెళ్లే వ్యాను వెళ్ళిపోతుంది అని కంగారు

పురుషకారం, దైవ సహాయం ఒక నాణానికి రెండు ముఖాలు.

పడుతున్నారు. అమ్మ బాధనొందుతూ కూడా పిల్లల అవసరాలను ఎంతగానో గమనించేది. "డ్యూటీ ఫస్టు, దెన్ గాడ్" అని అమ్మ అంటుంది. అందుకే 7.30 గం॥లకు అమ్మ, వారిని పిలిచి ప్రసాదం ఇచ్చి 8 గం॥లకు ప్రత్యేకంగా వ్యాను బయలుదేరేలా చేసింది. ఇక్కడ నుంచి అమ్మ రవాణాసౌకర్యం కలుగజేసినా బాపట్ల, విజయవాడలలో బండి దొరకుతుందన్న నమ్మకం మూర్తిగారికి కలుగలేదు. అమ్మకు ఎంతసేపూ పిల్లల గురించే కదా! ఆలోచన. బాపట్లలో రాత్రి 10 గం॥ల వరకు అమ్మనే జపిస్తూ కూర్చున్నారు. అపుడు బయలుదేరే బస్సులు ఏవీ లేవని అక్కడి వాళ్ళు చెప్పారు. రాత్రి 10.15 గం॥లకు విజయవాడకు వెళ్ళే బస్సు రిపేరు చేయించుకొని వీరి కోసమే అమ్మ పంపించినట్లుగా వచ్చింది. 1.30 గం॥లకు విజయవాడకు చేరారు. అపుడు వైజాగ్ వెళ్లే బస్సులు లేనందున రైల్వేస్టేషన్‌కు వచ్చారు. వైజాగ్‌కు 1.30 గం॥ల తరువాత ఏ రైలూ లేదు. వీళ్లు స్టేషన్‌కు వచ్చేటప్పటికి 2 గం॥లు అయింది. అమ్మ కరుణ వల్ల రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు విశాఖపట్టణం వెళ్ళటానికి సిద్ధముగా ఉండటంతో సకాలంలో విశాఖకు చేరుకున్నారు. దానితో 'అపనమ్మకం కంటే నమ్మకమే ప్రధానమని' గ్రహించారు. అమ్మ "నమ్మకమే దైవం" అంటుంది కదా!

ఇంకొక మారు విశాఖపట్టణం నుంచి బస్సు తీసుకొని జిల్లెళ్ళమూడి వెళ్లాము మరునాడు సాయంత్రం 5 గం॥లకు బయలుదేరుతుంటే 'అమ్మ' ఆగమని కబురు చేసింది. పిల్లల ఆకలి తెలిసిన తల్లి కనుక ఒక బుట్టలో పులిహోర విస్తరాకులు ఉంచి రాత్రికి తినమని పంపించింది. మూర్తిగారికి ప్రతీది అపనమ్మకమే. ఈ బుట్టెడు పులిహోర 50 మందికి సరిపోతుందా? ఎక్కడైనా హోటలు దగ్గర ఆపితే కడుపునిండా తృప్తిగా తినవచ్చు గదా! అని అనుకున్నారు. దారిలో 9.45 గం॥లకు ఒక ఊర్లో బస్సు ఆపి అందరికి

సమయానికి ఏది అవసరమో అది అందడమే సంపద.

పులిహోర వడ్డించారు. అందరం కడుపునిండా తృప్తిగా తినగా ఇంకా మిగిలిపోయింది. అక్కడ చుట్టుప్రక్కల ఉన్నవాళ్ళకు ఇచ్చాము. అమ్మకు తన బిడ్డలపై కల అవ్యాజానురాగానికి ఇది మచ్చుతునక మాత్రమే.

మూర్తిగారు "ఇటువంటి అనుభూతుల వల్ల అమ్మకు దాసోహం అనటం కంటే నేను చేసింది ఏమీ లేదని, అమ్మను ఎన్నిసార్లు దర్శించినా ఏమీ కోరలేదని అడగకుండానే అనుకున్నవన్నీ అమర్చటమే అమ్మ ప్రత్యేకత. అమ్మ నాకు, నా కుటుంబానికి అన్నీ అమర్చి ప్రశాంతిని కలుగచేసిందని" చెప్పారు.

జీవితంలో చిక్కు సమస్యలు ఎదురైనప్పుడు ఏమవుతుందోనని బెంగపడకుండా ఆ పరిష్కార బాధ్యతను అమ్మకు అప్పచెప్పి అమ్మ ఆజ్ఞకు బద్ధులమై ఆ సమస్యను మనస్సులోనించి పారద్రోలాలి అప్పుడు పరిష్కారము చేయటం ఆమె బాధ్యత, అనుభవించి ఆనందించటం మనవంతు అవుతుంది.

"రాత్రి గాఢ నిద్రలో కూడా మనపేరుతో పిలిస్తే ఆనందంతో లేచి కూర్చుంటాం కదా! అలాంటిది అమ్మను సహస్రనామాలతో పిలిస్తే పలకకుండా ఉంటుందా! మీరు ప్రయత్నించి చూడండి మీకే తెలుస్తుందని" మూర్తిగారు అంటారు.

జె.ఎస్.ఎన్. మూర్తిగారు తన ఉద్యోగధర్మాన్ని ఎంతో క్రమబద్ధంగా నడుపుకొని మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి. ఉద్యోగ విరమణ తరువాత కూడా వారం వారం ఇక్కడ జరిగే పూజలకు క్రమం తప్పకుండా ఎక్కడికైనా వచ్చి ఎంతో నియమబద్ధంగా పూజ చేసుకుంటారు. ఇంకా ఇంకా నేర్చుకోవాలనే తపన, ఆర్తి ఆయనకు ఎక్కువ. ప్రతివారికి ఇతరుల నుంచి నేర్చుకోవలసినవి ఎన్నెన్నో ఉంటాయి. మూర్తిగారి దగ్గరనుంచి క్రమశిక్షణ, కార్యదీక్షత, కొత్తవిషయాలు నేర్చుకోవాలనే తపన మనందరికీ

రేకులన్ని పూవులో భాగమైనట్లు మనమందరమూ వాడిలోని వారమే.

మార్గదర్శకమవుతాయి. అమ్మ యొక్క అవ్యాజానురాగము వారిమీద వారి కుటుంబసభ్యులమీద ఎల్లప్పుడూ ఉండాలని అమ్మను మనస్ఫూర్తిగా వేడుకుందాము.

35. భక్తితత్వం - అన్నమయ్య

సముద్రమంత లోతైన మనిషి మనస్సులో ఉత్తుంగ తరంగాల్లాంటి ఆలోచనలు, నింగిని తాకే ఊహలు ఎన్నెన్నో ఆశలు, ఇంకెన్నో అనుభూతులు దానితో ఆ మనసు చైతన్య ఝరిలా కాలం గడపాలని కోరుకుంటుంది. కానీ అదే మనసు అప్పుడప్పుడు ఆ కోలాహలానికి దూరంగా నిశ్చల సుందర ప్రకృతి వినిపించే నిశబ్ద సంగీత మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ఆలోచనల్లో మునిగిపోవాలని, ఊహల్లో తేలిపోవాలని భక్తి పారవశ్యంతో పాడే అన్నమయ్య కీర్తనలో, త్యాగరాజు కృతులనో వింటూ పరవశించి పోవాలని మనసు ఉవ్విళ్ళూరుతుంది.

మనస్సనే కోతిని కట్టివేసి భగవంతుని మూర్తిని కనుక్కోవటమే మానవుని కర్తవ్యం. భక్తుని మాటకు, పాటకు, భగవంతునికి భేదం లేదు. అహంకార త్యాగం భక్తుని యందు వుంటుంది. మహర్షులు, ఋషులు తమ ధ్యానమననాదులతో భగవంతుని దర్శించి భాగవత తత్వాన్ని మనకు అందించారు.

ఇది మంచిదా అది మంచిదా అన్న ఆలోచనతోనే మానవుడు ఎంతో సమయాన్ని వ్యర్థ పరుస్తున్నాడు. మనకు దేనినైతే మొదటిగా ప్రసాదిస్తాడో అదే మనకు కైవల్యసిద్ధిని కలుగచేస్తుంది. అందుకే శ్రీకృష్ణుడు "నమ్మినవారు నమ్మనివారు నను చేరగలరు. నమ్మీనమ్మని నాయనమ్మలు నను చేరలేరు అన్నాడు", అని మనవాళ్ళు తత్వాలలో పాడుతుంటారు.

ప్రతి వస్తువులోను ఒకే దానిని చూడటం ఏకాగ్రత.

మంత్రం మన స్వభావంగా మారిపోవాలి. వెన్నతో పెట్టిన విద్య వెన్నెలలా మారాలి. పసి వయస్సులో ఇంట్లోని పెద్దవారు వెన్న వేసి కలిపి అన్నం తినిపిస్తూ భగవంతుని గురించిన అనేక విషయాలను తెలియచేసేవారు. చంద్రుడి వెన్నెల అంతటా ప్రసరించినట్లు భగవంతుని అనుగ్రహం తలచినంత మాత్రానే భక్తుని కరతలామలకమవుతుంది.

ఆ కైవల్యసిద్ధికి కావలసింది మంత్రసిద్ధి. సప్తకోటి మహామంత్రాలున్నాయి. అందుకే జిల్లెళ్లమూడి అమ్మ మాతృశ్రీ అనసూయామహాదేవి" "మనస్సే మంత్రం; శబ్ద మేబీజరి దాని నిలకడకి అక్షరాలు. అక్షరం మంత్రం కాకపోతేగా, కర్రతో రేకు మీద కొడితే వచ్చే శబ్దం కూడా మంత్రమే, ఏ మంత్రాన్నైతే అనుష్టానం చేస్తారో దానియందే సర్వమంత్రాలు ఇమిడి ఉన్నాయి" అని విశదపరిచింది. రామకృష్ణ పరమహంస "ఊరికే తిరిగితే కళ్ళు తిరిగిపడిపోతాము, అదే భగవంతుడనే స్థంభాన్ని పట్టుకు తిరిగితే పడకుండా ఉంటామని" ప్రవచించారు.

ఆదిశంకరాచార్యులు స్వరపంచాక్షరి, నారదుడు నారాయణ మంత్రం, ప్రహ్లాదుడు నరసింహామంత్రం విభీషణుడు రామమంత్రం, త్యాగరాజు నారద మహర్షి ఒసగిన స్వరార్ణవమను గ్రంథరాజము, అన్నమయ్య వెంకటేశ్వర మంత్రం ద్వారా కైవల్యముక్తిని పొందారు. సద్గురు శ్రీ శివానంద మూర్తిగారు, శ్రీ చినజియ్యర్ స్వామివారు "సంప్రదాయోరక్షతరక్షితః" అని సాంప్రదాయాన్ని పరిరక్షించడానికి నడుంకట్టారు. భక్తుడు ఎప్పటికప్పుడు తనని తాను పరీక్షించుకోవాలి. మన అజ్ఞానాన్ని, అవిద్యను భగవంతునికి తెలియచేసి మనల్ని చేదుకోమని చెప్పుకోవాలి. అందుకే చేదుకో వెంకన్న చేదుకో, చేదుకొని మమ్ము ఆదుకోవయ్యా" అని భక్తులు గానం చేస్తారు.

పంచటంలో హెచ్చు తగ్గులుండవచ్చు కాని పెట్టడం సమానమే.

పుణ్యకర్మలను ఆచరించినపుడు మాత్రమే భగవంతుని చేరుకోవాలన్న సద్బుద్ధి జీవునకు కలుగుతుంది. ఆర్ష సంస్కృతిని, ఆర్ష ధర్మాన్ని భావితరాల వారికి అందించవలసిన అవసరం మనకి ఎంతైనా ఉంది. యజ్ఞయాగాదులు, తపస్సు, పూజలు, వ్రతాల ద్వారా పరమేశ్వరుని సన్నిధికి చేరుకోవాలి. మనంపూర్తిగా భగవంతుని శరణువేడుకోవాలి. భక్తి యొక్క పరమావధి భగవంతుని చేరుకోవటమే. సమస్త కర్మలను క్షయం చేసేవాడు భగవంతుడు.

దేవఋణం, ఋషిఋణం, పితృఋణం తీర్చుకోవటం మానవుని విధి. నారదుడు నామాల కూర్పుతోనే నారద భక్తి సూత్రాలు మనకు అందించాడు. భావకత, భావశబలత కలిగిన అన్నమయ్య అన్ని నామాలు కలిపి ఒక మంత్ర రాజ్యాన్ని కృతులుగా రచించాడు. శృతులై, శాస్త్రములై కృతులై అన్నమాచార్యుని గానవాహినిలో భగవంతుడు నర్తించాడు. నారాయణ శబ్దం చేతనే పరమావధి కలుగుతుంది. భయాలనే భయపెట్టే అభయత్వం నరసింహావతారం. అజ్ఞానమనే స్థంభాన్ని చీల్చుకొని అవతరించాడు. ఒకే దైవంలో అన్ని దైవాలను చూడటం, అన్ని దైవాలలో ఒకే దైవాన్ని చూడగలగటం అదృష్టం. "One in all, All in One"

అన్నమయ్య పదాలు జాతీయాలతో, మంత్ర సూక్తులతో నిండి ఉంటాయి. అన్నమయ్య కీర్తనలు భక్తి జ్ఞాన వైరాగ్యభాసురాలు. ఆయన సంస్కృతంలో కూడా అనేక కృతులను రచించాడు. జననములు అవసరం లేని విష్ణువు మన కోసం జన్మనెత్తాడు. ఆత్మకు నిజమైన ధైర్యాన్నిచ్చేది విష్ణు కథ. అన్నమాచార్యులు "వినరోభాగ్యము విష్ణు కథ" అన్న భక్తి కీర్తన మనసుని ఉర్రూతలూగిస్తుంది. భగవంతుని కథలే జీవునికి మూలాధారం. అదే భారతీయుల పుణ్యఫలం. భగవంతుని లీలలను గానం చేసుకుంటూ తరించడం భారతీయ సంస్కృతికి ఆలవాలం.

సంకల్పహితుడు అవతారుడు - సంకల్ప రహితుడు ముక్తుడు.

భగవంతుడ్ని మిన్నగా అనగా పురుషోత్తముడిగా వర్ణిస్తూ తనను పురుషాధముడుగా అన్నమయ్య వర్ణించిన విధంలో వినమ్రమైన భక్తి భావం మనకు అవగతమవుతుంది. "అనంతాపరాధములు మావి - అనంతుడవు నీవు" పురుషోత్తముని అడగవలసింది కేవలం కైవల్యం, మోక్షం మాత్రమే. "భావములోనా బాహ్యాము నందును గోవిందా, గోవిందా కొలవరో మనసా" అని ప్రబోధించాడు. ఆ స్వామి పాదాలు చేరుకోవడానికే ఈ పూజలు, వ్రతాలు, సాధనలు. కోటి జన్మల పుణ్యఫలం వల్ల భగవంతుని మీద భక్తి కలుగుతుందని "పద్మ పురాణం" లో చెప్పబడింది.

అన్నమయ్య భక్తి మీర ఒక శతకం చదవగానే శ్రీనివాసుని గుడి తలుపులు తెరుచుకున్నాయి. అన్నమయ్యకు, త్యాగయ్యకు పోలికవుంది. శ్రీనివాసుని దర్శనం కొఱకు త్యాగయ్య వెళ్ళినప్పుడు తెరవేసి వుందని దానితో "తెర తీయగరాదా నాలోని మదమాత్సర్యముల..." అనే కీర్తన పాడగానే తెరతొలగి శ్రీనివాసుని దర్శనమయిందిట. "నానాటి బ్రతుకు నాటకము, కానక కన్నది కైవల్యం, పుట్టుట నిజం, పోవుట నిజం" అన్న అన్నమయ్య వైరాగ్య కీర్తన మేలు బంతి. బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మముతాననె పాదము, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, అదివొ అల్లదివో శ్రీహరివాసము, పదివేల శేషుల పడగల మయం "బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే" మొ॥ కీర్తనలలో భక్తి, వైరాగ్యాలు మేళవించి రచించిన కీర్తనలు భావస్ఫోరకాలు, రస సింధువులు. అన్నమయ్య కీర్తనలలోని భక్తి వర్ణనలు భక్తునికి మరచిపోలేని మధురానుభూతి. వీనులవిందుగా భవరోగాలకు మందుగా అన్నమయ్య కీర్తనలు అలరిస్తాయి. అన్నమయ్య కీర్తనలు మనకు మార్గదర్శకాలు. ఆ మార్గాన్ని మనం అనుసరిస్తూ రాబోవు తరాలకు ఆ నిధిని అందించవలసిన బాధ్యత మనది. అన్నమయ్య తెలుగువాడుగా జన్మించటమే మన అదృష్టము.

బాధలు లేనిది బ్రతుకూ కాదు - అలలు లేనిది సముద్రమూ కాదు.

36. సాంద్ర కరుణ - అమ్మ

అపారమైన దయ, కారుణ్యం కమనీయరూపం ధరించి అమ్మగా మూర్తీభవించి వుంటుంది. అందరిని సమానంగా ఆదరిస్తూ, అందరిని మంచి మార్గంలో నడిపించి జీవితానికి అర్థాన్ని గమ్యాన్ని తెలియచేస్తుంది. అంతులేని అనురాగంతో మనకు అవసరమైన సమయంలో కావలసిన ధైర్యాన్ని, స్థైర్యాన్ని కలుగచేస్తుంది అమ్మ.

బొల్లాపల్లి వాస్తవ్యురాలు గుంటూరు అచ్చమ్మగారు. 40 సంవత్సరముల నుంచీ జిల్లెళ్ళమూడిని సందర్శిస్తూ మనసా, వాచా, కర్మణా అమ్మనే నమ్మిన వ్యక్తి, ప్రథమ దర్శనంలోనే అమ్మ ఆమెకు అన్నం కలిపి ముద్దలు పెట్టింది. "పిల్లలెంతమంది?" అని అడిగింది. "ఇద్దరు మొగపిల్లలు పెద్దవాడికి 25 సం॥లు, చిన్నవాడికి 15 సం॥లు" అని చెప్పింది. మనని ఆదరించే వారిని చూస్తే మన బాధలు వెళ్ళ గ్రక్కుకోవటం మానవ నైజం కదా! అలాగే ఆ అక్కయ్య 25 సం॥లుగా బాధలు పడుతున్నానని, 25 వేలు అప్పు వుందని అమ్మ దగ్గర మొరపెట్టుకుంది. అదేమి చిత్రమో అమ్మ దర్శనానంతరం అప్పు తీరిపోవటంతో ప్రశాంతత పొందింది.

వాళ్ళ పెద్ద కోడలిని అమ్మ దగ్గరకు తీసుకువచ్చి పిల్లల కోసం ఆపరేషన్ చేయించాలంటున్నారు" అని చెప్పింది. ఆపరేషన్ అవసరంలేదని ఆమెకు బిడ్డలు పుడ్తారని అమ్మ హామీ ఇచ్చింది. ఆ తరువాతే నలుగురు పిల్లలకు జన్మనిచ్చింది ఆమె. అమ్మ దయ వల్లే తనకు సంతానం కలిగిందని ఆమె విశ్వాసం.

అమ్మ దగ్గరకు రావాలన్న తపనతో వున్న బట్టేను కాస్తా అమ్ముకుని మనవల్ని కోడల్ని తీసుకువచ్చానంది. అమ్మ వెంటనే అచ్చమ్మ తొడల మీద

ధర్మంలో కట్టుబాట్లున్నాయి గాని - ప్రేమలో లేవు.

తన కాళ్ళను పెట్టింది. అమ్మ పాదాల గుర్తులు ఆమె తొడల మీద పడ్డాయి. అదే విధంగా పల్ల పట్ల శాస్త్రి గారికి గుండెల్లో మంటగా వున్నదన్నప్పుడు అమ్మ తన వేళ్ళతో రాసింది ఆయన గుండెల మీద అమ్మ వేలిగుర్తులు పడ్డాయి.

కొడుకు మతిస్థిమితం లేనివాడని పిల్లల్ని ఎలా పెంచి పెద్ద చేయాలో పాలుపోలేదని అమ్మ దగ్గర దిగులుపడింది అక్కయ్య. సాంద్ర కరుణ అయిన అమ్మ "అద్దంకిలో భారతమ్మగారు వున్నారు. ఆమె దగ్గరకు వెళ్ళమన్నది." అచ్చమ్మగారు ఆవిడ దగ్గరకు వెళితే వట్టి వేరు ఇచ్చి తినమంది. ఆమె ఎటువంటి సంశయం వెలిబుచ్చకుండా వెంటనే దాన్ని తినేసింది. ఆనాటి నుండీ కష్టానికి, సుఖానికీ భారతమ్మగారే అలంబనా, ఆధారం అయింది. ఆడపిల్లలు ముగ్గురు బి.యిడి చేసారు. మొగపిల్లవాడు సి.ఏ. చేసాడు.

అమ్మ సిద్ధి పొందటానికి ముందే అచ్చమ్మ గారికి కడుపులో నీరు చేరింది. విపరీతమైన బాధతో అతలాకుతలం అవుతోంది. పది సంవత్సరాల పిల్ల పట్టు పరికిణీ, జడ కుప్పెలు వేసుకొని ఆమె దగ్గరకు వచ్చి పొట్ట నాలుగు పక్కలా వొత్తుతూ పొట్టకు నీరు వచ్చిందే అంటే మూడుమార్లు నోటితో నీటిని తీసి ఉమ్మేసినట్లుగా అనిపించింది. దానితో ఆమె బాధ దూరం అయింది. ఇది కలా నిజమా అని తరచి చూస్తే పక్కనే మూడు మరకలు కనిపించాయి. ఆ విషయం అమ్మతో చెప్తే "అది నీనమ్మకమే!" అని నవ్వుతూ కొట్టి పారేసింది.

ఇన్నాళ్లు వీళ్ళను కంటికి రెప్పలా కాచిన భారతమ్మ గారికి ఎవరో అమ్మ ఫోటోలు తీసి సంప్రోక్షం చేయమని చెప్పారు దానితో ఆమె ఇంట్లో వున్న అమ్మ ఫోటోలన్నింటినీ తీసేయాలని సంకల్పించారు. పక్కనే వున్న అచ్చమ్మగారు హస్తారపదంగా వాటిని అందుకుంది. విచిత్రమేమిటంటే ఆ రాత్రే ఆమె పెద్ద కోడలు గుంటూరు అలివేలు మంగకు "ఒక ముసలమ్మ కొండమీద నుంచీ

జ్ఞానానికి ప్రేమకు ఉన్న సంబంధం - ప్రత్తికి దారానికి ఉన్న సంబంధంలాంటిది.

ఆమె వొళ్ళో పడ్డట్లు" కల వచ్చింది. ఇలా కలరావటమేమిటి అని ఖిన్నురాలైంది. ఈలోగా అత్తగారు అమ్మ ఫోటోలతో ఇంట్లో అడుగు పెట్టటంతో ఆనందపరవశురాలైంది. మర్నాడు ఆమె అమ్మకు మంచం వేయబోతున్నట్లు దానికి అమ్మ "నీ నలుగురు పిల్లల్నీ చూసుకొనే మంచంను వేసుకుంటానన్నట్లు" కలవచ్చింది.

అచ్చమ్మగారు తాను తెచ్చిన ఫోటోలన్నింటినీ కలిపి ఒక ఫ్రేమ్ కట్టించాలనుకుంది. బుగ్గనవేలుపెట్టుకున్న ఫోటో పెద్దది అయిందన్నారు. సరే దాన్ని అలా వుంచేయమంది. ఆ రాత్రి కలలో అమ్మ "ఏమే ఆ ఫోటో వెయ్యవా?" అని అడిగింది. మర్నాడు పొద్దున్నే వెళ్ళి "ఆ ఫోటోను చుట్టూ కొంచెం కట్ చేసి ఆ ఫ్రేమ్‌లోనే పెట్టమని" చెప్పింది.

ఆశ్చర్యకరమైన విషయం వీళ్ల పిల్లలు వృద్ధిలోకి వచ్చే వరకు అమ్మ భారతమ్మగారి దగ్గర వుండి, వారి అవసరాలు తీరాక వీరింటికి వచ్చేయటం అమ్మ యొక్క లీలా విశేషమే. అచ్చమ్మగారి మనవలకు అమ్మ యందు అనురక్తి మెండు 2002 సం॥ ధాన్యాభిషేకంకు 2వ మనవరాలు రెండు వేల రూపాలయలు పంపింది. 3వ మనవరాలు హైమక్కకు గొలుసు చేయించింది. ఆమె మునిమనుమరాలు శ్రీవాణి అమ్మ పాటలను ఎంతో ఆర్తిగా పాడుతుంది. అమ్మ స్మరణతో వారు హాయిగా జీవిస్తున్నారు.

37. నా బదరీ యాత్ర

1999 ఆగష్టు 15న అన్నపూర్ణాలయ వార్షికోత్సవ సందర్భంగా, అమ్మకు పూజ చేసుకున్నాం. ఆ తరువాత నా చేత అమ్మ వ్రాయించిన "అమ్మ సచ్చరిత్ర" మొదటిభాగం పుస్తకావిష్కరణ జరిగింది. ఆ సభకు శ్రీ ప్రసాదరాయ

ప్రతి స్త్రీలోను అమ్మను చూచే వానికి అందనిది అంటూ ఏది లేదు.

కులపతిగారు అధ్యక్షత వహించారు. శ్రీ రామబ్రహ్మగారు పుస్తకావిష్కరణ గావించారు. శ్రీ పి.ఎస్.ఆర్. ఆంజనేయులు గారు రచయిత్రి గురించి తెలియచేసారు. శ్రీ మల్లాప్రగడ శ్రీ మన్నారాయణ గారు గ్రంథ సమీక్ష చేసారు.

ఆ రాత్రికీ బయలుదేరి నేను, లక్ష్మిగారు వెళ్ళి జైపూర్‌లో అమ్మ విగ్రహం క్లే మోడల్ చూచాము. చేయవలసిన మార్పులను వారికి సూచించాము. మూర్తి బాగా వుంది. మధుర, బృందావన్, ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ చూచి ఢిల్లీ చేరాం. ఢిల్లీలో శుక్రవారం రాత్రి సదరన్ ట్రావల్స్ బస్సులో బయలుదేరి ఉదయానికి హరిద్వార్ చేరాం. "అక్కడ నుంచీ ఋషీకేష్‌లో సప్త ఋషి దేవాలయం, లక్షణఝూలా, రామఝూలా, గీతాభవన్ దర్శించారి. ఆ రాత్రికి శ్రీనగర్ చేరాం.

త్రోవలో అలకానందా, భాగీరధీ సంగమ స్థానాన్ని చూచాను. అలకానంద పేరుకు తగ్గట్టుగా అలిగి వెనక్కి ముందుకు వెళ్తానన్నట్లుగా ప్రవహిస్తోంది. భాగీరథి భగీరధుడి వెంట దుముకుతూ వస్తున్నట్లుగా వుంది ఆ ప్రకృతి సౌందర్యం చూచి ఆనందించవలసినదే కానీ, వర్ణించనలవికాదు. మందాకినీ మందగమనగా ప్రవహించటం, డోలానందా ఉయ్యాలలూగుతున్నట్లుగా ప్రవహించటం చూస్తే వాటి వాటి ప్రవాహ గమనానికి తగినట్లుగా పేర్లు వున్నాయనిపించింది.

దోవ పాడైనందున బదరీకి బస్సు వెళ్ళదని 3 కిలోమీటర్లు నడవాల్సి వుంటుందని గైడు చెప్పాడు. వర్షంలో అంతదూరం నడవటమాని దడపట్టుకుంది. మా మరిది గారి స్కూటర్ పోయినప్పుడు, స్కూటరు దొరికితే

అన్ని వ్రతాలు ఆడవారికే మగవారికి ఒక్కటే వ్రతం అదే - ఏక పత్నీ వ్రతం.

నడిచికొండ ఎక్కుతానని మా తోటికోడలు మొక్కుకుంది. నేను మాత్రం అలాంటి మొక్కు మొక్కకుండా ఏదో తోచిన డబ్బు హుండీలో వేస్తానని అనుకున్నాను. దానికి బుద్ధి చెప్పటినికీ అన్నట్లుగా దోవసరిగాలేని చోట వర్షంలో నడవాల్సి వచ్చింది. అమ్మకు వెంకటరమణమూర్తికి నమస్కారం చేసుకుని ఇంకెప్పుడూ అలా అనుకోను ఇప్పుడు నడిచేందుకు ఓపిక ఇమ్మని కోరుకున్నాను.

నేను నడవటమేమిటి అమ్మే నడిపించింది. కొంతదూరం వెళ్ళిన తరువాత పెద్ద శబ్దం వినిపించింది. వెనక్కు తిరిగి చూడగా ఫుట్‌బాల్ అంత రాయి కొండల మీద నుంచీ దొర్లుకుంటూ సరిగ్గా ఒక్క అడుగు వెనకాల పడ్డది. నేనే ఒక్క అడుగు వెనక్కు వుండి వుంటే అన్న ఆలోచనరాగానే దడపుట్టింది. అమ్మ! మనవెంటే వుంటానంటుంది కదా! ఆ మొత్తం ప్రయాణంలో అమ్మ తోడునీడగా నన్ను కాపాడిందనటానికి ఎటువంటి సందేహం లేదు.

టి.వి.లో గంగోత్రి సీరియల్ చూస్తున్నప్పుడు ఎప్పుడైనా ఆ గంగా ప్రవాహం, ఆ హిమాలయాలు చూడగలనా అని అనుకున్నాను. అమ్మ కోరికలు తీర్చే కల్పవల్లి కదా! నేను ముందు జైపూర్ నుంచీ ఢిల్లీ హరిద్వార్, ఋషీకేష్ మాత్రమే వెళ్ళాలనుకున్నాను. కానీ జిల్లెళ్ళమూడిలో చెక్కా శ్రీమన్నారాయణ ద్వారా సదరన్‌ట్రావెల్స్ సదుపాయం గురించి తెలియచేసింది. వసుంధరక్కయ్య ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వవని ధైర్యం చెప్పటం అమ్మ లీలకు నిదర్శనమే.

నా ఆరోగ్య దృష్ట్యా, జీవితంలో ఎప్పుడూ కూడా నేను ఆ ప్రయాణం చేస్తానని వూహించుకోవటానికి వీలుకాని విషయం. ఎప్పటికప్పుడు అమ్మ

ఆర్తుల అనాథుల సేవయే ఆదినారాయణ సేవ.

నా యోగ్యతకు మించే అనుగ్రహిస్తోంది. అందులోని భాగమే ఈ ప్రయాణంలో మూడు కిలోమీటర్లు నడచిన తరువాత అక్కడ నుంచి జీపులో బదరీకి వెళ్ళాం. ఆ సాయంత్రం నారాయణుని దర్శించుకున్నాం. అక్కడ చలి విపరీతంగా వుంది. డార్మెట్రీలో పడుకొంటూ "హిమాలయాలంటే హిమానికి ఆలయాలు కదా. ఇంతపైకి వచ్చినా ఒక్క మంచుకొండనన్నా చూడలేదని దిగులుపడ్డాను.

ఉదయం నిద్ర లేవగానే బాల్కనీలోకి రాగానే రెండు కొండల నడుమ మంచు పర్వతం కనిపించింది. నా ఆనందానికి అవధులు లేవు. అమ్మ అవ్యాజ కరుణామూర్తి కదా! ఆ విధంగా నా కోరికను నెరవేర్చింది. రాత్రి బాధపడిన నాకు ఆ దర్శనం ఎంతో ఆనందాన్ని కలుగచేసింది. శివుడు తపస్సు చేసుకునే కైలాస పర్వతమని చెప్పారు. వెంటనే స్నానం చేసి ఆ బాల్కనీలో కుర్చీవేసుకుని దాన్ని చూస్తూ ధ్యానం చేసుకున్నాను. ఆ క్షణంలో ఈయన కూడా నాతో వస్తే ఎంత బాగుండేదనిపించింది. కొంచెం ఎండ ఎక్కువ అవుతున్న కొద్దీ వెండికొండలా మెరిసిపోతూ చూచిన కొద్దీ చూడాలనిపించింది తదేకంగా దాన్నే చూస్తుంటే ఆ శిఖరం మీద అమ్మ దర్శన భాగ్యాన్ని కలుగచేసింది. అదీ జైపూర్‌లో చూచిన మోడల్ లాగా వుంది. వెంటనే నాతో వచ్చిన లక్ష్మిగార్ని చూడమంటే ఆమెకూ అమ్మ దర్శన భాగ్యం కలిగిందని చెప్పారు.

అలాగే చూస్తున్న కొద్దీ సూర్యకిరణాలు పడి మంచు కరిగిన చోట తెల్లటి అమ్మ మెడలో నల్లని రెండుపేట్ల గొలుసులాగా కనిపించింది. జైపూర్‌లో అమ్మ మెడలో పట్టెడలా వుంటే అది తీసి రెండు పేటల గొలుసులాగా వచ్చేట్టు చెక్కమన్నాం. సరిగా దీనితోనే అమ్మ దర్శనమొసగింది. కామధేనువు కల్పవృక్షం

సృష్టికి వికాసం ఎంత సహజమో విలయమూ అంతే.

కోరినవే ఇస్తాయి. కానీ మన అమ్మ కోరకుండానే మన కోరికలను తీర్చే కల్పవల్లి.

పసుపు కుంకుమలతో శ్రీ మహాలక్ష్మిని అర్చించుకుని శ్రీ సూక్తం, లలితా సహస్రం చదువుకున్నాం ఆ రోజు సోమవారం విష్ణుకుండ్‌లో స్నానమాచరించి శివాలయంలో స్వయంగా అభిషేకం చేసుకుని ఆవు నేతితో దీపాలకు వెలిగించాం. బ్రహ్మ కపాలం పితృ దేవతలకు పిండాలు పెడ్తారు. మొగవాళ్ళు వుండాలని అన్నారు. మాతో పాటు ఢిల్లీలో మా బావగారి స్నేహితులు ఆయన భార్యా వచ్చారు. వారికి మావాళ్ళ గోత్రనామాలు ఇచ్చి పిండప్రధానం చేయించాము. అక్కడే బదరీలో కల్పోక్త ప్రకారంగాఅర్చన చేసుకుని అన్న దానానికి డబ్బు కట్టాం. ఆంజనేయస్వామికి దీపాలు వెలిగించాం.

అక్కడ నుంచీ గౌరీ కుండ్‌లో వేడినీళ్ళుతో స్నానం చేసి ఆ ప్రకృతి రమణీయతకు మైమరచి పోయాను. కేదార్ వెళ్ళేవాళ్ళు, పోనీలమీద, డోలీల మీద వెడ్తారు. కేదార్‌లో ఆక్సిజన్ తక్కువగా వుంటుందన్నారు. మాతో మగవారు ఎవరూ లేకపోవడంతో ధైర్యం చేయలేకపోయాను. కేదార్ వెళ్ళని వాళ్ళు రామ్‌పూర్‌కి తిరిగి వచ్చాం. మళ్ళీ గౌరీకుండ్‌కు వెళ్ళి అమ్మ వారి గుడికి వెళ్ళి తృప్తిగా మనస్సుకు హాయి కలిగేలా అర్చించుకున్నాం.

గౌరీకుండ్ నుంచీ రుద్ర ప్రయాగకు వచ్చాం. దోవలోని ప్రకృతి అందాలను తికించాం. ఆ ప్రకృతి వివరించటానికి వేయినోళ్ళావున్న ఆదిశేషుని వల్ల కూడా లేదనిపించింది. అందుకే పరమేశ్వరుడు ఆ కొండలలో తన నివాసాన్ని ఏర్పరచుకున్నాడేమో అనిపించింది. రుద్ర ప్రయాగలో నారదముని

రాతితో కడితేనే దేవాలయంకాదు, నీ హృదయంలో నామంతో కట్టు.

తపస్సు చేసిన ప్రాంతం అక్కడ ఆయనకు శివుడు, లక్ష్మీనారాయణులు దర్శనమిచ్చిన దేవాలయాన్ని సందర్శించాం.

ఆ దేవాలయంలో రెండు శివలింగాలు, రెండు నందీశ్వరులు ఉన్నారు. అక్కడి పూజారిని అడిగితే నారదుడు ముందు శివుని గురించి తపస్సు చేసాడని అతని భక్తికి మెచ్చి శివుడు ప్రత్యక్షమైనాడు. ఆ శివుడ్ని అక్కడే లింగాకారంలో వుండవలసినదిగా నారుదుడు కోరటంతో అక్కడ రెండు లింగాలు ఉన్నాయని చెప్పారు. ఆ వెనకాలేవున్న పార్వతీదేవీ ఆలయంలో "శ్రీ ఉమాకాత్యాయని" భగవతీ శ్రీ రాజరాజేశ్వరి శ్రీ అరక్కపురవాసిని శుభకరి చిన్మయీ కరుణామయీ" అన్న పాటను పాడుకున్నాం. అది విన్న పూజారి వత్తులు, ఆవు నెయ్యి ఇచ్చి దీపం వెలిగించుకోమని చెప్పటంతో ఆశ్చర్యచకితులయ్యాము. అక్కడ మర్రిచెట్టు క్రింద కూర్చుని పారాయణ చేసుకున్నాం.

రుద్ర ప్రయాగ నుండి హరిద్వారకు బయలుదేరాం మార్గమధ్యంలో కాళికాదేవిని దర్శించి అమ్మ మూర్తి బాగారావాలని ప్రార్థించాను. ఆ దేవాలయం గోడలంతా కూడా గంటలతో వున్నాయి. తిరుపతిలో అయ్యవారు ఏడుకొండల మీదవుంటే అమ్మ వారు దిగువ తిరుపతిలో వుంటుంది కదా అలాగే కేదారీశ్వరుడు కొండల మీద వుంటే అమ్మవారు 2 కిలోమీటర్ల దిగువకు వెళితే కాని ఆమె దర్శనం కాదు. అక్కడికి నడిచేటప్పటికే నాలో సత్తువ నశించింది. అంతా దేవాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంటే నేను మాత్రం గుడిలోని హోమగుండం చుట్టూ ప్రదక్షిణాలు చేసాను. కుమారస్వామి నెమలి వాహనం మీద భూప్రదక్షిణంకు వెడితే వినాయకుడు మాతాపితురులైన పార్వతీపరమేశ్వరుల చుట్టూ ప్రదక్షిణం చేసిన పురాణ ఘట్టం జ్ఞప్తికి వచ్చింది.

మలం పోతే మంత్రం గుర్తు వస్తుంది.

హరి ద్వార్‌లో సాయంత్రం దీపాలు వెలిగించి గంగానదిలో వదులుతారు. ఆ దృశ్యం చాలా బాగుంది. హరికేపూడికి నుంచి మానసాదేవి ఆలయంకు రోప్ వేలో వెళ్ళాము. చాలా అద్భుతంగా వుంది. అక్కడ హోమగుండంలో హవిస్సులు అర్పించాం. హరిద్వార్‌లో గంగామాయి దేవాలయాన్ని దర్శించి, దీపాలు వెలిగించి నీళ్ళలో వదలి మెట్ల మీద కూర్చున్నాను. ఎదురుగా రెండు దేవాలయాల్లో విగ్రహాలు కనువిందు చేసాయి. నేను నడవలేనని అమ్మ నాకు అక్కడ నుంచే దర్శనభాగ్యం కలుగచేసింది. ఇంతలో కుండపోతగా వర్షం మొదలైంది. ఆగటానికీ వీలు కాలేదు. అలాగే వర్షంలో బస్సు దగ్గరకు బయలుదేరాను. కొంతదూరం వెళ్ళాక ఆ వర్షంకి రోడ్డు ఏదో, నది ఏదో తెలియలేదు. అంతా అయోమయం అంధకారం, అంతా జలమయం ఏం చేయాలో ఎటు వెళ్ళాలో పాలుపోలేదు. మాతో పాటు వచ్చిన 70 ఏళ్ళ కన్నడం ఆవిడ కనిపించింది. ఆమె పేరు తెలియదు కానీ అమ్మే నాచేత 'అమ్మాజీ' అని పిలిపించింది. వెంటనే ఆమె నన్ను పసిపిల్లను పొదవిపట్టుకున్నట్లుగా పట్టుకొని బస్సు దగ్గరకు తీసుకువెళ్ళింది. ఆ టైములో అమ్మే ఆమెను తోడు పంపిందో లేక అమ్మే ఆ రూపంలో వచ్చిందో అనూహ్యం. గురువారం రాత్రి బయలుదేరి శుక్రవారం తెల్లవారుఝామును ఢిల్లీ చేరాం.

వారం రోజుల ప్రయాణంలో ప్రక్కవారితో కూడా మాట్లాడకుండా వీలైనంత ఎక్కువ నామజపం చేసుకున్నాను. ఆ వారం రోజులు నేను అనుభవించిన ఆనందాన్ని జీవితంలో మర్చేపోలేను. హిమాలయాలు మునీశ్వరులకు, ఋషీశ్వరులకు సాధుకులకు ఆవాస స్థలం కదా! వారి తపస్సులతో ఆ పరిసరాలు పునీతమైనాయి. ఆ పుణ్యభూమిలో ఒక్కరోజు

కూతురును కోడలను సమంగా చూడడమే అద్వైతం

కూడా నా ఆరోగ్యంలో ఎటువంటి ఒడిదుడుకులు రాలేదు. నా ప్రయాణాన్ని హాయిగా సాగించిన అమ్మకు నేనేమిచ్చి ఋణం తీర్చుకోగలను. కలియుగంలో నామ సంకీర్తన తరుణోపాయం అని విష్ణుపురాణంలో చెప్పబడింది కదా! కాబట్టి అందరం ఎంత ఎక్కువ నామసంకీర్తన చేయగలిగితే అంత అదృష్టం. అందుకే అమ్మ అఖండ నామయజ్ఞాన్ని ప్రారంభించింది.

నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రనాశనమే ।
ప్రణామో దుఃఖ శమనః తం నమామి హరింపరమ్ ॥

18 వేల శ్లోకాలు వున్న శ్రీమత్భాగతంలో చివరి శ్లోకం ఇది. లలితా సహస్రనామాల్లో నామపారాయణ ప్రీతా! అన్న నామం కూడా దీనినే నొక్కి చెప్తోంది.



నీకున్నది తృప్తిగాతిని ఇతరులకు ఆదరంగా పెట్టుకో.

ఈశ్వరుడు - అనసూయేశ్వరుడు

మన దృష్టిలో అమ్మకు అత్యున్నత స్థానం వుంది. అమ్మ తన మాటల వల్ల క్రియల వల్ల మన గుండెల్లో గుడికట్టుకున్నది. మన హృదయసీమల్లో అమ్మకు గల ఆసనం అత్యున్నతమైన, అద్వితీయమైన, అనుపమైనట్టింది. అట్టి అమ్మ గుండె లోతుల్లో గుడికట్టుకున్న శ్రీ నాన్నగారి గురించి ఎంత చెప్పినా తక్కువేననిపిస్తుంది.

శ్రీ కావ్య కంఠ గణపతి ముని రమణ మహర్షి ఆశ్రమంలో 'నాయనా' అని పిలువబడేవారు. ఆయన రచించిన మహా విద్యాధిసుత్రావళిలోని సీతా వ్యాఖ్యానంలో

"యజ్ఞ మయస్య అవతారస్య
భోగాయ కిమపి శ్రేష్ఠవం శ్యాత్ నియతః"

యజ్ఞమయుడైన అవతారపురుషుని యొక్క అనుభవం కొరకు పుట్టుటకు ఏది నియమింపబడునో అది సతు నుండి మాత్రమే జనించును. అసత్తు నుండీ పుట్ట జాలదు రామస్య అనుభూతమే పర్యాప్తఫలంసీతా" మర్యాద పురుషోత్తముడైన రాముని కొరకు ఫలించినదే సీత" అని వ్రాశారు. అమ్మ పరిపూర్ణ అవతారం. సత్యవస్తువు నుంచి వచ్చిన అమ్మ యొక్క అనుభవం కొరకు శ్రీ నాన్నగారు బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు కూడా సత్తు నుండే జనించుటకు నియమింపబడినారు. అందుకే మన భావాల్నీ, మన అవసరాలన్నీ ఆలోచించి అనసూయేశ్వరాలయాన్ని సంకల్పం చేసింది అమ్మ. అది మహత్తర సంకల్పం. మానవ మాతృలు ఊహించడానికి కూడా శక్యం కానిది.

శ్రీ యార్లగడ్డ రాఘవన్నయ్య

"మంగళమూర్తి వాడు, బుధమాన్యుడు, సృష్టికి ముందు వాడు
ఏ రంగునుగాని దేహము నరంజల్లువాడు, అతడందగాడు
ప్రేమంగనుచున్సమస్తమును, మాతగసర్వుల నాదరించు
చున్ పొంగెడి వాడమృతమూర్తి కనుంగొనుడీ తరించుడీ॥

అని నాన్నగారి గురించి అత్యద్భుతంగా వర్ణించాడు.

ఈ అనసూయేశ్వరాలయ రూపకల్పనలో ఎన్నెన్నో అపూర్వ విషయాలు ఇమిడి వున్నాయి. అమ్మ - నాన్నగార్లంటే శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులవారు ప్రకటించినట్లు "ఒకే ప్రమిదలోని రెండు జ్యోతులు ఒకే వస్తువు యొక్క ఇరుపార్శ్వాలు. ఆ అఖండజ్యోతిని జిల్లెళ్ళమూడిలో ఒక దేవాలయంలో సుప్రతిష్ఠితం చేసి సర్వలోకాలకూ, ఆ వెలుగునూ, వెన్నెలను పంచాలన్నదే అమ్మ ఆకాంక్ష.

అనసూయేశ్వరాలయంలో కొలువై అమ్మా నాన్నలు ఆర్తుల ఆదరించుచు, ఇప్సితార్థముల తీర్చుచు, బిడ్డల కొంగు బంగారమై వెలుగొందుచున్నారు. అట్టి అమ్మ నాన్నలకు శతసహస్రాధికవందనములు సల్పుచున్నాను.













ధ్యానాలయంలో
అమ్మ

శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్



శ్రీశ్రీశ్రీ పూర్ణానంద స్వామీజీ

Sathyam. ✆ 2735878, 2713440